సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 269

శనివారం 20-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'



నాలుగు రోజుల నష్టాలకు చెక్

సెన్సెక్స్ 448 పాయింట్లు ప్లస్
నిఫ్టీ లాభం 151 పాయింట్లు - బిజినెస్‌లో

ఫైనల్‌కు యువ భారత్

ఆసియా కప్ సెమీస్‌లో
శ్రీలంకపై విజయం - స్పోర్ట్స్‌లో

5 ఏళ్లలో మొత్తం సాయం 5 లక్షల కోట్లు

ప్రత్యక్షంగా ప్రజలకు సాయం
3 లక్షల కోట్లు రూపాయలు
పరోక్షంగా ప్రజలకు సాయం
2 లక్షల కోట్లు రూపాయలు

THE LEADER
BORN FOR PEOPLE

రేపే సకల వర్గాల సంక్షేమ స్వాప్నికునికి జన్మదినం

ఆనాడు అన్నొచ్చాడు... అన్నీ ఇచ్చాడు... అందరికీ ఇచ్చాడు...

(FROM THE PEOPLE... FOR THE PEOPLE... WITH THE PEOPLE...)

విద్యా రంగానికి రూ.69,289 కోట్లు
వైద్య రంగానికి 29,488 కోట్లు
వ్యవసాయ రంగానికి 1,73,050 కోట్లు
మహిళా సంక్షేమానికి 2,10,425 కోట్లు

వైద్యం

- 8.480 కోట్లతో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు
- వైద్య ఖర్చు రూ.1,000 దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపు
- వైఎస్సార్ ఆరోగ్య శ్రీ రూ.25 లక్షల వరకు పెంపు
- ఆరోగ్యశ్రీ పరిధిలోకి 3257 వ్యాధులు, ఆపరేషన్లు
- 104, 108 లకు 1704 కొత్త వాహనాలు
- చికిత్స, విశ్రాంతి సమయంలో కుటుంబానికి ఆర్థిక సాయం
- వైఎస్సార్ డయాగ్నోస్టిక్స్ ల్యాబ్‌లు • జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- టెలీ మెడిసిన్ సేవలు • ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్
- వైఎస్సార్ ఆరోగ్య రక్ష (ఉద్యోగుల కొరకు)
- దివ్యాంగులకు సదరం శిబిరాలు • వైఎస్సార్ సంజీవిని మందుల షాపులు
- 2004 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు • మహాప్రస్థానం వాహనాలు
- కరోనా సమయంలో ప్రజలకు అండ
- 16,852 కోట్లతో 10,674 హెల్త్ క్లినిక్‌లు
- ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్యపరీక్షలు
- 53,166 మంది వైద్యసిబ్బంది నియామకం
- ఉద్దానంలో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో సహా 8 ప్రత్యేక హాస్పిటల్ల నిర్మాణం

చట్టాలు

- దిశ చట్టం • షెడ్యూల్డ్ కులాల కమిషన్
- షెడ్యూల్డ్ తెగల కమిషన్ • శాశ్వత బీసీ కమిషన్
- నామినేటెడ్ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50 శాతం
- ఆలయాలు, ట్రస్టుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు 50 శాతం
- పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు
- కౌలుదారులకు హక్కుల బిల్లు
- కొత్త మద్య నియంత్రణ చట్టం
- ముందస్తు న్యాయ పరిశీలన అనంతరమే టెండర్లు
- లోకాయుక్త ఏర్పాటు • వ్యవసాయ మార్కెట్లపై కొత్త బిల్లు
- పాఠశాల, విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్
- ఉన్నత విద్య కమిషన్ • ల్యాండ్ టైట్లింగ్ యాక్టు
- విద్యుత్ చట్టాలు సవరణ బిల్లు
- విశ్వవిద్యాలయాల కొత్త చట్టం
- ఆర్కిటెక్చర్, లలితకళల విశ్వవిద్యాలయాల బిల్లు
- చిరుధాన్యాల బోర్డు • పప్పు దినుసుల బోర్డు
- యూనివర్సిటీల క్లస్టర్ • మునిసిపాలిటీల కొత్త చట్టం
- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం
- సహకార సంఘాల కొత్త చట్టం

మహిళలు

- మహిళలకు 31లక్షల ఇళ్ల పట్టాలు - 22 లక్షల ఇళ్ల నిర్మాణం
- మహిళలకు వడ్డీ లేని రుణాలు
- నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం
- స్థానిక సంస్థల కొలువుల్లో మహిళలకు 50 శాతం
- నామినేటెడ్ పనుల్లో మహిళలకు 50 శాతం
- ఆశావర్కర్లకు జీతం రూ.10,000లకు పెంపు
- యానిమేటర్లకు జీతం రూ. 10 వేలకు పెంపు
- అంగన్‌వాడి టీచర్లకు 11,500
- జగనన్న మహిళా మార్టులు
- జగనన్న తోడు పథకంలో రుణాలు
- మహిళలకు స్త్రీ నిధి
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ
- ఎంఎస్ఎంఇలో 5.58 లక్షల మహిళల రిజిస్ట్రేషన్
- వైఎస్సార్ ఆసరా • వైఎస్సార్ చేయూత

సంక్షేమ పథకాలు

- రూ.3000 వైఎస్సార్ పింఛన్ పథకం
- అగ్రీ గోల్డు బాధితులకు సాయం
- నాయి బ్రాహ్మణులకు, రజక, దర్జీలకు ఆర్థిక సాయం
- వైఎస్సార్ గృహ వసతి
- వైఎస్సార్ మత్స్యకార నేస్తం • చేపల పడవలకు డీజిల్ సబ్సిడీ
- వైఎస్సార్ మత్స్యకార భరోసా • కళ్యాణ కానుక
- కాపునేస్తం • మత్స్యకార బీమా
- వాహన మిత్ర • నేతన్న నేస్తం
- లా నేస్తం • ఆలయాలకు ప్రత్యేక నిధి
- పోలీసులకు వీక్లీ ఆఫ్ • అర్చకులకు , మత పెద్దలకు జీతాలు
- డయాలసిస్ పేషంట్ల పెన్షన్ రూ.10 వేలకు పెంపు
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 27 శాతం మధ్యంతర భృతి
- ఉద్దానం కిడ్నీ బాధితులకు రూ.500 కోట్లతో సాయం
- ఎస్సీ, ఎస్టీకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.3 వేలు
- పోలీసు సిబ్బందికి రూ.40 లక్షల భీమా
- కళ్యాణ మిత్రలకు వేతనం పెంపు
- అన్ని కులాలకు కమిషన్లుతో మెరుగైన సంక్షేమం

జగనన్నా...

జనం బలం నువ్వు...
జనం ఆశవు నువ్వు...
జనం బతుకుల్లో.. మెతుకుల్లో
ప్రజల ప్రతి శ్వాసలో
ప్రజల తలరాతలు మార్చే
తెలుగు జాతికి
జనం నమ్మిన
అలుపెరగని
భవిష్యత్ తరాల
నాయకుడా...!

బలగం నువ్వు...
శ్వాసవు నువ్వు...
నిండిన ప్రేమవు నువ్వు...
పలుకువు నువ్వు...
బ్రహ్మవు నువ్వు...
రథసారథి నువ్వు...
తథాగతుడా...
శ్రామికుడా...
దార్శినికుడా...

వర్ధిల్లు వెయ్యేళ్ళు...

HAPPY BIRTHDAY 21 DEC

- మీ సైనికులు

రైతులు

- 10,778 రైతు భరోసా కేంద్రాలు
- ప్రతి రైతు కుటుంబానికి రైతు భరోసా క్రింది రూ.67500
- రైతన్నలకు వడ్డీలేని రుణాలు • రైతు కమీషన్ ఏర్పాటు
- వ్యవసాయానికి పగటిపూటే తొమ్మిది గంటల ఉచిత విద్యుత్
- ఆక్వా రైతులకు రూ.1.5లకు విద్యుత్ పంపిణీ
- పేదలకు భూపంపిణీ - భూములపై సర్వహక్కుల కల్పన
- వైఎస్సార్ పంటల బీమా పథకం ఐదేళ్లపాటు సాయం
- దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ
- జగనన్న భూహక్కు - భూరక్ష పథకం • ఈ క్రాప్ బుకింగ్
- మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్లు • పాల శీతలీకరణ కేంద్రాలు
- మొబైల్ వెటర్నరీ అంబులెన్స్ • వైఎస్సార్ అగ్రీ టెస్టింగ్ ల్యాబ్స్
- వైఎస్సార్ రైతు భరోసా రథం • జగనన్న జీవక్రాంతి
- వైఎస్సార్ యంత్ర సేవ • పశు కిసాన్ క్రెడిట్ కార్డులు
- సబ్సిడీలో విత్తనాలు, ఎరువుల పంపిణీ
- కౌలు రైతులకు కార్డులు • రైతులకు కాల్ సెంటర్ 155251
- వైఎస్సార్ పాలంబడి • జగనన్న పాల వెల్లువ
- ధరల స్థిరీకరణ నిధి రూ.3000 కోట్లు • వైఎస్సార్ రైతు బీమా

హిందూధర్మ రక్షణ

- రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా దేవదాయ శాఖకు బడ్జెట్
- వంశపారంపర్య అర్చకత్వానికి ఆమోదం
- 6709 దేవాలయాలకు నిత్య ధూప దీప నైవేద్యాలకు ప్రత్యేక నిధులు
- అర్చక స్వాములకు లేదు పదవీ విరమణ
- యాదవ మిరాశీ హక్కులకు చట్టంతో ప్రాణ ప్రతిష్ఠ
- కరోనా సమయంలో 40 వేల అర్చక స్వాములకు రూ.5 వేలు సాయం
- ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 500 నూతన దేవాలయాల నిర్మాణానికి శ్రీకారం
- జీర్ణస్థితికి చేరిన ఆలయాల పునర్నిర్మాణం
- సి.సి. కెమెరాలతో ఆలయాల్లో భద్రత మరింత పటిష్టం
- గరిష్ఠ నిధులతో బ్రాహ్మణ కార్పొరేషన్
- ఆంధ్రప్రదేశ్ అర్చక శిక్షణ అకాడమీ ఏర్పాటు
- దేవాలయ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం రిజర్వేషన్
- ఆలయ కమిటీల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్
- గుడికో గోమాత
- దేవుడి మాన్యం ఆక్రమణలపై ఉక్కుపాదం
- కాణిపాకం వినాయకుని బంగారు రథం
- దేశంలోని ప్రముఖ నగరాలలో శ్రీవారి ఆలయాల నిర్మాణం
- గోశాలలకు ప్రాధాన్యం, గో ఆధారిత నైవేద్యం
- టి.టి.డి చే 3250 నూతన దేవాలయాలకు శ్రీకారం

విద్య

- పేదవారి చదువు ఖర్చు పూర్తిగా ప్రభుత్వానిదే
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు వసతి, భోజనానికి ఏటేటా రూ.20 వేలు
- జగనన్న అమ్మఒడి • జగనన్న విద్యా దీవెన
- జగనన్న వసతి దీవెన • జగనన్న విద్యా కానుక
- జగనన్న గోరుముద్ద • జగనన్న విదేశీ విద్యాదీవెన
- 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు పంపిణీ
- ఇంగ్లీషు మీడియం - సిబిఎస్ఇ సిలబస్, టోఫెల్ శిక్షణ
- డిజిటల్ లైబ్రరీలు • వైఎస్సార్ విద్యోన్నతి పథకం
- టీచర్ల ట్రైనింగ్ కోసం యూట్యూబ్ చానెల్
- కన్‌సిస్టెంట్ రిథమ్స్ ఇన్ స్కూల్స్
- 17,805 కోట్లతో 45,975 స్కూళ్ల నిర్మాణం, ఆధునీకరణ
- ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం, యువతకు ప్రోత్సాహం.
- 41.53 కోట్ల విలువైన 5 లక్షల స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

ప్రగతి పథం

- 15,004 గ్రామ వార్డు సచివాలయాలు -542 పౌరసేవలు
- 2.5 లక్షల గ్రామ వాలంటీర్ల నియామకం
- 1.34 లక్షల సచివాలయాల సిబ్బంది నియామకం
- కడపలో స్టీల్ ప్లాంట్
- వైఎస్సార్ నవోదయం - వైఎస్సార్ నవశకం
- నియోజకవర్గానికో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్
- స్పందన కార్యక్రమం • రివర్స్ టెండరింగ్
- మసీదులకు కొత్త హంగులు • యుద్ధ ప్రాతిపదికన నీటి ప్రాజెక్టులు
- అవినీతి రహిత పాలన
- చిన్న పరిశ్రమలకు వెయ్యి కోట్ల ప్రోత్సాహం
- బీమా మిత్రలకు 3 వేలు • పాలన, అభివృద్ధి వికేంద్రీకరణ
- గడప గడపకు మన ప్రభుత్వం • జగనన్న పచ్చతోరణ
- (APCO's) అవుట్ సోర్సింగ్ కు ప్రత్యేక కార్పొరేషన్
- టిడ్కో ఇళ్ళు • కమ్యూనిటీ భవనాలు • ఎల్ఈడీ వీధి దీపాలు
- APONE అప్లికేషన్ ఫర్ ఇండస్ట్రీస్
- 4 పోర్టులు, 10 షిప్పింగ్ హార్బర్ల పనులు ప్రారంభం
- ఆర్.టి.సి. ప్రభుత్వంలో విలీనం, 50 వేల మంది ఉద్యోగులకు లబ్ధి
- విశాఖ జిఐఎస్‌లో 13.1 లక్షల కోట్ల ఒప్పందాలు
- 1.47 లక్షల ఉద్యోగ అవకాశాలు

చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి M.S.(UK)
వర్కింగ్ ప్రెసిడెంట్ :
రాష్ట్ర వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం

చెవిరెడ్డి మోహిత్ రెడ్డి M.S.(LONDON)
ఇన్‌చార్జ్ : వైఎస్ఆర్‌సీపీ, చంద్రగిరి నియోజకవర్గం
మాజీ చైర్మన్ : తుడ, మాజీ సభ్యులు : టి.టి.డి పాలక మండలి

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 269

శనివారం 20-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'అభివృద్ధి ఎంత ముఖ్యమో.. సంక్షేమమూ అంతే ముఖ్యం'

పాండ్యా విధ్వంసం.. సిరీస్ భారత్ వశం

13లో

హార్దిక్ పాండ్యా విధ్వంసం, తిలక్‌వర్మ దూకుడుతో భారత్ ఆఖరి మ్యాచ్‌లో 30 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై గెలిచింది. ఐదు టి20ల సిరీస్‌ను 3–1తో కైవసం చేసుకుంది.



'గ్రీన్‌కార్డ్ లాటరీ'కి విరామం

అమెరికాలోని బ్రౌన్ వర్సిటీ కాల్పుల ఘటన నేపథ్యంలో గ్రీన్‌కార్డ్ లాటరీ విధానాన్ని సస్పెండ్ చేస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు.

వివరాలు 6లో ▸

పార్లమెంట్ నిరవధిక వాయిదా

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగిశాయి. ఈసారి 92 గంటల 25 నిమిషాల పాటు సమావేశాలు జరిగాయి.

వివరాలు 6లో ▸

'బెట్టింగ్' కేసులో ఆస్తుల అటాచ్

బెట్టింగ్ యాప్ మనీలాండరింగ్ కేసులో పలువురు సెలబ్రిటీల రూ.కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

వివరాలు 6లో ▸



పౌరుల స్వేచ్ఛ ప్రభుత్వ బాధ్యత

'పౌరులకు స్వేచ్ఛ ప్రభుత్వాలిచ్చే కానుక కాదు. వారిపట్ల ప్రభుత్వాల తొలి బాధ్యత' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸

• భూములిస్తాం.. భవనాలూ కట్టిస్తాం!

సర్కారు భూములు 'సత్వా'కు సొమ్ములు!

ఐటీ ముసుగులో అప్పనంగా భూములు

ఆపై రియల్ ఎస్టేట్ వ్యాపారం.. బాబు సర్కారు బరి తెగింపు

విశాఖలో రూ.వేల కోట్ల విలువైన భూమి 'రియల్' కంపెనీలకు కారుచౌకగా కేటాయింపు

సగం భూమిలో వాణిజ్య, రెసిడెన్షియల్ భవనాలు కట్టి అద్దెలు వసూలు చేసుకునేందుకు పచ్చజెండా

భవనం నిర్మించే ఖర్చులో అయ్యే వ్యయంలో సగ భాగాన్ని ప్రభుత్వమే భరిస్తుంది.. నిర్మాణ వ్యయంలో చదరపు అడుగుకి రూ.2,000 చొప్పన ఎదురు చెల్లించనున్న సర్కారు

భూమి, మౌలిక వసతులు, నిర్మాణ ఖర్చు, రాయితీలు ప్రభుత్వానివే.. చివరకు లబ్ధి పొంది వసూలు చేసుకునేది రియల్ ఎస్టేట్ కంపెనీలు

అడ్డగోలుగా భూ కేటాయింపులపై సర్కారును నిలదీసిన హైకోర్టు

టెండర్లు పిలవకుండా ప్రభుత్వ భూములు ఎలా కేటాయిస్తారంటూ విస్మయం

2లో

6. Financial Incentives

6.1. Incentives for infrastructure developers

	Co-working space Developers	Neighborhood Working space Developers	IT Campus developers
Minimum Eligibility criteria	Turnover of at least INR 100 Cr (OR) developed co-working space of minimum 20,000 seats	Turnover of at least INR 100 Cr (OR) developed co-working space of minimum 5,000 seats	Developed minimum office space of 5 Lakh Sft.
Mandate	Create minimum 100 seats (OR) 10,000 Sft. developed space	Create Minimum 10 seats (OR) Minimum 1,000 Sft. developed space	To Develop space > 5 Lakh Sft. for office space
Capital subsidy	a. 50% of capex cost b. Maximum: Rs. 2,000/ Sft. x total developed Sft. c. Subsidy disbursed after 50% seats are filled. Paid over 3 years.	a. 50% of capex cost b. Maximum: Rs. 1,000/ Sft. x total developed Sft. c. Subsidy disbursed after 80% seats are filled. Paid over 1 year	a. 50% capital subsidy, b. Maximum: Rs. 2,000/ Sft, c. Paid over 5 years d. Subsidy to be disbursed once at least 30% of land/seats committed are filled

కంపెనీలకు నిర్మాణ వ్యయంలో చదరపు అడుగుకు రూ.2,000 చొప్పన ఎదురు చెల్లించడంతో పాటు పలు రాయితీలు ఇస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో ▸

సమగ్రత.. నిజాయితీ

అభ్యర్థుల్లో ఇవే కీలకం.. పీఎస్సీలు వీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

జాతీయ సదస్సులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

పీఎస్సీల జాతీయ సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

2లో

- అధికారుల సమగ్రత, సున్నితత్వం, సామర్థ్యం వల్లే స్థిరమైన కార్యనిర్వహణ సాధ్యమవుతుంది
- ఈ లక్షణాలున్న వారిని ఎంపిక చేస్తే ప్రభుత్వ వ్యవస్థ పకడ్బందీగా ముందుకెళ్తుంది
- యువతలో బడుగు, బలహీన వర్గాలకు సేవ చేయాలనే భావన ఉండాలన్న రాష్ట్రపతి

బంగ్లాదేశ్‌లో మళ్లీ మంటలు

'ఇంక్విలాబ్ మంచ్' నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్య

కాల్పుల్లో గాయపడి సింగపూర్‌లో చికిత్స పొందుతూ మృతి

బంగ్లాదేశ్ వ్యాప్తంగా మిన్నంటిన ఆగ్రహ జ్వాలలు.. విధ్వంసానికి పాల్పడిన అల్లరి మూకలు

షేక్ ముజిబుర్ ఇల్లు ధ్వంసం.. పత్రికా కార్యాలయాలపైనా దాడులు

అసిస్టెంట్ ఇండియన్ హైకమిషన్ కమిషనర్ నివాసంపై రాళ్ల దాడి

హిందూ కార్మికుడు దీపూచంద్ర దాస్‌ను కొట్టి చంపి దహనం

6లో

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షల్లో మార్పులు

14లో

ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో స్వల్ప మార్పులు చేశారు. హోలీ, రంజాన్ సెలవులు రావడంతో మార్చి 3న జరగాల్సిన రెండో ఏడాది పరీక్షలను 4వ తేదీన.. మార్చి 20న జరగాల్సిన మొదటి ఏడాది పరీక్షలను 21వ తేదీన నిర్వహిస్తారు.

మల్లన్న దర్శనం.. గొప్ప అనుభూతి

2లో

శ్రీశైలంలో జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జున స్వామివారిని, శక్తి స్వరూపిణి అయిన భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకోవడం తమ అదృష్టం అని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్నారు.

మనదేం లేదు.. అంతా టీడీపీ నేతలదే పెత్తనం

5లో

'మనం గెలిచిన నియోజకవర్గాల్లో సైతం టీడీపీ నేతలే పెత్తనం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో జనసేనను బలోపేతం చేసే పరిస్థితి కనిపించడం లేదు' అంటూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు పవన్‌కళ్యాణ్ ఎదుట వాపోయారు.

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹96

ఫారం దగ్గర లైవ్ బర్డ్ 133 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో 232 కిలో

రిటైల్ లైవ్ బర్డ్ 160 కిలో | స్కిన్ లెస్ 264 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

• బాబు మరో క్రెడిట్ చోరీ..

వేగంగా రిజిస్ట్రేషన్లూ బాబు గొప్పేనట!

- వైఎస్ జగన్ హయాంలో జరిగిన సంస్కరణలు తన ప్రతిభేనంటూ ప్రచారం.. నిజానికి నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తయ్యే విధానాన్ని తెచ్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- ఇందుకోసం 2023లోనే సాఫ్ట్‌వేర్ 'కార్డ్ 2.0' అమల్లోకి
- స్లాట్ బుకింగ్, ఆటోమ్యుటేషన్ కూడా అప్పుడే మొదలు
- వీటన్నింటి ఫలితంగానే సులభంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- అప్పట్లో దానిపై విష ప్రచారం చేసిన చంద్రబాబు, ఎల్లో మీడియా

3లో

ఆ నిరసన ప్రజా వ్యతిరేకతకు దర్పణం

- 18 నెలలుగా హామీల అమలులో మోసం.. పాలనలో వైఫల్యాలు.. అంతులేని అవినీతి
- కోటి సంతకాల ఉద్యమం వీటన్నింటినీ ఎత్తిచూపింది అంటున్న రాజకీయ విశ్లేషకులు
- ఓ అంశంపై 1,04,11,136 మంది స్వచ్ఛందంగా సంతకాలు చరిత్రాత్మకం
- ఈ స్థాయిలో నిరసన దేశ చరిత్రలో ఇదే ప్రథమం అంటున్న ప్రజా సంఘాలు
- వైఎస్సార్‌సీపీకి ప్రజా మద్దతు పెరుగుతోందనడానికి ఇదే తార్కాణమంటున్న నేతలు

11లో

జ్వరాలు 'వైరల్'

- ఇంట్లో ఒకరి నుంచి కుటుంబం అంతటికీ వ్యాప్తి
- హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు నమోదు.. స్క్రబ్‌టైఫస్ కేసులు 1,800 పైనే
- ఇప్పటికే 15 మంది బాధితులు మృతి.. వ్యాధుల వ్యాప్తి నియంత్రణలో ప్రభుత్వ చర్యలు శూన్యం

10లో

క్లుప్తంగా...

వైఎస్సార్ ఉద్యాన వర్సిటీకి జాతీయ పురస్కారం

సాక్షి, అమరావతి/తాడేపల్లిగూడెం : డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీకి జాతీయ పురస్కారం వరించింది. మాజీ సైనికోద్యోగులు, రిటైర్డ్ ఉన్నతాధికారులు ఏర్పాటు చేసుకున్న న్యూఢిల్లీలోని వెటరన్స్ ఇండియా సంస్థ ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్స్– 2025లో భాగంగా రాష్ట్రానికి చెందిన డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో ఉత్తమ విశ్వవిద్యాలయం అవార్డును ప్రదానం చేసింది. న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్‌సేథ్ చేతుల మీదుగా యూనివర్సిటీ మూల్యాంకన విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్.శ్రీవిజయపద్మ అవార్డును అందుకున్నారు. జాతీయ పురస్కారం పొందేందుకు కృషి చేసిన అధికారులతో పాటు రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులును వీసీ డాక్టర్ కే.ధనుంజయరావు శుక్రవారం యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు.

'మన మార్గదర్శి' పుస్తకావిష్కరణ

సాక్షి, అమరావతి: మాజీ సైనికుల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన 'మన మార్గదర్శి' పుస్తకాన్ని గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆవిష్కరించారు. శుక్రవారం విజయవాడలోని లోక్‌భవన్‌లో సాయుధ దళాల జెండా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ రక్షణలో సేవలు అందించిన పలువురు సైనిక అధికారులు, సైనిక సంక్షేమ నిధికి అత్యధికంగా విరాళాలు సేకరించిన జిల్లాల కలెక్టర్లు, సైనిక సంక్షేమ అధికారులను గవర్నర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనితతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కొత్త పంచాయతీల ఏర్పాటుకు 22 వరకే గడువు

సాక్షి, అమరావతి: కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు, విలీన ప్రక్రియకు జిల్లాల నుంచి పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపేందుకు ఆఖరి గడువు ఈ నెల 22వ తేదీగా ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజ ఉన్నతాధికారులకు శుక్రవారం మెమో జారీ చేశారు. గడువు దాటాక అందే ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోబోమని ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఆభాతో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు

రాష్ట్ర సెకండరీ హెల్త్ డైరెక్టర్ హెచ్. చక్రధర్‌బాబు

సాక్షి, అమరావతి: ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఆభా) ద్వారా ప్రజలకు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు అందుబాటులో ఉంటాయని రాష్ట్ర సెకండరీ హెల్త్ డైరెక్టర్ హెచ్. చక్రధర్ బాబు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో శుక్రవారం బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్, రీసెర్చ్ (ఐఐహెచ్ఎంఆర్) ప్రతినిధులతో ఏపీ వైద్యశాఖ సమావేశమైంది. ఈ సందర్భంగా చక్రధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలందరికీ 14 అంకెల ఆభా కార్డు కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్ర జనాభాలో 4.84 కోట్ల మందికి ఆభా రూపొందించామన్నారు. డాక్టర్లతో పాటు ఇతర సిబ్బందిలో 65,242 మంది వివరాలు హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీలో నమోదయ్యాయని ఆయన చెప్పారు. 26,083 ఆసుపత్రుల వివరాలు కూడా నమోదయ్యాయన్నారు. రోగులు ఆసుపత్రులకు వెళ్లినప్పుడు వారికి గతంలో అందిన చికిత్స వివరాలు, ల్యాబ్ రిపోర్టులు డిజిటల్‌గా భద్రపరిచేందుకు ఆభాలో అవకాశం ఉంటుందన్నారు.

సమగ్రత.. నిజాయతీ

అభ్యర్థుల్లో ఇవే కీలకం.. సర్వీస్ కమిషన్లు వీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

జాతీయ సదస్సులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఉద్యాన్ ఉత్సవ్ రెండో ఎడిషన్ ప్రారంభోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పరిపాలన నిష్పక్షపాతంగా, స్థిరంగా కొనసాగడంలో అధికారుల పాత్రే కీలకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వ్యాఖ్యానించారు. అలాంటి అధికారుల ఎంపిక బాధ్యత పబ్లిక్ సర్వీస్ కమిషన్ల (పీఎస్సీ)పై ఉందని గుర్తుచేశారు. ఈ విషయంలో సమగ్రత, నిజాయితీ అనే కీలక అంశాలకు పీఎస్సీ లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 'ఈ లక్షణాలున్న వారిని ఎంపిక చేస్తే ప్రభుత్వ వ్యవస్థ పకడ్బందీగా ముందుకెళ్తుంది. ఈ రెండు అంశాలు రాజీ పడేందుకు అవకాశం లేనివి. నైపుణ్యాలు, సామర్థ్యాల సంబంధిత లోపాలుంటే వాటిని సరిదిద్దుకోవడం, ఇతర కార్యక్రమాలు, వ్యూహాల ద్వారా అధిగమించవచ్చు. కానీ సమగ్రత లోపం తీవ్రమైన సవాళ్లను రేకెత్తిస్తుంది, వాటిని అధిగమించడం అసాధ్యం. కాబట్టి పీఎస్సీలు తాము నియమించే అభ్యర్థుల విషయంలో నిజాయితీ, సమగ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి..' అని రాష్ట్రపతి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న రెండ్రోజుల పీఎస్సీల జాతీయ సదస్సుకు రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శుక్రవారం తొలిరోజు సదస్సులో ఆమె ప్రారంభోపన్యాసం చేశారు.

ఉత్తమ సివిల్ సర్వెంట్లను ఎంపిక చేయగలగాలి..

'ప్రభుత్వ అధికారుల సమగ్రత, సున్నితత్వం, సామర్థ్యం వల్లే స్థిరమైన కార్యనిర్వహణ సాధ్యమవుతుంది. జాతీయ స్థాయిలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా సివిల్ సర్వెంట్లు ఎంపికవుతుంటే.. రాష్ట్రస్థాయిలో పీఎస్సీలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అభ్యర్థుల నైతిక ధోరణిని అర్థం చేసుకోవడానికి సహాయపడే సాధనాలు, ఉపకరణాలను పీఎస్సీలు వెతకాలి. సివిల్ సర్వెంట్ ఉద్యోగం సాధించాలనుకునే యువతలో అట్టడుగు వర్గాలు, బలహీనుల కోసం పనిచేయాలనే మనస్తత్వం ఉండాలి. అదేవిధంగా మహిళల అవసరాలు, ఆకాంక్షల విషయంలో సున్నితమైన వైఖరి కలిగి ఉండాలి. ఇలాంటి వారితో పాటు సాంకేతికత సవాళ్లను ముందుగానే ఊహించడం, పారదర్శకత, విశ్వసనీయతను బలోపేతం చేయడం, ప్రపంచ స్థాయితో పోల్చదగిన సివిల్ సర్వెంట్ల బృందాలను ఎంపిక చేసేలా పీఎస్సీలు సిద్ధం కావాలి. పీఎస్సీల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి, ఉత్తమ అనుభవాలను పంచుకోవడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుంది. సాంకేతికత, చట్టపరమైన అంశాలు, నియామక ప్రక్రియను మరింత సమర్థవంతంగా చేయడం.. వంటి అంశాలు చర్చకు రావడంతో పాటు కమిషన్ల ముందున్న ముఖ్యమైన సమస్యలకు పరిష్కారాలు ఈ చర్చల నుంచి లభిస్తాయని ఆశిస్తున్నా..' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

పీఎస్సీలకు విజయం చేకూరాలి

'ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంది. ప్రధాన ఆర్థిక వ్యవస్థ, అపారమైన వైవిధ్యం కలిగిన దేశంగా ఉన్న భారత్‌కు అన్ని స్థాయిల్లో అత్యంత సమర్థవంతమైన పరిపాలనా వ్యవస్థలు అవసరం. త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా కూడా ముందుకు సాగుతున్నాం. ఈ నేపథ్యంలో యూపీఎస్సీ, అన్ని రాష్ట్రాల పీఎస్సీలు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ, ఉత్తమ, 'భవిష్యత్తు–సిద్ధమైన' సివిల్ సర్వెంట్ల బృందాన్ని తయారు చేసేందుకు దోహదపడతాయని ఆశిస్తున్నా. యూపీఎస్సీ, రాష్ట్రాల పీఎస్సీల దేశ నిర్మాణ ప్రయత్నాల్లో నిరంతర విజయం చేకూరాలని కోరుకుంటున్నాను..' అని ముర్ము చెప్పారు. దేశంలోనే అత్యంత పిన్న వయసున్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు.

యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాలు

యూపీఎస్సీ చైర్మన్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కమిషన్ వందేళ్ల పండుగ జరుపుకుంటోందని, వచ్చే ఏడాది అక్టోబర్ వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను స్థాపించే ఆలోచన ఉన్నట్టు వెల్లడించారు. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు సదస్సులో భాగంగా పీఎస్సీల్లో సాంకేతికత ఉన్నతీకరణ, నియామక ప్రక్రియలలో బ్లాక్‌చైన్ సాంకేతికత వినియోగం, ఇంటర్వ్యూ ప్రక్రియలో మార్పులపై చర్చించారు.

ఉద్యాన్ ఉత్సవ్ రెండో ఎడిషన్ ప్రారంభించిన రాష్ట్రపతి

ఉద్యాన్ ఉత్సవ్ రెండో ఎడిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ప్రారంభించారు. తొమ్మిది రోజులు జరుపుకొనే ఈ ఉద్యాన ఉత్సవ్ రెండో ఎడిషన్ జనవరి 3 నుంచి 11 వరకు సందర్శకులకు అందుబాటులోకి రానుంది.

శ్రీశైలం మల్లన్న దర్శనం.. గొప్ప అనుభూతి

- భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్
- స్వాగతం పలికిన రాష్ట్ర ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఈఓ

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు స్వాగతం పలుకుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్

శ్రీశైలం టెంపుల్ : జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జున స్వామివారిని, శక్తి స్వరూపిణి అయిన భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకోవడం తమ అదృష్టం అని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్నారు. శుక్రవారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి దర్శనార్థం కుటుంబంతో కలిసి శ్రీశైలం చేరుకున్న ఆయనకు భ్రమరాంబ అతిథి గృహం వద్ద రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి అభిషేకం, భ్రమరాంబదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అంతకముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్ పౌరులకు నమస్కారం.. అందరూ బాగున్నారా' అని తెలుగులో సంబోధించారు. శనివారం ఉదయం కూడా మరో సారి స్వామి అమ్మవార్లను భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ దంపతులు దర్శించుకుంటారని దేవస్థాన అధికారులు తెలిపారు

- భూములిస్తాం.. భవనాలూ కట్టిస్తాం!

సర్కారు భూములు 'సత్వా'కు సొమ్ములు!

విశాఖలో రూ.వేల కోట్ల విలువైన భూమి 'రియల్' కంపెనీలకు కారుచౌకగా కేటాయింపు

సాక్షి, అమరావతి: అత్యంత ఖరీదైన ప్రాంతంలో రూ.కోట్లు పలికే భూమి ఉన్నప్పుడు ఎవరైనా ఏం చేస్తారు? డబ్బులు అవసరమనుకుంటే బహిరంగ మార్కెట్ ధరకు విక్రయిస్తారు. లేదంటే డెవలప్‌మెంట్‌కు ఇవ్వడం ద్వారా మరింత ప్రయోజనం పొందేలా జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ ప్రజా ధనానికి కాపలాదారుగా ఉండాల్సిన చంద్రబాబు సర్కారు ఏం చేస్తోందో తెలుసా..? ఐటీ కార్యకలాపాల అభివృద్ధి ముసుగులో తమకు నచ్చిన సంస్థలకు అప్పనంగా 99 పైసలకే భూములు కేటాయిస్తోంది. అంతేకాదు.. అందులో 50 శాతం భూముల్లో వాణిజ్య, గృహ సముదాయాలు నిర్మించి సొమ్ము చేసుకునేందుకు రియల్ ఎస్టేట్ కంపెనీలకు వెసులుబాటు కలిస్తోంది. చ.అడుగుకు రూ.4 వేలు నిర్మాణ వ్యయం అయితే అందులో రూ.2 వేలు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఉదాహరణకు 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఓ భవనాన్ని నిర్మిస్తే అందులో సగం అంటే ఐదు లక్షల చదరపు అడుగుల నిర్మాణ వ్యయాన్ని చదరపు అడుగుకు రూ.రెండువేలు చొప్పున ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఆ తరువాత అద్దెలు మాత్రం భూములు పొందిన కంపెనీలే వసూలు చేసుకుంటాయి. పోనీ ఆ కంపెనీలేమైనా ఉద్యోగాలు ఇస్తాయా? అంటే అదీ లేదు! ఆ రియల్ ఎస్టేట్ సంస్థలు నిర్మించే వాణిజ్య సముదాయాల్లో ఒక్క ఐటీ ఉద్యోగం కూడా నేరుగా ఇవ్వవు. అవి నిర్మించే భవనాల్లో ఏర్పాటయ్యే ఐటీ కంపెనీలు మాత్రమే ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంటుంది. అంటే.. కారుచౌకగా ప్రభుత్వం నుంచి భూములు తీసుకుని.. ప్రభుత్వ సొమ్ముతో రోడ్లు, విద్యుత్తు లాంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తే.. ప్రభుత్వ డబ్బులతోనే భవనాలను నిర్మించి వేరే కంపెనీలకు అమ్ముకుంటారు. ఉద్యోగాల కల్పనకు బాబు సర్కారు నిర్వచనం ఇదీ!! భూములు ప్రభుత్వానివి..! మౌలిక వసతులు కల్పించేది ప్రభుత్వమే.. ! భవన నిర్మాణ ఖర్చు కూడా ప్రభుత్వానిదే..! పలు రాయితీలు ఇచ్చేదీ ప్రభుత్వమే.. చివరకు లబ్ధి పొందేది మాత్రం రియల్ ఎస్టేట్ కంపెనీలు! అంటే.. సర్కారు భూముల్లో రియల్ ఎస్టేట్ కంపెనీల భూ దందా! విశాఖలో విచ్చలవిడిగా సాగుతున్న బాబు సర్కారు భూ దోపిడీ ఇలా ఉంది..

భూములిచ్చి.. ఎదురు డబ్బులు కూడా!

వాణిజ్య భవనాలను నిర్మించుకుని భారీ ధరలకు విక్రయించుకునే రియల్ ఎస్టేట్ సంస్థలకు ఐటీ ముసుగులో చంద్రబాబు సర్కారు భూములు అప్పగిస్తూ చేస్తున్న ''రియల్'' దందా ఇప్పుడు జాతీయస్థాయిలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఐటీ క్యాంపస్‌లు, గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్స్ పేరిట కె.రహేజా, సత్వా, కపిల్ గ్రూపు సంస్థ బీవీఎం ఎనర్జీ లాంటి రియల్ ఎస్టేట్ సంస్థలకు విశాఖలో కారు చౌకగా భూములను కేటాయించడమే కాకుండా అందులో 50 శాతం వాణిజ్య అవసరాలకు వినియోగించుకోవడానికి అనుమతిస్తోంది. ఇంతటితో ఆగకుండా ప్రోత్సాహకాల రూపంలో ఎదురు చెల్లిస్తోంది. నిర్మిస్తున్న చదరపు అడుగుకు గరిష్టంగా రూ.2,000 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ సంస్థలకు ఎదురు డబ్బులు ఇవ్వడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

కారుచౌకగా భూములు.. పలు రాయితీలు

బెంగళూరుకు చెందిన సత్వా గ్రూపు రెండు దశాబ్దాలుగా రియల్ ఎస్టేట్ రంగంలో ఉంది. పుణె, బెంగళూరు, హైదరాబాద్ లాంటి నగరాల్లో భారీ లగ్జరీ రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసింది. బ్లాక్‌స్టోన్ వంటి పీఈ, వెంచర్ క్యాపిటల్ సంస్థల నుంచి నిధులు సేకరించి వ్యాపారం చేస్తుంది. 2017లో సత్వా గ్రూపు హైదరాబాద్‌లో హైటెక్ సిటీ వద్ద 10 ఎకరాల స్థలాన్ని భారీ ధరకు కొనుగోలు చేసింది. ఇప్పుడు తాజాగా కోకాపేట వద్ద 25 ఎకరాల భూమిని రూ.వేల కోట్లు పెట్టి కొనుగోలు చేసింది. ఇలా ప్రైవేటుగా స్థలాలు కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఈ సంస్థకు విశాఖలో 30 ఎకరాల భూమిని చంద్రబాబు సర్కారు కారు చౌకగా కట్టబెట్టింది. విశాఖ గ్రామీణ మండలం మధురవాడ ఐటీ హిల్ నెం.4పై ప్లాట్ నంబర్లు యూడీఎల్ 1, యూడీఎల్ 2, యూడీఎల్ 3 వద్ద 30 ఎకరాల భూమిని ఎకరా రూ.1.5 కోట్ల సబ్సిడీ ధరకే ఇవ్వడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం మధురవాడ ఐటీ హిల్స్‌లో ఎకరం రూ.50 కోట్లకుపైనే పలుకుతోంది. అంటే రూ.1,500 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.45 కోట్లకే ఒక రియల్ ఎస్టేట్ కంపెనీకి అప్పగించడం విస్తుగొలుపుతోంది. కారుచౌకగా భూమిని కేటాయించడమే కాకుండా ఐటీ, జీసీసీ పాలసీ 4.0 కింద పెట్టుబడి రాయితీ, విద్యుత్ సబ్సిడీ లాంటి అనేక అదనపు రాయితీలను సత్వాకు కల్పిస్తున్నారు. సత్వాకు అత్యంత కారుచౌకగా భూమిని కేటాయిస్తూ ఈ ఏడాది ఆగస్టు 8వ తేదీన ప్రభుత్వం జీవో జారీ చేసింది. నిబంధనల ప్రకారం సత్వా సంస్థ గత నెల 5వ తేదీలోగా ఏపీఐఐసీకి డబ్బులు చెల్లించాలి. అయితే ఎటువంటి వడ్డీ లేకుండా డబ్బులు చెల్లించేందుకు 60 రోజులు గడువు ఇవ్వాలని ప్రభుత్వానికి లేఖ రాసింది. సత్వా సంస్థ కోరిందే తడవుగా ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన ఎస్ఐపీబీ సమావేశానికి తీసుకెళ్లడం.. వడ్డీ, జరిమానా లేకుండా డబ్బులు చెల్లించేందుకు ఈ నెల 4 వరకు గడువు ఇస్తూ ఉత్తర్వులు జారీ కావడం చకచకా జరిగిపోయాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి భూములిస్తూ అదికూడా వడ్డీ లేకుండా చెల్లించడానికి గడువు ఇవ్వడం ఏమిటని విస్మయం వ్యక్తమవుతోంది.

రహేజాకు రూ.1,375 కోట్ల భూమి 99 పైసలకే

రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కంపెనీ కె.రహేజా హైదరాబాద్‌లో వేలంలో భూములు కొనుగోలు చేసి వాణిజ్య సముదాయాలు నిర్మిస్తుంటే.. చంద్రబాబు సర్కారు మాత్రం రూ.వేల కోట్ల విలువైన భూమిని ఎటువంటి టెండర్లు, దరఖాస్తులు ఆహ్వానించకుండా అప్పనంగా అప్పగించేసింది. రహేజా గ్రూపునకు విశాఖలో సుమారు రూ.1,375 కోట్ల విలువైన 27.10 ఎకరాలను కేవలం 99 పైసలకే కేటాయించింది. మధురవాడలోని ఐటీ హిల్ నెంబర్ 3లో 27.10 ఎకరాలను ఏపీ లాండ్ ఇన్సెంటివ్స్ ఫర్ టెక్ హబ్స్ (లిఫ్ట్) పాలసీ ప్రకారం ఇచ్చింది. ప్రస్తుతం మధురవాడ ఐటీ హిల్‌లో ఎకరా ధర రూ.50 కోట్లపైనే ఉంది. అంతేకాదు కేటాయించిన 27.10 ఎకరాల్లో 45 శాతం భూమిని ఐటీ కాకుండా ఇతర అవసరాలకు వినియోగించుకోవడానికి అనుమతి ఇచ్చింది. వీటికి అదనంగా రూ.91.2 కోట్లతో రహదారులు, నీరు, విద్యుత్ లాంటి మౌలిక వసతులు కూడా కల్పిస్తామంటూ హామీ ఇచ్చింది. ఇక ఇక్కడ ఉద్యోగాలు కూడా రహేజా గ్రూపు సొంతంగా ఇవ్వదు. ఈ సంస్థ అభివృద్ధి చేసిన ఐటీ బిల్డింగ్‌లో వచ్చే ఐటీ కంపెనీలే ఉద్యోగాలను కల్పించాలి. ఉద్యోగాలు ఐటీ కంపెనీలు కల్పిస్తుంటే ఆ పేరుతో ప్రోత్సాహకాల రూపంలో దోచిపెడుతుండటంపై విస్మయం వ్యక్తమవుతోంది. పెట్టుబడి రాయితీ కింద 50 శాతం, చదరపు అడుగుకు రూ.2,000, నైపుణ్య శిక్షణ స్టయిఫండ్, విద్యుత్, జీఎస్టీ లాంటి అనేక రాయితీలను ప్రభుత్వం అందిస్తోంది.

కపిల్ చిట్ ఫండ్‌కు..

తెలుగు రాష్ట్రాల్లో చిట్‌ఫండ్, రియల్ ఎస్టేట్, మీడియా రంగాల్లో విస్తరించిన కపిల్ గ్రూపునకు చెందిన బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్‌కు పనోరమా హిల్స్ వెనుక ఎండాడ వద్ద ఎకరా రూ.1.5 కోట్లు చొప్పున ప్రభుత్వం 30 ఎకరాలు కేటాయించింది. ఎండాడ వద్ద బహిరంగ మార్కెట్లో ఎకరా రూ.100 కోట్లు పెట్టినా భూమి దొరకని పరిస్థితి. సుమారు రూ.3,000 కోట్ల విలువైన భూమిని హెచ్ఎంటీవీ లాంటి మీడియా సంస్థలున్న కపిల్ గ్రూపునకు కేవలం రూ.45 కోట్లకే కేటాయించారు. ఇక బెంగళూరుకు చెందిన ఏఎస్ఎన్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు మధురవాడ ఐటీ హిల్ నెం. 3పై ప్లాట్ నంబర్ 6 వద్ద 2.5 ఎకరాల భూమిని మరియు హిల్ నంబర్ 4పై ప్లాట్ నంబర్ యూడీఎల్ 6వద్ద 7.79 ఎకరాల భూమిని కేవలం 99 పైసలకే కట్టబెట్టింది. ఇలా విలువైన భూమిని పప్పుబెల్లాలుగా కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతుండటాన్ని న్యాయస్థానం ప్రశ్నించడంతో రాష్ట్రంలో విచ్చలవిడి భూ పందేరం జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసింది.

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

ITE&C Dept - Promotions Wing – Allotment of 30 Acres of land to M/s. Sattva Developers Private Limited at Hill No. 4, Madhurawada, Visakhapatnam for setting up IT / ITES Space, Retail, Residential, Data Centers, and consideration of the project under the AP IT & GCC Policy (4.0) 2024-29 for extending incentives towards a proposed investment of INR 1,500 crores with an employment potential of 25,000 jobs – Orders – Issued.

INFORMATION TECHNOLOGY, ELECTRONICS AND COMMUNICATION
[IT,E&C] (PROMOTIONS) DEPARTMENT

G.O.MS.No.27 — Date: 01.08.2025
Read the following

7. The Government after careful examination of the proposal and keeping in the view the recommendations the SIPB and the Honorable Council of Ministers, hereby approves the allotment of 30 acres of land at Plot Nos. UDL1, UDL2, and UDL3, Hill No. 4, Madhurawada, Visakhapatnam, at a rate of INR 1.50 crore per acre, and for considering the project under the *"IT Infrastructure Developer category"* in the AP IT & GCC Policy (4.0) 2024-29, with incentives extended as per the policy. The project

proponent is permitted to utilize up to 50 percent (%) of the allotted land for mixed usage, and the shall commence commercial operations as per the following implementation schedule: during Years 1 to 3, completion of 1 million sq. ft. including IT office space and other mixed development and during Years 3 to 5, full-scale ramp-up and completion of the remaining 9 million sq. ft. of mixed development. Further, VMRDA is directed to lay the master plan road. This allotment is for setting up IT / ITES Space, Retail, Residential, Data Centers with proposed investment of INR 1,500 crores and employment potential of 25,000 jobs.

సత్వా కంపెనీకి 30 ఎకరాల భూమిని ఎకరా రూ.1.5 కోట్ల చొప్పున కేటాయిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు

ఐటీ డెవలపర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమైన రాయితీలు

వివరం	రాయితీ
క్యాపిటల్ సబ్సిడీ	పెట్టుబడి విలువలో 50 శాతం, చదరపు అడుగుకి గరిష్టంగా రూ.2,000 చెల్లింపు
మౌలిక వసతులు	పరిశ్రమల టారీఫ్ అమలు, క్యాంపస్ వద్దకే విద్యుత్ సౌకర్యం, 100 అడుగుల రోడ్డు నిర్మాణం
టైలర్ మేడ్ రాయితీలు	భారీ ప్రాజెక్టులకు చౌకగా భూములు కేటాయింపు, పెట్టుబడి ఆధారంగా ఇతర అవసరాలకు భూ వినియోగం పెంపు
ఇతర ప్రయోజనాలు	ఆర్నెళ్ల పాటు ఉద్యోగుల వ్యయాన్ని ప్రభుత్వం తిరిగి వెనక్కి ఇస్తుంది. నైపుణ్య శిక్షణ కింద ప్రతి సీటుకు 24 నెలలపాటు రూ.2,000 చొప్పన చెల్లింపు

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

IT, E&C Dept - Promotions Wing – Approval for allotment of 27.10 acres of land at IT Hill No 3, Madhurawada, Visakhapatnam to M/s K Raheja Corp Real Estate Private Limited for developing IT/ITeS office space and residential space, and consideration of the project under AP IT & GCC Policy 4.0 (2024-29) for extending incentives, towards a proposed investment of INR 2,172 Crores with potential to create 9,681 jobs – Orders – Issued.

INFORMATION TECHNOLOGY, ELECTRONICS AND COMMUNICATION
[IT,E&C] (PROMOTIONS) DEPARTMENT

G.O.MS.No.56 — Date: 12.11.2025
Read the following

7. The Government after careful examination of the proposal and keeping in the view the recommendations of the SIPB and the Council of Honourable Ministers, hereby approves the allotment of 27.10 acres of plottable land at Hill No.3, Madhurawada, Visakhapatnam, to M/s K Raheja Corp Real Estate Pvt Ltd, under Andhra Pradesh Land Incentive for Tech Hubs (LIFT) Policy (4.0) 2024-29, at a cost of INR 0.99. The allotment is made against the condition that the company creates 15,000 jobs. APIIC is directed to develop the infrastructure, that is, a road with at least 18 meters or 24 meters, based on feasibility and the IT, E & C department is required to extend the capital for this request to the tune of INR 91.2 Crores towards road, water, power and other necessary infrastructure. Administrative sanctions are accorded for the same. The Revenue department is directed to handover the possession of land and alienate 12.00 acres of land at Sy.No 407, Madhurawada to APIIC. And APIIC is directed to further allot the land to the company. The approval is accorded for allowing mixed development of land up to 45%. The project shall be eligible for all other incentives as per AP IT & GCC policy (4.0) 2024-29, under IT Campus developer category.

రహేజా సంస్థకు రూ.1375 కోట్ల విలువైన 27.10 ఎకరాలను ఎకరా కేవలం 99 పైసలకే ఇస్తూ జారీ చేసిన ఉత్తర్వులు

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

ITE&C Dept. - Promotions Wing - Allotment of 10 Acres of land to M/s. BVM Energy and Residency Private Limited (A Kapil Group Entity) at Yendada Village, Visakhapatnam for setting up World Trade Center, and consideration of the project under the AP IT & GCC Policy (4.0) 2024-29 for extending incentives towards a proposed investment of Indian Rupees (INR) 1,250 crores with an employment potential of 15,000 jobs – Orders – Issued.

INFORMATION TECHNOLOGY, ELECTRONICS AND COMMUNICATION
[IT,E&C] (PROMOTIONS) DEPARTMENT

G.O.MS.No.28 — Date:01.08.2025
Read the following

a. *"Approval for allotment of 10 acres of land at Sy No. 179/2 of Yendada Village, Visakhapatnam, at INR 1.5 Cr per acre, subject to developing a minimum of 2.5 Million SFT of mixed development.*

b. *Allotment for the remaining 20 acres of land will be examined after receipt of the additional proposal for the development of the Integrated IT Park.*

కపిల్ గ్రూప్ బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ సంస్థకు 30 ఎకరాలను ఇచ్చేందుకు జారీచేసిన ఉత్తర్వులు

తెలంగాణలో ఆదాయం.. ఏపీలో ఆల్ ఫ్రీ..!

ప్రజల ఆస్తులకు ధర్మకర్తగా ఉండాల్సిన చంద్రబాబు సర్కారు రూ.వేల కోట్ల విలువైన భూములను రియల్ ఎస్టేట్ సంస్థలకు పప్పు బెల్లాలు మాదిరిగా అప్పగిస్తోంది. ఒకపక్క హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ సంస్థలకు వేలం ద్వారా భూములను విక్రయిస్తూ పోటీతత్వాన్ని పెంచి తెలంగాణ ప్రభుత్వం భారీగా ఆదాయాన్ని పొందుతుంటే.. రాష్ట్రంలో మాత్రం చంద్రబాబు సర్కారు అత్యంత ఖరీదైన భూములను కేవలం 99 పైసలకే కేటాయిస్తూ ఖజానాకు తూట్లు పొడుస్తోంది. ఎటువంటి వేలం లేకుండా, భూ కేటాయింపులకు దరఖాస్తులు ఆహ్వానించకుండా నచ్చిన సంస్థలకు ఇష్టమొచ్చిన రేటుకు భూములు కేటాయిస్తున్నారు. తాజాగా ఇదే విషయంపై హైకోర్టు సైతం రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. అన్ని కంపెనీలకు అవకాశం ఇవ్వకుండా ఇష్టమొచ్చినట్టు భూములను ఎలా కేటాయిస్తున్నారంటూ కె.రహేజాకు భూ కేటాయింపుపై దాఖలైన ప్రజాప్రయోజన వాజ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

ఇంతంగాత్

బిజినెస్ రీఫార్మర్ అవార్డు లాంటివి ఇంకా ఎన్నో వస్తాయ్! రూపాయికి.. 99 పైసలకే కోట్ల విలువ చేసే భూములు కేటాయిస్తున్నారుగా!

బాబు మరో క్రెడిట్ చోరీ..

వేగంగా రిజిస్ట్రేషన్లూ ▸ బాబు గొప్పేనట!

వైఎస్ జగన్ హయాంలో జరిగిన సంస్కరణలు తన ప్రతిభేనంటూ ప్రచారం

- నిజానికి.. నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తయ్యే విధానాన్ని తెచ్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- ఇందుకోసం 2023లోనే సాఫ్ట్‌వేర్ 'కార్డ్ 2.0' అమల్లోకి
- అప్పట్లో దానిపై ఎడతెగని విష ప్రచారం చేసిన చంద్రబాబు, ఎల్లో మీడియా
- ఇప్పుడది విజయవంతంగా అమలవుతుండడంతో నిస్సిగ్గుగా తన ఖాతాలోకి



గ్రామ గ్రామాన ఈ వ్యవస్థను బాబు రద్దుచేశారు..

సాక్షి, అమరావతి: దేశంలో ఏం సంస్కరణ జరిగినా, ఎక్కడ మంచి ఫలితం కనిపించినా అది తన ఘనతేనని సిగ్గూఎగ్గూ లేకుండా ప్రచారం చేసుకునే చంద్రబాబు తాజాగా మరో క్రెడిట్ చోరీకి బరితెగించారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలో చిన్న మార్పు కూడా చేపట్టకుండానే ఏడాదిన్నర గడిపేసిన ఆయన.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వేగంగా రిజిస్ట్రేషన్లు జరిగే ప్రక్రియ ప్రారంభమై విజయవంతంగా అమలవుతుంటే దీనినీ తన ఖాతాలో వేసుకుంటున్నారు. రెండ్రోజుల క్రితం జరిగిన కలెక్టర్ల సదస్సులో దీని గురించి మాట్లాడుతూ.. పది నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ అయిపోయిందని తనకు ఒక మెసేజ్ వచ్చిందని, అది తనకెంతో సంతోషాన్నిచ్చిందని.. ఆ ఘనత తనదేనని నమ్మబలికారు. నిజానికి.. నిమిషాల వ్యవధిలో రిజిస్ట్రేషన్లు జరిగేలా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను మార్చడానికి ఆయన ఒక్క చర్య కూడా తీసుకోలేదు. ఆయనేమీ చేయకుండానే ఇప్పుడు అత్యంత సులభంగా, వేగంగా రిజిస్ట్రేషన్లు చకచకా జరిగిపోతున్నాయి. ఎందుకంటే.. అది వైఎస్ జగన్ హయాంలో ఎంతో ముందుచూపుతో అమల్లోకి తెచ్చిన విధానం. రిజిస్ట్రేషన్ల శాఖను ఆధునిక టెక్నాలజీతో అనుసంధానం చేయడానికి జగన్ సర్కార్ అప్పట్లో ఎంతో కసరత్తు చేసింది.

ఒరిజినల్ దస్తావేజులు ఇవ్వరంటూ విషం కక్కింది బాబే..

రిజిస్ట్రేషన్ల శాఖలో జరిగిన సంస్కరణలపై అప్పట్లో చంద్రబాబు మోపిన అభాండాలు అన్నీఇన్నీ కావు. సులభంగా రిజిస్ట్రేషన్లు చేయడానికి తెచ్చిన ఆన్‌లైన్ విధానంలో ప్రజలకు ఒరిజినల్ దస్తావేజులు ఇవ్వకుండా జిరాక్స్ కాపీలు మాత్రమే ఇస్తారంటూ ప్రజలను బెంబేలెత్తించారు. అందరి ఆస్తులను జగన్ లాగేసుకుంటారని, ఒరిజినల్ దస్తావేజులు ప్రభుత్వం వద్దే ఉంటాయని, వాటిని చూపి అప్పులు తెస్తారని, ప్రజల ఆస్తులు గంగలో కలిసినట్లేనని ఎల్లో మీడియా ద్వారా ప్రజల్లో అనేకానేక అపోహలు సృష్టించారు. అలాంటి దుష్ప్రచారాలతో ఎన్నికల్లో గెలిచిన చంద్రబాబు ఇప్పుడు అవన్నీ మరచిపోయి.. జగన్ తీసుకొచ్చిన విధానంవల్ల జరుగుతున్న మంచిని తనదని డబ్బా కొట్టుకోవడం ఆయన దిగజారుడు వైఖరికి నిదర్శనమని విమర్శకులు చెబుతున్నారు.

కార్డ్ 2.0 విధానాన్ని కేవలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే కాకుండా ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలోనూ అమలయ్యే వ్యవస్థను అప్పట్లో జగన్ తీసుకొచ్చారు. చంద్రబాబు వచ్చాక దాన్ని రద్దుచేశారు. అది అమల్లో ఉంటే ప్రజలు ఇంకా సులభంగా తమ గ్రామంలోనే రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ఉండేది. అలాంటి అవకాశం జనానికి లేకుండా చేసిన ఘనత చంద్రబాబుది. ఈ రిజిస్ట్రేషన్ జరిగే ప్రక్రియలో సంబంధిత ఆస్తిని సబ్ డివిజన్ చేయాల్సి వస్తే వెంటనే జరిగిపోయే పద్ధతిని కూడా జగన్ ప్రవేశపెట్టారు. అలాగే, రిజిస్ట్రేషన్ జరిగిన సంబంధిత ఆస్తి వినియోగదారుడి పేరుపై మ్యుటేషన్ కూడా ఆటోమేటిక్‌గా జరిగే విధానాన్ని అప్పుడే తీసుకొచ్చారు. ఇందుకోసం కార్డ్ 2.0 సాఫ్ట్‌వేర్‌ను రెవెన్యూ శాఖ పరిధిలోని వెబ్‌ల్యాండ్‌కు అనుసంధానం చేశారు. అస్తవ్యస్థంగా, రోజుల తరబడి జరిగే రిజిస్ట్రేషన్ల విధానాన్ని సులభంగా మార్చే సంస్కరణ తీసుకొచ్చినప్పుడు చంద్రబాబు నీచాతినీచంగా బురదజల్లి లబ్ధిపొందారు. కానీ, ఇప్పుడు అదే విధానం బాగుండేసరికి అది తన ప్రతిభేనని డప్పు కొట్టుకుంటున్నారు.

2023లోనే సులభతర రిజిస్ట్రేషన్ల విధానం..

- వాస్తవానికి.. 2023 ఆగస్టులో అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల శాఖలో కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్ (కార్డ్)ను ఆధునీకరించి కార్డ్ 2.0 వెర్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది.
- దీనిద్వారా స్టాంపు పేపర్లు, సంతకాలతో పనిలేకుండా రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం ఏర్పడింది.
- డాక్యుమెంట్‌ను ఎవరికి వారే ఆన్‌లైన్‌లో తయారుచేసుకుని, ఆన్‌లైన్‌లోనే స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజును చలానా ద్వారా కట్టి, ఒక టైం స్లాట్‌ను బుక్‌చేసుకుని ఆ సమయానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే సరిపోయే వ్యవస్థ అది.
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర వేస్తే 5–10 నిమిషాల వ్యవధిలో రిజిస్ట్రేషన్ అయిపోతుంది. అప్పటి నుంచి ఈ విధానం అమలవుతోంది.
- కానీ, చంద్రబాబు ఇప్పుడు తానే ఆ విధానాన్ని తీసుకొచ్చినట్లు బిల్డప్ ఇచ్చుకుంటూ కలెక్టర్ల సదస్సులో సిగ్గులేకుండా చెప్పుకున్నారు. ఇది చూసి అధికారులు ముక్కున వేలేసుకున్నారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్ట్ మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో శుక్రవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. బీజాపూర్ జిల్లా ఎస్పీ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రావతి నదీతీరంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు డీఆర్‌జీ, ఎస్టీఫ్, కోబ్రా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరుపుతూ పారిపోతుండగా బలగాలు కూడా ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందగా, అతన్ని ఇంద్రావతి ఏరియా కమిటీ సభ్యుడు పడ్డీ మడవిగా గుర్తించారు.

41 మంది మావోల లొంగుబాటు

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు పార్టీ కొమురంభీం ఆసిఫాబాద్–మంచిర్యాల డివిజనల్ కమిటీ కార్యదర్శి ఎర్రగొల్ల రవి అలియాస్ సంతోష్, పార్టీ సభ్యుడు చెందిన కనికారపు ప్రభంజన్ (మంచిర్యాల జిల్లా) సహా మొత్తం 41 మంది మావోయిస్టులు శుక్రవారం డీజీపీ బి.శివధర్‌రెడ్డి ఎదుట ఆయుధాలతో లొంగిపోయారు.

టీటీడీ బోర్డులో బంజారాలకు చోటివ్వండి

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డులో బంజారా జాతికి చెందిన వ్యక్తిని సభ్యుడిగా నియమించారని... ప్రస్తుతం చంద్రబాబు ఆ అవకాశం ఇవ్వలేదని తెలంగాణలోని కాంగ్రెస్ ఎంపీ బల్‌రామ్ నాయక్ అన్నారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీకి చెందిన బంజారా జాతి వ్యక్తికి టీటీడీ బోర్డులో సీఎం చంద్రబాబు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ - శ్రీశైలం
40వ సర్వసభ్య సమావేశము
మన సంస్థ సర్వసభ్య సమావేశము, డి. 26-12-2025 రోజున ఉ॥10 గం॥ 30 ని॥లకు రెడ్డి భవనము తిరుపతిలో జరుగును. కావున గది దాతలు, స్థల దాతలు మరియు జీవిత సభ్యులు సంస్థ జారీచేసిన తమ గుర్తింపు కార్డుతో హాజరు కావలసినదిగా కోరుచున్నాము.
తోదేటి నరసింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శి, సెల్: 98486 03434

ఏఐ ద్వారా పిచికారీ చేసే సాంకేతికత

ఫ్లోరిడా యూనివర్సిటీ ప్రొ.డాక్టర్ గోపాల్

సాక్షి, అమరావతి: కృత్రిమ మేధస్సు(ఏఐ) ద్వారా పంటల్లో కలుపు మొక్కలు, పురుగులను గుర్తించి వాటిపై మాత్రమే రసాయనాలు పిచికారీ చేసే పరిజ్ఞానం యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా(యూఎస్ఏ)లో ఉందని ఫ్లోరిడాలోని గ్లోబల్ ఫుడ్ స్పేస్ ఇన్‌స్టిట్యూట్ అసోసియేట్ డైరెక్టర్ (రీసెర్చ్) ప్రొఫెసర్ డాక్టర్ గోపాల్ కాకాని అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కృష్ణా ఆడిటోరియంలో వ్యవసాయంలో కృత్రిమ మేధ అభివృద్ధి అనే అంశంపై శుక్రవారం జరిగిన చర్చలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఫిర్యాదు, ఎఫ్ఐఆర్‌ల సర్టిఫైడ్ కాపీలను మాత్రమే తీసుకోండి

- తేల్చిచెప్పిన విజయవాడ ఏసీబీ కోర్టు
- తిలక్ పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించిన కోర్టు

సాక్షి, అమరావతి: మద్యం కుంభకోణానికి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో నాటి మాజీ సీఎం చంద్రబాబు, మాజీమంత్రి కొల్లు రవీంద్ర, అప్పటి ఐఏఎస్ అధికారి శ్రీనరేష్‌లపై సీఐడీ నమోదుచేసిన కేసుకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను తమకు అందచేయాలని స్వర్ణాంధ్ర తెలుగు పత్రిక ఎడిటర్ కొట్టి బాలగంగాధర్ తిలక్ అభ్యర్థనను విజయవాడ ఏసీబీ కోర్టు తిరస్కరించింది. కేవలం ఫిర్యాదు, ఎఫ్ఐఆర్ తాలుకు సర్టిఫైడ్ కాపీలను మాత్రమే ఇచ్చేందుకు అనుమతినిచ్చింది. ఈ మేరకు ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి. భాస్కరరావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

హైకోర్టులో పిల్ వేశా, ఆ డాక్యుమెంట్లు ఇవ్వండి..

2014–19 మధ్య కాలంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన పలు కుంభకోణాల్లో దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ తిలక్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఇందులో తదుపరి చర్యల నిమిత్తం మద్యం కుంభకోణానికి సంబంధించి చంద్రబాబు తదితరులపై సీఐడీ నమోదుచేసిన కేసులో తమకు ఫిర్యాదు, ఎఫ్ఐఆర్, సాక్షుల వాంగ్మూలాలు, చార్జిషీట్లతో పాటు ఇతర డాక్యుమెంట్లన్నీ ఇవ్వాలని కోరుతూ తిలక్ ఇటీవల ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీటిని పొందేందుకు హైకోర్టులో పిల్ దాఖలు చేసిన వ్యక్తిగా తిలక్ అర్హుడని ఆయన తరపు న్యాయవాది శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి ఏసీబీ కోర్టుకు నివేదించారు. వాదనలు విన్న ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి. భాస్కరరావు ఈనెల 19న నిర్ణయం వెలువరిస్తానన్న విషయం తెలిసిందే. తాజాగా.. శుక్రవారం తిలక్ పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించారు. కేవలం ఫిర్యాదు కాపీ, దాని ఆధారంగా సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీని మాత్రమే అందించేందుకు అనుమతినిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మిగిలిన కుంభకోణాల్లో డాక్యుమెంట్లు ఇచ్చేందుకూ 'నో'..

అయితే, చంద్రబాబునాయుడు, అప్పటి ఆయన మంత్రివర్గ సహచరులు లోకేశ్, నారాయణ, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు తదితరులపై గతంలో నమోదైన పలు కుంభకోణాల కేసులను మూసివేస్తూ ఏసీబీ కోర్టు ఇప్పటికే ఉత్తర్వులిచ్చింది. దీంతో.. చంద్రబాబుపై నమోదైన కుంభకోణాల తాలుకు కేసుల్లో అన్ని డాక్యుమెంట్లు ఇవ్వాలని, అలాగే కేసుల మూసివేత ఉత్తర్వులను కూడా ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు కూడా ఏసీబీ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఇందులో కూడా సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల తాలుకు సర్టిఫైడ్ కాపీలను మాత్రమే ఇచ్చేందుకు ఏసీబీ కోర్టు అనుమతించింది.

ప్రయత్నం ఎప్పటికీ వృథా కాదు. వైఫల్యం శాశ్వతంగా ఉండిపోదు. కొన్నిసార్లు చిన్న ప్రయత్నమైనా ఉన్నత స్థానాన్ని కల్పించవచ్చు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 20 డిసెంబర్ 2025

అసత్యాలు... అర్ధ సత్యాలు

సొంత శిబిరంలో విభేదాలూ, అస్తవ్యస్తంగా మారిన ఆర్థిక వ్యవస్థ, కానరాని ఉపాధి కల్పన, మధ్యంతర ఎన్నికల్లో ఓటర్ల తిరస్కరణ వగైరాలు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను ఊపిరాడనీయటం లేదని వైట్‌హౌస్ వేదికగా ఆయన జాతినుద్దేశించి చేసిన ప్రసంగం తేటతెల్లం చేసింది. పాత సంవత్సరానికి వీడ్కోలుగా, అధికారంలోకొచ్చి ఏడాది కావస్తున్న సందర్భంగా ఆయన చేసిన ఈ ప్రసంగం ఒకపక్క స్వోత్కర్షలతో, మరోపక్క సంజాయిషీలతో నిండిపోయింది. అసత్యాలు, అర్ధ సత్యాలు సరేసరి. తరచు వైట్‌హౌస్ వేదికగా జరిగే మీడియా సమావేశాల్లో ఆయన చేసే వ్యాఖ్యలకూ, ఈ ప్రసంగానికీ కాస్తయినా తేడా లేదు. స్వీయ వైఫల్యాలను నిష్క్రమించిన అధ్యక్షుడు జో బైడెన్ ఖాతాకు మళ్లించి... జరగని యుద్ధాలనూ, జరిగినా తన ప్రమేయం లేకుండా ముగిసిన యుద్ధాలనూ, ఆపినా మళ్లీ మొదలైన యుద్ధాలనూ సైతం తన విజయంగా ప్రకటించుకున్నారు. అందులో భారత్–పాక్ సంఘర్షణ ఒకటి. వలసదారులను దేశం విడిచి వెళ్లేలా చేసి అలా ఆదా చేసిన సొమ్మంతా అమెరికన్ పన్ను చెల్లింపుదారులకు ఉచితంగా వైద్యం, విద్య రూపంలో అందిస్తున్నామని ట్రంప్ చెప్పుకొన్నారు. ఇళ్ల అద్దెలు తగ్గాయనీ, ఉద్యోగాలు వచ్చిపడ్డాయనీ, పెట్టుబడులు రప్పించాననీ ప్రకటించుకున్నారు.

నిజానికి అమెరికా ఆర్థిక వ్యవస్థ పరుగులు పెట్టడానికి వలసదారుల తోడ్పాటు ఎంతో ఉంది. దేశంలో అగ్ర సంస్థలుగా పేరొందిన వాటిలో 46 శాతం... అంటే 230 కంపెనీలు వలసదారులూ, వారి పిల్లలూ స్థాపించినవే. ఈ ఏడాది న్యూ అమెరికన్ ఫార్చ్యూన్–500లో చేరిన పది కంపెనీల్లో సగం వలసదారులవే. 2023 గణాంకాల ప్రకారమైతే ఆ ఏడాది వలసదారులు సృష్టించిన సంపద లక్షా 70 వేల కోట్ల డాలర్లు. వారు పన్ను రూపంలో చెల్లించిన మొత్తం 65,200 కోట్ల డాలర్లు. వాస్తవాలు ఇవి కాగా, చట్టవిరుద్ధంగా వచ్చినవారితోపాటు అమెరికా పౌరసత్వం పొందినవారిని సైతం ట్రంప్ ప్రభుత్వం రాచి రంపాన పెడుతోంది. వారిలో అనవసర భయాందోళనలను సృష్టిస్తూ, ప్రజల్లో అనైక్యత తీసుకురావటానికి అబద్ధాలను ప్రచారంలో పెడుతోంది. ఆయన వచ్చాక వలస వ్యవహారాల న్యాయమూర్తులుగా వున్న 100 మందిని తొలగించారు. టానియా నెమెర్ అనే మహిళా న్యాయమూర్తిని ఒక కేసు విచారిస్తుండగానే కారణం చెప్పకుండా బెంచ్ నుంచి, ఆ తర్వాత సర్వీసు నుంచి తొలగించారు.

ప్రస్తుత వైఫల్యాలకు కారణం గతంలోని అస్తవ్యస్తతే కారణమని చెప్పడం ఇటీవల అన్ని దేశాల్లోనూ పాలకులకు అలవాటైన విద్య. ట్రంప్ సైతం ఆ పాటే పాడారు. నిజానికి జో బైడెన్ హయాంలో ఆర్థిక వ్యవస్థ ఎంతో పటిష్టంగా ఉంది. వలసదారులను తరిమేయటం ద్వారా దాన్ని మరింత గొప్పగా మారుస్తానని అధ్యక్ష ఎన్నికల ప్రచార సభల్లో ట్రంప్ పదే పదే చెప్పారు. కానీ జరిగిందంతా వేరు. ఇష్టానుసారం ప్రపంచ దేశాలపై సుంకాలు పెంచటం వల్ల దేశీయ వినియోగదారులు సగటున 16.8 శాతం అదనంగా పన్నులు చెల్లించాల్సి వస్తున్నదనీ, 1935 నుంచి చూస్తే ఇదే అత్యధికమనీ యేల్ బడ్జెట్ ల్యాబ్ అంచనా వేసింది. దిగుమతైన సరుకులపై ప్రభుత్వం విధించే అదనపు సుంకాలను అంతిమంగా భరించేది అమెరికా వినియోగదారులే. ట్రంప్ అనుకూల ఫాక్స్ న్యూస్ సర్వేలో 72 శాతం మంది గడ్డు ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్నామని చెప్పగా, 58 శాతం మంది ఆయన అనుచిత విషయాలపై శ్రద్ధ పెడుతున్నారని అన్నారు. ఇక అక్టోబర్, నవంబర్ నెలల్లో 41,000 మంది ఉద్యోగాలు కోల్పోయారు. నిరుద్యోగిత 4.6 శాతానికి ఎగబాకింది. 2021 తర్వాత ఈ స్థాయికి పోవటం ఇదే ప్రథమం. గంజాయి వాడకాన్ని చట్టబద్ధం చేయటానికి ప్రయత్నిస్తూ మాదక ద్రవ్యాలపై పోరాడుతున్నానని చెప్పుకోవటం ట్రంప్‌కే చెల్లింది.

దేశం ఎదుర్కొంటున్న సమస్యలను చిత్తశుద్ధితో చర్చించి, వాటి పరిష్కారానికి తాను అనుసరిస్తున్న విధానాలేమిటో చెప్పి భవిష్యత్తు బాగుంటుందని చెప్పివుంటే కనీసం కొందరైనా నమ్మేవారు. ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని ఒప్పుకొంటే, దానికి జవసత్వాలిచ్చేందుకు ఆయన ఏదో ఒకటి చేస్తారన్న ఆశయినా మిగిలేది. దానికి బదులు అంతా సవ్యంగా ఉందని చెప్పడం వల్ల ట్రంప్‌పై కొద్దో గొప్పో ఉన్న విశ్వాసం కూడా దెబ్బ తింది. ఆయన రేటింగ్ పడిపోవటంలో ఆశ్చర్యమేముంది?

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.పాడ్యమి పూర్తి (24 గంటలు), **నక్షత్రం:** మూల రా.1.15 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.7.42 నుండి 9.27 వరకు, తదుపరి రా.11.26 నుండి 1.10 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.26 నుండి 7.55 వరకు, **అమృత ఘడియలు:** సా.6.08 నుండి 7.54 వరకు.

సూర్యోదయం : 6.28
సూర్యాస్తమయం: 5.26
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

ఖాళీ కుర్చీ



వినియోగదారుడే మన అంతిమ తీర్పరి. అతడు ఇచ్చిందే ఫైనల్ జడ్జిమెంట్. నేను ప్రతిసారీ మీటింగ్ పెట్టినప్పుడు మీటింగ్ హాల్లో ఖాళీగా ఉన్న కుర్చీలో ఒక మహిళా వినియోగదారు కూర్చొని మేము ఏం చేస్తున్నామో గమనిస్తున్నట్లుగా నేను ఊహించుకుంటాను.

– మినీష్ తివారీ, 'నెస్లే' ఇండియా చైర్మన్

ఇదే చెబుతా!

వయసు మీద పడిందని రైడింగ్ ఆపటం జరగదు. రైడింగ్ ఆపినప్పుడే వయసు మీద పడినట్లు! కాబట్టి నీతి ఏమిటంటే – జీవితం చిన్నది. మోటార్ సైకిల్ కొనుక్కో. రైడ్ చెయ్యి. ఇది నా గురించి మాత్రమే కాదు. బైక్ రైడింగ్‌ను ఇష్టపడే ప్రతి మహిళకు కూడా ఇదే చెబుతాను.

– పల్లవి ఫౌజ్‌దార్, బైక్ రైడర్, సోషల్ వర్కర్

ఆగకూడదు

ఒడిదుడుకులు లేని జీవితం ఉండదు. 'విజయం సాధించినప్పుడు ఎక్కువగా పొంగిపోకు. వైఫల్యం ఎదురైనప్పుడు అతిగా కుంగిపోకు' అని తత్వశాస్త్రం చెబుతుంది. వెంచర్ క్యాపిటలిస్ట్ మీకు హ్యాండిచ్చినంత మాత్రాన మీ ఆలోచన ఆగకూడదు.

– అజయ్ పీరామల్, వ్యాపారవేత్త

సినిమాలు

దారి చూపించటం, హృదయానికి హత్తుకునేలా చెప్పటం కళాకారుడి విధి. కళ విలువల్ని ప్రేరేపించాలి. సినిమా తీయటం, స్క్రిప్టు రాయటం అనేవి ప్రపంచాన్ని మార్చేంత శక్తి గలిగినవి. ఆ శక్తిని నిష్ప్రయోజనం కానివ్వకండి. సమాజం కోసం ఫలవంతంగా ప్రయోగించండి.

– రాజీవ్ ఆంచల్, డైరెక్టర్

మంచి కోచ్

నేను స్ట్రయికర్‌గా మాత్రమే ఆటలో కొనసాగి ఉంటే ఈ రోజు ఎక్కడ ఉండేవాడినో నాకే తెలియదు. స్ట్రయికర్ పాత్ర నుండి మిడ్ ఫీల్డ్‌కు మారటం నా కెరీర్‌నే మార్చేసింది. కోచ్ ఇచ్చిన సలహా అది. దిగ్గజాలైన కోచ్‌లు ఉండటం మన యువ క్రీడాకారులకు కలిసొచ్చే విషయం.

– డెన్సన్ దేవదాస్, ఫుట్‌బాలర్

ఎదురు పాఠాలు!



ఒక భారీ సవాలుతో కూడిన లక్ష్యాన్ని ఏర్పరచుకున్నప్పుడు రాజీ పడని అంకిత భావం అవసరం. కఠినమైన శ్రమ, పోటీ స్ఫూర్తి, పట్టువీడని కృషి ఇవి లేనిదే విజయాన్ని సాధించలేం. ఎదురు దెబ్బలు ఉండొచ్చు, వాటి నుంచి మనల్ని మెరుగుపరుచుకునే పాఠాలు నేర్చుకోవాలి.

– కె.ఎం. బీను, మాజీ ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్

పనిలో పారదర్శకతకు పట్టం

అభిప్రాయం

శివరాజ్ సింగ్ చౌహాన్

సంక్షేమ సంస్కరణల విషయంలో బహిరంగ చర్చ అవసరమైనదే కాకుండా ఆరోగ్యకరమైనది కూడా. 'వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ)' (వీబీ జీ– రామ్ జీ) బిల్లుకు సంబంధించి కొన్ని వర్గాల నుంచి వ్యక్తమౌతున్న ఆందోళనలు... చారిత్రక ఉపాధి హామీ చట్టంలో వచ్చే మార్పులు కార్మికుల హక్కులను బలహీనపరుస్తాయేమో అనే భయం నుంచి వచ్చాయి. అటువంటి ఆందోళనలను గౌరవించాల్సిందే. అయితే ఊహల కంటే కూడా 'వీబీ జీ రామ్ జీ' బిల్లు అసలు ఏం చేస్తుందో క్షుణ్ణంగా పరిశీలించడం ముఖ్యం. ఈ బిల్లులోని అత్యంత ప్రధానమైన అంశం ఏంటంటే, ఇది ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధమైన హామీని ఇస్తోంది. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోపు ఉపాధి కల్పించని పక్షంలో నిరుద్యోగ భృతిని అందించే నిబంధనను కూడా ఈ బిల్లు కలిగి ఉంది.

◆ వీబీ జీ రామ్ జీ బిల్లు ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధమైన హామీని ఇస్తోంది. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోపు ఉపాధి కల్పించని పక్షంలో నిరుద్యోగ భృతిని అందించే నిబంధనను కూడా ఈ బిల్లు కలిగి ఉంది.

125 రోజుల గ్యారంటీ పని!

జాతీయ గ్రామీణ ఉపాధి చట్టంలో బలహీనత అనేది ఉద్దేశంలో లేదు... నిర్మాణపరమైన లోపాలలో ఉంది. ఈ విషయంలో సంస్కరణలు అవసరం. 'వీబీ–జీ రామ్ జీ'ని ఈ వాస్తవికతకు అనుగుణంగా అంచనా వేయాలి. హక్కులను బలహీనపరచడానికి బదులుగా ప్రతిపాదిత చట్టం 'ఎంజీ నరేగా'లోని లోపాలను నేరుగా పరిష్కరిస్తుంది. కార్మికులకు రావలసిన వాటిని నిరాకరించే అనర్హత నిబంధనలను తొలగించడంతో పాటు పారదర్శకత, సామాజిక తనిఖీ, ఫిర్యాదుల పరిష్కారానికి చట్టబద్ధమైన బాధ్యతలను బలోపేతం చేస్తుంది.

'వీబీ–జీ రామ్ జీ' గ్రామీణ ఉపాధి విషయంలో డిమాండ్–ఆధారిత స్వభావాన్ని దెబ్బతీస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ బిల్లును క్షుణ్ణంగా చదివితే ఆ వాదన నిలబడదు. సెక్షన్ 5(1) ప్రకారం, గ్రామీణ కుటుంబానికి చెందిన వయోజనులు ఎవరైనా శారీరక శ్రమతో నైపుణ్యం లేని పని చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తే వారికి ప్రతి ఆర్థిక సంవత్సరంలో కనీసం 125 రోజుల ఉపాధిని కల్పించాల్సిన స్పష్టమైన చట్టబద్ధమైన బాధ్యత ప్రభుత్వానికి ఉంటుంది. ఉపాధి హామీని 125 రోజులకు విస్తరించడం, 'ఎంజీ నరేగా' కాలం నాటి అనర్హత నిబంధనలను తొలగించడం ద్వారా ఈ బిల్లు ఈ హక్కును మరింత బలోపేతం చేస్తోంది. తద్వారా నిరుద్యోగ భృతిని ఒక నిజమైన చట్టబద్ధమైన రక్షణ కవచంగా పునరుద్ధరిస్తోంది.

బలోపేతం కానున్న జీవనోపాధి హామీ

ఈ సంస్కరణ ఉపాధిని పక్కన పెట్టి కేవలం ఆస్తుల కల్పనకే ప్రాధాన్యత ఇస్తుందన్నది మరో విమర్శ. ఈ బిల్లు స్పష్టంగా చట్టబద్ధమైన జీవనోపాధికి హామీని ఇస్తూనే ఉపాధిని ఉత్పాదక, మన్నికైన ప్రభుత్వ ఆస్తుల కల్పనతో అనుసంధానిస్తుంది.

షెడ్యూల్ 'ఐ'తో కలిపి సెక్షన్ 4(2)... నీటి భద్రత, కీలకమైన గ్రామీణ మౌలిక సదుపాయాలు, జీవనోపాధికి సంబంధించిన మౌలిక సదుపాయాలు, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించే పనులు అనే నాలుగు ప్రధాన రంగాలను గుర్తించింది. దీనివల్ల వేతన ఉపాధి అనేది తక్షణ ఆదాయ మద్దతును అందించడమే కాకుండా దీర్ఘకాలిక గ్రామీణ దృఢత్వం, ఉత్పాదకతకు కూడా దోహదపడుతుంది. అందువల్ల ఉపాధి, ఆస్తుల కల్పన అనేవి పరస్పర విరుద్ధమైన లక్ష్యాలు కావు. అవి ఒకదానికొకటి తోడ్పడుతూ సుసంపన్న గ్రామీణ భారతానికి పునాది వేస్తాయి.

కేంద్రీకరణ కాదు, సమన్వయం ద్వారా వికేంద్రీకరణ

ఈ బిల్లు అధికారాల కేంద్రీకరణను వ్యతిరేకిస్తోంది. సెక్షన్ 4(1) నుంచి 4(3)... అన్ని పనులను గ్రామ స్థాయిలో స్థానిక అవసరాల ఆధారంగా రూపొందించిన, గ్రామసభ ఆమోదించిన వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్‌లతో (వీజీపీపీలు) అనుసంధానిస్తాయి. పాత చట్టంలో ఉన్న ప్రధాన లోపం విభజన. దీనిని తొలగించేందుకు అన్ని పనులను వికసిత్ భారత్ నేషనల్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టాక్‌లో (వీబీఎన్ఆర్ఐఎస్) చేర్చాలని ఈ బిల్లు చెబుతోంది. దీని వల్ల ప్రణాళికా రచనలో ఏకరూపత, పారదర్శకత ఉంటాయి.

ఇది కేవలం పై నుంచి రుద్దిన కేంద్రీకరణ కాదు. సెక్షన్ 16, 17, 18, 19 ప్రకారం ప్రణాళిక, అమలు, పర్యవేక్షణ అధికారాలు ఆ యా స్థాయుల్లోని పంచాయతీలు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, జిల్లా అధికారులకు ఉంటాయి. ఈ బిల్లు కేవలం పనుల పట్ల స్పష్టత, సమన్వయం, సమగ్రతను కల్పిస్తుందే తప్ప నిర్ణయాధికారాన్ని కేంద్రీకరించదు. స్థానిక ప్రాధాన్యతల ఆధారంగా ప్రణాళికలను రూపొందించడంలో గ్రామ సభలదే ప్రధాన పాత్ర.

భద్రత, ఉత్పాదకత మధ్య సమతుల్యత

సాగు పనులు ఎక్కువగా ఉండే సమయాల్లో వ్యవసాయ కూలీల కొరతపై ఉన్న ఆందోళనలను ఈ బిల్లు స్పష్టంగా పరిష్కరించింది. ఈ బిల్లు కింద సెక్షన్ 6 ప్రకారం విత్తనాలు నాటడం, కోతల సమయాలను కలుపుకొని ఒక ఆర్థిక సంవత్సరంలో మొత్తం 60 రోజుల వరకు పనులు చేపట్టకూడదని ముందుగానే ఆదేశాలు జారీ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుంది.

ముఖ్యంగా సెక్షన్ 6(3) ప్రకారం వ్యవసాయ–వాతావరణ పరిస్థితుల ఆధారంగా జిల్లా, బ్లాక్ లేదా గ్రామ పంచాయతీ స్థాయుల్లో వేర్వేరు నోటిఫికేషన్లను జారీ చేసేందుకు రాష్ట్రాలను ఇది అనుమతిస్తుంది. ఈ అంతర్నిర్మిత సౌలభ్యం పెరిగిన ఉపాధి హామీని వ్యవసాయ పనులకు ఆటంకం కలిగించకుండా... దానికి అనుబంధంగా ఉండేలా చూస్తుంది. చాలా తక్కువ సంక్షేమ చట్టాలు మాత్రమే సాధించగలిగిన ఒక సున్నితమైన సమతుల్యత ఇది.

కేటాయింపుల ద్వారా సమానత్వం

ఆర్థికపరమైన కోతలకు సంబంధించిన ఆందోళనలను కూడా విమర్శకులు వ్యక్తం చేస్తున్నారు. సెక్షన్ 4(5), సెక్షన్ 22(4) ప్రకారం నిబంధనల్లో చెప్పిన అంశాల ఆధారంగానే రాష్ట్రాల వారీగా నిధులను కేటాయిస్తారు. ఈ చట్టం రాష్ట్రాలను కేవలం అమలు చేసే వాటి గానే కాకుండా అభివృద్ధిలో భాగస్వాములుగా పరిగణిస్తుంది. నిర్దేశించిన కనీస చట్టబద్ధమైన నిబంధనలకు అనుగుణంగా సొంత పథకాలను నోటిఫై చేసి అమలు చేసే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కలిగి ఉంటాయి. ఆచరణ పరంగా 'సహకార సమాఖ్య' ఇది.

సాంకేతికత కారణంగా లబ్ధిదారులు దూరమవుతారనే వాదన ఈ బిల్లులో పొందుపరిచిన రక్షణ చర్యలను విస్మరిస్తోంది. సెక్షన్ 23, 24లు బయోమెట్రిక్ ధ్రువీకరణ, జియో–ట్యాగ్ పనులు, రియల్–టైమ్ డ్యాష్‌బోర్డ్‌లు, క్రమబద్ధమైన బహిరంగ వెల్లడి ద్వారా సాంకేతికతతో కూడిన పారదర్శకతను తప్పనిసరి చేస్తాయి. ఇవి నకిలీ హాజరు, ఉనికిలో లేని కార్మికులు, ధ్రువీకరించలేని రికార్డులకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తాయి. సెక్షన్ 20 అనేది గ్రామ సభ ద్వారా సామాజిక తనిఖీలను బలోపేతం చేస్తుంది. సాంకేతికత జవాబుదారీతనాన్ని దాటవేయదు... పునాదిగా నిలుస్తుంది.

హామీకి మళ్లీ విశ్వసనీయత

ఉపాధి హామీని పెంపొందించడం, స్థానిక ప్రణాళికను అంతర్భాగం చేయడం, వ్యవసాయ ఉత్పాదకతతో కార్మిక భద్రతను సమతుల్యం చేయడం, పథకాలను అనుసంధానించడం, మెరుగైన పరిపాలనా మద్దతు ద్వారా క్షేత్రస్థాయి సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, పరిపాలనను ఆధునీకరించడం ద్వారా ఆచరణలో తరచుగా విఫలమౌతున్న ఒక హామీకి విశ్వసనీయతను పునరుద్ధరించేందుకు ఈ బిల్లు ప్రయత్నిస్తోంది.

ఇక్కడ ఎంపిక అనేది సంస్కరణ, సానుభూతికి మధ్య కాదు... తక్కువ ఫలితాలనిచ్చే నిలకడ లేని హక్కు, గౌరవం – స్పష్టమైన ఉద్దేశ్యంతో ఫలితాలను అందించే ఆధునిక చట్టానికి మధ్య ఉంది. ఈ కోణంలో చూస్తే 'వీబీ–జీ రామ్ జీ' అనేది సామాజిక రక్షణ నుంచి వెనక్కి తగ్గడం కాదు, దాన్ని పునరుద్ధరిస్తోంది.

వ్యాసకర్త కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం–రైతు సంక్షేమ మంత్రి

విత్తన స్వావలంబనకు ప్రమాదం

''దేశంలోని విత్తనాల ఉత్పత్తి, ప్రమాణీకరణ, నిల్వ, పంపిణీ, రైతు రక్షణ వంటి వ్యవస్థలను ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం 'డ్రాఫ్ట్ సీడ్ బిల్లు –2025' ప్రకటించింది. 1966లో అమలులోకి వచ్చిన పాత సీడ్ యాక్ట్ స్థానంలో కొత్త సాంకేతికతలు, అధిక దిగుబడి జాతులు, బయో సేఫ్టీ ప్రమాణాలు, రైతు రక్షణ, హక్కులను ప్రతిబింబించే విధంగా చట్టాన్ని తెచ్చే దిశగా దీన్ని రూపొందించినట్లు'' కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

అయితే గతంలో లక్షలాది మంది రైతాంగం పోరాడి రద్దు చేయించిన మూడు రైతు వ్యతిరేక చట్టాలలోని అంశాలను తిరిగి 'డ్రాఫ్ట్ సీడ్ బిల్లు–2025' పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ విత్తన చట్టం ముసాయిదాలో ప్రధానంగా రెండు లోపాలున్నాయి: నకిలీ లేదా నాసిరకం విత్తనాల వల్ల రైతులకు పరిహారం కల్పించే సెక్షన్ లేకపోవడం; విత్తన ఉత్పత్తి రైతుల రక్షణకు ప్రత్యేక నిబంధనలు లేకపోవడం. రైతు రక్షణ నిబంధనలు త్రిముఖంగా ఉండాలి: అవి విత్తన పంటకు బీమా, విత్తన రైతులకు జీవిత బీమా, విత్తనోత్పత్తిలో మధ్యవర్తుల వ్యవస్థపై పూర్తిగా నిషేధం వంటివి ఉండాలి. అంతేగాక, కంపెనీలు రైతుల పంటను అంగీకరించి నిర్ణీత ధరలకు కొనుగోలు చేయటం వంటి నిబంధనలుండాలి.

ఈ బిల్లులో విత్తన ధరల నియంత్రణ స్పష్టంగా లేకపోవడం వల్ల కంపెనీలు అధిక ధరలకు విత్తనాలు విక్రయించే అవకాశం ఉంది. దీనితో రైతులపై ఆర్థిక భారం పెరుగుతుంది. విత్తన మార్కెట్‌లో గుత్తాధిపత్యం ఏర్పడే ప్రమాదం ఉంది. కంపెనీలు సమర్పించే ఫీల్డ్ ట్రయల్ డేటా, మొలక దిగుబడి ప్రమాణాలు వంటివన్నీ ఆ యా కంపెనీలే అందిస్తాయి; అధికారుల పర్యవేక్షణ కొరవడితే తప్పుడు డేటా ద్వారా రైతులను మోసగించే ప్రమాదం ఉంది. పరిహారం పొందే ప్రక్రియను క్లిష్టంగా రూపొందించారు. నమూనాలు సేకరణలు, ప్రయోగశాల పరీక్షలు, విచారణ వంటి పద్ధతులు సుదీర్ఘంగా, సాంకేతికంగా క్లిష్టతరమై పూర్తిగా అధికారుల దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడాల్సి వస్తుంది. దీనివల్ల రైతులు సకాలంలో పరిహారం పొందలేరు.

భవిష్యత్‌లో ఈ బిల్లు సంప్రదాయ విత్తనాలపై దుష్ప్రభావం చూపనుంది. పైకి కఠిన నిబంధనలు ఉన్నా... విత్తన దిగుమతి మార్గాలు తెరవటం వల్ల విదేశీ విత్తన మల్టీ నేషనల్ కంపెనీలు మార్కెట్‌లోకి పెద్దెత్తున ప్రవేశించే వీలుంది. ఈ బిల్లు పేటెంట్ ఉన్న బ్రాండెడ్ విత్తనాలు మాత్రమే ఉండాలనే ప్రమాదకరమైన అంశాన్ని ప్రతిపాదించడం, విత్తన దిగుమతులను సరళతరం చేయనుండటం వంటివన్నీ దేశీయ విత్తనాభివృద్ధికి సమాధి కట్టే ప్రమాదం ఉంది.

రైతు ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీసే ఈ విత్తన బిల్లును ఉపసంహరించాలి. రైతులకు అనుకూలంగా... విత్తనోత్పత్తి, సరఫరా ప్రధానంగా ప్రభుత్వమే చేపట్టాలి. విదేశీ విత్తన వ్యాపారాన్ని నిషేధించాలి. పంట నష్టపోయిన రైతులు పరిహారం నెల లోపు పొందేలా నిబంధనలను సులభతరం చేయాలి.

– కెచ్చెల రంగారెడ్డి
అఖిల భారత ఐక్య రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు

ప్రజల్ని మభ్యపెట్టేందుకే!

తన ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను దారి మళ్లించే పథకాలు ప్రవేశపెట్టడంలో దేశంలోనే చంద్రబాబు అగ్రభాగాన ఉన్నారు. 'పీ4' పేరుతో పేదరిక నిర్మూలన, పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టు, అలాగే ఇప్పుడు ముందుకు తెచ్చిన పోలవరం – నల్లమల లింక్ ప్రాజెక్ట్ అందులో భాగమే.

పోలవరం ప్రాజెక్టు ఎత్తును 45.55 మీటర్ల నుంచి 41.5 మీటర్లకే మోదీ ప్రభుత్వ పరిమితం చేయడం, దాన్ని చంద్రబాబు ప్రభుత్వం వ్యతిరేకించకపోవడం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం అయ్యింది. ఆ వ్యతిరేకత నుండి ప్రజల ఆలోచనలను మళ్లించడం కోసం 'పోలవరం– బనకచర్ల లింక్' ప్రాజెక్టును ముందుకు తెచ్చారు. దీనిపట్ల ప్రజల వ్యతిరేకత రావడం, కేంద్ర సంస్థలు కూడా అనుమతులు ఇవ్వక పోవడం, తెలంగాణ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేయడంతో అది ముందుకు సాగలేదు. అనేక సంక్షేమ పథకాలను ఎత్తి వేయడమో లేక వాటికి కోత విధించడమో చేసిన చంద్రబాబు ప్రభుత్వం పట్ల ఉన్న ప్రజాగ్రహానికి... 'పోలవరం వ్యయం 30 వేల కోట్లు అని తాజా పార్లమెంట్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం, దాన్ని టీడీపీ–జనసేన పార్లమెంట్ సభ్యులు వ్యతిరేకించక పోవడం, పోలవరం ప్రాజెక్టు వల్ల అదనపు సేద్యం సాధ్యం కాదని వ్యక్తమైన అభిప్రాయం – కూటమి ప్రభుత్వం ఎడల వ్యతిరేకతకు మరింత ఆజ్యం పోశాయి. ఈ వ్యతిరేకతను పక్క దారి పట్టించడానికి ముందుకు తెచ్చిందే 'పోలవరం– నల్లమల లింక్ ప్రాజెక్ట్'. గోదావరి నీటిని తాడిపూడి వరద కాల్వ ద్వారా పోలవరం కుడి కాల్వకు పంపి, ప్రకాశం బ్యారేజీకి ఎగువన దాములూరు దాకా తీసుకువెళ్లి, అక్కడ నుంచి హరిశ్చంద్రపురం వద్ద నాగార్జున సాగర్‌లో కలపడం, తర్వాత నల్లమల సాగర్‌కు తీసుకెళ్లడం ఈ లింక్ పథకం ఉద్దేశం.

ఈ ప్రాజెక్టు రెండు దశల్లో చేపట్టాలని, దాని వ్యయం రూ. 58,500 కోట్లుగా కూటమి ప్రభుత్వం అంచనా వేసింది. 50 శాతం విదేశీ రుణం, కేంద్రం 20%, రాష్ట్ర ప్రభుత్వం 5 వేల కోట్లు, ప్రైవేట్ పెట్టుబడి 20% ఉంటుందని చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ సమగ్ర నివేదిక (డీపీఆర్) కోసం తాజాగా టెండర్లు ఆహ్వానించి, 'పోలవరం – బనకచర్ల' టెండర్లు ప్రభుత్వం రద్దు చేసింది. కొత్త ప్రాజెక్టుల కోసం వేల కోట్లు ఖర్చు చేసే బదులు, నిర్మాణంలో ఉన్న పాత ప్రాజెక్టులను పూర్తి చేస్తే సగం ఖర్చుతోనే సాగునీటి సమస్య తీరుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రజలు ఈ సూచనల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

– బొల్లిముంత సాంబశివరావు
రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

పెరిగిన 'తలసరి' సిరి

దేశ ప్రజల తలసరి ఆదాయం (ప్రస్తుత ధరల వద్ద) గత 5 ఏళ్లలో భారీగా పెరిగింది.

ఆధారం: కేంద్ర గణాంక శాఖ

సంవత్సరం	తలసరి ఆదాయం(రూ.లలో)	మార్పు శాతం
2020-21	1,27,244	-3.9 ▼
2021-22	1,50,906	18.6 ▲
2022-23	1,69,145	12.1 ▲
2023-24	1,88,892	11.7 ▲
2024-25	2,05,324	8.7 ▲

ఆనంద యోగం

ఆనందం నిర్వచనానికి చిక్కనిది. అది అనుభూతి ద్వారానే మన అనుభవంలోకి వస్తుంది. ఇంద్రియాల ద్వారా పొందే అనుభూతి సుఖాన్ని, సంతోషాన్ని ఇస్తుంది. అయితే అది తాత్కాలికమైనది. అంతే కాదు. క్షణభంగురం కూడా. ఆనందం దీనికి అతీతంగా ఉంటుంది. ఒక శాశ్వతమైన అనుభూతిని, ప్రేమను, నిర్మలమైన మనసును, స్థిత ప్రజ్ఞతల నిచ్చే ఒక అపురూప భావన అది. బుద్ధి, మనసులతో పాటు అనిర్వచనీయమైన అనేక అనుభూతుల సమాహార పూర్ణభావనే ఆనందం.

ఆనందం దైవ స్వరూపం. మనలోని జీవుడు ఇంద్రియ సుఖాల వైపే నిరంతరం దృష్టి పెడతాడు. నయనం సౌందర్యాన్వేషణకు, రసన రుచికి, శ్రవణాలు లౌకిక విషయాసక్తికి, శరీరం సమాగమనానికి తహతహలాడుతుంది. ఇది ప్రకృతి పరమైన శారీరక ధర్మం. వీటి వల్ల తాత్కాలిక సుఖం, తృప్తి వస్తాయి. కానీ వీటికి పరిధి, పరిమితులు ఉన్నాయి. జీవితంలో ఈ ఇంద్రియ సుఖం ఒక పార్శ్వం మాత్రమే! దీనికి మించిన గొప్ప సుఖం ఇంకేమైనా ఉందా? ఉంటే అది ఏమిటి? అనే యోచన బుద్ధి జీవులు చేయాలి. ఈ యోచన సాఫల్యం చెందినప్పుడు జీవితానికి అర్థం తెలిసినట్లే! ఆనంద యోగాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నట్టే. ఈ ఆనందం తాత్కాలిక సంతోషం కాదు. అది అంతర్గత శాంతిని, జీవన పరిపూర్ణతను చేకూర్చే ఒక గొప్ప స్థితి.

ఆనందాన్ని ఆధ్యాత్మిక పరంగా చూస్తే ఇది భౌతిక, తాత్కాలిక సుఖాల కంటే శాశ్వతమైనది. ఎంతో ఉన్నతమైనది. ఈ ఆనంద స్థితికి చేరుకున్నవారు సుఖ దుఃఖాలను సమ భావనతో చూడగలరు. ఈ సమ భావన మనిషికి తామరాకు మీద నీటి బొట్టులా ప్రవర్తించే స్థిరత్వాన్నిస్తుంది. అదే ఆనంద యోగం. తన ఆలోచనా శక్తితో మనిషి మాత్రమే ఆ ఆనందం పొందగలడు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

రామచంద్రారెడ్డి (ఫైల్)

ఉయ్యాలవాడ: అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం కొండుపల్లెలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సిద్ధంరెడ్డి రామచంద్రారెడ్డి(50) 10.50 ఎకరాలను స్వగ్రామం, ఆళ్లగడ్డలో గత రెండేళ్లుగా కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో పెట్టుబడుల కోసం రూ.16 లక్షలకు పైగా అప్పు చేశాడు. పంట సరిగా రాకపోవడం, దిగుబడులకు ధర లభించకపోవడంతో అప్పులు చెల్లించే మార్గం కనిపించలేదు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక భరోసా లేకపోగా, రుణదాతల ఒత్తిళ్లు అధికమయ్యాయి. దీంతో రామచంద్రారెడ్డి తీవ్ర మనోవేదనకు లోనై గురువారం పురుగుమందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతన్ని కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

1 నుంచి మరో మూడు విడతల్లో మల్లన్న స్పర్శదర్శనం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మల్లికార్జున స్వామి స్పర్శదర్శనం ఆన్‌లైన్ టికెట్ల సంఖ్యను పెంచారు. ప్రస్తుతం శని, ఆది, సోమవారాల్లో భక్తులకు ఉదయం 7.30, మధ్యాహ్నం 2.00, రాత్రి 9.00 గంటలకు స్పర్శ దర్శనం కల్పిస్తున్నారు. అయితే జనవరి 1 నుంచి ప్రతి శని, ఆది, సోమవారాల్లో ఉదయం 6.30 గంటలకు, 10.30 గంటలకు, రాత్రి 7.45 గంటలకు అదనంగా మరో మూడు విడతల్లో స్పర్శదర్శనం ఉంటుంది. ఇందుకోసం దేవస్థానం వెబ్‌సైట్‌లో కూడా ఆరు విడతలుగా స్పర్శదర్శనం టికెట్లు భక్తులకు అందుబాటులో ఉండేలా మార్పులు చేశారు. భక్తులు ఆన్‌లైన్ ద్వారా దేవస్థానం వెబ్‌సైట్‌ను సందర్శించి టికెట్లను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే మనమిత్ర వాట్సాప్ (9552300009) ద్వారా కూడా టికెట్లు పొందవచ్చు.

మనదేం లేదు.. టీడీపీ నేతలదే పెత్తనం

పనుల కోసం జనసేన అభిమానులు టీడీపీ నేతల చుట్టూ తిరుగుతున్నారు

నియోజకవర్గాల్లో జనసేనను బలోపేతం చేసే పరిస్థితి కనిపించడం లేదంటూ వాపోయిన ఎమ్మెల్యేలు

మీరు మాత్రం టీడీపీ నేతలతో సఖ్యతగా ఉండండి

ఎమ్మెల్యేలకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచన

సాక్షి, అమరావతి: ''మనం గెలిచిన నియోజకవర్గాల్లో సైతం టీడీపీ నేతలే పెత్తనం చేస్తున్నారు.. ఇలాగే కొనసాగితే క్షేత్రస్థాయిలో జనసేన బలోపేతానికి అవసరమయ్యే కమిటీ నిర్మాణం సమర్థవంతంగా చేపట్టే పరిస్థితి లేదు'' అంటూ జనసేన ఎమ్మెల్యేలు ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఎదుట వాపోయారు. శుక్రవారం ఆయన మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్రం కార్యాలయంలో జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో పార్టీ సంస్థాగత నిర్మాణం తదితర అంశాలపై ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్ (అవనిగడ్డ), దేవ వరప్రసాద్ (రాజోలు), లోకం నాగమాధవి (నెలిమర్ల), గిడ్డి సత్యనారాయణ(పి.గన్నవరం), పంతం నానాజీ(కాకినాడ రూరల్), సీహెచ్ వంశీకృష్ణ (విశాఖ సౌత్), నిమ్మక జయకృష్ణ(పాలకొండ), పంచకర్ల రమేష్ బాబు(పెందుర్తి), సుందరపు విజయ్ కుమార్ (యలమంచిలి)తో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో జనసేనపార్టీ పరిస్థితి గురించి పవన్ కళ్యాణ్ ప్రశ్నించినప్పుడు ఉత్తరాంధ్రకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో జనసేన ఉనికి సైతం ప్రమాదంలో పడేలా ఉందని వాపోయినట్లు భోగట్టా. టీడీపీ నేతలు పెత్తనం చేస్తుండడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో జనసేన నాయకులు పనులు చేయించేకునేందుకు టీడీపీ నేతల చుట్టూ తిరుగుతున్నారని అధినేతకు వివరించినట్టు సమాచారం. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ నియోజకవర్గాల్లో కనీసం సగం సీట్లు అయినా జనసేనకు ఇచ్చే పరిస్థితి ఉండడంతో పాటు ఆ మేరకు స్పష్టమైన హామీ ఉంటే గానీ గ్రామస్థాయిలో బలమైన పార్టీ కమిటీలు ఏర్పాటు చేసే పరిస్థితి లేదని అధినేత పవన్ కళ్యాణ్‌కు ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు వివరించినట్టు సమాచారం. ఈ సందర్భంగా అధినేత పవన్‌కల్యాణ్ స్పందిస్తూ, అంశాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని, అయితే జనసేన ఎమ్మెల్యేలు సైతం నియోజకవర్గాల్లో కూటమి నేతలతో సఖ్యతతో ఉండాలని సూచించినట్టు సమాచారం. నియోజకవర్గాల్లో టీడీపీ నేతలతో ఎక్కడైనా ఇబ్బందులు వస్తే వాటిని పరిష్కరించుకుంటూ మిగిలిన రెండు కూటమి పార్టీల నేతలతో నిబద్ధతతో కలిసి పని చేయాలని పవన్‌కల్యాణ్ సూచించినట్టు సమాచారం.

ఆ ప్రతిపాదనలు నాకివ్వండి..

మరోవైపు అధినేత పవన్ కళ్యాణ్ జనసేన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పరిస్థితిపై వాకబు చేశారు. దీనిపై ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పెండింగ్ సమస్యల పరిష్కారంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు అధికారులు నిధులు లేవంటున్నారని తెలిపారు. అలాంటి వాటికి అవసరమైన ప్రతిపాదనలు తనకు నేరుగా అందజేస్తే వాటిని తానే సీఎం చంద్రబాబుకు అందజేసి, ప్రత్యేక నిధులు కోరతానని పవన్ హామీ ఇచ్చినట్టు సమాచారం. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు అవినీతి కార్యక్రమాల ద్వారా పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించవద్దంటూ అధినేత స్పష్టం చేసినట్లు సమాచారం.

దళిత సర్పంచ్‌పై అధికార జులుం

ప్రభుత్వస్థలం, తన స్థలం టీడీపీ వర్గీయుడు కబ్జాచేశారని సర్పంచ్ ఫిర్యాదు

అది ఆక్రమణే అని తేల్చిన రెవెన్యూ అధికారులు

దీంతో కబ్జాచేసి కట్టిన గోడను కూల్చేసిన సర్పంచ్

ఇందుకుగాను సర్పంచ్‌పై కేసు నమోదు

బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లిన సీఐ

ఆక్రమణకు సిద్ధం చేసిన స్థలం

సాక్షి టాస్క్‌ఫోర్స్: తన స్థలంతోపాటు రైతుసేవా కేంద్రం దారిని ఆక్రమంచి టీడీపీ సానుభూతిపరుడు నిర్మించిన ప్రహరీని కూల్చేసిన ఎస్సీ వర్గీయుడైన సర్పంచ్‌పై కేసుపెట్టి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిన వైనమిది. బాపట్ల జిల్లా అద్దంకి మండలం చక్రాయపాలెంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన అధికారపార్టీ నేతలు, అధికారుల వైఖరికి అద్దం పడుతోంది. బాధిత సర్పంచ్ నగేశ్ తెలిపిన మేరకు.. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వస్థలంలో రైతుభరోసా కేంద్రం నిర్మించారు. దానికి దారి కోసం సర్పంచ్ నగేశ్ సర్వేనంబరు 127/7 లోని తన స్థలంలో ఐదడుగులు ఇచ్చారు. ఆ పక్కనే నివాసం ఉంటున్న టీడీపీ సానుభూతిపరులు టి.వెంకాయమ్మ, శ్రీనివాసరావు దంపతులు ఇటీవల రైతుసేవా కేంద్రానికి వెళ్లే రహదారిలో కొంత, నగేశ్ పట్టాభూమిలో కొంత ఆక్రమించి ప్రహరీ కట్టేందుకు పిల్లర్లు వేశారు. దీంతో సర్పంచ్ ఆ స్థలాన్ని సర్వేచేయాలంటూ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. తహసీల్దార్ ఆదేశాలతో సర్వేయర్ వచ్చి స్థలాన్ని సర్వేచేసి టీడీపీ సానుభూతిపరుడు గోడకట్టే ప్రదేశంలో ఆక్రమణ ఉందని నివేదిక ఇచ్చారు. ఈ విషయం చెప్పి సర్పంచ్ హెచ్చరించినా వినకుండా వారు గోడకట్టారు. సర్పంచ్‌పై దాడిచేసి కులం పేరుతో దూషించారు. ఆ విషయమై సర్పంచ్ రెండురోజుల కిందట ఎస్పీకి, జేసీకి ఫిర్యాదు చేశారు. ఎవరూ స్పందించకపోవడంతో సర్పంచ్ నగేశ్ ఆ అక్రమ గోడను యంత్రంతో కూల్చేశారు. దీంతో తన గోడను సర్పంచ్ కూల్చేశారని శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకుడి ప్రోద్బలంతో శుక్రవారం నగేశ్ స్థలంలో నుంచి విద్యుత్ సిబ్బంది కరెంటు స్తంభాలు వేయసాగారు. వారిని నగేశ్ అడ్డుకున్నారు. వారి సమాచారంతో గ్రామానికి వెళ్లిన సీఐ సుబ్బరాజు గోడ కూల్చినందుకు తీసుకెళ్తున్నానంటూ సర్పంచ్ నగేశ్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై సీఐ సుబ్బరాజును అడగగా.. ఆక్రమణ విషయమై కోర్టులో తేల్చుకోవాలని, పడేయడం క్రిమినల్ కేసు అవుతుందని చెప్పారు. అందుకే తీసుకొచ్చి 41 నోటీసు ఇచ్చి పంపినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాన్ని కబ్జాచేసి గోడ నిర్మించినా పట్టించుకోని అధికారులు.. ఆ గోడ తొలగించారని సర్పంచ్‌పైనే కేసు పెట్టడం ఏమిటని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఎంపీడీవో ఆఫీస్‌లో టీడీపీ నేతల ప్రజాదర్బార్

హోదా లేని వ్యక్తులతో అంగన్‌వాడీలకు 5జీ స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ

అర్జీలు స్వీకరిస్తున్న టీడీపీ నేత ఎరిక్షన్ బాబు

యర్రగొండపాలెం: ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండల పరిషత్ కార్యాలయాన్ని టీడీపీ కార్యాలయంగా మార్చారు. ఎంపీడీవో సమక్షంలో టీడీపీ నేతలు ప్రజాదర్బార్ నిర్వహించి తమ అధికార దర్పాన్ని మరోసారి ప్రదర్శించారు. ఇప్పటి వరకు టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో జరిగింది. ఎటువంటి అధికారిక పదవి లేని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అర్జీలు స్వీకరించి, ఆ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు హుకుం జారీ చేశారు. ముందుగా ఆ సమావేశ భవనంలో ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు కేటాయించిన 5జీ స్మార్ట్ ఫోన్‌లను ఎటువంటి హోదాలేని వ్యక్తులు పంపిణీ చేయడం చూసి ఇదేమి చోద్యమని జనం చర్చించుకుంటున్నారు.

విద్యార్థులా? తాపీ మేస్త్రీలా?

తాపీ పనులు చేస్తున్న విద్యార్థులు

కొండపి: ప్రకాశం జిల్లా కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు విద్యార్థులతో తాపీ పనులు చేయించారు. పాఠశాల అభివృద్ధికి కేటాయించిన నిధులతో అవసరమైన పనులు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు చేయించాలి. అయితే కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల ప్రధాన గేటు వద్ద విద్యార్థులతో సిమెంటు పనిచేయించారు. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. సంబంధిత ఉపాధ్యాయులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల్లో బూజుపట్టిన కందిపప్పు

గర్భిణులు, బాలింతలకు పంపిణీ

చంద్రబాబు సర్కారు నిర్లక్ష్యం

తెల్లగా, నల్లగా మారిపోయిన కందిపప్పు

ఉలవపాడు: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వండిపెట్టేందుకు, బాలసంజీవని కింద గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసేందుకు సరఫరా అయిన కందిపప్పును చూస్తే ప్రభుత్వ నిర్లక్ష్యం తెలుస్తోంది. వీరికి పంపిణీచేసిన కందిపప్పు నల్లగా మారిపోయింది. చాలావరకు బూజుపట్టింది. వాసన వస్తోంది. సరుకు దిగుమతి అయినప్పుడు నాణ్యత చూసి పంపిణీ చేయాల్సిన అధికారులు పట్టించుకోలేదు. అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది కిలో ప్యాకెట్ల రూపంలో ఆ కందిపప్పును గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. గతంలో కూడా ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలో అధ్వానంగా ఉన్న కోడిగుడ్లు, అటుకులు వారికి ఇచ్చారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పరిధిలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 14,195 మంది గర్భిణులు, 11,804 మంది బాలింతలు ఉన్నారు. ఆరేళ్లలోపు చిన్నారులు 1,34,834 మంది ఉన్నారు. గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ప్రతినెల సరుకులు అందజేస్తారు. ఈ నెలలో ఇచ్చిన కందిపప్పు తినే పరిస్థితిలో లేకపోవడంతో అందరూ చూసి పారబోశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ కేంద్రాల్లో చిన్నారులకు ఈ పప్పును వండిపెట్టలేక మిన్నకుంటున్నారు. మరోవైపు పలు అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపైన కూడా విమర్శలు న్నాయి. కొన్ని కేంద్రాల పరిధిలో బాలింతలు, గర్భిణులు అందరికీ సరుకులు ఇవ్వకుండా బయట అమ్ముకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. కొన్ని కేంద్రాలను సకాలంలో తీయడంలేదని స్థానికులు చెబుతున్నారు. కొల్లూరుపాడు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం సకాలంలో తీయకపోవడంతో పలువురు గర్భిణులు ఇబ్బందిపడ్డారు. ఈ విషయాలపై సీడీపీఓ మాధవీలతను అడగగా.. ఇటీవల గుడ్లూరులో కందిపప్పు బాగా లేదంటే దానిని మార్చి వేరే ప్యాకెట్లను పంపిణీ చేయించినట్లు చెప్పారు. ఉలవపాడు పరిస్థితి తనకు తెలియదన్నారు. వివరాలు కనుక్కొని ప్యాకెట్లు మార్పిస్తానని చెప్పారు. ఆలస్యంగా తీస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలపై చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

కార్మిక రాజ్య భీమా సంస్థ
(కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
कर्मचारी राज्य बीमा निगम
(श्रम एवं रोजगार मंत्रालय, भारत सरकार)
Employees' State Insurance Corporation
(Ministry of Labour & Employment, Govt. of India)
క.రా.బీ.ని. E.S.I.C.

ప్రాంతీయ కార్యాలయం/क्षेत्रीय कार्यालय /Regional Office
ఈ ఎస్ ఐ రోడ్డు, గుణదల, విజయవాడ – 520 004
ईएसआइ रोड, गुणदला, विजयवाड़ा–520 004
ESI Road, Gunadala, Vijayawada-520 004
Telephone: 0866-2453498
e-mail : rd-andhrapradesh@esic.gov.in

యజమానులు మరియు ఉద్యోగుల నమోదును ప్రోత్సహించే పథకం (SPREE 2025)
ESIC స్ప్రీ పథకాన్ని పొందేందుకు చివరి అవకాశం
చివరి తేదీ:31st December, 2025
ఆలస్యం లేకుండా నమోదు చేసుకోండి

ఆంధ్రప్రదేశ్ లోని అందరు యజమానులకు తక్షణ గమనిక:
యజమానులు మరియు ఉద్యోగుల నమోదును ప్రోత్సహించడానికి SPREE పథకం-2025 ఇప్పటికే అమలులో ఉందని మరియు త్వరలో ముగియబోతుందని కార్మిక రాజ్య బీమా సంస్థ (ESIC) అన్ని కవర్ చేయబడిన మరియు కవర్ చేయదగిన యజమానులకు అత్యవసరంగా తెలియజేయడమైనది.

తక్షణ నమోదు ఎందుకు ముఖ్యమైనది
- 31.12.2025 తర్వాత ఈ ఉపశమనం అందుబాటులో ఉండదు
- యజమాని ప్రకటించిన తేదీ నుండి రిజిస్ట్రేషన్ చెల్లుతుంది
- మునుపటి కాలాలకు తనిఖీలు ఉండవు
- ఇబ్బంది లేని స్వీయ నమోదు
- ఉద్యోగులకు సమగ్ర సామాజిక భద్రతా ప్రయోజనాలు

ఎవరు నమోదు చేసుకోవచ్చు
- ESI చట్టం కింద ఇంకా నమోదు కాని 10 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులను కలిగి ఉన్న యజమానులు
- ESI చట్టం కింద అర్హత కలిగిన ఉద్యోగులందరినీ నమోదు చేసుకోని యజమానులు

ఎలా నమోదు చేసుకోవాలి
యజమానులు తమ యూనిట్ మరియు ఉద్యోగులను ESIC పోర్టల్ www.esic.gov.in, శ్రమ్ సువిధ పోర్టల్: https://registration.shramsuvidha.gov.in/, MCA పోర్టల్: www.mca.gov.in లలో నమోదు చేసుకోవచ్చు

దయచేసి ఇప్పుడే చర్య తీసుకోండి - గడువు వరకు వేచి ఉండకండి

శ్రీవారిని దర్శించుకున్న న్యాయమూర్తులు

తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ మల్లికార్జునరావు తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు. – తిరుమల/చంద్రగిరి

ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు

బాలాత్రిపురసుందరి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలోని బాలాత్రిపుర సుందరిదేవి, పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు ఆమెకు అమ్మవారి చిత్రపటం అందజేశారు. – త్రిపురాంతకం

వీరభద్రుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షిలోని వీరభద్రస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.హరిహరనాథ శర్మ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో నరసింహమూర్తి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించారు. దేవదాయ శాఖ అధికారులు ఆయనను మెమొంటో, శాలువాతో సత్కరించారు. – లేపాక్షి

'వీబీజీ రామ్ జీ బిల్లు'ను టీడీపీ, జనసేన వ్యతిరేకించాలి

సంయుక్త కిసాన్ మోర్చా నాయకుల డిమాండ్


వీబీజీఆర్ఏఎం బిల్లు ప్రతులను దహనం చేస్తున్న రైతు నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేదలకు ఉపాధిని దూరం చేసేందుకే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్–గ్రామీణ బిల్లు (వీబీ జీరామ్‌జీ బిల్లు–2025)ను ప్రవేశపెట్టిందని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు విమర్శించారు. ఈ బిల్లును కేంద్రంలో భాగస్వాములుగా ఉన్న టీడీపీ, జనసేన వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు ఉద్యమ నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అవసరమైన మార్పులు, చేర్పులతో కొనసాగించాలని, దానిని దెబ్బతీస్తూ వీబీజీఆర్ఏఎంజీ బిల్లు తేవడం సరికాదన్నారు. రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపి ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం వాటాను 60 శాతానికి తగ్గించి, రాష్ట్రాల వాటాను 40 శాతానికి పెంచారని విమర్శించారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి తులసిరెడ్డి, రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ ఇప్పటికే వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసిన కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం.. ఇప్పుడు గ్రామీణ పేదల ఉపాధిని సైతం దెబ్బతీస్తోందని మండిపడ్డారు. అనంతరం ప్రెస్‌క్లబ్ ఎదుట వీబీజీరామ్‌జీ బిల్లు ప్రతులను నాయకులు దహనం చేశారు.

ఏప్రిల్ నుంచి స్టీమ్డ్ రైస్ పంపిణీ: మంత్రి నాదెండ్ల

తెనాలి అర్బన్: వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు, మధ్యాహ్న భోజన పథకానికి స్టీమ్డ్ రైస్‌ను పంపిణీ చేయనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా, తెనాలి మారీసుపేట మఠంబజార్‌లోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ వద్ద శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు సెల్‌ఫోన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 31వేల ప్రభుత్వ పాఠశాలలకు, నాలుగు వేల సంక్షేమ వసతి గృహాలకు నాణ్యమైన బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



బంగ్లాదేశ్‌లో మళ్లీ మంటలు

ఢాకాలోని ప్రధాన రహదారిపైకి పెద్ద సంఖ్యలో చేరిన ఆందోళనకారులు

మంటల్లో ప్రొథోమ్ అలో పత్రికా కార్యాలయం

‘ఇంక్విలాబ్ మంచ్’ నేత షరీఫ్ ఉస్మాన్ హదీ హత్య

- కాల్పుల్లో గాయపడి సింగపూర్‌లో చికిత్స పొందుతూ మృతి
- బంగ్లాదేశ్‌వ్యాప్తంగా మిన్నంటిన ఆగ్రహ జ్వాలలు

ఢాకా/న్యూఢిల్లీ: పొరుగు దేశం బంగ్లాదేశ్ మరోసారి అల్లకల్లోలంగా మారింది. ‘ఇంక్విలాబ్ మంచ్’ నాయకుడు, విద్యార్థి నేత షరీఫ్ ఉస్మాన్ హదీ హత్యాకాండ అగ్గి రాజేసింది. ఈ హత్య పట్ల ఆగ్రహానికి గురైన జనం వీధుల్లోకి వచ్చారు. విధ్వంసం సృష్టించారు. పత్రికా కార్యలయాల పైనా విరుచుకుపడ్డారు. గురువారం రాత్రంతా హింసాకాండ కొనసాగింది. అసిస్టెంట్ ఇండియన్ హైకమిషన్ కమిషనర్ నివాసంపై రాళ్లు రువ్వారు. బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు, జాతిపిత షేక్ ముజిబుర్ రెహ్మాన్ నివాసాన్ని ధ్వంసం చేశారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాకు, భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు. లాఠీచార్జి చేశారు. 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. హిందువులను లక్ష్యంగా చేసుకొని అల్లరిమూకలు దాడి చేసినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఈ దాడుల్లో దీపూచంద్ర దాస్(25) అనే కార్మికుడు మరణించాడు.

రిజర్వేషన్లతో మొదలైన రగడ

- ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటా(రిజర్వేషన్లు) వ్యవస్థను వ్యతిరేకిస్తూ విద్యార్థులు ప్రారంభించిన పోరాటం చివరకు ప్రధానమంత్రి షేక్ హసీనా పదవి నుంచి దిగిపోవడానికి దారితీసింది.
- 1971 నాటి బంగ్లా విమోచన ఉద్యమం పాల్గొన్నవారి వారసులకు ఉద్యోగాల్లో ఎక్కువ రిజర్వేషన్లు ఇవ్వడాన్ని విద్యార్థులు తప్పుపట్టారు. రిజర్వేషన్ల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ 2024 జూలైలో ఆందోళన ప్రారంభించారు. ఇది ‘జూలై తిరుగుబాటు’గా పేరుగాంచింది.
- షేక్ హసీనా తక్షణమే పదవి నుంచి దిగిపోవాలంటూ ఆందోళనకారులు పోరాటం ఉధృతం చేశారు. దేశంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపుతప్పాయి. మైనార్టీలపై విచ్చలవిడిగా దాడులు జరిగా యి.
- చేసేది లేక షేక్ హసీనా అప్పటికప్పుడే దేశం విడి చిపెట్టి వెళ్లిపోవాల్సి వచ్చింది. భారత ప్రభుత్వం ఆమెకు ఆశ్రయం కల్పించింది.
- నోబెల్ బహుమతి గ్రహీత మొహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా బాధ్యతలు చేపట్టారు.
- షేక్ హసీనాపై పలు కేసులు నమోదయ్యాయి. కోర్టు ఆమెకు మరణశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.
- మరోవైపు బంగ్లాదేశ్ ఆర్థిక పరిస్థితి దిగజారింది. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు కట్టుబడి ఉన్నామని, 2026 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహిస్తామని మొహమ్మద్ యూనస్ ప్రకటించారు.
- ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తరుణంలో విద్యార్థి నేత షరీఫ్ ఉస్మాన్ హదీ హత్యకు గురి కావడం సంచలనాత్మకంగా మారింది.

ఆటోలో వెళ్తుండగా హదీపై కాల్పులు

షరీఫ్ ఉస్మాన్ హదీ గత ఏడాది షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చడంలో కీలక పాత్ర పోషించాడు. ఇండియా వ్యతిరేక రాడికల్ లీడర్‌గా యువతలో గుర్తింపు పొందాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న జరిగే ఎన్నికల్లో ఢాకా–8 నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యాడు. ఇప్పటికే ఎన్నికల ప్రచారం ప్రారంభించాడు. ఈ నెల 12వ తేదీన సెంట్రల్ ఢాకాలోని విజోయ్‌నగర్ ప్రాంతంలో ప్రచారానికి ఆటోలో వెళ్తున్న హదీపై ముసుగులు ధరించి బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలే అతి సమీపం నుంచి కాల్పులు జరిపి పరారయ్యారు. సరిగ్గా తలపై కాల్చడంతో కుప్పకూలిపోయాడు. ఒక చెవిలోకి దూసుకెళ్లిన తూటా మరో చెవి నుంచి బయటకు వచ్చింది. అతడి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం ఎయిర్ అంబులెన్స్‌లో సింగపూర్‌కు తరలించారు. ఆరు రోజుపాటు చికిత్స అందించినా ఫలితం దక్కలేదు. ఆరోగ్యం విషమించి గురువారం మృతిచెందాడు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మొహమ్మద్ యూనస్ ఈ విషయాన్ని స్వయంగా టీవీలో ప్రకటించారు. దాంతో జనంలో ఒక్కసారిగా ఆగ్రహం కట్టలు తెంచుకుంది. హదీ మరణాన్ని జీర్ణించుకోలేక వీధుల్లో విధ్వంసానికి దిగారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై దాడులకు పాల్పడ్డారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించారు. రాజ్‌షాహీ సిటీలో షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్ కార్యాలయాన్ని సైతం ధ్వంసం చేశారు. నిరసనకారుల ముసుగులో అల్లరిమూకలు రెచ్చిపోయాయి. గురువారం రాత్రంతా దాడులు జరిగాయి. రాజధాని ఢాకాలో నిరసనకారులు ఛాయానత్ అనే సాంస్కృతిక సంస్థ కార్యాలయంపై దాడి చేశారు. ఫర్నిచర్‌ను బయటపడేసి నిప్పుపెట్టారు. బంగ్లా పత్రికలు ప్రొథోమ్ అలో, డెయిలీ స్టార్ కార్యాయాలపైనా దాడులు జరిగాయి.

ఉస్మాన్ హదీ (ఫైల్)

భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు..

హదీని హత్య చేసిన దుండుగులు భారత్‌కు పారిపోయారని ఆరోపిస్తూ నేషనల్ సిటిజెన్ పార్టీ(ఎన్సీపీ) నేతలు, కార్యకర్తలు భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. దుండగులను వెనక్కి తీసుకొచ్చేదాకా భారత హైకమిషన్‌ను మూసివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సంయమనం పాటించాలని యూనస్ వినతి

హింసాకాండ పట్ల మొహమ్మద్ యూనిస్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. సంయమనం పాటించాలని, దాడులకు దూరంగా ఉండాలని ప్రజలను కోరారు. హదీని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. హంతకులపై దయ చూపించే ప్రసక్తే లేదన్నారు. శనివారం సంతాపం దినంగా పాటించాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల వాయిదా తప్పదా?

బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న జరగాల్సి ఉంది. రాజకీయ పార్టీలు ప్రచారంలో నిమగ్నమయ్యాయి. ఇంతలోనే షరీఫ్ ఉస్మాన్ హత్య జరగడం, విధ్వంసం ప్రారంభం కావడంతో ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

దీపూచంద్ర దాస్‌ను కొట్టి చంపారు

బంగ్లాదేశ్‌లపై మైనార్టీలైన హిందువులపై దాడులు మళ్లీ మొదలయ్యాయి. 25 ఏళ్ల దీపూచంద్ర దాస్‌ను గురువారం రాత్రి దారుణంగా కొట్టి చెట్టుకి కట్టి ఊరి తీశారు. అనంతరం మృతదేహాన్ని దహనం చేశారు. దీపూచంద్ర దాస్ మైమెన్‌సింగ్ సిటీలో ఓ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. దైవ దూషణకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ అల్లరిమూక అతడిని హత్య చేసినట్లు బంగ్లా ట్రిబ్యూన్ పత్రిక వెల్లడించింది. దీపూచంద్ర హత్యను బంగ్లాదేశ్ ప్రభుత్వం ఖండించింది. అతడిని పొట్టనపెట్టుకున్న ముష్కరులను కచ్చితంగా శిక్షిస్తామని పేర్కొంది.

బంగ్లాదేశ్‌ను గడగడలాడిస్తా..

షరీఫ్ ఉస్మాన్ హదీపై కాల్పులు జరిపిన దుండుగుల్లో ఫైజల్ కరీంను ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించారు. పక్కా ప్రణాళికతోనే హదీని హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈ హత్య తర్వాత దేశమంతటా తీవ్రస్థాయిలో అలజడి రేగుతుందని అతడు ముందే ఊహించినట్లు తెలుస్తోంది. ఈ నెల 12న హదీపై కాల్పులు జరగ్గా, అంతకుముందు రాత్రి ఢాకా శివార్లలోని ఓ రిసార్ట్‌లో ఫైజల్ కరీం తన గర్ల్‌ఫ్రెండ్ మరియా అఖ్తర్ లీమాతో ఉన్నాడు. బంగ్లాదేశ్‌ను వణికించే పెద్ద సంఘటన జరగబోతోందని ఆమెతో చెప్పాడు. దేశాన్ని గడగడలాడించబోతున్నానని పేర్కొన్నాడు. మరుసటి రోజే మరో ఇద్దరితోపాటు కలిసి హదీపై కాల్పులు జరిపాడు.

వైట్ హౌస్ సైట్‌లో... ప్రైవేట్ వీడియో!

- 8 నిమిషాలు లైవ్ స్ట్రీమ్
- హ్యాకర్ల పనా, సిబ్బంది పొరపాటా?
- తేల్చే పనిలో పడ్డ వైట్ హౌస్

వాషింగ్టన్: వైట్ హౌస్.జీఓవీ/లైవ్. అత్యంత పటిష్టమైన సెక్యూరిటీ వాల్స్ ఉండే, అత్యంత సురక్షితమైన అమెరికా ప్రభుత్వ సైట్. అందులో సాధారణంగా అధ్యక్షుని ప్రసంగాల లైవ్ స్ట్రీమింగ్ జరుగుతూ ఉంటుంది. అంతటి ముఖ్యమైన సైట్ కాస్తా గురువారం రాత్రి పొద్దు ఉన్నట్టుండి పెట్టుబడి పాఠాలు బోధించడం మొదలుపెట్టింది. అలా ఏకంగా 8 నిమిషాల పాటు సాగింది. తీరా చూస్తే అది మాట్ ఫార్లే అనే ఓ కంటెంట్ క్రియేటర్ యూట్యూబ్‌లో చెప్తున్న ఇన్వెస్ట్‌మెంట్ సంబంధిత చిట్కాల తాలూకు లైవ్ స్ట్రీమింగ్. దాంతో అసలిదెలా జరిగిందో తెలియక విస్తుపోవడం వైట్ హౌస్ సిబ్బంది పనయింది. ఇది హ్యాకర్ల పనా, లేక తమవాళ్లే పొరపాటున స్ట్రీమ్ చేశారా అన్నది తేల్చడంలో వాళ్లిప్పుడు తలమునకలుగా ఉన్నారు. ‘దీన్ని సీరియస్‌గానే తీసుకున్నాం. విచారణ జరుపుతున్నాం’ అంటూ వైట్ హౌస్ శుక్రవారం ఒక ప్రకటన కూడా విడుదల చేసింది. దాంతో, దీనితో తనకు ఏ సంబంధమూ లేదని యూట్యూబర్ ఫార్లే చెప్పుకొచ్చాడు. మనవాడు అక్కడితో ఆగలేదు. ‘నా స్ట్రీమ్ అంత పెద్ద సైట్‌లో అంతమందికి రీచ్ అవుతుందని ముందే తెలిస్తే బాగుండేది! ఇంకాస్త బాగా తయారై కనిపించేవాడిని. ఇంకొన్ని ఇంటరెస్టింగ్ పాయింట్లు కాస్త నాటకీయ జోడించి మరీ చెప్పేవాడిని’ అంటూ హాస్యమాడాడు! గత జనవరిలో డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్ష పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ ప్రభుత సైట్లు డిజిటల్ సెక్యూరిటీ బ్రీచ్ బారిన పడుతున్న ఉదంతాలు తరచూ జరుగుతున్నాయి. గత మే లో పలువురు అధికారులు, ప్రఖ్యాత వ్యాపార దిగ్గజాలకు అధ్యక్షుని చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఫోన్ నుంచి తనకు తెలియకుండానే మెసేజీకు, కాల్స్ వెళ్లి పెద్ద కలకలమే రేపాయి. ఇక గత ఏడాది ట్రంప్ ఎన్ని ప్రచార వేళ ఇరాన్ హ్యాకర్లు ఏకంగా ఆయన ప్రచార సైట్లలోకి చొరబడ్డారు.

11.49 కోట్ల మందిలో 1.71 కోట్ల పేర్లు తొలగింపు

తమిళనాడు, గుజరాత్ ముసాయిదా ఓటరు జాబితాపై ఈసీ వెల్లడి

న్యూఢిల్లీ: తమిళనాడు, గుజరాత్‌లలో ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనంతరం 1.71 కోట్ల ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలో లేవని ఎన్నికల కమిషన్ తెలిపింది. రెండు రాష్ట్రాల్లో కలిపి మొత్తం ఓటర్లు 11.49 కోట్లు కాగా, వీరిలో 9.78 కోట్ల మంది పేర్లు తాజాగా విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో ఉన్నాయని శుక్రవారం ఈసీ వివరించింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన తమిళనాడులో మొత్తం ఓటర్లు 6.41 కోట్ల మంది కాగా, 84.81 శాతం మంది అంటే, 5.43 కోట్ల మంది బూత్ లెవెల్ అధికారులకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేశారని తెలిపింది. మిగతా సుమారు 97.37 లక్షల పేర్లు తొలగింపునకు గురయ్యాయంది. అదేవిధంగా, గుజరాత్‌లో మొత్తం ఓటర్లు 5.08 కోట్ల మంది కాగా, 85.50 శాతం మంది, 4.34 కోట్ల మంది ఎన్యుమరేషన్ ఫాంలు అందజేసినట్లు ఈసీ వివరించింది. మిగతా 73.74 లక్షల మంది పేర్లు ఓటరు జాబితా ముసాయిదా నుంచి తొలగింపునకు గురయ్యాయని తెలిపింది. 2026 జనవరి 18వ తేదీ వరకు ఓటర్లు తమ అభ్యంతరాలను తెలిపేందుకు అవకాశం ఉందని పేర్కొంది. ఫిబ్రవరి 10వ తేదీ వరకు వీటిని పరిశీలిస్తారంది. ఎస్ఐఆర్ కొనసాగుతున్న పశ్చిమబెంగాల్, రాజస్తాన్, గోవా, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లలో ఈ నెల 16వ తేదీన ముసాయిదా జాబితా ప్రకటిస్తామంది. ఇక్కడ మొత్తం 12.32 కోట్ల మంది ఓటర్లు ముసాయిదాలో తమ పేర్లు ఉన్నాయోలేదో చూసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. ఓటర్లు ముసాయిదా ఓటరు జాబితాను http://ceo.gujarat.gov.in అనే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపింది.

గ్రీన్ కార్డ్ లాటరీ విధానానికి అమెరికా విరామం

- బ్రౌన్ వర్సిటీ కాల్పుల నేపథ్యంలో ట్రంప్ నిర్ణయం
- నిందితుడు అమెరికా వచ్చింది ఈ లాటరీ ద్వారానే

వాషింగ్టన్: గ్రీన్ కార్డ్ లాటరీ విధానాన్ని సస్పెండ్ చేస్తూ అమెరికా అధ్యక్షుడు నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల ఒక పోర్చుగీస్ జాతీయుడు అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీలోకి చొరబడి విచక్షణా రహితంగా కాల్పులకు పాల్పడటం, ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులను పొట్టన పెట్టుకోవడం తెలిసిందే. అలాగే ఒక ఎంఐటీ ప్రొఫెసర్‌ను కూడా కాల్చిచంపాడు. అతను గ్రీన్ కార్డ్ లాటరీ ద్వారానే అమెరికాలోకి ప్రవేశించాడు. దాంతో ప్రస్తుతానికి ఆ విధానాన్ని నిలిపివేయాలని ట్రంప్ నిర్ణయించినట్టు హోం లాండ్ సెక్యూరిటీ విభాగం కార్యదర్శి క్రిస్టీ నోయెమ్ గురువారం ఎక్స్ పోస్టులో తెలిపారు. అమెరికా సిటిజెన్ షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్‌కు ఈ మేరకు ఆమె ఆదేశాలు కూడా జారీ చేశారు. పోర్చుగల్‌కు చెందిన హంతకుడు క్లాడియో నెవెస్ వాలెంటేను అమెరికాలోకి అసలు అనుమతించే ఉండకూడదని నోయెమ్ వాపోయారు. 48 ఏళ్ల వాలెంటే 2000లో అమెరికా వచ్చి బ్రౌన్ వర్సిటీలోనే చదివాడు. 2017 అనంతరం అతనికి అమెరికాలో శాశ్వత నివాస హోదా కూడా దక్కింది. అయితే 2001లో వర్సిటీ నుంచి ఆబ్సెన్స్ లీవ్ తీసుకున్న నాటినుంచి 2017 దాకా అతను అమెరికాలో ఎక్కడున్నాడు, ఏం చేసాడు తదితర అనుపానులేవీ తెలియకపోవడం విశేషం.

పౌరుల స్వేచ్ఛ...ప్రభుత్వ తొలి బాధ్యత

- అదేమీ కానుక కాదు: సుప్రీం
- రెన్యువల్‌కు విదేశీయానాల జాబితా అడగటం సరికాదు
- పాస్‌పోర్ట్ అథారిటీకి మందలింపు

న్యూఢిల్లీ: ‘స్వేచ్ఛ దేశ పౌరులకు ప్రభుత్వాలిచ్చే కానుక కాదు. వారిపట్ల వాటి తొలి బాధ్యత. ఎందుకంటే రాజ్యాంగం వారికి కల్పించిన మౌలిక హక్కు’అని అత్యున్నత న్యాయస్థానం కుండబద్దలు కొట్టింది. పాస్ పోర్ట్ రెన్యువల్ కోసం భావి విదేశీయానాలు, వీసా వివరాలను పాస్‌పోర్ట్ అథారిటీ డిమాండ్ చేయడం సరికాదని స్పష్టం చేసింది. ‘జీవనోపాధి, అవకాశాల అన్వేషణలో భాగంగా చట్టబద్ధంగా ఎక్కడికైనా వెళ్లేందుకు, ప్రయాణించేందుకు పౌరులకు అన్ని హక్కులూ ఉన్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఇందుకు వీలు కల్పిస్తోంది’అని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఎ.జి.మసీహ్‌ల ధర్మాసనం గుర్తు చేసింది. క్రిమినల్ ప్రొసీడింగ్స్ పెండింగ్‌లో ఉన్న ఉదంతాల్లో నిందితుల విదేశీయానం సంబంధిత కోర్టుల దృష్టిలో ఉందా లేదా అన్నది మాత్రమే దాని పని అని పేర్కొంది. జార్ఖండ్ బొగ్గు గనుల కేటాయింపు కేసులో ఎన్ఐఏ విచారణ ఎదుర్కొంటున్న మహేశ్ కుమార్ ఝా అనే వ్యక్తి పిటిషన్ విచారణ సందర్భంగా శుక్రవారం ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ‘క్రిమినల్ కేసులున్నంత మాత్రాన సదరు వ్యక్తికి పాస్‌పోర్ట్ ఉండొద్దని, రెన్యువల్ చేయించుకోవద్దని ఏమీ లేదు. సంబంధిత క్రిమినల్ కోర్టు అనుమతి, పిలిచినప్పుడల్లా విచారణకు హాజరవుతానని నిందితుని ప్రమాణ పత్రం ఉంటే చాలు’అని స్పష్టం చేసింది.

రూ.4 కోట్ల నగదు, 313 కిలోల వెండి..

‘డుంకి’ ట్రావెల్ ఏజెంట్ ఇంట్లో ఈడీ సోదాల్లో లభ్యం



న్యూఢిల్లీ: అమెరికాకు భారతీయులను దొంగచాటుగా తరలించే డుంకి ట్రావెల్ ఏజెంట్ ఇంట్లో జరిపిన తనిఖీల్లో కళ్లు చెదిరే రీతిలో సొత్తు వెలుగు చూసింది. భారతీయుల అక్రమ రవాణాకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)బృందాలు ఢిల్లీ, పంజాబ్, హరియాణాల్లోని డజనుకుపైగా ప్రాంతాల్లో సోదాలు జరిపాయి. ఈ సందర్భంగా రూ.4.62 కోట్ల నోట్ల కట్టలతోపాటు, రూ.19.13 కోట్ల విలువైన 313 కిలోల వెండి, 6 కిలోల బంగారం కనిపించాయి. ఢిల్లీ కేంద్రంగా పనిచేసే ఈ ఏజెంట్ నివాసాల్లో దొరికిన ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల్లో అభ్యంతరకరమైన చాటింగ్‌లు కనిపించాయని అధికారులు శుక్రవారం తెలిపారు. హరియాణాలోని పానిపట్‌లో జరిపిన తనిఖీల్లో డుంకి కార్యకలాపాలకు సంబంధించిన రికార్డులు దొరికాయన్నారు. అమెరికాకి అక్రమమార్గంలో వెళ్లాలనుకునే వారి నుంచి ఇతడు ఆస్తి పత్రాలను తన కమిషన్‌లో భాగంగా ష్యూరిటీగా ఉంచుకునేవాడని అధికారులు వివరించారు. అమెరికాలోకి దొంగచాటుగా ప్రవేశించాలనుకునే వలసదారులు గాడిద మాదిరిగా సుదీర్ఘ, కష్టమైన ప్రయాణం చేయాల్సి ఉంటుందని చెప్పేందుకే డాంకీ/డుంకీ అనే పదం వాడుతుంటారు.

పార్లమెంట్ నిరవధిక వాయిదా

ముగిసిన శీతాకాల సమావేశాలు ● లోక్‌సభలో 111 శాతం, రాజ్యసభలో 121 శాతం ఉత్పాదకత

న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగిశాయి. ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈసారి సమావేశాలు 19 రోజులపాటు జరిగాయి. శుక్రవారం ఉదయం లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా ముగింపు సందేశాన్ని చదివి వినిపించారు. శీతాకాల సమావేశాల్లో 111 శాతం ఉత్పాదకత సాధ్యమైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సభకు హాజరయ్యారు. విపక్ష సభ్యులు మహాత్మాగాంధీకి జై అంటూ నినదించారు. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. రాజ్యసభలో విపక్ష సభ్యుల ప్రవర్తనను చైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ తప్పుపట్టారు. జీ రామ్ జీ బిల్లుపై గురువారం జరిగిన చర్చ సందర్భంగా సభలో అలజడి సృష్టించడాన్ని ఆక్షేపించారు. ప్రవర్తన పట్ల ఆత్మపరిశీలన చేసుకోవాలని ప్రతిపక్ష ఎంపీలకు సూచించారు. సభలో బిగ్గరగా నినాదాలు చేయడం, ప్లకార్డులు ప్రదర్శించడం, సభకు అంతరాయం కలిగించడం, పేపర్లు చించేసి విసిరేయడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావడానికి వీల్లేదని అన్నారు. రాజ్యసభలో ఈ సమావేశాల్లో 121 శాతం ఉత్పాదకత నమోదైందని స్పష్టంచేశారు. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు.

- శీతాకాల సమావేశాలు మొత్తం 92 గంటల 25 నిమిషాల పాటు జరిగాయి.
- పలు కీలకమైన బిల్లులను ఆమోదించారు. బిల్లులపై చర్చ సందర్భంగా అధికార, విపక్షాల మధ్య పలుమార్లు రగడ చోటుచేసుకుంది.
- కీలకమైన ‘రామ్ జీ రామ్’ బిల్లుతోపాటు అణు ఇంధన రంగంలో ప్రైవేట్ సంస్థలను అనుమతిస్తూ, బీమా రంగలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు వీలు కల్పిస్తూ బిల్లులు ఆమోదించారు. మొత్తం 8 బిల్లులు ఆమోదం పొందాయి.
- గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించడం పట్ల విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి.
- వందేమాతర గీతానికి 150 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రత్యేక చర్చ చేపట్టారు.
- ఎన్నికల సంస్కరణలపైనా చర్చ జరిగింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రత్యేకంగా చర్చించాలని విపక్షాలు పట్టుబట్టగా ప్రభుత్వం అంగీకరించలేదు.

సమావేశాలు ఫలవంతం: రిజిజు

శీతాకాల సమావేశాలు ఫలవంతంగా సాగాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఈసారి ఉభయ సభల్లో ఎనిమిది బిల్లులను సమగ్రంగా చర్చించి ఆమోదించినట్లు తెలిపారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వ సంస్కరణల ఎక్స్‌ప్రెస్ మరింగ వేగం పుంజుకోనుందని వివరించారు.

కించపర్చడంతోనే ప్రారంభం, ముగింపు: కాంగ్రెస్: రవీంద్రనాథ్ రాగూర్‌ను కించపర్చడంతో ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మహాత్మా గాంధీని కించపర్చడంతో ముగిశాయని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ శుక్రవారం విమర్శించారు. వాయు కాలుష్యంపై చర్చకు తాము సిద్ధమైనప్పటికీ ప్రభుత్వం పారిపోయిందని ఎద్దేవా చేశారు.

మోదీ, ప్రియాంక స్నేహపూర్వక సంభాషణ

పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వివిధ పార్టీల నేతలకు తేనీటి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా మధ్య స్నేహపూర్వక సంభాషణ చోటుచేసుకుంది. మలయాళ భాష నేర్చుకుంటున్నానని ప్రియాంక చెప్పారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వయనాడ్(కేరళ) ప్రజలతో వారి భాషలోనే మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నానని తెలిపారు. అలాగే మోదీ తాజాగా చేపట్టిన మూడు దేశాల పర్యటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇథియోపియా దేశం మనం ఊహించిన దానికంటే భిన్నంగా ఉందని, అక్కడ వేగంగా అభివృద్ధి జరుగుతోందని మోదీ వెల్లడించారు. ఈసారి శీతాకాల సమావేశాలు అతితక్కువగా 15 రోజులపాటే జరిగాయని సమాజ్‌వాదీ పార్టీ నేత ధర్మేంద్ర యాదవ్ చెప్పగా.. అలా జరగడం మంచిదేనని, ఎక్కువ రోజులు గట్టిగా అరవడానికి తన గొంతు సహకరించదని మోదీ నవ్వుతూ బదులిచ్చారు.

‘జీ రామ్ జీ’పై రాత్రంతా విపక్షాల ధర్నా

న్యూఢిల్లీ: జీ రామ్ జీ బిల్లును వ్యతిరేకిస్తూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు గురువారం రాత్రంతా పార్లమెంట్ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. సంవిధాన్ సదన్ గేటు వద్ద వారు ఉండిపోయారు. మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్ల ఫోటోలు, బ్యానర్లు ప్రదర్శించారు. బిల్లుపై సమగ్రంగా చర్చించకుండానే ఆమోదించడం అన్యాయమంటూ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం గాంధీజీని రెండోసారి హత్య చేసిందని, రవీంద్రనాథ్ ఠాగూర్‌ను అవమానించిందని మండిపడ్డారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో జీ రామ్‌జీ బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును బుధవారం లోక్‌సభలో, గురువారం రాజ్యసభలో ఆమోదం పొందింది.

బెట్టింగ్ యాప్ కేసులో యువరాజ్, సోనూసూద్ ఆస్తుల అటాచ్

న్యూఢిల్లీ: బెట్టింగ్ యాప్‌తో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసు దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా పలు సెలబ్రిటీల కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. యువరాజ్, రాబిన్ ఉతప్ప పలువురు మాజీ క్రికెటర్లతోపాటు నటులు సోనూ సూద్, ఊర్వశీ రౌతేలా, మిమీ చక్రవర్తి, నేహా శర్మ, పలువురికి చెందిన రూ.7.93 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. క్రికెటర్ యువరాజ్ సింగ్‌కు చెందిన హెల్త్ అండ్ వెల్‌నెస్ సంస్థ వైడబ్ల్యూసీకి సంబంధించి రూ.2.5కోట్ల ఆస్తులు, నటి నేహాశర్మకు చెందిన రూ.1.28 కోట్ల ఆస్తులు, నటుడు అంకుశ్ హజ్రాకు చెందిన రూ 47.2 లక్షలు, రాబిన్‌ఉతప్పకు సంబంధించిన రూ.8.26 లక్షల ఆస్తులను ఈడీ అధికారులు జప్తు చేశారు. అంతేకాదు నటుడు సోను సూద్ పేరు మీద ఉన్న రూ.1 కోటి విలువైన ఆస్తులు, నటి, తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మిమీ చక్రవర్తి పేరుతోఉన్న రూ.59 లక్షల విలువైన ఆస్తులను కూడా తాత్కాలికంగా అటాచ్ చేశారు.

రన్‌వేపైనే తల‘రాతలు’

187 పోస్టులకు 8 వేల మంది!

ఆకాశమంత చదువు చదివితే ఏం లాభం.. పొట్టకూటి కోసం నేలపై కూర్చుని పరీక్ష రాయక తప్పలేదు. డిగ్రీలు, పీజీలు చేతిలో ఉన్నా.. కనీసం హోంగార్డు ఉద్యోగమైనా దొరక్కపోతుందా.. అన్న నిరాశ నిండిన నిరీక్షణ అది. ఒడిశాలోని సంబల్‌పూర్‌లో డిసెంబర్ 16న కనిపించిన దృశ్యం, దేశంలో నిరుద్యోగ సమస్యకు సజీవ సాక్ష్యంగా నిలిచింది. కేవలం 187 హోంగార్డు పోస్టుల భర్తీ కోసం ఏకంగా 8,000 మంది యువత కదిలివచ్చారు. దీనికి కనీస అర్హత కేవలం 5వ తరగతి ఉత్తీర్ణత. కానీ, వచ్చిన వారిలో ఎక్కువ శాతం మంది ఉన్నత విద్యావంతులే కావడం గమనార్హం. సాధారణ పరీక్ష కేంద్రాలు సరిపోకపోవడంతో, అధికారులు జమాదర్‌పాలి ఎయిర్‌స్ట్రిప్ (విమానాశ్రయం) రన్‌వేనే వేదికగా మార్చారు. నిరుద్యోగ యువత మండుతున్న ఎండలో, ఆకాశం కింద నేలపైనే కూర్చుని తమ భవిష్యత్తును వెతుక్కుంటూ పరీక్ష రాశారు. ఈ నియామకాలు కేవలం ఒప్పంద ప్రాతిపదికన జరుగుతున్నాయి. అయినప్పటికీ, కనీస ఉపాధి కరువైన తరుణంలో యువత వీటిపైనే ఆశలు పెట్టుకుంది. దాదాపు 10,000 మంది దరఖాస్తు చేసుకోగా, 8,000 మంది హాజరయ్యారు. ఇంతమంది కోసం 20 పాఠశాలల్లో ఏర్పాట్లు చేయాల్సి వచ్చేది. - సాక్షి, నేషనల్ డెస్క్

పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీరు రావడం లేదు. దిగువకు 2400 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 41.8813 టీఎంసీలు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 569.90 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 49,838 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.800, గరిష్ట ధర రూ.1500, మోడల్ ధర రూ.1000 వరకు పలికింది.

న్యూస్‌రీల్

నారసింహ మహాదేవిగా బగళాముఖి అమ్మవారు

చందోలు(కర్లపాలెం): మార్గశిర అమావాస్య శుక్రవారం బాపట్ల జిల్లా చందోలులోని బగళాముఖి అమ్మవారు శ్రీ నారసింహ మహాదేవిగా పూజలందుకున్నారు. అమావాస్య సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈవో నరసింహమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు శాంతి హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి బగళాముఖి అమ్మవారికి పూజలు చేశారు.

బాల కోటేశ్వరస్వామి ఆలయంలో కోటి కుంకుమార్చన

అమర్తలూరు (భట్టిప్రోలు): అమర్తలూరు మండలం గోవాడలో కొలువైన శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ బాల కోటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం సామూహిక లలిత సహస్ర నామ పూజ, కోటి కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ శ్రీనివాసశర్మ, చావలి శ్రీధర్‌శర్మలు స్వామి వార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీసేవ ఘనంగా జరిపారు. మైత్రేయి ఆశ్రమ నిర్వాహకురాలు గంటా నిర్మలమ్మ భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పావులూరి రమేష్, కార్యనిర్వహణాధికారి మంతెన విఠల్ శ్రీనివాస వర్మ, ఎస్‌ఎస్‌ఎఫ్ బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, నిర్వాహకులు పావులూరి సుబ్బారావు, ఉప్పల పద్మజ, చింతల మురళీకృష్ణ, పడమట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యవసాయం కోసం ఏఐపై చర్చా కార్యక్రమం

గుంటూరు రూరల్: గుంటూరు నగర శివారు లాంఫాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం బిల్డింగ్ ఆన్ ఏఐ యూనివర్సిటీ–ఏఐ ఫర్ అగ్రికల్చర్ అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. యూఎస్ఏలోని ఫ్లోరిడా గ్లోబల్ ఫుడ్ స్టెంప్స్ ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కాకాని గోపాల్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఫ్లోరిడా, భారతదేశం వాతావరణ పరిస్థితులు ఒకే విధంగా ఉండటం వల్ల కృత్రిమ మేధస్సుపై చేసిన పరిశోధనలు ఆంధ్రప్రదేశ్‌లో పరిశీలించి ఆచరణలో పెట్టవచ్చన్నారు. యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా సూపర్ కంప్యూటర్ కలిగి ఉండటం వల్ల కృత్రిమ మేధస్సుపై ప్రపంచానికి నాయకత్వం వహిస్తుందన్నారు. కృత్రిమ మేధస్సు ద్వారా పంటల్లో కలుపు మొక్కలను, పురుగులను గుర్తించి వాటిపైన మాత్రమే రసాయనాలు పిచికారి చేసే పరిజ్ఞానం అక్కడ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లాంఫాం రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ పీవీ సత్యనారాయణ, ఇంజినీరింగ్ టెక్నాలజీ డాక్టర్ ఎ.మణి, పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ ఏవీ రమణ, కంట్రోలర్ డాక్టర్ ప్రసాద్, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ పి.సాంబశివరావు, ఎస్టేట్ ఆఫీసర్ పి. రవి, లైబ్రేరియన్ డాక్టర్ జి.కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యాన పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఉద్యాన పంటలపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రైతు సేవ కేంద్రాల వారీగా రబీ 2025, ఖరీఫ్ 2026, రబీ 2026 సీజన్లకు సంబంధించిన పంట ప్రణాళికలను సిద్ధం చేసే విధానాలపై చర్చించారు. స్థూల విలువ జోడింపునకు సంబంధించిన వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఉద్యాన శాఖ అదనపు డైరెక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, ఉద్యానశాఖ ఏడీలు హరినాథరెడ్డి, ఎం.అశోక్‌కుమార్ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్య పాలనలో విద్యార్థులపై కక్ష

- ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ఏటా ఉచిత మెటీరియల్
- ఈ ఏడాది ప్రశ్నార్థకంగా పంపిణీ
- గత వైఎస్సార్ సీపీ పాలనలో నిరాటంకంగా అందజేత
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 35 వేల మంది విద్యార్థులు
- 'అల్పాహారం' కూడా లేక అవస్థలు

చంద్రబాబు పాలనలో పదో తరగతి విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఉత్తీర్ణత శాతం పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్న సర్కారు... బాలలకు ఆ మేరకు వసతులు కల్పించడంలో చేతులెత్తేసింది. కనీసం ప్రణాళిక కూడా లేకుండా అడ్డగోలుగా వ్యవహరిస్తూ విద్యార్థులను అర్ధాకలితో అలమటింపజేస్తోంది. స్టడీ మెటీరియల్ ఇవ్వడానికి కూడా చేతులు రావడం లేదు. అదనపు తరగతులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు బడిలోనే ఉంటున్న విద్యార్థులకు అల్పాహారం పెట్టడానికీ చంద్రబాబు సర్కారుకు మనసు కూడా రావడం లేదు.

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులకు జిల్లా పరిషత్ ద్వారా అందించాల్సిన ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ ప్రశ్నార్థకంగా మారింది. వచ్చే ఏడాది మార్చి 16వ తేదీ నుంచి జరగనున్న పరీక్షలకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల నుంచి దాదాపు 35 వేల మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులతో అధిక మార్కుల సాధనకు దోహదం చేసేలా రూపొందించిన మెటీరియల్‌ను జెడ్పీ పాలకవర్గానికి విద్యాశాఖాధికారులు అందజేశారు. అయినప్పటికీ జనవరి వస్తున్నా పంపిణీకి నోచుకోలేదు.

గత ప్రభుత్వంలో నిరాటంకంగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వరుసగా రెండేళ్లు 'జగనన్న విద్యాజ్యోతి' పేరుతో నాణ్యమైన స్టడీ మెటీరియల్ రూపొందించి సకాలంలో పంపిణీ చేశారు. ఇప్పుడు జెడ్పీ పాలకవర్గం చతికిలబడింది. 2022 నవంబరులో రూ.61.80 లక్షల జెడ్పీ నిధులతో రాష్ట్రంలోనే తొలిసారిగా గుంటూరు జిల్లా వ్యాప్తంగా 36,155 మంది విద్యార్థులకు, 2023లో రూ.70 లక్షల వ్యయంతో 39 వేల మంది విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు.

టెన్త్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

అర్ధాకలితో హాజరవుతున్న విద్యార్థులు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి సిద్ధమవుతున్న విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏకధాటిగా నిర్వహిస్తున్న రెగ్యులర్, అదనపు తరగతులకు వారు హాజరవుతున్నారు. మధ్యాహ్న భోజనంతోనే సరిపెట్టుకుంటున్నారు. సాయంత్రం అదనపు తరగతులు ముగిసే వరకు ఖాళీ కడుపులతో నెట్టుకువస్తున్నారు. పట్టణ, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు దూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలకోర్చి ఉదయం 7 గంటలకే ఇళ్ల నుంచి బయల్దేరి వస్తున్నారు. నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంతో ఎస్సీఈఆర్టీ ద్వారా నూరు రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించిన ప్రభుత్వం పాఠశాలల్లో అదనపు తరగతులను నిర్బంధంగా అమలు చేస్తోంది. వారి ఆకలిని మాత్రం మరిచిపోయింది. గుంటూరు జిల్లా వ్యాప్తంగా 186 ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, సోషల్, బీసీ వెల్ఫేర్ పాఠశాలల నుంచి పరీక్షలకు సన్నద్ధమవుతున్న 10,384 మంది విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. గతేడాది కూడా జిల్లా పరిషత్ ద్వారా నెల రోజులు మాత్రమే అమలు చేశారు. విద్యార్థికి రూ.10 చొప్పునే కేటాయించారు. ఈ సారి కనీసం ఎటువంటి ప్రతిపాదనలు కూడా సిద్ధం కాలేదు. మరోవైపు అధికారుల హెచ్చరికలు, ఆకస్మిక తనిఖీలతో ఉపాధ్యాయులు బెంబేలెత్తుతున్నారు.

గత ప్రభుత్వంలో పంపిణీ చేసిన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ (ఫైల్)

ఎస్సీఈఆర్టీ మోడల్ పేపర్లే దిక్కు

మార్చి 16వ తేదీ నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనుండటం, జెడ్పీ నుంచి స్టడీ మెటీరియల్ అందకపోవడంతో ఎస్సీఈఆర్టీ సిద్ధం చేసిన మోడల్ పేపర్లే దిక్కయ్యాయి. ఎస్సీఈఆర్టీ మోడల్ పేపర్లను పలువురు హెచ్ఎంలు పుస్తక రూపంలో ముద్రించారు. వీటితోపాటు అవే పేపర్లను జిరాక్సులు తీయించి పాఠశాలల్లో విద్యార్థులతో చదివిస్తున్నారు. జెడ్పీ నుంచి స్టడీ మెటీరియల్‌ను ఆలస్యంగా పంపిణీ చేయడం వలన విద్యార్థులకు ప్రయోజనం ఉండదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

కార్యాచరణలో అల్పాహారాన్ని చేర్చాలి

విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందించాలి. బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించాలనే విషయాన్ని ప్రభుత్వం విస్మరిస్తోంది. ఖాళీ కడుపులతో తరగతులకు వచ్చి ఏం నేర్చుకుంటారో ఆలోచించాలి.

– కె.బసవ లింగారావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

నూరు శాతం ఉత్తీర్ణత సాధ్యమా?

అదనపు తరగతులకు హాజరవుతున్న విద్యార్థులు సాయంత్రానికి అలసి ఇళ్లకు వెళుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలకే పరిమితం అవుతున్నారు. సబ్జెక్టుల వారీగా చదవడం, చదివిన పాఠ్యాంశాలను గుర్తుంచుకోవాలన్నా ఇలా ఖాళీ కడుపులతో సాధ్యమేనా?

– వై. థామస్‌రెడ్డి, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

జిల్లా కలెక్టర్‌కు గవర్నర్ ప్రశంసలు

గుంటూరు వెస్ట్: సాయుధ దళాల పతాక నిధికి రాష్ట్రంలోనే అత్యధికంగా నిధులు సేకరించినందుకు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాను రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రశంసించారు. గుంటూరు జిల్లా నుంచి రూ.17,67,363 సేకరించారు. బాపట్ల, తూర్పు గోదావరి జిల్లాలు తర్వాతి రెండు స్థానాల్లో నిలిచాయి. ఈ మేరకు శుక్రవారం లోక్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తొలి స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. సైనికులు ప్రాణాలు త్యాగం చేస్తూ మనల్ని కాపాడుతున్నారన్నారు. సైనికుల త్యాగాలు ఎనలేనివని పేర్కొన్నారు. సైనిక కుటుంబాలను ఆదుకోవడం మన కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్.గుణశీల తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర'

స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా తెలిపారు. గ్రామ, మండల స్థాయి నుంచి కార్యక్రమం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'పర్యావరణంలో అవకాశాలు' అనే థీమ్‌తో నిర్వహించనున్నట్లు చెప్పారు. అన్ని శాఖలు సమర్థంగా ప్రణాళికతో, సమన్వయంతో కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. పరిశుభ్రత, ప్రజా ఆరోగ్యం, పౌరుల భాగస్వామ్య విలువలను ప్రోత్సహించేందుకు ప్రతి నెల మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవగాహన శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ముందుకు సాగని రబీ సాగు

గుంటూరు జిల్లాలో మంచి శనగ సాగు

- జిల్లా వ్యాప్తంగా 32.71 శాతం మేర పంటల సాగు
- వరుస తుపాన్లు, అధిక వర్షాలే ఇందుకు కారణం
- 65,295 హెక్టార్లకు గాను 21,356 హెక్టార్లలోనే సాగు
- మినుము, జొన్న, మొక్క జొన్న సాగు అంతంతే..

కొరిటెపాడు(గుంటూరు వెస్ట్): ఈ ఏడాది రబీ సాగు అంత ఆశాజనకంగా లేదు. సాగులో పురోగతి కనిపించడం లేదు. రబీ సీజన్ అక్టోబర్ రెండవ వారం నుంచి మొదలైంది. రెండు నెలలు పూర్తయినా సాగు అంతంత మాత్రంగానే ఉంది. వరుస తుపాన్లు, భారీ వర్షాల కారణంగా రబీ సాగు అనుకున్నంత ముందుకు సాగలేదు. రబీ సాగు ఆరంభమై రెండు నెలలు దాటినా అతికష్టంపైన సాధారణ సాగు 65,295 హెక్టార్లు ఉండగా, ఇప్పటి వరకు 21,356 హెక్టార్ల (32.71 శాతం)కే పరిమితం అయ్యింది.

- వర్షాధారం కింద ఇక సాగుకు అవకాశం లేదు. గతేడాది ఈ సమయానికి సాధారణ సాగు 65,728 హెక్టార్లకు గాను జిల్లాలో 64,720 హెక్టార్లలో వివిధ పంటలు సాగు కాగా, ఈ ఏడాది అదే సమయానికి 21,356 హెక్టార్లు మాత్రమే సాగయింది.
- ఇక ఆరుతడి పంటల సాగు కూడా అంతంత మాత్రంగానే ఉంది. ప్రస్తుతం మొక్కజొన్న, జొన్న, మినుము, మంచి శనగ పంటలు వేసుకునేందుకు అవకాశం ఉన్నా ఖరీఫ్‌లో సాగు చేసిన వరి కోతలు ఇంకా పూర్తి కాకపోవడంతో పంటల సాగు ముందుకు సాగడం లేదు. దీంతో రైతుల్లో నిరాసక్తి నెలకొంది. ముందుగా సాగు చేసిన పంటలు మాత్రం కళకళలాడుతున్నాయి.

ముగిసిన మంచి శనగ సాగు సీజన్...

- జిల్లాలో మంచి శనగ సాగు సీజన్ ముగిసింది. ఈ ఏడాది మంచి శనగ సాగు కూడా ఆశించిన మేర సాగు కాలేదు. జిల్లాలో మంచి శనగ సాధారణ సాగు విస్తీర్ణం 8,121 హెక్టార్లకు గాను 7,709 హెక్టార్లలో మాత్రమే సాగయింది. సాధారణంగా ఈ ఏడాది వంద శాతానికి మించి మంచి శనగ సాగు అవుతుందనుకున్న అధికారుల అంచనాలు నిజం కాలేదు.
- గుంటూరు జిల్లాలో పెదనందిపాడు, ఫిరంగిపురం, తాడికొండ, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, పెదకాకాని, కాకుమాను, మేడికొండూరు తదితర మండలాల్లో అత్యధికంగా శనగ సాగు అవుతుంది. అలాంటిది ఈ ఏడాది ఆయా మండలాల్లో అనుకున్న మేర సాగు కాలేదని రైతులు తెలిపారు.

జొన్న, మొక్కజొన్న, మినుము సాగుకు అదును..

- ప్రస్తుతం జిల్లాలో జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర పంటలకు మాత్రమే అదును ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.
- మొక్కజొన్న సాధారణ సాగు 20,334 హెక్టార్లకు గాను ప్రస్తుతం 8,172 హెక్టార్లలో సాగయింది. జొన్న సాధారణ సాగు 16,893 హెక్టార్లకు గాను 2,608 హెక్టార్లలో, మినుము సాధారణ సాగు 6,529 హెక్టార్లకు గాను 2,353 హెక్టార్లలో, పెసర సాధారణ సాగు 10,759 హెక్టార్లకు గాను 89 హెక్టార్లలో సాగయింది.
- ఈ నాలుగు పంటల సాగుకు అదును ఉంది. దాంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. మొత్తంగా ఈ ఏడాది రబీ సీజన్ పంటల సాగు ఆశించిన మేర ముందు సాగలేదనే చెప్పాలి.

జిల్లాలో పంటల సాగు (హెక్టార్లలో..)

పంట	సాధారణ సాగు	ప్రస్తుతం సాగు
మంచి శనగ	8,121	7,709
మొక్కజొన్న	20,334	8,172
జొన్న	16,893	2,608
మినుము	6,529	2,353
పెసర	10,759	89
పొగాకు	1,615	260
వరి	868	73
కంది	94	92

అడుగడుగుకో గొయ్యి!

- అధ్వానంగా కాజ–నంబూరు మార్గం
- కాజ గ్రామంలో రహదారిపై దారిపొడవునా భారీ గుంతలే
- దుమ్ము ధూళితో నిండుతున్న నివాసాలు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి నియోజకవర్గంలోని కాజ, పొన్నూరు నియోజకవర్గంలోని నంబూరుల మధ్య రహదారి అధ్వానంగా మారింది. దాదాపు 3.5 కి.మీ. పొడవున ఈ రహదారి ఉంది. నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనదారులు, కార్లలో, ఆటోల్లో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే రహదారిలో గుంటూరు చానల్‌పై బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టోల్‌గేట్ రుసుం తప్పించుకోవాలని..

ఈ మార్గంలో నిత్యం నంబూరుతోపాటు గోళ్లమూరు, ఉప్పలపాడు గ్రామాలకు చెందిన వారు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. కాజా వద్ద టోల్‌గేటు రుసుం చెల్లించాల్సి వస్తుందని భారీ వాహనాలు ఈ రోడ్డులో వందల సంఖ్యలో రాత్రీపగలు తేడా లేకుండా తిరుగుతున్నాయి. రోడ్డు పొడవునా రెండువైపులా పంట కాలువ డ్రైనేజీలు ఉండడంతో మార్జిన్‌లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఎదురుగా వాహనం వస్తే మార్జిన్ దిగాలంటే భయమేస్తోందని వాహనదారులు తెలిపారు. కాజ గ్రామంలో జాతీయ రహదారి నుంచి గుంటూరు చానల్ వరకు రోడ్డు గజానికొక గొయ్యి ఉంది. భారీగా దుమ్ము లేవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో నుంచి ఈ రహదారి వెళుతుండడంతో రోడ్డు పక్కనే ఉన్న నివాసాల్లో దుమ్ము చేరుతోంది. అనారోగ్యం పాలవుతున్నామని కాజ గ్రామస్తులు వాపోతున్నారు.

కాజ గ్రామంలో ధ్వంసమైన రోడ్డు

నంబూరు - కాజ రోడ్డులో ప్రమాదకరంగా మార్జిన్

భారీ లారీలతో ...

గుంటూరు చానల్‌పై బ్రిడ్జి సైడు ఐరన్ గడ్డర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కింద పిల్లర్లు సైతం ధ్వంసం అయ్యాయి. రోజూ ఈ రోడ్డులో ట్రాన్స్‌పోర్ట్ లారీలతో పాటు 50 టన్నుల లోడ్‌తో కంకర, మట్టి టిప్పర్లు తిరుగుతున్నాయి. ఈ వాహనాల వల్ల బ్రిడ్జి మరింత బలహీనపడే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు తెలిపారు. వెంటనే ఇరిగేషన్ అధికారులు ఆ బ్రిడ్జిని నిర్మించి, రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

భారీ వాహనాలను నిషేధించాలి

నంబూరుతోపాటు కాజా గ్రామంలోని ఇతర రహదారుల్లో రాత్రి సమయంలో టిప్పర్లు భారీ సంఖ్యలో తిరుగుతున్నాయి. ఈ టిప్పర్ల వల్ల గ్రామాలను కలుపుతూ ఏర్పాటు చేసిన రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయి. ముఖ్యంగా నంబూరు – కాజ రోడ్డు అధ్వానంగా మారింది. రాత్రి సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి మార్జిన్ దగ్గర ద్విచక్రవాహనదారులు కిందపడి గాయాల పాలవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారిని వెడల్పు చేయాలి. భారీ వాహనాలతోపాటు టిప్పర్లను గ్రామంలోకి రాకుండా నిషేధించాలి.

– కంకణాల శంకర్, జనసేన సీనియర్ నేత

దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు

కాజ నుంచి నంబూరు వెళ్లే రోడ్డు గోతులమయం కావడం, రోడ్డు మార్జిన్ పూర్తిగా పాడైపోవడంతో దుమ్ము ధూళి లేచి ఇటుగా ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోంది. రోడ్డు పక్కనే ఉండే ఇళ్లలో రోజూ దుమ్ము భారీగా చేరుతోంది. మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంతోమంది చిన్నపిల్లలకు రోగాలు వస్తున్నాయి. వెంటనే కొత్త రోడ్డు నిర్మించాలి.

– అప్పిగడ్డ లక్ష్మీనారాయణ, స్థానికుడు

ప్రయాణమంటేనే నరకం

నండూరు పెట్రోల్ బంక్ నుంచి కాజ జాతీయ రహదారి వరకు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోంది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహనాల భాగం కింద ఆనుతోంది. దీని వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయి. ఎదురుగా వాహనం వస్తుంటే మార్జిన్ దింపాలంటే భయం వేస్తోంది. ప్రభుత్వం స్పందించి వెంటనే కొత్త రోడ్డు నిర్మించాలి.

– మేకల గురవయ్య, డ్రైవర్

విద్యార్థుల్లేక మూత'బడి'oది..!

విద్యార్థులు లేక ప్రభుత్వ పాఠశాల మూతబడింది. మండల కేంద్రం పెదనందిపాడులోని ఉర్దూ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. తాత్కాలికంగా విద్యాశాఖ అధికారులు బడిని మూసేశారు. ఒక్క టీచర్‌నూ మండల విద్యాశాఖ అధికారులు వేరే పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపారు. పిల్లలను చేర్పించడంపై దృష్టి సారించకపోవడంతో ఈ దుస్థితి పట్టిందని స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొంటున్నారు.

– ప్రత్తిపాడు

క్లుప్తంగా

సెమీ క్రిస్మస్ వేడుకల్లో హైకోర్టు న్యాయమూర్తి

గుంటూరు లీగల్: జిల్లా కోర్టులో గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి రఘునందన్ రావు, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు. రెవ. సుమంత్ సుధా సందేశం ఇచ్చారు. కార్యక్రమానికి గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంగళ శెట్టి శివ సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. కోర్టు చిరు ఉద్యోగులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి శుక్రవారం భక్తులు విరాళాలు సమర్పించారు. తాడేపల్లి మండలం కొండెపాడు వెంకట విలిల్ భాస్కర్ తన కుటుంబ సభ్యులైన కె.సత్యనారాయణమ్మ, అంజయ్యల పేరిట రూ. 1,00,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు.

ఎంఎస్ఎంఈల పార్కుల ఏర్పాటు వేగవంతం

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈల పార్కులు ఏర్పాటు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక మండలి(డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పార్కులు, కామన్ ఫెసిలిటీ సెంటర్ల కోసం భూముల కేటాయింపును పరిశీలించాలని, ఏపీఐఐసీ శాఖలు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు రాష్ట్ర స్థాయిలో ఎంఓయులు జరిగిన సంస్థలు వెంటనే కార్యకలాపాలు ప్రారంభించేలా అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి మాట్లాడుతూ గత నెల రోజుల్లో 970 దరఖాస్తులు అందగా 734 దరఖాస్తులకు మంజూరు ఇచ్చామన్నారు.

పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 224

కొమ్ములు : 191 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
8,750	12,850	12,850

కాయలు : 33 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
8,750	12,850	12,850

మొత్తం అమ్మకాలు : 168 క్వింటాళ్లు

–దుగ్గిరాల

క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం

- జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ పీడీ ప్రసూన
- పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థినులకు క్రీడా పోటీలు

క్రీడా జ్యోతి వెలిగించిన ప్రసూన, నిర్మల్‌కుమార్ ప్రియ, పద్మారావు, ఉషారాణి

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయని జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ప్రసూన అన్నారు. గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో శుక్రవారం 28వ ప్రాంతీయ స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసూన మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు క్రీడలు, ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని, మేటి క్రీడాకారిణిలుగా ఎదగాలని సూచించారు. సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ వి.పద్మారావు మాట్లాడుతూ ఏటా స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామన్నారు. క్రీడా పోటీలకు ఎస్వీయూ ప్రాంతీయ ఆర్జేడీ ఎ.నిర్మల్‌కుమార్ ప్రియ కన్వీనర్‌గా వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపాల్ జాస్తి ఉషారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో విజేతలు వీరే

వాలీబాల్‌లో సెయింట్ మేరీస్ (బుడంపాడు), ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ (గుంటూరు), షాట్‌పుట్‌లో ఎం.సాయిజ్యోతి, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ (గుంటూరు), పి.దివ్యాజంలి, హిందూ ఇంజినీరింగ్ కళాశాల (గుంటూరు), లాంగ్ జంప్‌లో బి.రుచిత, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ (గుంటూరు), డి.ప్రియాంక, సెయింట్ మేరీస్ (బుడంపాడు), డిస్కత్రోలో ఎం.సాయి ఖాద్యోత, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ (గుంటూరు), వై. వైష్ణవి, సెయింట్ మేరీస్ (బుడంపాడు), చదరంగంలో టి. తన్మయ రెడ్డి, ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ (గుంటూరు), ఎస్. త్రిష రెడ్డి (బాపట్ల పాలిటెక్నిక్), టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఎస్. సుస్మిత, సెయింట్ మేరీస్ (బుడంపాడు), శ్రీ సాహితి, హిందూ ఇంజినీరింగ్ కళాశాల (గుంటూరు), డబుల్స్‌లో ఎస్.సుస్మిత, పి.భవ్య, హిందూ ఇంజినీరింగ్ కళాశాల (గుంటూరు), ఎం.నందిని, కె.షెరిష్మా సెయింట్ మేరీస్ (బుడంపాడు) విన్నర్, రన్నర్లుగా నిలిచారు.

కోల్డ్ స్టోరేజ్‌ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా సురేంద్రబాబు, రాఘవయ్య

సురేంద్రబాబు

రాఘవయ్య

కొరిటెపాడు(గుంటూరు): ది గుంటూరు జిల్లా కోల్డ్ స్టోరేజ్‌ల ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడుగా పి.సురేంద్రబాబు, కార్యదర్శిగా కేఎస్ రాఘవయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో నూతన కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎస్వీ కోల్డ్‌స్టోరేజ్‌కి చెందిన పి.సురేంద్రబాబు, కార్యదర్శిగా శ్రీ మంజునాథ కోల్డ్ స్టోరేజ్‌కి చెందిన కేఎస్ రాఘవయ్యలతో పాటు కోశాధికారిగా ఆర్.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా కె.అశోక్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా వి.వెలుగొండారెడ్డి, జుగిరాజ్ భండారి, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, టి.గోపాలరావు, మానం శ్రీనివాసరెడ్డి, బి.పేరయ్య, ఎ.సుబ్బారావు, శ్రీపాల్ భండారిలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం రెండు సంవత్సరాల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్ర బాబు, రాఘవయ్యలు మాట్లాడుతూ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉన్న టీఎస్ ప్రకాశరావు కాలం చేసిన తర్వాత నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని వెల్లడించారు. రాబోయే రెండు సంవత్సరాలు కాలంలో అసోసియేషన్ కలిసికట్టుగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ తమ వద్ద పనిచేసే వందలాదిమంది కార్మికుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: కృష్ణా పశ్చిమ డెల్టాకు 1,816 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద 12 అడుగుల నీటి మట్టం స్థిరంగా ఉంది. బ్యాంక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులు, తూర్పు కాలువకు 90, పశ్చిమ కాలువకు 44, నిజాంపట్నం కాలువకు 12, కొమ్మూరు కాలువకు 1,428 క్యూసెక్కులు విడుదల చేశారు.

నేరెళ్లవాగుపై కుంగిన చప్టా

- ముందే హెచ్చరించిన 'సాక్షి'
- పట్టించుకోని అధికారులు
- నిలిచిన వాహనాల రాకపోకలు

కుంగిపోవడంతో నిలిచిన వాహనాలు

ఫిరంగిపురం: మండల కేంద్రం ఫిరంగిపురం నుంచి సత్తెనపల్లి దారిలో అల్లంవారిపాలెం దాటిన తరువాత నేరెళ్లవాగుపై దశాబ్దాల కిందట నిర్మించిన చప్టా శుక్రవారం ఉదయం కొంత భాగం కుంగిపోయింది. దీంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. రెండు నెలల కిందట చప్టా నెర్రెలిచ్చి ఉండటం గమనించి 'ప్రమాదం మాటున ప్రయాణం' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో వార్త ప్రచురించింది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఫిరంగిపురం నుంచి అల్లంవారిపాలెం, 113.తాళ్లూరు, శిరంగిపాలెం, తక్కెళ్లపాడు, కొమెరపూడి, కంటిపూడి గ్రామాల మీదుగా సత్తెనపల్లి దగ్గరి దారి కావడంతో ఎక్కువ మంది కార్లు, లారీలు, ద్విచక్ర వాహనదారులు ఈ మార్గం నుంచి ప్రయాణిస్తుంటారు. చప్టా కుంగిపోవడంతో పూర్తిగా కార్లు, బస్సులు, లారీలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రవినాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అనిమిని రవి నాయుడు పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం 'ఆదర్శ్ 2025 – స్పోర్ట్స్ ఫర్ హార్మనీ' పేరుతో రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలను ప్రారంభించారు. క్రీడా జ్యోతిని వెలిగించి పావురాలను ఎగురవేశారు. రవినాయుడు మాట్లాడుతూ చదువు ఒక్కటే లక్ష్యంగా ఉన్న ప్రస్తుత టెక్నాలజీ యుగంలో క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి 15 క్రీడా అంశాలపై స్పోర్ట్స్‌మీట్ నిర్వహించడం అభినందనీయమన్నారు.

నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా క్రీడల్లో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న కళాశాలగా హిందూ కళాశాల పేరు పొందిందని తెలిపారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ పీఎం ప్రసాద్ , జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.అఫ్రోజ్ ఖాన్, ఏపీ శాప్ సభ్యుడు ఎస్. సంతోష్ కుమార్, కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు ఎస్వీఎస్.సోమయాజి, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, కొల్లా సుస్మితా చౌదరి, ఫిజికల్ డైరెక్టర్ కె.రవి పాల్గొన్నారు

యువతిపై లైంగిక దాడి

పొన్నూరు: ఒంటరిగా నిద్రిస్తున్న యువతిని కత్తితో బెదిరించి లైంగిక దాడికి పాల్పడిన ఘటన పట్టణంలోని వీవర్స్ కాలనీలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ వీరానాయక్ తెలిపిన వివరాలు.. మండలంలోని చింతలపూడి గ్రామానికి చెందిన నల్లమోతు వరకుమార్ పట్టణంలోని వీవర్స్ కాలనీకి చెందిన యువతిపై కన్నేశాడు. గురువారం రాత్రి యువతి నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోకి ప్రవేశించి కత్తితో గాయపరిచి లైంగిక దాడికి పాల్పడ్డాడని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం వరకుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

కెనరా బ్యాంక్ Canara Bank

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ ఎపి-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో పఠించబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన. ... 07.01.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ...

ఇ-వేలం తేది & సమయం: 07.01.2026, ఉ॥ 02.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిముషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 07.01.2026, ఉ॥ 12.00 గం॥ల లోపు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పీఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 07.01.2026, ఉ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

క్ర. నెం	ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచి వివరములు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడకు బదిలీ చేయబడినవి)	బకాయి మొత్తం	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ. లో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
1	గుంటూరు మెయిన్-1 బ్రాంచ్; మెస్సర్స్. మిట్టపల్లి అగ్రో ఎంటర్‌ప్రైజెస్, ప్రొప్రయిటర్ మహాలక్ష్మి పార్వతీస్టు; శ్రీ మిట్టపల్లి రమేష్ బాబు, తండ్రి: పాండురంగా రావు మరియు మిట్టపల్లి లక్ష్మి సుస్మిత, తండ్రి: శ్రీ మిట్టపల్లి రమేష్ బాబు	రూ. 1808.97 లక్షలు తేది 18.12.2025 నాటికి	[illegible] 1) డాక్యుమెంట్ నెం : 11866/2000, తేది 28-12-2000 – 879.77 చ.గ॥, 2) డాక్యుమెంట్ నెం : 11869/2000, తేది 28-12-2000 – 882.64 చ.గ॥, 3) డాక్యుమెంట్ నెం : 14/2001, తేది 24-12-2000 – 884.62 చ.గ॥, 4) డాక్యుమెంట్ నెం : 75/2001, తేది 24-12-2000 – 884.50 చ.గ॥, 5) డాక్యుమెంట్ నెం : 293/2001, తేది 26-12-2000 – 383.42 చ.గ॥, 6) డాక్యుమెంట్ నెం : 343/2001, తేది 27-12-2000 – 380.18 చ.గ॥, 7) డాక్యుమెంట్ నెం : 407/2001, తేది 27-12-2000 – 380.35 చ.గ॥, 8) డాక్యుమెంట్ నెం : 508/2001, తేది 29-12-2000 – 380.41 చ.గ॥, 9) డాక్యుమెంట్ నెం : 525/2001, తేది 29-12-2000 – 381.62 చ.గ॥, 10) డాక్యుమెంట్ నెం: 761/2001, తేది 30-12-2000 – 360.65 చ.గ॥, పైన తెలిపిన 10 ఐటమ్‌లు కలిపి ఒకే స్థలంగా మొత్తం విస్తీర్ణం 3818.16 చ.గ॥	రూ. 1253.00 లక్షలు	రూ. 125.30 లక్షలు

* బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది

ఆస్తి తనిఖీ తేది & సమయం: 30.12.2025, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥4.00 గం॥ల వరకు.

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో పొందుపరచిన "ఇ-వేలం" లింకును రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8331011695

బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ. 1,00,000/- గుణింపులో పెంచవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.

ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్. పీఎస్‌బి అలియన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/eauction-psb హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 16.12.2025, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

భారతీయ భాషల వినియోగాన్ని విస్తృతం చేయాలి

ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ తిరుపతిరావు

విజ్ఞాన్ వర్సిటీలో పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ తిరుపతిరావు

చేబ్రోలు: ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు భారతీయ భాషల వినియోగాన్ని మరింత విస్తృతంగా పెంచాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ బి. తిరుపతిరావు తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో 'భారతీయ భాషా పరివార్–భారతీయ భాషల అధ్యయనంలో పారడైమ్ షిఫ్ట్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. సదస్సులో ముందుగా 'భారతీయ భాషా పరివార్–ఏ న్యూ ఫ్రేమ్ వర్క్ ఇన్ లింగ్విస్టిక్స్', 'భారతీయ భాషా పరివార్–పర్‌స్పెక్షన్ అండ్ హారిజన్స్' అనే రెండు పుస్తకాలను ఆవిష్కరించారు.

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ తిరుపతి రావు మాట్లాడుతూ భారతీయ భాషలు, సాహిత్యం, తత్వశాస్త్రం కేవలం గతానికి చెందినవిగా కాకుండా, నేటి సమాజానికి, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచే శక్తిని కలిగి ఉన్నాయని స్పష్టం చేశారు.
- జాతీయ విద్యా విధానం–2020లో మాతృభాషలు, ప్రాంతీయ భాషల్లో బోధనకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా భాషా అధ్యయన రంగంలో విప్లవాత్మక మార్పు సాధ్యమవుతుందన్నారు.
- నెల్లూరులోని సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ స్టడీస్ ఇన్ క్లాసికల్ తెలుగు డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.సంపత్‌కుమార్ మాట్లాడుతూ స్థానిక భాషల్లో పరిశోధనలు జరగడం వల్ల జ్ఞానం సమాజానికి మరింత చేరువవుతుందని అన్నారు.
- కర్ణాటకలోని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బీమ్ రావ్ భోసాలే మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక భాషా సాధనాల వినియోగం ద్వారా భారతీయ భాషలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని తెలిపారు. భాషా వైవిధ్యమే భారతదేశ సాంస్కృతిక ఐక్యతకు బలమన్నారు.

కార్యక్రమంలో వైస్ చాన్సలర్ పి. నాగభూషణ్, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

బీ-ఫార్మసీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ(పెదకాకాని): బీ-ఫార్మసీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలను శుక్రవారం సీఈ ఆలపాటి శివప్రసాద్ విడుదల చేశారు. ఈ నెల 30వ తేదీలోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తులను పీజీ కోఆర్డినేటర్ కార్యాలయంలో 31వ తేదీలోగా సమర్పించాలన్నారు. ఒక్కొక్క సబ్జెక్ట్‌కు ఫీజు రూ.2070 చెల్లించాలన్నారు. పర్సనల్ వెరిఫికేషన్ కోసం రూ. 2190 చెల్లించాలని సూచించారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.42 లక్షలు స్వాహా

మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

- విశ్రాంత హెచ్ఎంను మోసగించిన ఐదుగురు అరెస్ట్
- మిగతా వారి కోసం ప్రత్యేక బృందాలతో దర్యాప్తు

నగరంపాలెం: డిజిటల్ అరెస్ట్ పేరుతో రిటైర్డ్ హెడ్‌మాస్టర్‌ను మోసగించిన ఐదుగురిని కాకుమాను పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడించారు. కాకుమాను పీఎస్ పరిధిలోని కొమ్మూరుకు చెందిన మోపర్తి మేరీ మంజులవాణి ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. రిటైర్డు కాగా వచ్చిన నగదు, నెలనెలా పెన్షన్ డబ్బులను ఆమె బ్యాంక్ ఖాతాలో దాచుకున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 23న గుర్తుతెలియని ఓ ఫోన్ నంబర్ నుంచి కాల్ చేసి ముంబాయి సీఐడీ అధికారులమని నమ్మించినట్లు చెప్పారు. మానవ అక్రమ రవాణా కేసులో ఒకర్ని అరెస్ట్ చేశామని, అందులో మీ పేరు ఉందని చెప్పి బెదిరించినట్లు పేర్కొన్నారు. డిజిటల్ అరెస్ట్‌లో ఉన్నారని, డిజిటల్ అరెస్ట్ లేకుండా ఉండేందుకు పెద్ద మొత్తంలో నగదు చెల్లించాలని ఐదు రోజులు ఆమెను తీవ్ర ఒత్తిడికి గురిచేయగా ఆమె బెదిరిపోయి బ్యాంక్ ఖాతా నుంచి రెండు సార్లుగా రూ.42 లక్షలను రెండు ఖాతాలకు బదిలీ చేసినట్లు చెప్పారు. గత నెల ఏడో తేదీన ఆమె కాకుమాను పీఎస్‌లో ఫిర్యాదు చేశాయగా ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు, కాకుమాను పీఎస్ ఎస్ఐ ఏకనాథ్ దర్యాప్తు చేపట్టారు.

రెండు బ్యాంక్ ఖాతాల్లో జమ..

రెండు బ్యాంక్ ఖాతాల్లో జమ అయిన రూ.42 లక్షల్లో రూ.22 లక్షలు గతనెల ఒకటిన విశాఖపట్నంలోని ఇంద్రప్రస్థ హాస్పిటల్ డైరెక్టర్, డాక్టర్ మరపు సురేష్‌నాయుడు ఖాతాకి జమ అయినట్లు గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ మేరకు మరపు సురేష్‌నాయుడ్ని విచారించగా ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఈ నేరానికి పాల్పడినట్లు విచారణలో అంగీకరించినట్లు చెప్పారు. అక్రమంగా డబ్బు సంపాదించాలని ఇంటర్నెట్ ద్వారా కార్పొరేట్ అకౌంట్లను మ్యూల్ అకౌంట్లుగా ఉపయోగించి కమీషన్ తీసుకునేలా వ్యవహరించినట్లు గుర్తించినట్లు చెప్పారు. దీంతో హిందూపురం వాసి లక్ష్మణ్, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వాసి మోహన్ ద్వారా కాకినాడకు చెందిన సింహదాడి సాయి శ్రీనివాస్, కారే స్టీవెన్‌లను పరిచయం చేసుకున్నారని అన్నారు. వీరి ద్వారా ఆగ్రాకు చెందిన మోహిత్ శిఖర్వార్(టేకి) అనే వ్యక్తితో మాట్లాడి, ఈ అక్రమ లావాదేవీలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. అనంతరం ఇండోర్, జైపూర్ వెళ్లి, కార్పొరేట్ అకౌంట్‌కు డిజిటల్ అరెస్ట్ ద్వారా వచ్చిన నగదును వేర్వేరు ఖాతాలకు బదిలీ చేశారని చెప్పారు. దీంతో సురేష్‌నాయుడు, పార్వతీపురం జిల్లాకు చెందిన సింహదాడి సాయిశ్రీనివాస్, ఉత్తరప్రదేశ్ ఆగ్రాకు చెందిన మోహిత్ శిఖర్వార్, అనకాపల్లి జిల్లాకు చెందిన కారే స్టీవెన్, శ్రీపొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లాకు చెందిన పొదల మోహన్ అరెస్ట్ చేశారని వివరించారు. వారి నుంచి మూడు స్మార్ట్‌ఫోన్లు, రూ.50 వేలు, ఇంద్రప్రస్థ కార్పొరేట్ అకౌంట్ కిట్‌ను సీజ్ చేసుకున్నట్లు వెల్లడించారు. కంబోడియా దేశానికి చెందిన ఫోన్ నంబర్లుగా గుర్తించామని అన్నారు. అక్కడ్నుంచి ఇటువంటి సైబర్ నేరాలు నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. కేసులో మిగతా వారిని అరెస్ట్ చేస్తామని అన్నారు. దక్షిణ డీఎస్పీ భానోదయ, ప్రత్తిపాడు పీఎస్ సీఐ శ్రీనివాసరావు, ఐటీ కోర్ సీఐ నిస్సార్‌బాషా, కాకుమాను పీఎస్ ఎస్ఐ ఏకనాథ్, హెచ్‌సీలు జె.జె.నరసింహారావు, కె.చిరంజీవి, రాజాకిశోర్, కానిస్టేబుళ్లు ఎం.అశోక్, జి.ఖజాకరీమా, రాము, ఎస్‌కె.ఇమామ్, యాసిన్, ఉపేంద్ర సాయిని అభినందించి, ప్రశంసపత్రాలను అందించారు.

ఉపాధ్యాయుల్లో సాంకేతిక నైపుణ్యాలు బలోపేతం

ప్రత్తిపాడు: ఉపాధ్యాయుల్లో సాంకేతిక నైపుణ్యాలను మరింత బలోపేతం చేసేందుకు బూట్ క్యాంప్ దోహదపడుతుందని గుంటూరు జిల్లా డీఈవో షేక్ సలీం అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ), కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఏఐసీటీఈ, ఎంవోఈ ఇన్నోవేషన్ సెల్, ఎస్‌సీఈఆర్టీ, స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్, వాద్వానీ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఇన్నోవేషన్, డిజైన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ (ఐడీఈ) పై మూడు రోజుల పాటు నిర్వహించిన బూట్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది.

- ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ప్రారంభించిన ఈ బూట్ క్యాంప్ ఎంతో విలువైనదన్నారు. సాంకేతికంగా రోజురోజుకు పెను మార్పులు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులు తమను తాము మెరుగు పరుచుని సాంకేతికంగా దృఢం అయ్యేందుకు క్యాంప్ ఉపకరిస్తుందన్నారు.
- కిట్స్ కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ క్యాంపస్‌లో అవిఘ్నంగా బూట్ క్యాంప్ జరిగిందన్నారు. తమ కళాశాలను నోడల్ సెంటర్‌గా ఎంపిక చేసిన ఏఐసీటీఈ, భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
- కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో నవీనత, డిజైన్ థింకింగ్, పారిశ్రామిక నైపుణ్యాలను పెంచేందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్‌తో కలిసి జాతీయ స్థాయిలో ఐడిఇ బూట్ క్యాంప్‌ను నిర్వహించిందన్నారు.

కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కె. శేఖర్, డైరెక్టర్ కె. హరిబాబు, అరుణ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

- జిల్లా కేంద్రం నరసరావుపేటలో బైపాస్ రోడ్డుకు దగ్గరగా అతి తక్కువ ధరకు ఇంటి స్థలాలు లభించును. వివరాలకు: 73869 48543

SERVICES

CHANGE OF NAME

- I, SHAIK KARIMULLAH S/o Abdul Shukoor Resident of D.No:15-10-28, VinobaNagar, 1st Line, Old Guntur, Nandivelugu Road, Guntur, Guntur Dist. 522001 AP, I have changed my name from SHAIK KARIMULLA (Old Name) to SHAIK KARIMULLAH (New Name) for all purposes
- I, Raghavamma Velisala (Old Name) W/o Chattu Siva Nageswara Rao. Resident of Dr. No13-8-47 Guntur Vari Thota 7th Line, Guntur City, Guntur Dist. Pin 522 001, AP. I Have changed my name as Lakshmi Chattu (New Name) W/o Chattu Siva Nageswara Rao, Hereafter my name is known as Lakshmi Chattu (New Name) W/o Chattu Siva Nageswara Rao.

GOLD FINANCE

- బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071
- బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. ✆ 87907 41166

WANTED

- గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ క్యాంపస్ హాస్టల్ A.Oగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/-నుండి18000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములు కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 92487 33320
- గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు సీనియర్ కన్‌స్ట్రక్షన్ సైట్ ఇన్‌ఛార్జ్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతం: 50,000 నుండి 60,000 వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: సివిల్ డిప్లొమా మరియు సివిల్ ఇంజనీరింగ్, వయస్సు: 30సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8978480429
- గుంటూరు, మంగళగిరి, సత్తెనపల్లి, లాం, గుజ్జనగుండ్ల ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & గుంటూరు ఆఫీసులో DTP ఆపరేటర్ కావలెను. సం॥ 9866618811, 9866618877
- గుంటూరు మెయిన్‌రోడ్డు లక్ష్మీపురం నందు ట్రాన్స్ మీడియా టెక్నాలజీస్(ఏ.పి) ప్రై॥లి॥ కంపెనీలో పనిచేయుటకు టెక్నీషియన్స్ (M) కావలెను. 9059812327, 9603433369
- అకౌంటెంట్ కమ్ ఆఫీసు అసిస్టెంట్ కావలెను. బీకాం, ఏంకాం॥లు కంప్యూటర్ అకౌంట్స్‌పై అనుభవం, తెలుగు, ఇంగ్లీష్ భాషలపై పరిజ్ఞానం, రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.
- పెదకాకాని, నంబూరు, గుంటూరు ఆటోనగర్‌లలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12గం. జీతం: 12-13 వేలు, వ: 50సం, సంప్ర॥ 9676107661
- ప్రముఖ కార్పొరేట్ ఆఫీస్‌లో వర్క్ ఫ్రమ్ హోం పని చేయుటకు మేనేజర్స్, అసిస్టెంట్ మేనేజర్స్, ఆఫీస్ ఇంచార్జి, AGM, DJM, CJM కావలెను. జీతం 20-30 వేలు. 9573411570
- Wanted Accountants to Work in Audit Office having Knowledge in Tally, GST Contact Numbers: 89780 21054
- గుంటూరుసిటీ ప్రముఖ హోటల్ నందు హౌస్‌కీపింగ్ స్టాఫ్, రూమ్ బాయ్స్ కావలెను. (హోటల్ మేనేజ్మెంట్ వారికి ప్రాధాన్యత) 8185826270, 8247814976
- గుంటూరు బ్రాడిపేటలో కొత్తగా పెడుతున్న గోల్డ్ పర్చేస్ కంపెనీ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన గోల్డ్ అప్రైజర్స్ కావలెను. సంప్రదించండి. సెల్: 89777 58477.
- శాంతి ఎంటర్‌ప్రైజెస్‌లో టెలికాలర్ & డేటా ఆపరేటర్ వర్క్ చేయుటకు యువతీ యువకులు కావలెను. అర్హత:10thపైన వీక్లీ పేమెంట్, వర్క్ ఫ్రం హోం కలదు. 9063910978.

ఈ పత్రికలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించి పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

లబ్ధిదారుకు ఆటో అందజేత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పీ4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబానికి అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ కంపెనీ రూ. 3.30 లక్షల విలువైన ఎలక్ట్రిక్ ఆటోను సమకూర్చింది. మార్గదర్శులతో కలిసి కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లో శుక్రవారం తాపీమేస్త్రి పరిధిలోని సీతానగరానికి చెందిన లబ్ధిదారు పవన్‌కుమార్ కుటుంబానికి ఆటో తాళాలు అందజేశారు. గతంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చొరవ చూపి అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ (జగ్గయ్యపేట) సహకారంతో ఆటోను అందజేశారు. అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్, బాలాజీ సిమెంట్ వర్క్స్ యూనిట్ హెడ్ శివరాజ్ వరదరాజన్, యూనిట్ హెచ్ఆర్ హెడ్ జి.మోహన్ రావు, బ్రిజన్ హెడ్ డి.జయదేవ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

మంగళగిరి టౌన్: ఆర్టీసీ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సూచించారు. మంగళగిరి పట్టణం ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి స్వెట్టర్లు, చీరలు, యాప్రాన్లు, బ్లాంకెట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సురేష్‌రెడ్డి పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. కార్మికులందరూ కుటుంబంగా కలిసి పనిచేయాలని సూచించారు. డిపోలో అత్యధిక ఈపీకే, కేఎంపీఎల్ సాధించిన పలువురు సిబ్బంది, ప్రత్యేక ప్రతిభ కనబరిచిన గ్యారేజ్ సిబ్బందిని సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిపోమేనేజర్ రెంటపాళ్ల పిచ్చయ్య, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆభా ఖాతాల రూపకల్పనలో ఏపీ టాప్

మంగళగిరి టౌన్: ఆభా(ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) ఖాతాల సృష్టించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో ఉందని తెలియజేసేందుకు ఆనందంగా ఉందని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారి చక్రధర్ బాబు వెల్లడించారు. నగరంలోని హాయ్‌లాండ్‌లో శుక్రవారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ బెంగళూరు, ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యం, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ సమక్షంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ అంశాలపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో 4.84 కోట్ల మందికి ఆభా ఖాతాలు రూపొందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సమన్వయ అధికారి వి.వి.రావు, రీసెర్చ్ డైరెక్టర్ ఉషా మంజునాథ్, రీసెర్చ్ సలహాదారులు డాక్టర్ సీఎస్ కేదర్, కన్సల్టెంట్ డాక్టర్ వినయ్, శ్రీహరి తదితర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

చర్చికి రూ. 14 లక్షల గ్రానైట్ అందజేత

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం ఆత్మకూరులో నూతనంగా నిర్మిస్తున్న క్రీస్తు కరుణాలయం ఏఈఎల్‌సీ చర్చికి మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో గ్రానైట్ అందజేశారు. చర్చి ఫ్లోరింగ్‌కు అవసరమైన రూ.14 లక్షల విలువ చేసే గ్రానైట్‌ను తన సొంత నిధులతో కొనుగోలు చేయించి శుక్రవారం స్థానిక నాయకుల ద్వారా నిర్వాహకులకు అందజేయించారు. ఈ మేరకు నిర్వాహకులు, సంఘ పెద్దలు, చర్చి నిర్మాణ కమిటీ సభ్యులు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

కేంద్రం తీరుపై కన్నెర్ర!

మేడికొండూరు: కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకంలో తీసుకువచ్చిన నూతన మార్పులు కూలీల పొట్టగొట్టేలా ఉన్నాయని ఆరోపిస్తూ మేడికొండూరు మండలం ఎర్రపాడు గ్రామంలో నిరసన చేపట్టారు. కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలను వ్యతిరేకిస్తూ బిల్లు ప్రతులను గ్రామస్తులు, నాయకులు దహనం చేశారు. జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షుడు బొట్ల రామకృష్ణ కేంద్రం తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎస్కే ఇమామ్, పంకలూరు సుభాని, కరిముల్లా, అన్వర్ బాషా, ఎస్కే పెద్దకాశా, బీద, కంషావ్ బేగం పాల్గొన్నారు.

భూస్వాముల ఒత్తిడితోనే ఉపాధి హామీ సవరణలు

మంగళగిరి టౌన్: భూస్వాముల ఒత్తిడితోనే ఉపాధి హామీ సవరణలు చేస్తున్నారని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరి పట్టణం, పాత కూరగాయల మార్కెట్ వద్ద గల గాంధీ విగ్రహం వద్ద మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సవరణలకు వ్యతిరేకంగా సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాజధాని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు మాట్లాడుతూ.. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు మేలుకలిగే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అనంతరం పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు ప్రతులను దహనం చేశారు.

విరుచుకుపడుతున్న ప్లాస్టిక్ భూతం!

- ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం కరువు
- నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు

క్రిస్టియన్ శ్మశానవాటిక పక్కన తగలబెడుతున్న చెత్త, వెలువడుతున్న పొగ

దుగ్గిరాల: దుగ్గిరాల మండలంలోని అన్ని గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా జరుగుతుంది. అయినప్పటికీ అధికారుల నుంచి వ్యాపార దుకాణాలు, చిరు హోటళ్లు, కూరగాయల వ్యాపారులపై ఎక్కడా తనిఖీలు జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి మూడో శనివారం ప్రచారం భారీగా జరుగుతున్నా ఆచరణ మాత్రం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. ప్రజల్లో మార్పు సైతం రావడంలేదు.

కాలువల్లోకి వ్యర్థాలు..

దుగ్గిరాల ముర్తుజానగర్ దగ్గర చెత్తను తొలగించకుండా కొన్ని రోజులు పాటు అలానే ఉంచడం ద్వారా ఆ వ్యర్థాలు కాలువలోకి క్రమేణా జారుతున్నాయి. ఫలితంగా కాలువలోని నీరు దుర్వాసన వస్తోంది. చుట్టుపక్కల ప్రజలు చెత్త బుట్టలను వినియోగించడం మానేసి చెత్తను కాలువ గట్టుపై పడేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా విచ్చలవిడిగా పారేస్తున్న చెత్త అటు వాతావరణం, ఇటు ప్రజారోగ్యంపై విరుచుకుపడుతుంది. దుగ్గిరాల బాలిక, బాలుర పాఠశాల వెనుక గల డంపింగ్ కేంద్రం వద్ద చెత్తను సేకరించిన అనంతరం ఎటువంటి ప్రణాళికా లేకుండా అన్నీ కలిపి తగలబెడుతున్నారు. రోజూ వాటి నుంచి వెలువడే దట్టమైన పొగ ప్రాణానికే ముప్పుగా మారనుంది.

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు..

వ్యర్థాలను తగలబెడుతున్న సందర్భాల్లో చెత్తలో బ్యాటరీలు, కొన్ని బల్బులు ఉంటున్నాయి. అవి మంటతగిలిన సందర్భాల్లో ఒక్కసారిగా పేలడంతో శబ్దాలు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం తడి చెత్త నుంచి అన్నం మెతుకులు, కుళ్లిన పండ్లు, ఆకు.. కూరగాయలను సేకరించాలి. పొడి చెత్త నుంచి పేపర్లు, వాటర్ బాటిళ్లు, చెక్కలు సేరించాలి. ప్రమాదకర చెత్త నుంచి న్యాప్కిన్స్, గౌజులు, కాటన్, సిరంజీలు సేకరించాలి. వీటి మొత్తం పద్ధతి, ప్రణాళికా విధానం పరంగా వాటిని గుర్తించి రికార్డు చేసి వాటిని మరలా పలు విధాలుగా ప్రాసెస్ చేయాలి. కాగా క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియ మొత్తం జరుగుతుందా అనేది ప్రశ్నార్థకం. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర పేరుతో అధికారులు ప్లాస్టిక్ వినియోగంపై ప్రచారం కల్పిస్తున్నప్పటికీ ఆశించిన మేర ఫలితాలు కనిపించడంలేదు. దీంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పలు గ్రామాల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

ముర్తుజానగర్ వద్ద కాలువలోకి జారుతున్న చెత్త

దుగ్గిరాలలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

రక్తదాన, అన్నదాన కార్యక్రమాలు రేపు

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న వనమా బాల వజ్రబాబు

తాడికొండ: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు తాడికొండ నియోజకవర్గంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రక్తదాన, అన్నదాన కార్యక్రమాల నిర్వహణకు గానూ చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం పార్టీ తాడికొండ నియోజకవర్గ అధ్యక్షులు వనమా బాల వజ్రబాబు పర్యవేక్షించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్‌తో కలిసి రక్తదాన నిర్వహణకు బెడ్‌ల ఏర్పాట్లు, షామియానా, అన్నదాన నిర్వహణ ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో తాడికొండ మండల పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల మనోహర్ వివిధ విభాగాల నాయకులు బాకి వెంకటస్వామి, షేక్ అజీస్, దమ్మాటి మోహనరావు, ధూళిపాళ్ల నాగేశ్వరరావు, చుండు వెంకటరెడ్డి, లోకేష్ రెడ్డి, సాంబిరెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న జన్మదిన వేడుకలు నేడు..

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని నిర్మల్ హృదయ్ సేవాసంస్థలో శనివారం సాయంత్రం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు, సెమీక్రిస్మస్ కేక్‌కటింగ్, అన్నదానం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమ్మారెడ్డి, చిన్నప్పరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మలు మాట్లాడారు. పార్టీ సమన్వయకర్త వనమా ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో అన్ని గ్రామాల్లో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తక్కెళ్లపాడు గ్రామంలో ఆదివారం సాయంత్రం తక్కెళ్లపాడు వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో జగనన్న జన్మదిన వేడుకలు నిర్వహిస్తామని పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, వైస్ ఎంపీపీ ఎం.విజయలక్ష్మీలు తెలిపారు.

నెల్లూరు పారిశుద్ధ్య కార్మికులపై దాడి హేయం

ఉండవల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: నెల్లూరులో కార్మిక సిబ్బంది శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే పోలీసులు వారిపై లాఠీచార్జి చేసిన ఘటనపై ఉండవల్లి, పెనుమాకలో కార్పొరేషన్ కార్మికులు, కార్మిక సంఘ నాయకులు శుక్రవారం తీవ్రంగా ఖండించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాజధాని ప్రాంత కమిటీ గౌరవ అధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ.. నెల్లూరులో కార్మికుల పట్ల పోలీసుల దమనకాండ, మహిళా కార్మికుల పట్ల పోలీసుల అమానుష ప్రవర్తన దుర్మార్గమని మండిపడ్డారు. కార్మికుల రిటైర్‌మెంట్‌ను అందరి ప్రభుత్వ ఉద్యోగులులానే 62 ఏళ్ల వరకూ కొనసాగించాలని, లేని పక్షంలో డిగ్రీలు చదివి ఖాళీగా ఉన్న తమ పిల్లలకు పని కల్పించాలని అడగడం నేరమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టి.బక్కిరెడ్డి, వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఆర్.వి.రాఘవయ్య, సైకం వెంకట నారాయణ, కె.రామకృష్ణ, పార్థసారథి, గాంధీ, మేరి, శ్రావణి, వేణు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి ఇరువైపులా చెట్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

ఫిరంగిపురం: గుంటూరు–కర్నూలు రాష్ట్ర రహదారికి ఇరువైపులా ఏడు అడుగుల ఎత్తులో రేగిచెట్లు, పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారంటూ సాక్షి దినపత్రికలో ఇటీవల కథనం ప్రచురితమైంది. దీనిపై సంబంధిత శాఖాధికారులు స్పందించారు. పొనుగుపాడు శివారు నుంచి అమీనాబాద్ గ్రామ శివారు వరకూ రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు, పిచ్చిమొక్కలను మిషన్‌ల ద్వారా శుక్రవారం తొలగించారు. వారు రోజుల పాటు పిచ్చి చెట్ల తొలగింపు కార్యక్రమం కొనసాగుతుందని కార్మికులు తెలిపారు.

జగన్ పాలన కోరుకుంటున్న మహిళలు, ప్రజలు

– ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త దొంతిరెడ్డి

మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త దొంతిరెడ్డి

మంగళగిరి టౌన్: బాబు పాలనలో రాష్ట్రం కుంటుపడిందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిలు విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయంలో ముందస్తు వేడుకలను మహిళల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి ముందస్తు శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ మురుగుడు, వేమారెడ్డి మాట్లాడుతూ.. జగన్ పాలనలో మహిళలకు స్వర్ణయుగమని గుర్తుచేశారు. మంగళగిరి నియోజకవర్గ మహిళా విభాగ అధ్యక్షురాలు ఫిలోమినా, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, రాష్ట్ర మహిళా విభాగ జాయింట్ సెక్రటరీ షాలిని మాట్లాడుతూ.. జగనన్న పాలన కోసం ఆయనను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకునే వరకూ ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ, మండల అధ్యక్షురాలు నాగ స్రవంతి, మంగళగిరి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాణిప్రియ, నియోజకవర్గ ఐటీ విభాగ అధ్యక్షురాలు గౌతమి, దుగ్గిరాల మండల మహిళా విభాగ అధ్యక్షురాలు సంసోనమ్మ, మంగళగిరి పట్టణ కమిటీ కార్యదర్శి తుమ్మా పద్మ, పట్టణ మహిళా విభాగ సభ్యులు నిర్మల, మండల మహిళా విభాగ ఉపాధ్యాయులు అనిత, పలువురు మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

దుగ్గిరాల: విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని.. విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారని దుగ్గిరాల బాలుర పాఠశాల హెచ్‌ఎం జయరత్న రాణి అన్నారు. శుక్రవారం బాలుర పాఠశాల వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె విద్యార్థుల ప్రతిభను ఉద్దేశించి మాట్లాడారు. మండలంలోని పేరుకలపూడి, దుగ్గిరాల బాలికల, బాలుర, పాఠశాలలు, పెదకొండూరు, పెనుమూలి, రేవేంద్రపాడు విద్యార్థులు మొత్తంగా 47 ప్రదర్శనలు నిర్వహించారని పేర్కొన్నారు. మండలస్థాయిలో జరిగిన ఈ ప్రదర్శనలలో నలుగురు జడ్జిల ద్వారా ఏడు ఉత్తమ ప్రదర్శన ఎంపిక చేశామని.. మండలస్థాయిలో గెలుపొందిన వారికి జిల్లాస్థాయి ప్రదర్శనకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్: తాడేపల్లిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తాడేపల్లి బైపాస్ ప్రాంతంలోని క్రిస్టియన్‌పేట, ప్రణవ్ హోండా షోరూం రోడ్, ఎస్‌బీఐ రోడ్డు, నీలిమ నర్సరీ రోడ్, అరవింద స్కూల్, కీర్తి ఎస్టేట్, డీమార్ట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులకు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

తాడికొండ: గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఫిరంగిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎం.అనురాధ అన్నారు. తాడికొండ మండలం, రావెల గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్–క్రాఫ్, ఫిరంగిపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాలలపై హింస–వేధింపులు నివారణలో బాలల పాత్రపై బాలల సంబంధిత కమిటీ సభ్యులతో చర్చాగోష్ఠి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఎం.అనురాధ మాట్లాడుతూ.. బాలలపై జరుగుతున్న శారీరక, మానసిక, లైంగిక హింస వేధింపులు, వివక్షత అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మ, క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ జి.వెంకట్, లాం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీతారావమ్మ, హెల్త్ కమ్యూనిటీ ఆఫీసర్ ఎం.లత, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి బి.అనురాధ, సచివాలయం ఎడ్యుకేషన్ అండ్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు అంగన్‌వాడీ వర్కర్స్, క్రాఫ్ సిబ్బంది జయరాజు, బ్యూలా, బాలికలు పాల్గొన్నారు.

కార్మికులపై పోలీసుల దౌర్జన్యం దారుణం

ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

మంగళగిరి టౌన్: నెల్లూరులో పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సమయంలో పోలీసులు కార్మికులపై లాఠీచార్జి చేయడం అన్యాయమని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం గేటు ఎదుట నెల్లూరు ఘటనను ఖండిస్తూ శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల్లూరులో కార్పొరేషన్‌లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు 14 రోజుల పాటు సమ్మె చేశారని అన్నారు. ఇచ్చిన ఒప్పందాలను అమలు చేయాలని కోరుతూ ఆందోళన చేస్తున్న కార్మికులు, మహిళలపై పోలీసులు లాఠీచార్జి చేయడం దారుణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు వీవీ జవహర్‌లాల్, ఎం.బాలాజీ, జేవీ రాఘవులు, యూనియన్ నాయకులు శివనాగేశ్వరరావు, వెంకటేశ్వరమ్మ, వెంగమ్మ, డీవైఎఫ్ఐ నాయకులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

మంగళగిరి టౌన్: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సమష్టి కృషితో విజయవంతం చేయాలని గుంటూరు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం పల్స్‌పోలియో కార్యక్రమానికి సంబంధించి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆదివారం పోలియో చుక్కలు వేసే కార్యక్రమానికి సంబంధించి సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా గుంటూరు జిల్లాలో 2.15 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యమని తెలిపారు. ఎంటీఎంసీ పరిధిలో 30 వేల మంది చిన్నారులు ఉన్నారని.. వీరికి 128 బూత్‌లు, 22 మొబైల్ టీమ్స్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. సమావేశంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుభవాలే అరుదైన పాఠాలు

ప్రముఖ సాహితీవేత్త శీలా సుభద్రాదేవి

సుభద్రాదేవిని సత్కరిస్తున్న ముమ్వా ట్రస్టు పెద్దలు

తాడికొండ: జీవన సమరంలో ఎన్నో అనుభవాలు గడించిన పెద్దల నుంచి విలువైన పాఠాలు నేర్చుకోవచ్చని ప్రముఖ సాహితీవేత్త శీలా సుభద్రాదేవి అన్నారు. తుళ్లూరు మండలం పెదపరిమిలో ముమ్వా చినబాపిరెడ్డి వృద్ధాలయంలోని పెద్దల సమక్షంలో సుభద్రాదేవి తన 76వ పుట్టినరోజు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజూ తేలికైన వ్యాయామం చేయడం ద్వారా మనసును ఉల్లాసంగా ఉంచుకోవచ్చని తెలిపారు. వృద్ధుల జీవితంలో ఆరోగ్యం, ఆనందం అందించేలా వృద్ధాలయం నిర్మాణం చేశారని మేనేజింగ్ ట్రస్టీ ఎమ్వీ రామిరెడ్డిని అభినందించారు. తన రచనల ద్వారా తెలుగు సాహిత్యాభిమానుల ఆదరాభిమానాలను పొందిన సాహితీవేత్తగా సుభద్రాదేవిని రామిరెడ్డి ప్రశంసించారు. అనంతరం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మున్నంగి శ్రీనివాసరెడ్డి, ట్రస్టీలు వంగా సాంబిరెడ్డి, సీనియర్ సిటిజన్లు సుభద్రాదేవిని సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

అమరావతి పెట్టుబడులకు మలేషియా కంపెనీలు

మలేషియా బృందంతో సమావేశమైన సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ భార్గవ్‌తేజ

తాడికొండ: రాజధాని అమరావతిలో పర్యటించేందుకు మలేషియా బృందం అమరావతికి చేరుకుంది. బృందంలోని సభ్యులైన మలేషియాలోని క్లాంగ్ నియోజకవర్గ పార్లమెంట్ సభ్యులు, మలేషియా–ఆంధ్రా బిజినెస్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్–ప్రెసిడెంట్ వైబి తువాన్ గణపతిరావు వీరమన్, మలేషియాలో ప్రముఖ సంస్థ అయిన ‘దయా మధు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(ఆసియా)–డీఎంఐఏ గ్రూప్ ‘ఫౌండర్–గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.సుబ్రహ్మణ్యం పిళ్లై శుక్రవారం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ అమిలినేని భార్గవ్‌తేజ, సీఆర్డీఏ ఆఫీస్ మేనేజ్‌మెంట్ విభాగ డైరెక్టర్ వల్లభనేని శ్రీనివాసరావు, కమ్యూనికేషన్స్ విభాగ జాయింట్ డైరెక్టర్ జి.రామరాజు, డిప్యూటీ డైరెక్టర్–దక్షిణాసియా ఇన్వెస్ట్‌మెంట్ ఇన్‌చార్జ్ ఎం.సిద్ధార్థ వర్మ మలేషియా ప్రతినిధులకు స్వాగతం పలికారు. భార్గవ్‌తేజ మలేషియా బృందంతో సమావేశమై రాజధాని అమరావతి నిర్మాణ పురోగతి గురించి వివరించారు.

ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొన్న లారీ

తాడేపల్లి రూరల్: 16వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. విజయవాడ నుంచి గుంటూరు డిపోకు ఆర్టీసీ బస్సు జాతీయ రహదారిపై వెళుతుంది. ఈ క్రమంలో కొలనుకొండ శ్రీకృష్ణ మందిరం సమీపంలో ఆర్టీసీ బస్సుకు ఎదురుగా ఒక వాహనం అడ్డురావడంతో బస్సు డ్రైవర్ ఉన్నపలంగా బ్రేక్ వేశారు. దీంతో వెనుకగా వస్తున్న కంటైనర్ లారీ ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ అప్రమత్తమై బస్సును అదుపు చేయడంతో పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఘటనలో ఇద్దరు డ్రైవర్లు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుని మరల ఆ ఫిర్యాదులు వాపస్ తీసుకుని వెళ్లిపోయారు.

యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు

తాడికొండ: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీసీఆర్డీఏ), అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీతో కలిసి రాజధాని ప్రాంత యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించామని సీఆర్డీఏ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధి అవకాశాలను పెంచే పలు నైపుణ్యాలను ఉచితంగా అందించేందుకు సీఆర్డీఏ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కృషి చేస్తోందన్నారు. పూర్తి వివరాలకు 98484 24207(వాట్సాప్), 83742 34588 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఆలయాలు తొలగించకుండా రోడ్లు వేయాలి

తాడికొండ: పురాతన ఆలయాలు తొలగించకుండా రోడ్లు వేసేలా చూడాలని మందడం గ్రామస్తులు అభిప్రాయాన్ని వెల్లడించారు. శుక్రవారం ఈ–8 రహదారి బాధిత రైతులతో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, సీఆర్డీఏ అధికారులు సమావేశమై అభిప్రాయాలను సేకరించారు.

ఒరిజినల్ డాక్యుమెంట్, లింకు డాక్యుమెంట్స్ పోయినవి

నా క్లయింట్ వెంపరాల భూలక్ష్మి, భర్త శ్యాం ప్రసాద్, పల్నాడు జిల్లా, రొంపిచెర్ల మండలం, తుంగపాడు గ్రామం నందు సర్వే నెం 48–స లో ఉ.గ 242 ఉ.లో ఆర్.సి.సి. భాగా ఇల్లు దస్తావేజు సదరు డాక్యుమెంట్ నెం. 14992/2016, ది.19–10–2016 వ SRO నరసరావుపేట నందు రిజిస్టర్ అయినది. సదరు స్థలంకి గల ఒరిజినల్ డాక్యుమెంట్ మరియు లింకు డాక్యుమెంట్స్ ఒరిజినల్స్ ది.02 12 2025 వ [illegible] మంగళగిరిలో గల నా క్లయింట్ ఇంటికి ఆటోలో వెళ్తున్నప్పుడు సదరు డాక్యుమెంట్ మరియు లింకు డాక్యుమెంట్స్ ఒరిజినల్స్ మొత్తంగా మూడు పోయినవి. సదరు డాక్యుమెంట్స్ కోసం ఎంత వెతికినను దొరకలేదు.

సదరు డాక్యుమెంట్ 1)14992/2016, ది.19–10–2016 మరియు సదరు డాక్యుమెంట్ కి సంబంధించిన లింకు డాక్యుమెంట్ ఒరిజినల్స్ వివరాలు 2) 4767/2013, ది.16 04 2013 వ SRO నరసరావుపేట, 3) 7511/2010, ది.22–05–2010వ SRO నరసరావుపేట నందు రిజిస్టర్ అయినవి.

బుల్లా చందు, బుల్లా రమేష్ బాబు
అడ్వకేట్స్ & నోటరీ, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్
మంగళగిరి, గుంటూరు జిల్లా.
సెల్: 98940 76578

ఉచితంగా మోడల్ పేపర్స్ పంపిణీ

కార్యక్రమంలో మాట్లాడుతున్న తిలక్ బాబు

మేడికొండూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాల, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ సంయుక్తంగా కార్యక్రమాన్ని చేపట్టారు. మేడికొండూరు, పేరేచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులకు నిపుణులైన అధ్యాపకులు రూపొందించిన మోడల్ ప్రశ్నపత్రాలు, జవాబులతో కూడిన మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతతతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని వివరించారు. ఈ మోడల్ పేపర్స్ విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి, మంచి మార్కులు సాధించడానికి దోహదపడతాయని ఎంఈవో వి.నాగేశ్వరరావు తెలిపారు. పాలిటెక్నిక్ చేయాలనుకునే విద్యార్థులకు ఈ ఏడాది తమ కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని ఎన్ఆర్ఐ కాలేజీ అడ్మిన్ మేనేజర్ బండారు సీతారామయ్య ప్రకటించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గుంటుపల్లి రఘునాథ్, సెక్రటరీ గోనుగుంట్ల వెంకట్, మేడికొండూరు జెడ్పీ హెచ్‌ఎం జయప్రద, పేరేచర్ల హెచ్‌ఎం రంగరాజు, అధ్యాపకులు కొండవీటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మంగళగిరి టౌన్: ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడపాలని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మంగళగిరి రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం హెచ్చరించారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు, నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ సూచనల మేరకు చినకాకాని ఎన్ఆర్ఐ వై జంక్షన్, ఆత్మకూరు జంక్షన్‌ల వద్ద శుక్రవారం వాహనాల తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బ్రహ్మం మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు నిబంధన మేరకు ప్రయాణికులను ఎక్కించుకుని సురక్షితమైన ప్రయాణం సాగించాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. తల్లిదండ్రులు మైనర్‌లకు వాహనాలు ఇచ్చే ముందు ఒక్క క్షణం ఆలోచించాలని కోరారు. నిబంధనలు పాటించని 30 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐలు సీహెచ్ వెంకట్, చిరంజీవి, బాలూ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బకాయిలు చెల్లించకపోతే ఆమరణ దీక్షలు

ప్రభుత్వానికి ఆర్‌ఎస్‌యూ హెచ్చరిక

సాక్షి, అమరావతి: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించకపోతే ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని రివల్యూషనరీ విద్యార్థి సంఘం(ఆర్‌ఎస్‌యూ) ప్రభుత్వాన్ని హెచ్చరించింది. విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా.. ఫీజు బకాయిలు విడుదల చేయాలనే డిమాండ్‌తో శుక్రవారం విజయవాడలోని ధర్నాచౌక్‌లో ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.7800 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులను వేధించడంతో విద్యార్థుల భవిష్యత్తు గందరగోళంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, సహాయ కార్యదర్శి శాంతి, నరేందర్ రెడ్డితో పాటు వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

వాతావరణ సమస్యలకు బయో ఆవిష్కరణలతో పరిష్కారం

సాక్షి, అమరావతి: వాతావరణ మార్పులతో ఎదురయ్యే సమస్యలకు ప్రకృతి ఆధారిత బయో ఆవిష్కరణలే స్థిరమైన పరిష్కారమని బెంగళూరులోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ ప్లాట్‌ఫామ్స్ (సీ – క్యాంప్) సంచాలకులు డాక్టర్ తస్లీమారిఫ్ సయ్యద్ అన్నారు. ఈ ఆవిష్కరణలతో వ్యవసాయం, పర్యావరణం, ప్రజారోగ్యాన్ని ఏకకాలంలో మెరుగు పరచవచ్చని స్పష్టం చేశారు. ఏపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం 'వాతావరణ మార్పు – పర్యావరణం, ఆరోగ్యం, వ్యవసాయంపై బయో ఆధారిత ఆవిష్కరణల ప్రభావం' అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో తస్లీమారిఫ్ సయ్యద్ మాట్లాడారు. వాతావరణ మార్పులతో ఆహార భద్రతే కాకుండా, నీటి వనరులు, మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం ఉంటోందన్నారు. కార్యక్రమంలో మాలక్ష్మి గ్రూప్ వ్యవస్థాపకులు యార్లగడ్డ హరిశ్చంద్ర ప్రసాద్, ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్క్రిప్ట్ ప్రకారం 'హలో లోకేశ్'

విద్యార్థులకు ముందే ప్రశ్నలిచ్చి ప్రిపరేషన్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో శుక్రవారం మంత్రి లోకేశ్ పర్యటన అంతా ఓ స్క్రిప్ట్ ప్రకారం సాగింది. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో దాతల సహకారంతో రూ.6.49 కోట్లతో నిర్మించిన పలు భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. అనంతరం 'హలో లోకేశ్' పేరిట విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ముందుగానే ఎంపిక చేసిన విద్యార్థులు ఏ ప్రశ్న అడగాలో, ఎక్కడ కూర్చోవాలో కూడా నిర్దేశించారు. ప్రశ్నలు అడుగుతామని ఇతర విద్యార్థులు లేచి నిలుచున్నా.. వారిని కాదని ముందే సిద్ధం చేసిన విద్యార్థుల ప్రశ్నలకే మంత్రి లోకేశ్ బదులిచ్చారు. ఎలక్ట్రానిక్ మీడియాను సైతం లోపలకు రానివ్వకుండా గేటు వద్దే నిలిపివేశారు. లోకేశ్ వ్యక్తిగత మీడియాకు చెందిన కొందరి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం సాగింది. గతంలో లైవ్‌లో విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రశ్నలు సంధించడంతో ఈసారి లైవ్ లేకుండా ముందు జాగ్రత్తలు పాటించారు. విద్యారంగ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకుని రావడానికి ప్రయత్నించిన విద్యార్థిసంఘ నాయకులు కొందరిని పోలీసులు గృహనిర్బంధం చేశారు.

లోకేశ్ పర్యటనలో ఫ్లెక్సీల రగడ

ఆందోళనలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాజానగరం: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో శుక్రవారం మంత్రి లోకేశ్ పర్యటన సందర్భంగా స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వివాదానికి దారి తీశాయి. యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో జనసేన పార్టీకి చెందిన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఫ్లెక్సీ లేదనే సాకుతో ఆ పార్టీ కార్యకర్తలు రెచ్చిపోయారు. యూనివర్సిటీ పరిపాలనా భవనం ముంగిట ఆందోళనకు దిగారు. తమ ఎమ్మెల్యే పేరుతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయకపోగా, ఆయన సతీమణి బత్తుల వెంకటలక్ష్మిని వీసీ చాంబర్‌లోకి వెళ్లకుండా వీసీ పీఏ గెంటేసి అవమానించారని ఆరోపించారు. వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇదంతా ఎమ్మెల్యే బలరామకృష్ణ సమక్షంలోనే జరిగినప్పటికీ, తన ఫ్లెక్సీ పెట్టకపోయినా, తన భార్యను లోనికి వెళ్లకుండా గెంటేసి అవమానించినా తాను పట్టించుకోలేదని ఆయన చెప్పడం విచిత్రం. ఉభయ గోదావరి జిల్లాల్లోని అందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, తన పట్ల నిర్లక్ష్యం చూపినందుకు కొంత బాధ అనిపించినప్పటికీ మంత్రి లోకేశ్ పర్యటన ముఖ్యమని కేడర్‌ని సముదాయించి, ఆందోళన విరమింపజేశానని చెప్పారు.

జ్వరాలు 'వైరల్'

ఇంట్లో ఒకరి నుంచి కుటుంబం అంతటికీ వ్యాప్తి

పిల్లలు పెద్దలు సహా కుటుంబంలో అందరిపైనా ప్రభావం

- హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు నమోదు
- స్క్రబ్‌టైఫస్ కేసులు 1,800 పైనే
- ఇప్పటికే 15 మంది బాధితులు మృతి
- వ్యాధుల వ్యాప్తి నియంత్రణలో ప్రభుత్వ చర్యలు శూన్యం
- ఎటుచూసినా అపరిశుభ్ర వాతావరణం, దోమల బెడద

తిరుపతి వీధుల్లో ఇటీవల పేరుకుపోయిన చెత్త

సాక్షి, అమరావతి: పల్లెలు, పట్టణాలు ఎటుచూసినా అపరిశుభ్ర వాతావరణం..! ప్రజలపై దోమల దండయాత్ర..! ఫలితంగా వ్యాధుల స్వైర విహారం..! ఒకరికి జ్వరం వస్తే కుటుంబంలోని అందరినీ చుట్టేస్తోంది..! ఏ ఇంట్లో చూసినా జ్వరం, దగ్గు, జలుబు, ఇతర అనారోగ్య బాధితులే..! దావానలం తరహాలో వ్యాధులు వ్యాపిస్తుంటే నియంత్రణ చర్యలు చేపట్టకుండా ప్రభుత్వం చేతులెత్తేసింది..! బాధితులకు వైద్య భరోసా లేకుండా పోయింది..!

అసలే పారిశుధ్యం అధ్వానంగా ఉండగా ఇటీవల భారీ వర్షాలు, వరుస తుపానులతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. దీనికితోడు ప్రభుత్వ వైద్యం పడకేసింది. 24 గంటలు సేవలందించాల్సిన పీహెచ్‌సీలకు తాళాలు పడుతున్నాయి. ప్రజలు ఆర్‌ఎంపీలు, ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. సత్యసాయి నుంచి శ్రీకాకుళం వరకు అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనడం గమనార్హం.

- ఈ ఏడాది ప్రారంభంలో దేశంలో ఆందోళన కలిగించిన హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) కేసులు రాష్ట్రంలో క్రమంగా పెరుగుతున్నాయి. ఇటీవల పలువురు జ్వర బాధితుల నమూనాలను గుంటూరు వైరాలజీ ల్యాబ్‌లో పరీక్షించగా హెచ్‌ఎంపీవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు సమాచారం. పిల్లల్లో సైతం బాధితులున్నట్లు వెల్లడైంది. వీటికిపాటు అడినోవైరస్, ఇన్‌ఫ్లుయెంజా ఎ, బి, డెంగీ కేసులు అధికంగానే ఉంటున్నాయి. జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు బాధితులను తీవ్రంగా వేధిస్తున్నాయి.

మాట్లాడలేనంతగా గొంతు ఇన్ఫెక్షన్..

పిల్లలు, పెద్దలను గొంతు ఇన్ఫెక్షన్ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కొందరు మాట్లాడేందుకు కూడా తీవ్ర అవస్థ పడుతున్నారు. తొలుత గొంతు నొప్పితో మొదలై జ్వరం, జలుబు చుట్టుముడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. రెండు, మూడు రోజులు బాధితుల్లో 101 నుంచి 104 డిగ్రీల జ్వరం ఉంటోంది. జ్వరం, జలుబు తగ్గాక వారం రోజులు, ఆపైన దగ్గు వెంటాడుతోంది.

రాష్ట్రంలో స్క్రబ్‌టైఫస్ కేసుల పెరుగుదల తీరు

సంవత్సరం	కేసులు	మరణాలు
2023	579	0
2024	803	0
2025	1801	15

- ఉత్తరాంధ్రలోని గిరిజన ప్రాంతాలను మలేరియా, విష జ్వరాలు పీడిస్తున్నాయి. ఏఎస్ఆర్, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి, ఏలూరు జిల్లాల్లో మలేరియా తీవ్రంగా ఉంది. ఈ జిల్లాలతో పాటు, రాష్ట్రం మొత్తం గత ఏడాదితో పోలిస్తే కేసులు పెరిగాయి.
- స్క్రబ్‌టైఫస్ విజృంభణ కూడా అధికంగానే ఉంటోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 1,801 పాజిటివ్‌లు నమోదవగా, దీనిబారిన పడి 15 మంది చనిపోయారు.

నియంత్రణ చర్యలు శూన్యం

పెద్దఎత్తున వ్యాధులు వ్యాపిస్తున్నా, నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మొక్కుబడిగా ఉంటున్నాయి. గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో వార్డు స్థాయిల్లో పక్కాగా పారిశుధ్య నిర్వహణ, ముందస్తు నియంత్రణ చర్యల్లో భాగంగా సర్వైలెన్స్, ఇతర కార్యక్రమాలు చేపట్టడమే లేదు. అసలు సర్వైలెన్స్ వ్యవస్థను చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చింది. స్క్రబ్‌టైఫస్ బాధితుల మరణాలపై మీడియాలో కథనాలు వచ్చాకే వైద్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం పరిస్థితి ఎంత నిర్లక్ష్యంగా ఉందో చాటుతోంది.

- గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో జనవరి–సెప్టెంబర్ మధ్య వరుసగా మరణాలు సంభవించినా ప్రభుత్వానికి కనీస సమాచారం లేదు. ఈ ఉదాహరణలన్నీ రాష్ట్రంలో వ్యాధులపై సర్వైలెన్స్ లేదనేందుకు పెద్ద నిదర్శనమని చెప్పవచ్చు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పకడ్బందీగా ముందు జాగ్రత్త చర్యలు

కరోనాతో పాటు, ఇతర సీజనల్ వ్యాధుల కట్టడిలో భాగంగా ప్రాథమిక దశలోనే పీడితులను గుర్తించడం, వారి కాంటాక్ట్‌లను నిర్ధారించి పరీక్షలు చేయడం, అవసరమైన చికిత్సలు అందించడం ఎంతో కీలకం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ ముందుజాగ్రత్త చర్యలన్నీ చేపట్టారు. ఫీవర్ సర్వే నిర్వహించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రతి ఇంటికి వెళ్లి... జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరోచనాలు ఇతర లక్షణాలున్నవారిని గుర్తించేవారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు వెళ్లే పీహెచ్‌సీ వైద్యులు స్థానికంగా వ్యాధులు ప్రబలుతున్న తీరును అధ్యయనం చేసి, ప్రజలకు జాగ్రత్తలను సూచించేవారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఫీవర్ సర్వేలో అవసరం మేర కిట్ల ద్వారా గ్రామాల్లోనే పరీక్షలు నిర్వహించి ప్రాథమికంగా వ్యాధిని నిర్ధారించేవారు. స్వల్ప లక్షణాలున్న వారికి ఇంటి వద్దే మందులు అందించేవారు. పరిస్థితిని బట్టి ఆస్పత్రులకు రెఫర్ చేసి, వైద్యం అందేలా సమన్వయంతో వ్యవహరించేవారు. తద్వారా ప్రాథమిక దశలోనే మలేరియా, డెంగీ వంటి వ్యాధులు బయటపడేవి. బాధితులు ఆస్పత్రుల పాలవకుండా మందులతోనే కోలుకునే వీలు కలిగేది. ఈ కార్యక్రమాన్ని చంద్రబాబు గద్దెనెక్కిన వెంటనే నిర్వీర్యం చేశారు. ఫీవర్ సర్వే ఊసే లేకుండా పోయింది. వ్యాధి ముదిరిన అనంతరం బాధితులు ఆస్పత్రులకు వెళ్తున్నారు. రోగ నిరోధక శక్తి క్షీణించినవారు, అసలు రోగ నిరోధకత లేనివారు మృత్యువాత పడుతున్నారు. అయినా చంద్రబాబు సర్కారుకు పట్టడం లేదు.

బాబూ... ఏదీ నియంత్రణ?

''డయేరియా, డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు మున్సిపల్, పంచాయతీ, వైద్యశాఖ అధికారులతో సమన్వయ కమిటీ వేస్తున్నాం, కేసులు సున్నాకు కట్టడి చేస్తాం, దోమలపై డ్రోన్‌లతో దండయాత్రలు చేస్తా'' అని నిరుడు గద్దెనెక్కిన వెంటనే చంద్రబాబు ప్రగల్భాలు పలికారు. పేరుకు సమన్వయ కమిటీలు వేశారుగానీ క్షేత్ర స్థాయిలో నియంత్రణ చర్యలు కొరవడ్డాయి. దోమలపై డ్రోన్‌లను ఎక్కుపెడతామన్న బాబు మున్సిపాలిటీలు, పంచాయతీల్లో సక్రమంగా ఫాగింగ్ కూడా చేయడం లేదు.

మా 'లావు' దోమలు

రాష్ట్రంలో దోమల స్వైర విహారం ఎలా ఉందో చెప్పేందుకు ఇదొక ఉదాహరణ. ''ప్రజలారా మీ సమస్యలు చెబితే నేను పార్లమెంట్‌లో చర్చిస్తా'' అంటూ ఇటీవల టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. 'దోమలు నివారించండి' అంటూ పలువురు కామెంట్లు పోస్ట్ చేయడం గమనార్హం. రాష్ట్రంలో మారుమూల గ్రామాల్లోనే కాదు. విశాఖ, విజయనగరం, గుంటూరు వంటి ప్రధాన నగరాల్లో సైతం ప్రజలను దోమలు కుట్టి కుట్టి వేధిస్తున్నాయి. డోర్లు, కిటికీలకు మెష్ వేసి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా దోమలు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఇతర మంత్రులతో సీఎం చంద్రబాబు భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రులను కోరారు. కేంద్రం నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిలు, నిధులు త్వరితగతిన ఇవ్వాలంటూ విజ్ఞప్తి చేశారు. రెండ్రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన పలువురు కేంద్ర మంత్రులతో విడివిడిగా భేటీ అయ్యారు. పోలవరం–నల్లమల సాగర్ ప్రాజెక్టుకు సహకారం అందించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. విశాఖలో యూనిటీ మాల్ నిర్మాణం, అఖండ గోదావరి కింద చేపట్టిన హేవ్‌లాక్ బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు, గండికోట పర్యాటక ప్రాజెక్టుతోపాటు రాష్ట్రంలో మూడు వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల నిర్మాణాల పూర్తికి నిధులివ్వాలని కోరారు. 2025–26లో సాస్కీ కింద రూ.10,054 కోట్లు మంజూరుచేయాలని, వచ్చే బడ్జెట్‌లో రాయలసీమ హార్టికల్చర్ డెవలప్‌మెంట్ ప్యాకేజీ ప్రకటించాలని సీఎం కోరారు. అలాగే, పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్ పనులకు అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఆల్మట్టి డ్యామ్‌పై కర్ణాటక ప్రభుత్వం ముందుకెళ్లకుండా కేంద్రం నిలువరించాలన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ శంకుస్థాపనకు రండి..

ఇక దుగరాజపట్నంలో నేషనల్ మెగా షిప్ బిల్డింగ్, షిప్ రిపేర్ క్లస్టర్ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖ మంత్రి సోనోవాల్ సర్బానంద్‌ను చంద్రబాబు కోరారు. నెల్లూరు జిల్లాలో బీపీసీఎల్ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ ప్రాజెక్టు శంకుస్థాపనకు రావాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీని కోరారు. అనంతరం.. ఇటీవల బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నితిన్ నబీన్‌ను సీఎం చంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో కూడా చంద్రబాబు భేటీ అయ్యారు. ఏపీలో రాజకీయ పరిణామాలు వారి భేటీలో ప్రస్తావనకొచ్చినట్లు తెలిసింది.

వైఎస్ జగన్‌ను తేలికగా తీసుకోవద్దు

'వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ను మీరెవరూ తేలిగ్గా తీసుకోవద్దు. ఆయన బలహీనుడని అనుకోవద్దు' అని సీఎం చంద్రబాబు కూటమి ఎంపీలతో వ్యాఖ్యానించారు. కూటమి ఎంపీలతో ముచ్చటించిన సందర్భంలో వైఎస్ జగన్‌ను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. 'వైఎస్ జగన్ చేసే విమర్శలను ఎప్పటికప్పుడు స్పందించండి. మెడికల్ కాలేజీల పీపీపీ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి. ఈ విషయంలో కూటమి ప్రభుత్వంపై ఎవరెన్ని ఆరోపణలు చేసినా గట్టిగా తిప్పికొట్టండి' అని చంద్రబాబు అన్నట్లు తెలిసింది.

మీ వైఫల్యాన్ని అధికారులపైకి నెడతారా?

సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్సార్‌సీపీ నేత పేర్ని నాని

- తమది పొలిటికల్ గవర్నెన్స్ అని చెప్పి ఇప్పుడు కలెక్టర్లు, ఎస్పీలపై నిందలా?
- కలెక్టర్లు ప్రభుత్వ నిర్ణయాల డెలివరీ మెకానిజమ్ మాత్రమే
- పాలనా యంత్రాంగం అంతా సీఎం వద్దే.. అదే దిశ తప్పింది
- మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు కట్టబెడుతుండటం దారుణం
- మీ పాలనలో అన్ని వ్యవస్థలూ నిర్వీర్యం.. 1న జీతాలు కలే

మచిలీపట్నం టౌన్: కలెక్టర్లు సరిగా పని చేయడం లేదంటే అది చంద్రబాబు వైఫల్యమేనని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలకు కలెక్టర్లు కేవలం డెలివరీ మెకానిజమ్ మాత్రమే అని, వారికి దిశానిర్దేశం చేసేది సీఎం అని చెప్పారు. తన వైఫల్యాలు, తప్పులను అధికారులపై వేసి, సీఎం చంద్రబాబు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మట్లాడారు. కలెక్టర్లు, ఎస్పీల సమావేశం పేరుతో సీఎం చేసింది పాలనా సమీక్ష కాదని, ఒక కాలక్షేప కార్యక్రమం అని తేల్చి చెప్పారు. చేయాల్సిన దారుణాలన్నీ చంద్రబాబు, ఆయన పరివారం చేసేసి.. తీరా కలెక్టర్లు, ఎస్పీలపై నిందలు వేయడం దారుణం అన్నారు. వారిని పని చేయనివ్వకుండా అనేక ఆంక్షలు విధించడం ఆయన ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోందని దెప్పి పొడిచారు.

'మనది పొలిటికల్ గవర్నెన్స్. మా పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు మీ వద్దకు వస్తారు. వారికి మర్యాద ఇవ్వండి. మా ఎమ్మెల్యేలపై ఫిర్యాదులు రాకుండా చూసుకోండి' అంటూ గద్దెనెక్కినప్పటి నుంచి నిన్నటిదాకా వారికి దిశా నిర్దేశం చేసి, ఇప్పుడు మీరు సరిగ్గా పని చేయడం లేదని నిందించడం భావ్యం కాదని చెప్పారు. 'పలు కేసుల్లో మీరు ముద్దాయిగా ఉండి, మీరే ముఖ్యమంత్రిగా కొనసాగుతూ కేసులు మాఫీ చేయించుకున్న ముఖ్యమంత్రి మీరే కదా?' అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పేర్ని నాని ఇంకా ఏమన్నారంటే..

66 ఏళ్ల తర్వాత మీరు ఉంటారా?

- మెడికల్ కాలేజీలను 66 ఏళ్ల పాటు ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు. ఆ 66 ఏళ్ల వరకు మీరు, మీ లోకేశ్, మీ పవన్ కళ్యాణ్, సత్యకుమార్ ఎవరు ఉంటారు? ఎకరానికి రూపాయి అద్దెకు ప్రభుత్వ భూములను 66 ఏళ్ల పాటు ప్రైవేట్ వారికి ఇవ్వడం అంటే అమ్మేయడమే. రాష్ట్రంలో ఉన్న మీ భూములను కూడా ఎకరా రూపాయి చొప్పున 66 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వండి. 66 ఏళ్ల తర్వాత మళ్లీ దేవాన్ష్ లేదా ఆయన కొడుక్కు అప్పగిస్తారు.
- 2015లో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేట్‌కు ఇచ్చారు కదా.. మీరు ఒక్కరోజైనా ఆ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నారా? ప్రైవేట్ ఆసుపత్రులకు పేదలు ఎలా వెళ్తారు? పీపీపీ వల్ల మెడికల్ సీట్లు పెరుగుతాయని, ఫీజులు అలాగే ఉంటాయని చంద్రబాబు దబాయిస్తున్నాడు. అది సాధ్యమేనా? ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఒక విద్యార్థికి ఏడాది ఫీజు కేవలం రూ.15 వేలే ఉంటుంది. రోగులకు స్కానింగ్, ఎంఆర్ఐ, రక్త పరీక్షలు, డయాలసిస్ అన్నీ ఉచితంగా లభిస్తాయి. ప్రైవేట్ నిర్వహణలో ఇలా సాధ్యమా? తనకు చందాలు ఇచ్చిన వారికి చంద్రబాబు మెడికల్ కాలేజీలను ఆసుపత్రులతో సహా రాసిచ్చేస్తున్నాడు. ఇది సరికాదని కోటి మందికి పైగా ప్రజలు సంతకాలు చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు బాధ్యులైన వారందరిపై మా ప్రభుత్వం వచ్చిన తర్వాత తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

బసవ తారకం ఆస్పత్రిలో ఉచిత వైద్యం అందిస్తున్నారా?

- చంద్రబాబు, ఆయన బావమరిది బాలకృష్ణ కలిసి నడుపుతున్న బసవతారకం ఆసుపత్రిలో 70 శాతం ఉచిత వైద్యం అందిస్తామని ప్రభుత్వం వద్ద భూమి తీసుకున్నప్పుడు అంగీకరించారు. కానీ ఆ ఆసుపత్రిలో ఒక్క పేదవాడికైనా ఉచితంగా చికిత్స ఇచ్చారా? అక్కడ పేదల్ని పట్టించుకునే పరిస్థితే లేదు. బాబు పాలనలో నేరాలు, ఘోరాలు మాత్రమే పెరిగాయి.
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన శాఖలను నిర్లక్ష్యం చేసి హోం శాఖలో జోక్యం చేసుకుంటూ మాటలకే పరిమితమయ్యారు. భీమవరం, పిఠాపురం వంటి ప్రాంతాల్లో పేకాట, ల్యాండ్ సెటిల్‌మెంట్లు, రాజకీయ జోక్యంతో పోలీసు–రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది.

వైద్య మంత్రీ.. నోరు అదుపులో పెట్టుకో

మంత్రి సత్యకుమార్ యాదవ్.. నువ్వు ఒక పసుపు పచ్చ పువ్వు. లోకేశ్ రాసిచ్చిన పేపర్ చదువుతూ ఏదేదో మాట్లాడుతున్నావు. బురదపామువైన నువ్వు చంద్రబాబు, లోకేశ్ దయతో మదమెక్కి మాట్లాడుతున్నావు. ప్రైవేట్‌లో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందంటున్నావు. నీలాంటోడు వైద్య మంత్రిగా ఉండటం మా దౌర్భాగ్యం. నీకు దమ్ముంటే ఎయిమ్స్ వంటి కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రులను పీపీపీకి ఎందుకు ఇవ్వడం లేదన్న ప్రశ్నకు సమాధానం చెప్పు. వైఎస్ జగన్ గురించి మాట్లాడే అర్హత సత్యకుమార్ యాదవ్‌కు లేదు. పార్లమెంట్ సాక్షిగా బీజేపీ నేత సుష్మాస్వరాజ్ స్వయంగా, వైఎస్ జగన్‌పై కేసులు రాజకీయ ప్రతీకారమేనని స్పష్టం చేసిన విషయం గుర్తుకు పెట్టుకో. స్కూల్స్, హాస్టల్స్‌లో భోజనం ఎంత అధ్వానంగా ఉందో ఏనాడైనా చంద్రబాబు, పవన్, లోకేశ్‌లు రుచి చూశారా? చంద్రబాబు ఈ రాష్ట్రానికి పట్టిన పీడ. కానిస్టేబుల్ ఉద్యోగాలు మీరే ఇచ్చామని చెప్పుకోవడానికి సిగ్గులేదా? నాడు జగన్ భర్తీ చేస్తుంటే కోర్టులో కేసు వేసి అడ్డుకున్నది మీరు కాదా? పోర్టులు, సచివాలయాలు, మెడికల్ కాలేజ్‌లు, ఫిషింగ్ హార్బర్‌లు, స్కూళ్ల అభివృద్ధి, విద్య వైద్య రంగం అభివృద్ధి.. ఇలా రాష్ట్రం బాగుపడింది జగన్ హయాంలోనే. చంద్రబాబు వచ్చాక పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ఉద్యోగులకు సగం నెల దాటాక జీతాలిస్తూ.. చంద్రబాబు, లోకేష్, పవన్‌లు మాత్రం ఒకటో తేదీన జీతం తీసుకుంటున్నారు. పదేపదే హోం శాఖ గురించి మాట్లాడే బదులు ఆ శాఖను పవన్ అడిగి తీసుకోవచ్చు కదా.. అనితకు హోం శాఖ తీసేసి సమాచార శాఖ ఇస్తే సరిపోతుంది. అప్పుల్లో రికార్డు సృష్టించిన చంద్రబాబుకు ఆ అంశంపై శ్వేతపత్రం ఇచ్చే దమ్ముందా?

పరకామణిలో సంస్కరణలు తప్పనిసరి

- ప్లాన్–ఏ ని రెండు వారాల్లో.. ప్లాన్–బీ ని 8 వారాల్లో మా ముందుంచండి
- ఏసీబీ డీజీకి హైకోర్టు ఆదేశం.. తదుపరి విచారణ ఈనెల 26కి వాయిదా

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి పరకామణి వ్యవస్థలో సమూల సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని హైకోర్టు స్పష్టంచేసింది. హుండీల్లో భక్తులు సమర్పించే కానుకల లెక్కింపు, రవాణా, సీలింగ్, డీ–సీలింగ్, ఖాతాల నిర్వహణ వంటి అంశాల్లో ఇప్పటికీ అనుసరిస్తున్న పాత విధానాల్లో మానవ జోక్యాన్ని తగ్గిస్తూ, కృత్రిమ మేథస్సు (ఏఐ), ఆధునిక యంత్రాలు, డిజిటలైజేషన్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాల్సిన అవసరం ఉందని టీటీడీకి తేల్చిచెప్పింది. హుండీల్లో కేవలం డబ్బు మాత్రమే కాకుండా ఎన్నో వస్తువులు భక్తులు సమర్పిస్తారని కోర్టు గుర్తుచేసింది. ఇవన్నీ వర్గీకరించడంలో నేటి ఆధునిక యంత్రాలు, ఏఐ సాంకేతికత సమర్థవంతంగా పనిచేస్తాయని తెలిపింది. తక్షణ, శాశ్వత ప్రణాళికలను రూపొందించి వాటిని తమ ముందుంచాలని టీటీడీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 26కి వాయిదా వేసింది.

సీఐడీ, ఏసీబీ దర్యాప్తునకు ఆదేశం..

శ్రీవారి పరకామణి చోరీ కేసును లోక్ అదాలత్‌లో రాజీచేసుకోవడంపై సీఐడీ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ తిరుపతికి చెందిన పాత్రికేయుడు ఎం.శ్రీనివాసులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యవహారంపై సీఐడీ దర్యాప్తునకు ఆదేశించింది. అలాగే, నిందితుడు రవికుమార్ ఆస్తులపై దర్యాప్తు జరపాలని ఏసీబీని ఆదేశించింది.

ఆ కానుకలు.. భక్తుల మనోభావాలకు ప్రతీకలు..

శ్రీవారికి భక్తులు హుండీలో సమర్పించిన ప్రతి కానుక భక్తుల విశ్వాసానికి ప్రతీకగా భావించాల్సి ఉంటుందని హైకోర్టు స్పష్టంచేసింది. అందుకే వాటి భద్రత, పారదర్శక లెక్కింపునకు అత్యంత ప్రాముఖ్యతను ఇస్తున్నామని పేర్కొంది. హుండీ నిర్వహణ, కానుకల లెక్కింపులో పారదర్శకత లేకపోతే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని టీటీడీకి తేల్చిచెప్పింది. భక్తుల మనోభావాలను పరిరక్షించాల్సిన బాధ్యత టీటీడీదేనని స్పష్టంచేసింది. ఇక పరకామణి వ్యవస్థలో తక్షణ సంస్కరణల కోసం ప్లాన్–ఏ ను రెండు వారాల్లో, శాశ్వత ఆధునీకరణ కోసం ప్లాన్–బీని ఎనిమిది వారాల్లో సమర్పించాలని టీటీడీ బోర్డును హైకోర్టు ఆదేశించింది. ప్లాన్–ఏ అమలుకు అవసరమైన నిపుణుల కమిటీలను ఏర్పాటుచేయాలని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాంకేతిక పరిజ్ఞానం కలిగిన భక్తుల సేవలను వినియోగించుకోవచ్చని సూచించింది. అలాగే, పరకామణిలో చోరీచేస్తూ దొరికిన ఓ ప్రైవేటు మఠం ఉద్యోగి సీవీ రవికుమార్ ఆయన కుటుంబ సభ్యులు జరిపిన ఆస్తుల బదలాయింపు వివరాలను సీల్డ్ కవర్‌లో ఒక వారంలో తమ ముందుంచాలని ఏసీబీ డైరెక్టర్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది.

అభ్యర్థులతో ప్రభుత్వం ఆటలు!

- బాలల హక్కుల కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకంలో చంద్రబాబు సర్కారు ఇష్టారీతిన నిర్ణయాలు
- పలు జిల్లాల అభ్యర్థులకు షెడ్యూల్ కన్నా ముందే ఇంటర్వ్యూలు
- అర్జెంట్‌గా రావాలంటూ రాత్రికి రాత్రే కబురు
- ఈ నెల 21తో ముగియాల్సిన ఇంటర్వ్యూలు నేటితో ముగింపు
- ఉదయం 7 గంటలకే ఇంటర్వ్యూలు మొదలు.. 2 గంటలకు పూర్తి?

సాక్షి, అమరావతి: రాజ్యాంగబద్ధమైన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులతో చంద్రబాబు ప్రభుత్వం ఆటలాడుతోంది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కాకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తోంది. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్, ఆరుగురు సభ్యులు (వారిలో ఇద్దరు మహిళా సభ్యులు) నియామకం కోసం ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీచేసింది. గతంలో రెండుసార్లు నోటిఫికేషన్ ఇచ్చి రద్దు చేసింది. దాదాపు 600 మంది దరఖాస్తు చేసుకోగా, 359 మందిని ఇంటర్వ్యూలకు పిలిచేందుకు ఎంపిక చేశారు. అభ్యర్థుల జాబితాలను జిల్లాల వారీగా వర్గీకరించి ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు ఇంటర్వ్యూల షెడ్యూల్ ప్రకటించారు. వెలగపూడిలోని సచివాలయంలో ఈ నెల 15న కృష్ణా జిల్లా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు పూర్తి కాగా, శుక్రవారం అదే జిల్లాకు చెందిన మరికొందరికి ఇంటర్వ్యూలు నిర్వహించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా షెడ్యూల్ ప్రకారం విజయనగరం జిల్లా అభ్యర్థులకు ఈ నెల 20న ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉంది. కానీ శుక్రవారమే హాజరుకావాలని గురువారం రాత్రి సమాచారం ఇచ్చారు. దీంతో ముందుగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ప్రయాణానికి రిజర్వేషన్, బస ఏర్పాట్లు చేసుకున్నామని, ఇప్పుడు అంతదూరం నుంచి ముందే రావాలని హడావుడిగా సమాచారం ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని అభ్యర్థులు ఆందోళన వ్యక్తంచేశారు. మరోవైపు అనేక వ్యయప్రయాసలకు గురై ఆఫీసు పని వేళల్లో (ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలు) వచ్చినా... ఉదయం ఏడు గంటలకే ఇంటర్వ్యూలు ప్రారంభించి, మధ్యాహ్నం రెండు గంటలకే ముగించారని తెలిసి పలువురు అభ్యర్థులు కంగుతిన్నారు.

రేపటి ఇంటర్వ్యూలు... ఈ రోజే..!

నెల్లూరుతోపాటు మరికొన్ని జిల్లాల అభ్యర్థులకు ఈ నెల 21న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని అధికారులు ముందుగా షెడ్యూల్ ఇచ్చారు. అయితే వారందరికీ ఈ నెల 20న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని 24 గంటల ముందు సమాచారం ఇచ్చారు. షెడ్యూల్ కన్నా ఒకరోజు ముందే ఇంటర్వ్యూలు ముగించాలని అధికారులు హడావుడి చేస్తుండటంపై అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బాలల హక్కుల కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకం ప్రక్రియను ప్రభుత్వం గందరగోళంగా మార్చిందని మండిపడుతున్నారు.

మేం గొంతెత్తితే చంద్రబాబుకు వణుకు

మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్



తాడేపల్లి రూరల్: 'మా ఫిర్యాదులను స్వీకరించే దమ్ము చంద్రబాబు ప్రభుత్వానికి ఉందా ?' అని వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన తాడేపల్లి పోలీస్ స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గొంతెత్తితే చంద్రబాబు ప్రభుత్వానికి వణుకు పుడుతోందని, అందుకే తమ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెడుతోందన్నారు. మంత్రి లోకేశ్‌ను అసభ్య పదజాలంతో దూషించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు తనపై కేసు నమోదు చేశారని, ఈ కేసులో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వై.నాగార్జున యాదవ్‌తో కలిసి విచారణకు హాజరైనట్టు తెలిపారు. కేవలం ప్రభుత్వాన్ని విమర్శించినందుకే వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు పెడుతున్న పోలీసులు.. మాజీ సీఎం వైఎస్ జగన్‌ని, తమ పార్టీ నాయకులను దూషిస్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలపై ఫిర్యాదులు ఇస్తే కనీసం స్వీకరించడం లేదని మండిపడ్డారు. వై.నాగార్జున యాదవ్ మాట్లాడుతూ గోరంట్ల మాధవ్ రాయలసీమ మాండలికంలో మంత్రి లోకేశ్‌ను విమర్శించారే తప్ప ఎలాంటి అసభ్య పదజాలం ఉపయోగించలేదని, సూపర్ సిక్స్ హామీల అమలు, ప్రభుత్వ వైఫల్యాలను మాత్రమే ఎత్తి చూపారని అన్నారు.

ఆ నిరసన ప్రజా వ్యతిరేకతకు దర్పణం

18 నెలలుగా హామీల అమలులో మోసం.. పాలనలో వైఫల్యాలు.. అంతులేని అవినీతి

- కోటి సంతకాల ఉద్యమం వీటన్నింటినీ ఎత్తిచూపిందంటున్న రాజకీయ విశ్లేషకులు
- ఓ అంశంపై 1,04,11,136 మంది స్వచ్ఛందంగా సంతకాలు చేయడం చరిత్రాత్మకం
- ఈ స్థాయిలో నిరసన దేశ చరిత్రలో ఇదే ప్రథమం అంటున్న ప్రజా సంఘాలు
- నానాటికీ పడిపోతున్న చంద్రబాబు, టీడీపీ సర్కార్ గ్రాఫ్..
- వైఎస్సార్‌సీపీకి ప్రజా మద్దతు పెరుగుతోందనడానికి ఇదే తార్కాణం
- తాజా పరిణామాలతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో కదనోత్సాహం

కాకినాడలో కోటి సంతకాల ప్రతులను విజయవాడ పంపిస్తూ చేపట్టిన ర్యాలీకి హాజరైన అశేష జనవాహిని (ఫైల్)

సాక్షి, అమరావతి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమానికి ఇచ్చిన పిలుపు ప్రభంజనమైంది. రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరిస్తూ పేదలకు నాణ్యమైన వైద్యాన్ని.. వైద్య విద్యను దూరం చేయడంపై ప్రజలు తిరగబడ్డారు. తనకు కావాల్సిన వారికి సంపద సృష్టించి.. తద్వారా 'నీకింత–నాకింత' అంటూ పంచుకుతినే కుట్రతో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తూ చంద్రబాబు సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని కోటి మందికి పైగా ప్రజలు సంతకాలు చేసి బాబును కడిగి పారేశారు. క్రెడిట్ మరొకరికి దక్కుతుందనే కక్షతో మెడికల్ కాలేజీలను ప్రైవేటు ముసుగులో బినామీలకు కట్టబెట్టే కుట్రను బట్టబయలు చేశారు. సర్కార్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అన్ని వర్గాలకు చెందిన 1,04,11,136 మంది ప్రజలు సంతకాలు చేయడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దేశ చరిత్రలో ఎన్నడూ ఒక ప్రజా ఉద్యమంలో ప్రజలు స్వచ్ఛందంగా ఈ స్థాయిలో సర్కార్ తీరును వ్యతిరేకిస్తూ సంతకాలు చేసిన దాఖలాలు లేవని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై నిరసనాగ్రహమే కాదు.. చంద్రబాబు సర్కార్‌పై ప్రజల్లో పెల్లుబుకుతున్న వ్యతిరేకతకు కోటి సంతకాల ప్రజా ఉద్యమం దర్పణం పట్టిందని విశ్లేషిస్తున్నారు. చారిత్రక ఘట్టంగా నిలుస్తూ కోటి సంతకాల ఉద్యమం గ్రాండ్ సక్సెస్ కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు నూతనోత్సాహంతో కదం తొక్కుతున్నాయి.

కోటి మందిని కదిలించిన ఒక్క పిలుపు

- రాష్ట్రంలో 1923 నుంచి 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి కేవలం 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు.. పద్మావతి అటానమస్ మెడికల్ కాలేజీతో కలిపితే 12 ఉన్నాయి. 2019 నాటికి చంద్రబాబు మూడు సార్లు అంటే 1995–99, 1999–04, 2014–19 మధ్య 14 ఏళ్లు సీఎంగా పాలించినప్పటికీ ఒక్కటంటే ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ కూడా కట్టలేదు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 13 జిల్లాలను పునర్విభజించి, 26 జిల్లాలుగా ఏర్పాటు చేసింది. ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతోపాటు నాణ్యమైన వైద్యం అందించడం.. పేదలకు వైద్య విద్యను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో కాలేజీకి కనీసం 50 ఎకరాల స్థలం ఉండేలా భూమిని కేటాయించారు. ఒక్కో మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ.500 కోట్లకుపైగా ఖర్చు చేసి, అన్ని రకాల సదుపాయాలు ఉండేలా క్యాంపస్‌ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. వాటిని పూర్తి చేయడానికి అవసరమైన నిధులను నాబార్డు.. కేంద్ర పథకాల నుంచి సమకూర్చారు.
- కోవిడ్ మహమ్మారి వంటి సమస్యలు రెండేళ్లపాటు రాష్ట్రాన్ని పీడించినా, ఎన్ని ఇబ్బందులున్నా విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీలను 2023–24లో ప్రారంభించి, తరగతులు మొదలు పెట్టారు. ఎన్నికలు వచ్చే నాటికి పాడేరు, పులివెందుల కాలేజీలు కూడా తరగతులు ప్రారంభించడానికి సిద్ధమయ్యాయి.
- ఎన్నికలు ముగిసిన తర్వాత పాడేరులో అడ్మిషన్లు ముగిసి తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. వైఎస్ జగన్ సర్కార్ సమకూర్చిన నిధులను సద్వినియోగం చేసుకుని.. ఆ ప్రభుత్వం రూపొందించిన ప్రణాళిక ప్రకారం చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టి ఉంటే.. 2024–25 విద్యా సంవత్సరంలో ఆదోని, మదనపల్లి, మార్కాపురం మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చేవి.
- ఈ విద్యా సంవత్సరం అంటే 2025–26లో అమలాపురం, బాపట్ల, నర్సీపట్నం, పార్వతీపురం, పాలకొల్లు, పెనుకొండలో కూడా వైద్య కళాశాలలు ప్రారంభం అయ్యేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లు 2,360 మాత్రమే ఉండేవి. కొత్త మెడికల్ కాలేజీల ద్వారా అదనంగా మరో 2,550 సీట్లు పెరిగితే.. మొత్తమ్మీద 4,910 సీట్లు అందుబాటులోకి వచ్చేవి.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తరగతులు ప్రారంభమైన కొత్త మెడికల్ కాలేజీల్లో అప్పట్లోనే 800 సీట్లు భర్తీ చేశారు. పులివెందుల మెడికల్ కాలేజీలో తరగతులు ప్రారంభించేందుకు చంద్రబాబు సర్కార్ అంగీకరించి ఉంటే మరో 50 సీట్లు వచ్చేవి. కానీ చంద్రబాబు కాలదన్నారు. ఎక్కడ వైఎస్ జగన్‌కు క్రెడిట్ వస్తుందోనని ఏకంగా ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీలను సీఎం చంద్రబాబు ప్రైవేటీకరించడానికి పూనుకున్నారు. దీనిపై ప్రజలు, మేధావులు, ప్రజా సంఘాల నేతలు మండిపడుతున్నారు. ఏడాదికి రూ.వెయ్యి కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే ప్రభుత్వ రంగంలోనే మెడికల్ కాలేజీలన్నీ అందుబాటులోకి వచ్చేవన్న జగన్ వాదనను సమర్థిస్తున్నారు.
- ఈ క్రమంలో చంద్రబాబు సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అక్టోబర్ 7న వైఎస్ జగన్ ప్రజా ఉద్యమానికి పిలుపునిస్తూ ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. ఆ పిలుపు ప్రభంజనంగా మారింది. అక్టోబర్ 9న వైఎస్ జగన్ నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శించి సమరభేరి మోగించారు.

ప్రజా తిరుగుబాటు

- వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపు మేరకు గ్రామాలు, పట్టణాలు, వార్డుల్లోనూ వైఎస్సార్‌సీపీ నేతలు అక్టోబర్ 10 నుంచి డిసెంబర్ 10 వరకు భారీ ఎత్తున రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రబాబు సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రోజుకు సగటున రూ.520.94 కోట్లు అప్పు చేస్తూ.. దాన్ని దుబారా చేస్తూ దుర్వినియోగం చేస్తోందని.. ఒక్క రోజు చేసిన అప్పుతో ఒక మెడికల్ కాలేజీని పూర్తి చేయొచ్చని.. పేదలకు నాణ్యమైన వైద్యం, వైద్య విద్య అందకుండా చేయడం, బినామీలకు కట్టబెట్టడం కోసమే మెడికల్ కాలేజీలను చంద్రబాబు సర్కార్ ప్రైవేటీకరిస్తున్నారని రచ్చబండ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు వివరించారు.
- దీనికి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పత్రాలపై తమ చిరునామా, ఫోన్ నంబర్లు రాసి సంతకాలు చేశారు. నవంబర్ 12న నియోజకవర్గాల కేంద్రాల్లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ర్యాలీల్లో అన్ని వర్గాల ప్రజలు కదం తొక్కడంతో ర్యాలీలు గ్రాండ్ సక్సెస్ అయ్యాయి.
- ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లోనూ ప్రజలు స్వచ్ఛందంగా చేసిన సంతకాల పత్రాలను ప్రదర్శిస్తూ వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ర్యాలీల్లో ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు. పోలీసుల ద్వారా ర్యాలీలను అడగడుగునా అడ్డుకోవడానికి చంద్రబాబు చేసిన కుట్రలను జనం పటాపంచలు చేశారు. ఈ నెల 15న జిల్లా కేంద్రాలలో కోటి సంతకాల పత్రాలను ప్రదర్శిస్తూ నిర్వహించిన ర్యాలీల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి చంద్రబాబు సర్కార్‌పై రణభేరి మోగించారు. ఆ పత్రాలను వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి వైఎస్ జగన్ గవర్నర్‌కు అందజేసిన సందర్భంలోనూ జనం నీరాజనాలు పలికారు.
- ఈ ఉద్యమాన్ని ఆసాంతం పరిశీలించిన రాజకీయ విశ్లేషకులు.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపైనే కాదు చంద్రబాబు సర్కార్‌పై ప్రజల్లో పెల్లుబుకుతున్న వ్యతిరేకతకు ఇది దర్పణం పట్టిందని చెబుతున్నారు. వైఎస్ జగన్ అమలు చేసిన పథకాలను కొనసాగించడంతోపాటు సూపర్ సిక్స్, సూపర్ సెవన్ పథకాలు అమలు చేస్తానంటూ ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు.
- అధికారంలోకి వచ్చాక వైఎస్ జగన్ అమలు చేసిన పథకాలను చంద్రబాబు సర్కార్ రద్దు చేసింది. సూపర్ సిక్స్, సూపర్ సెవన్ పథకాలను మోసాలుగా మిగిల్చింది. రెడ్ బుక్‌తో పరిపాలనతో అడుగడుగునా అదుపు తప్పుతోంది. సర్కార్‌లో అవినీతి తార స్థాయికి చేరింది. దాంతో ప్రజల్లో చంద్రబాబు సర్కార్‌పై వ్యతిరేకత పెల్లుబుకుతోంది. ఇది కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో ప్రస్ఫుటితమైందని సీనియర్ రాజకీయ నేతలు స్పష్టం చేస్తున్నారు. ప్రజల్లో చంద్రబాబు, టీడీపీ కూటమి సర్కార్ గ్రాఫ్ నానాటికీ పడిపోతుంటే.. వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ గ్రాఫ్ రోజురోజుకూ పెరుగుతోందని.. వైఎస్ జగన్ ఒక్క పిలుపుతో 1,04,11,136 మంది ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు చేయడమే ఇందుకు తార్కాణమని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

ఖర్చు ప్రభుత్వానిది.. లాభాలు ప్రైవేట్ వారికా?

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై సీపీఐ నేత రామకృష్ణ ఆగ్రహం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ఏర్పాటు, జీతాల ఖర్చు ప్రభుత్వానిది... లాభాలు మాత్రం ప్రైవేట్ వారికి.. అన్నట్లుగా దేశంలో ఎక్కడాలేని విధంగా చంద్రబాబు సర్కారు పీపీపీ పేరిట ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేటీకరిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ఆగ్రహం వ్యక్తంచేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజతో కలిసి రామకృష్ణ శుక్రవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. 'మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విషయంలో నేను జైలుకి వెళ్లడానికి సిద్ధమని సత్యకుమార్ మాట్లాడటం చూస్తే పీపీపీ పద్ధతి ద్వారా చంద్రబాబు ప్రభుత్వం తప్పు చేసినట్లు ఆయన భావిస్తున్నట్లు ఉంది. ప్రభుత్వం భూమి కేటాయించి, భవనాలు నిర్మించి, వనరులు సమకూర్చి, సిబ్బందిని నియమించి, వారికి జీతాలు చెల్లిస్తూ, ఇతర ఖర్చులకు నిధులను ఇస్తుంది. కానీ ప్రభుత్వ మెడికల్ కాలేజీల నుంచి లాభాలు మాత్రం ప్రైవేటు శక్తులకు వచ్చేలా చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంటే మెడికల్ కాలేజీల ఖర్చు ప్రభుత్వానిది.. ఆదాయం ప్రైవేట్ వారికా?' అని రామకృష్ణ మండిపడ్డారు. ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచేలా కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ ఈ నెల 22న దేశవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టనున్నట్టు తెలిపారు.

అంబేడ్కర్ చెయిర్ ప్రొఫెసర్‌గా జస్టిస్ గవాయ్

సాక్షి, హైదరాబాద్: నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా, హైదరాబాద్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెయిర్ ఆన్ కాన్‌స్టిట్యూషనల్ లా అండ్ సోషల్ ఇన్‌క్లూజన్ ప్రొఫెసర్‌గా మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌ని నియమించారు. ఈ హోదాలో జస్టిస్ గవాయ్.. చెయిర్‌కు సంబంధించిన పరిశోధన, బోధన, విద్యా కార్యక్రమాలు, రాజ్యాంగ చట్టం, న్యాయ ప్రాప్తి, సామాజిక సమావేశం తదితర అంశాలపై అకడమిక్ కార్యక్రమాలకు నాయకత్వం వహించనున్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వెల్లువలా ప్రజా వ్యతిరేకత

మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

సాక్షి,అమరావతి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలతో రాష్ట్ర ప్రజలు సీఎం చంద్రబాబు నిర్ణయాన్ని ఎండగట్టారని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు స్పష్టం చేశారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కోటి సంతకాల కార్యక్రమం ఏపీ చరిత్రలో వచ్చిన అత్యుత్తమ ప్రజా స్పందనని అభివర్ణించారు. రాష్ట్రంలో ఉన్న 1.60 కోట్ల కుటుంబాల్లో ప్రైవేటీకరణను నిరసిస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 1,04,11,136 మంది సంతకాలు చేశారని, ఇది కచ్చితంగా ప్రభుత్వ తీరుపై రెఫరెండమేనని పేర్కొన్నారు. వైఎస్ జగన్ పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు చేపట్టిన కోటిసంతకాల ఉద్యమంలో మేధావులు, విద్యార్థులు, మహిళలు, రాజకీయ పక్షాలతో మమేకమయ్యారని, వెల్లువెత్తుతున్న ప్రజా స్పందన చూస్తే ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందన్న భావనలో ఆంధ్రులు ఉన్నారన్న విషయం స్పష్టమవుతోందని అప్పలరాజు చెప్పారు. మెడికల్ కాలేజీలపై పార్లమెంటు స్థాయీసంఘ నివేదికకు టీడీపీ, ఎల్లో మీడియా వక్ర భాష్యం చెప్పడాన్ని అప్పలరాజు తప్పుబట్టారు. 18 నెలల్లోనే రూ.2.70 లక్షల కోట్లు అప్పు చేసిన చంద్రబాబు సర్కారు ఒక రోజు అప్పుతో ఒక మెడికల్ కాలేజీ పూర్తి చేయవచ్చని, అయినా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకే మొగ్గు చూపడం దుర్మార్గమని అప్పలరాజు మండిపడ్డారు. మరోవైపు గంట యోగా ఖర్చుకు రూ.330 కోట్లు ప్రజాధనం ఖర్చు చేసిన చంద్రబాబు, ప్రజల సొమ్మును విపరీతంగా దుబారా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజలకు వైద్యాన్ని దూరం చేస్తున్న చంద్రబాబు విజనరీ కాదు, విషనరీ' అని అప్పలరాజు మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కచ్చితంగా మెడికల్ కాలేజీలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని స్పష్టం చేశారు.

గోమాంసం పట్టుబడితే పవన్ నోరెత్తరేం?

విశాఖలో గోమాంసం దొరికితే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎందుకు నోరువిప్పలేదని అప్పలరాజు తీవ్రంగా విమర్శించారు. తనను తాను సనాతని అని చెప్పుకునే పవన్ ఇప్పుడు ఏం చేస్తున్నారని నిలదీశారు. పరకామణి కేసు సెటిల్మెంట్ కోర్టు పరిధిలో జరిగితే.. దానికి, వైఎస్సార్‌సీపీకి ఏం సంబంధమని.. దాన్ని కూడా రాజకీయం చేయటం పవన్ సంకుచిత బుద్ధికి నిదర్శనమని మండిపడ్డారు.

కమీషన్ల కోసమే పీపీపీ జపం

- బాబు దోపిడీకి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణే నిదర్శనం
- మాజీ మంత్రి విడదల రజిని

సాక్షి,అమరావతి: చంద్రబాబు మార్క్ దోపిడీకి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణే నిదర్శనమని, కమీషన్ల కక్కుర్తితో చంద్రబాబు ప్రజారోగ్యాన్ని, వైద్య విద్య అభ్యసించాలన్న పేద విద్యార్థుల కలను పణంగా పెడుతున్నారని మాజీ మంత్రి విడదల రజిని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ జరిగితే యూజర్ చార్జీల రూపంలో ప్రజలపై పెనుభారం మోపడం ఖాయమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉచితంగా అందిన వైద్య సేవలన్నీ రాబోయే రోజుల్లో డబ్బులు చెల్లించి పొందాల్సిన దుస్థితి వస్తుందని వివరించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ నిర్వహించిన కోటి సంతకాల సేకరణలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని చంద్రబాబు చెంపచెళ్లుమనిపించారని విమర్శించారు. ఈ ప్రజా మహోఉద్యమం చరిత్రలో నిలిచిపోతోందని, ఈ ఉద్యమంతో కూటమి నాయకుల్లో వణుకు మొదలైందని చెప్పారు. కాబట్టే దాన్ని తక్కువ చేసి చూపించేలా సంతకాలు చేసిన ప్రజలను సైకోలు అని కూటమి నాయకులతో తిట్టిస్తూ, మరోవైపు హేళన చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై విచారణ జరిపి అవినీతికి పాల్పడిన వారిని చట్టం ముందు దోషులుగా నిలబెట్టడం ఖాయమన్నారు. ఇంకా రజిని ఏమన్నారంటే..

ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

''పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కూడా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఆవశ్యకతను నొక్కి వక్కాణించినా ఈ ప్రభుత్వం తీరులో మార్పు కనిపించడం లేదు. కమీషన్ల పేరుతో దోచుకోవడమే లక్ష్యంగా చంద్రబాబు పీపీపీ జపం చేస్తున్నారు. మెడికల్ కాలేజీలు వద్దని సంతకాలు చేసిన 1,04,11,136 మంది ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరిస్తే నాణ్యమైన ఉచిత వైద్యం అనే మాటే వినిపించదు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పెద్ద స్కామ్. అందుకే వైఎస్ జగన్ దీన్ని మదర్ ఆఫ్ ఆల్ స్కామ్స్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక దీనిపై విచారణ జరిపి అవినీతికి ఎవరు పాల్పడినా ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం.'' అని మాజీ మంత్రి విడదల రజిని హెచ్చరించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను గట్టిగా వ్యతిరేకించా

- పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలోనూ, పార్లమెంటులోనూ గళమెత్తా
- ఎక్కడా ప్రైవేటీకరణకు మద్దతివ్వలేదు.. సంతకం పెట్టలేదు..
- స్టాండింగ్ కమిటీ నివేదికకూ టీడీపీ, ఎల్లోమీడియా వక్రభాష్యం
- నివేదికలో ఎక్కడా ప్రైవేటీకరణను ప్రోత్సహించలేదు
- ప్రైవేటు కాలేజీల వల్ల విద్యార్థులపై ఫీజుల భారం పడుతుందని కమిటీ పేర్కొంది
- ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కాలేజీలు ఉండాలని స్పష్టం చేసింది
- టీడీపీ దుష్ప్రచారాన్ని ఖండించిన తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి


2.20 The Committee was apprised of the fact that some private medical colleges seemingly fail medical graduates deliberately during mid-semester exams which results in repetition of the semester, and charging additional fees for repeating the semester or exam. This practice causes tress on the medical students, financial and otherwise. The Committee therefore recommends that UGMEB may develop appropriate feasible modalities for monitoring assessment, revaluation, etc. without charging any additional fee.

ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఫీజులు అధికంగా వసూలు చేస్తాయని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ పేర్కొన్న సిఫార్సుల్లో భాగం

సాక్షి, న్యూఢిల్లీ: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పార్లమెంటు స్టాండింగ్ కమిటీలోనూ, పార్లమెంటులోనూ ప్రజాగళం గట్టిగా వినిపించానని, స్టాండింగ్ కమిటీలో తాను మద్దతిచ్చినట్టు టీడీపీ చేస్తున్నవన్నీ అసత్య ప్రచారాలేనని తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ గురుమూర్తి స్పష్టం చేశారు. తాను లేదా, వైఎస్సార్‌సీపీ నేతలెవరూ వైద్య కళాశాలలను ప్రైవేటుకు ఇవ్వాలని స్టాండింగ్ కమిటీకి చెప్పలేదని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలో గురుమూర్తి మీడియాతో మాట్లాడారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పార్లమెంట్‌లో తాను బలంగా మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రైవేటీకరణ వలన పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుందని, వారు రూ.లక్షలు కుమ్మరించి సీటు కొనలేని పరిస్థితులు ఉంటాయని వివరించినట్లు చెప్పారు. ప్రైవేటీకరణకు మద్దతుగా తాను ఎక్కడా సంతకం పెట్టలేదని స్పష్టం చేశారు. స్టాండింగ్ కమిటీ నివేదికకూ టీడీపీ, ఎల్లో మీడియా వక్రభాష్యం చెబుతున్నాయని, కమిటీ నివేదికలో ఎక్కడా ప్రైవేటీకరణను ప్రోత్సహించలేదని, ప్రైవేటు కాలేజీల వల్ల విద్యార్థులపై ఫీజుల భారం పెరుగుతుందని స్పష్టంగా పేర్కొందని వివరించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కాలేజీలు ఉండాలని చెప్పిందని, ప్రభుత్వం నిర్మిస్తున్న కాలేజీలను ప్రైవేటుకు ఇవ్వాలని ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు. ఈ అంశాలన్నీ టీడీపీకి కనపడ లేదా అని గురుమూర్తి ప్రశ్నించారు.

జిల్లాకో మెడికల్ కాలేజీ వైఎస్ జగన్ కల

ప్రతిజిల్లాకో మెడికల్ కాలేజీ ఉండాలనేది వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల అని గురుమూర్తి చెప్పారు. రాష్ట్రంలో వైద్యవిద్యను అభ్యసించే అవకాశం లేక విద్యార్థులు వలసలు పోతున్నారని, బయట రాష్ట్రాల్లో మెడికల్ సీట్లు కొనే స్తోమత పేద విద్యార్థులకు ఉండడం లేదని, ఈ విషయాలన్నీ గమనించి వైఎస్ జగన్ రాష్ట్రానికి 17 కాలేజీలను తీసుకొచ్చారని గురుమూర్తి పేర్కొన్నారు. వీటిలో కొన్ని కాలేజీల్లో ఇప్పుడు తరగతులు కూడా ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. రాష్ట్రానికి వచ్చిన వంద మెడికల్ సీట్లను వెనక్కి పంపిన చేతగాని ప్రభుత్వం చంద్రబాబుది అని ధ్వజమెత్తారు. తనపై మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలనూ ఖండించారు. మెడికల్ కాలేజీలు ప్రభుత్వమే కట్టేలా ఆయన కృషి చేయాలని హితవుపలికారు.

గోదావరి పుష్కరాల కార్యాచరణ సిద్ధం చేయండి

సీఎస్ విజయానంద్

సాక్షి, అమరావతి: ఈ ఏడాది ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన గంగానది మహా కుంభమేళాలో.. అలాగే, గత గోదావరి పుష్కరాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఏఏ తేదీల్లో అధిక సంఖ్యలో భక్తులు వస్తారనే దానిపై అంచనా వేసి ఈసారి అందుకు రెట్టింపు స్థాయిలో ఏర్పాట్లు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ వివిధ శాఖల కార్యదర్శులను ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరగనున్న గోదావరి పుష్కరాలను విజయవంతం చేసేందుకు ఇప్పటి నుంచే ఆయా శాఖలు జిల్లాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గోదావరి పుష్కరాలపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యదర్శుల కమిటీ సమావేశం శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం సీఎస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ.. ముఖ్యంగా స్నాన ఘాట్‌లను గుర్తించడం, తాగునీరు, పారిశుధ్యం, రవాణా వంటి అంశాలపై డీపీఆర్‌లు పంపాలని సూచించారు. దేవదాయ శాఖ కార్యదర్శి హరి జవహర్‌లాల్, గోదావరి పుష్కరాల ప్రత్యేక అధికారి జి. వీరపాండియన్ ప్రెజెంటేషన్ ఇస్తూ ఈసారి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి 9నుంచి10 కోట్ల మంది వచ్చే అవకాశముందని తెలిపారు.

హారతుల నిర్వహణ ఖర్చు ఆలయాలపైనే..

గోదావరి నదిపై రాజమండ్రి వద్ద గోదావరి హారతుల కార్యక్రమం నిర్వహణకు అయ్యే ఖర్చును రెండు ఆలయాలు భరించాలని ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. గోదావరి హారతుల కార్యక్రమ నిర్వహణకు ప్రతి నెలా రూ.2.50 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేసింది. ఆ మొత్తాన్ని అన్నవరం శ్రీవీరవేంకటసత్యనారాయణ స్వామి ఆలయం, వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాల నిధుల నుంచి 60:40 నిష్పత్తిన అందజేయాలని పేర్కొంది. దేవదాయ శాఖ కమిషనర్ నుంచి అందిన ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతూ దేవదాయశాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి హరిజవహర్‌లాల్ ఆదేశాలు జారీ చేశారు.

తిరుమల వసతి గృహంలో కోడిగుడ్లు కలకలం

సోషల్ మీడియాలో వీడియో వైరల్

తిరుమల: తిరుమలలోని కౌస్తుభం అతిథి గృహంలో శుక్రవారం కోడిగుడ్లు కనిపించడం కలకలం రేపింది. ఓ భక్తుడు కౌస్తుభంలోని 538వ గదిని ఇటీవల అద్దెకు తీసుకున్నాడు. తిరుమలపై నిషేధిత కోడి గుడ్లను ఆ గదిలోకి తీసుకువచ్చి వినియోగించాడు. అనంతరం టీటీడీ యంత్రాంగం ఆ గదిని వేరే వ్యక్తికి కేటాయించింది. అతను ఆ గదిలో కోడిగుడ్డు పెంకులను గుర్తించి టీటీడీకి ఫిర్యాదు చేయడంతో పాటు.. అందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. అది వైరల్ కావడంతో స్పందించిన టీటీడీ.. విధి నిర్వహణలో అలసత్వం వహించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించింది. అదేవిధంగా నిషేధిత వస్తువైన కోడి గుడ్లను తిరుమలకు తెచ్చిన వ్యక్తిపై టీటీడీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, తిరుమలలో ఓ భక్తుడు గదిని ఖాళీ చేశాక.. శుభ్రం చేయకుండానే మరో భక్తుడికి అదే గదిని ఎలా కేటాయించారని భక్తుల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి.

సంస్థాగత నిర్మాణంపై స్పెషల్ డ్రైవ్

- 35 రోజుల పాటు నిర్మాణం, కమిటీల కూర్పుపై ప్రత్యేక కార్యక్రమం
- కమిటీలు పూర్తయితే పార్టీకి 16 లక్షల నుంచి 18 లక్షల సైన్యం
- ఆ వెంటనే పార్టీ క్యాడర్‌కు గుర్తింపు కార్డులు
- వైఎస్సార్‌సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ సంస్థాగత నిర్మాణం, కమిటీల నియామకాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన సమయం ఆసన్నమైందని ఆ పార్టీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శులకు శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్రకార్యాలయంలో రాష్ట్రస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమాలకు 35 రోజుల ప్రత్యేక కార్యక్రమం రూపొందించినట్లు చెప్పారు. పార్టీ అనుబంధ విభాగాలను మరింత బలోపేతం చేయాలన్నారు. 'పార్టీ కమిటీలను బలంగా నిర్మించుకోవాలి. గ్రామస్థాయి నుంచి కమిటీల్లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం ఉండాలి. ఉత్సాహంగా పనిచేసే వారికి అవకాశం ఇవ్వాలి. మీడియా, సోషల్ మీడియాను వినియోగించుకోవాలి. జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు నియోజకవర్గ ఇన్‌చార్జికి సహాయపడుతూ బాధ్యతలు చిత్తశుద్ధితో నెరవేర్చాలి. పార్టీ నిర్మాణంలో మీ పాత్ర కీలకం. డిజిటల్ మేనేజర్లు, ఐటీ నిపుణులు, సోషల్ మీడియా ఇన్‌చార్జిలు సహాయ సహకారాలు అందిస్తారు. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ప్రతి కమిటీ సభ్యుడి డేటాను డిజిటలైజ్ చేసి ఒకగొడుగు కిందకు తీసుకువస్తున్నాం. ఇవన్నీ పూర్తయితే పార్టీకి 16 లక్షల నుంచి 18 లక్షల సైన్యం సిద్ధమవుతుంది. వెంటనే క్యాడర్‌కు గుర్తింపు కార్డులు ఇస్తాం. పార్టీ అధినేత జగన్ అధ్యక్షతన మనపార్టీ నిత్యం ప్రజలతోనే, ప్రజలకొరకు ముందుకుసాగుతూనే ఉంది. అధికారంలో ఉన్నప్పుడు కూడా నిత్యం ప్రజలకోసం తపించిన నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్. మంచిపాలన ఎలా ఉంటుందో చూపిన నాయకుడు ఆయన. ఇప్పుడు ప్రజలకు తామేం కోల్పోయామనేది స్పష్టంగా అర్థమవుతోంది. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా నిత్యం ప్రజల తరపున నిలబడడం, పోరాడడం అనేది మన వైఎస్సార్‌సీపీకే దక్కుతుంది. కోటి సంతకాల ఉద్యమం అనేది ప్రజా ఉద్యమంగా మారిందంటే మనందరి కష్టం, శ్రమ వల్లే. ఈ మధ్యకాలంలో ఎన్నడూ ఇలాంటి కార్యక్రమం చూడలేదు. ప్రజల ఆకాంక్షను ప్రతిబింబించేలా చేయగలిగాం. ఇలాంటి ఎన్నో ప్రజా ఉద్యమాలకు వైఎస్సార్‌సీపీ కేరాఫ్ అడ్రస్‌గా మారింది' అని చెప్పారు. ఈ 35 రోజులు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని చాలెంజ్‌గా తీసుకుని మిమ్మల్ని మీరు నిరూపించుకోవాలని వారికి సూచించారు. ఈ సమావేశంలో పార్టీ సెంట్రల్ ఆఫీస్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి (మీడియా) పూడి శ్రీహరి, రాష్ట్ర కార్యదర్శులు చల్లా మధు, పుత్తా ప్రతాప్, హర్షవర్ధన్, పుత్తా శివశంకర్, కందుల రవీంద్ర, వజ్ర భాస్కర్, లీగల్‌సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు టి.జె.ఆర్.సుధాకర్‌బాబు తదితరులు పార్టీ సంస్థాగత నిర్మాణం, కమిటీల నియామకాల స్పెషల్ డ్రైవ్‌పై అవగాహన కల్పించారు.

'సీఎం మార్పు'పై మళ్లీ ఎత్తుకు పైఎత్తులు

- సిద్ధరామయ్యనే సీఎంగా కొనసాగించాలని అధిష్టానానికి కర్ణాటక అహింద నేతల లేఖలు
- ఒప్పందం మేరకు ముందుకెళతామంటున్న డీకే

సాక్షి బెంగళూరు/బనశంకరి: బెళగావిలో కర్ణాటక అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ముగిసిన నేపథ్యంలో సీఎం మార్పు అంశం మళ్లీ జోరందుకుంది. అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాలకు ఈ విషయం ఒక అస్త్రంగా మారకూడదనే ఉద్దేశంతో సీఎం, డీసీఎంలు రాజీ మార్గం అనుసరించారు. అయినప్పటికీ ఇరు వర్గాలు ఇటు బెంగళూరు, అటు ఢిల్లీ వేదికగా ఈ విషయంపై ఎప్పటికప్పుడు వ్యాఖ్యలు చేస్తూ లైవ్‌లో ఉండేలా చేశాయి. ఈ నేపథ్యంలో డాక్టర్ యతీంద్ర తన తండ్రి సిద్ధరామయ్య ఐదేళ్లూ సీఎంగా పదవీ కాలాన్ని పూర్తి చేసుకుంటారని వ్యాఖ్యానించి అధికార మార్పిడి అంశానికి ఆజ్యం పోశారు. ఇందుకు ప్రతిగా డీసీఎం డీకే శివకుమార్ వర్గానికి చెందిన ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ మరో అడుగు ముందుకు వేసి జనవరి 6 లేదా 9న డీకే సీఎం పదవి చేపడతారని ప్రకటించి అందరికీ షాక్ ఇచ్చారు. ఈ క్రమంలో ఇరు వర్గాలు విందు సమావేశాలు ఏర్పాటు చేసి మంతనాలు సాగించాయి. ఈ నేపథ్యంలో ఈనెల 27, 28 తేదీల్లో ఢిల్లీలో ఏఐసీసీ వర్కింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాటైన కమిటీలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో పాటు మంత్రులు కేజే జార్జ్, కేహెచ్ మునియప్ప, సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్ సభ్యులుగా ఉన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా డీకే శివకుమార్‌ను ప్రత్యేక ఆహ్వానితుడిగా సమావేశానికి పిలవనున్నారు. ఈ క్రమంలో అధిష్టానం నుంచి వీలైనంత త్వరగా సీఎం మార్పుపై ప్రకటన చేయించాలని డీకే వర్గం విశ్వప్రయత్నాలు సాగిస్తుంటే.. సిద్ధరామయ్యనే సీఎంగా కొనసాగించాలని ఆయన వర్గం ఒత్తిడి తెస్తోంది. ఇందులో భాగంగా తాజాగా అధిష్టానానికి లేఖలను పంపాలని అహింద నాయకులు తీర్మానించారు. త్వరలో బెంగళూరులో భారీ ఎత్తున అహింద నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేసి సిద్ధరామయ్య నాయకత్వాన్ని బలపరచాలనే ప్రణాళికను రచిస్తున్నారు.

ఐదేళ్లూ నేనే సీఎం : సిద్ధు

హైకమాండ్ చెప్పే వరకు తానే సీఎం అని, హైకమాండ్ తన పక్షాన ఉందని సీఎం సిద్ధరామయ్య ఇటీవలే అసెంబ్లీలో వ్యాఖ్యానించారు. రెండున్నరేళ్ల పదవీ కాలం తర్వాత అధికార మార్పిడి ఒప్పందమనేది అబద్ధమని చెప్పారు. కర్ణాటక ప్రజలు తమను ఆశీర్వదించారని, ఎమ్మెల్యేలు తనను శాసనసభ నాయకుడిగా ఎన్నుకున్నారని, ఆ తర్వాత హైకమాండ్ నిర్ణయించిందని గుర్తు చేశారు. తన వర్గాన్ని పటిష్ట పరుచుకోవడంలో భాగంగా గురువారం రాత్రి సీనియర్ మంత్రి సతీశ్ జార్కిహోళి బెళగావి కువెంపునగరలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన డిన్నర్ మీటింగ్‌లో సీఎం సిద్ధరామయ్య వర్గం నేతలంతా పాల్గొన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ నాయకత్వ మార్పునకు అవకాశం కల్పించకూడదని తీర్మానించినట్లు తెలిసింది. కాగా, సీఎం సిద్ధరామయ్య వర్గం డిన్నర్ మీటింగ్‌పై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సానుకూలంగా స్పందించారు. డిన్నర్ మీటింగ్స్ నిర్వహిస్తే తప్పేంటి? తానెందుకు స్పందించాలని ప్రశ్నించారు. తనకు, సీఎం సిద్ధరామయ్యకు మధ్య ఒప్పందం జరిగిందని, ఇద్దరం కలిసి మాట్లాడుకున్నామని, ఆ ప్రకారం నడుచుకుంటామని తెలిపారు.



డిసెంబర్ వచ్చింది.
అందరి భావన కన్ను మూసి
తెరిచేంతలో కొత్త సంవత్సరం
వచ్చేసిందే అని.
కాని డిసెంబర్ మాసం
'ఎగ్జామ్ ఇవాల్యుయేటర్' వంటిది.
ఈ సంవత్సరం మొత్తం మీరు
కుటుంబ, ఆర్థిక, వ్యక్తిగత, స్నేహ,
బౌద్ధిక, కళారంగాలలో
మీ సమయాన్ని ఎలా వెచ్చించారో,
ఏ మేరకు ఎదిగారో బేరీజు వేస్తుంది.
అందుకే కాగితం తీసుకుని
హైలైట్స్ రాసుకోండి.
వచ్చిన మార్కులను బట్టి కొత్త ఏడాదికి
మరింత జాగ్రత్తగా సిద్ధం కండి.

డిసెంబర్ సమయం

ఈ సంవత్సరాన్ని కాగితంపై పెట్టండి...

కాలం దగ్గర మేజిక్ ఉంటుంది. అది కొందరికి చిటికెలో అయిపోయిన భావన ఇస్తుంది. మరికొందరికి ఎంతకూ గడవని మొండి ఘటంలా తోస్తుంది. అంతా మానసికమే. మన చేతుల్లో ఉన్న సంగతే. 'గమనించ దగ్గ విషయం' ఏమిటంటే గతంలో కొందరికి మెల్లగా, కొందరికి వేగంగా గడిచిన కాలం ఇప్పుడు అందరికీ ఒక్కలాగే పరుగు పరుగున సాగుతోంది. కారణం? అందరి చేతుల్లో ఫోన్లు ఉండటమే. అలా రీల్స్ చూస్తూ ఉంటే డిసెంబర్ రావడం ఏమిటి... దశాబ్దాలే గడిచిపోతాయి. నిజం. ఎన్ని డైవర్షన్స్ ఇవాళ మన జీవితంలో! ఎంత తీరుబడిలేనితనం – 'పనికిమాలిన విషయాల ఆక్రమణ వల్ల'! సమయమంతా వాటికే వెచ్చించడం వల్ల. అలా వెనక్కు తిరిగి చూడండి. ఈ సంవత్సరం నిర్మాణాత్మకంగా ఏమైనా చేయగలిగారా? సాధించగలిగారా? 2024 డిసెంబర్ చివరన తీసుకున్న నిర్ణయాలు ఏవైనా కొన్ని అమలు చేయగలిగారా? అలా గాల్లో చూస్తూ మననం చేసుకుంటే లెక్క తేలదు. పేపర్ మీద పెట్టాలి. ఒక తెల్లకాగితం తీసుకుని మీ పేరు రాసి కింద 'హైలైట్స్ 2025' అని హెడ్డింగ్ పెట్టి ఒక్కో విభాగంలో ఏమైనా చేశారో చేయలేకపోయారో రాసుకోండి. అప్పుడు సంవత్సరం ఎలా గడిచిందో తెలుస్తుంది. తప్పులు తెలుస్తాయి. అప్రమత్తత కలుగుతుంది. కాలం విలువైనది. కాలానికి విలువనిచ్చినవారే విలువైన జీవితాలను నిర్మించుకుంటారు.

కుటుంబం: కుటుంబానికి ఎంత సమయం ఇవ్వగలిగారో రాసుకోండి. కుటుంబ సభ్యుల సబబైన ఆకాంక్షలను ఏమేరకు సఫలం చేయగలిగారు? అసలు వారి ఆకాంక్షలేమిటో విన్నారా? ప్రతి సభ్యుడికి సమానమైన విలువ, గౌరవం ఇచ్చి తద్వారా మీరు గౌరవం పొందారా? థ్యాంక్యూలు ఎక్కువా... లేదా సారీలా? కుటుంబ ఆరోగ్యం గురించి, హెల్త్ పాలసీల గురించి, పెద్దలకు చేయించాల్సిన టెస్ట్‌ల గురించి ఎంత సమయం ఇచ్చారు? వారు మీ పట్ల సంతృప్తిగా ఉన్నారా? పేపర్ మీద రాసుకుంటూ ఉంటే మీరు మెరుగ్గానే వ్యవహరించినట్టుగా అనిపిస్తోందా?

ఆర్థికం: గత సంవత్సరం సంపాదన కన్నా ఈ సంవత్సరం సంపాదన విషయంలో కొత్త ఆలోచనలు చేశారా? ఒక ఆదాయ మార్గంపైనే ఆధారపడకుండా ఇతర ఆదాయ మార్గాలకు ప్రయత్నించారా లేదా? ఈ సంవత్సరం పొదుపు ఎంత? పెట్టుబడి ఎంత? కనీసం కాసింత బంగారం అయినా కొని దాచగలిగారా? దుబారా జరిగితే ఎందుకు జరిగినట్టు? డబ్బు విషయంలో మార్చుకోవాల్సిన పద్ధతులు, బలహీనతలు మార్చుకున్నారా? ఆర్థిక రంగం గురించి ఇప్పుడు ఏమిటి? నెక్స్ట్ ఏం చేయాలి?

వ్యక్తిగతం: మిమ్మల్ని మీరు పట్టించుకున్నారా? వ్యాయామం, ధ్యానం, చలికి తగిన డైట్... ఏం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య పరీక్షలు, 'రిపేర్లు' చేయించుకున్నారా? కంటి, పంటి వైద్యాలు... బరువు అదుపు... కేశ, చర్మ సంరక్షణ... సమతుల్య ఆహారం... తినకూడని ఆహారాన్ని మానేయడం... ఈ సంవత్సరం ఎన్ని లెక్కలేనితనాలు... ఇవన్నీ రాబోయే సంవత్సరాల్లో మీ ఆరోగ్యాన్ని దెబ్బ తీయకుండా ఉండాలంటే పేపర్ మీద మీరు వేసుకున్న మార్కులే హెచ్చరిక.

స్నేహం: స్నేహితులను నిలబెట్టుకోవడమే కాదు టాక్సిక్ స్నేహాలను, మొహమాటం పెట్టి మనల్ని ఎక్స్‌ప్లాయిట్ చేసుకునే స్నేహాలను వదులుకోవడం కూడా ముఖ్యమే. ఈ సంవత్సరం మీ స్నేహవాతావరణం ఎలా ఉంది. మంచి స్నేహితుల కోసం మీరు ఏం చేశారు? వారికి మీ స్నేహాన్ని, ప్రేమను పంచారా? చెడ్డ స్నేహితులు మిగిలి మంచి స్నేహితులు మీ నుంచి దూరమై ఉంటే మీ దోషాలు ఏమిటో చూసుకున్నారా? స్నేహం వల్లే కాలం సులువుగా కదులుతుంది. స్నేహంలో మీకు వచ్చిన మార్కులు ఎన్ని?

మెదడుకు ఆహారం: మనిషి మెదడు ఒక సూపర్ కంప్యూటర్. దానికి జ్ఞానం ఇచ్చే కొద్దీ అది జీవితాన్ని సులభతరం చేస్తుంది. నేర్చుకుంటూ ఉన్నప్పుడే మెదడు ఆరోగ్యంగా ఉంటుంది. మీరు ఈ సంవత్సరం మెదడుకు కొత్త విషయాలను ఏం చెప్పారు? మంచి ఆలోచనాత్మక పుస్తకాలు, వ్యాసాలు, ప్రపంచ పరిణామాలు, ప్రకృతి విషయాలను ఏం తెలుసుకున్నారు? కొత్త ప్రాంతాలను ఏం చూశారు. పోనీ పిల్లల పుస్తకాల్లో ఉన్న కనీస విషయాలనైనా మనం తెలుసుకున్నామా? సమాజం ఎటు పోతున్నదో తెలుసుకోకుండా మనం సరిగ్గా నెగ్గలేం. మేధో విషయాలను తెలుసుకోవడంలో మీకు వచ్చిన మార్కులు ఎన్ని?

కళారంగం: 'ఉత్తినే తిని తొంగుంటే మడిసికీ గొడ్డుకూ తేడా ఏం ఉంటుంది' సినిమాలో డైలాగ్. సంగీతం, నాటకం, మంచి సినిమా, సాహిత్యం... ఈ సంవత్సరం వీటికి మీరిచ్చిన సమయం ఎంత? మంచి అనుభూతులను పొందింది ఎంత? 2025లో ఎన్నో ఉత్తమ పుస్తకాలు, పాటలు, సినిమాలు వచ్చాయి. వాటికి ఏ మేరకు సమయం ఇచ్చారు? మీ ఊళ్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరయ్యారా? మీకు ఒక అభిమాన రచయితో, నటుడో, గాయకుడో ఉన్నారా? జీవితం వేరు, రసాత్మక జీవితం వేరు. కళలతో జీవితం, కాలం రసాత్మకం అవుతాయి. మరి మీకొచ్చిన మార్కులెన్ని? బేరీజు వేసుకోండి. కొత్త సంవత్సరానికి సిద్ధం కండి.

ఆ ప్రశ్న ఉద్యమం అయింది!

గత మూడు దశాబ్దాలుగా న్యాయవాది వర్ష్ దేశ్ పాండే లింగ వివక్షతకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేస్తోంది. అసౌకర్యం, బాధలో నుంచి తలెత్తిన ఒక సాధారణమైన ప్రశ్నతో ఆమె పోరాటం ప్రారంభమైంది.

'అమ్మాయిలు తమదైన సమాజానికి ఎందుకు దూరం అవుతున్నారు?' ఈ ప్రశ్న 'దళిత మహిళా వికాస్ మండల్'కు పునాదిగా మారింది. మహారాష్ట్రలో పాతుకుపోయిన చట్టవిరుద్ధమైన లింగనిర్ధారణ పరీక్షల రాకెట్లను బహిర్గతం చేసిన పాండే ఉద్యమాలు ఎన్నో చేసింది. ఎంతోమంది దొంగ వైద్యులను జైలుకు పంపించింది. ఈ సంవత్సరం ప్రతిష్ఠాత్మకమైన యూఎన్ పాపులేషన్ అవార్డ్ రూపంలో ఆమె పోరాటానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. 'ఇది నాకు వచ్చిన గుర్తింపు కాదు. నా పక్కన నిలబడిన ధైర్యవంతులైన మహిళలకు' అంటోంది వర్ష్ దేశ్ పాండే.

మహాత్ముడి ఇలస్ట్రేషన్స్ నేడు పుస్తక రూపంలో



బోసి నవ్వుల తాత, ధర్మాగ్రహ ధీరుడు ధ్యానంలో మహాత్ముడు, దయార్ద్ర హృదయుడు...మహాత్ముడు. ఒకే మహాత్ముడు అనేకానేక రూపాలలో!

ఆ రూపాలను తన కుంచెతో ఆవిష్కరించి, వాటికి పుస్తక రూపం ఇచ్చారు కార్టూనిస్ట్ శంకర్. మహాత్మా ఇల్లస్ట్రేటెడ్ అండ్ స్కెచింగ్ ఎ లెగసీ ఇన్ ఇంక్ అండ్ కన్‌సైన్స్ పేరుతో రానున్న ఈ పుస్తకం పుస్తకం చెప్పాలంటే ఒక చరిత్ర.... చరిత్ర పునర్నిర్మాణం.

ప్రపంచ ప్రఖ్యాత చరిత్రకారుడు రామచంద్ర గుహ ఈ పుస్తకానికి పీఠిక రాయగా.. ఈ పుస్తకం రేఖాచిత్రాల సంపుటం మాత్రమే కాదు, అంతకు మించినదని చిత్రకారుడు, గాంధీజీ విశేషజ్ఞుడు అయిన బిరద్ రాజారామ్ యాజ్ఞిక్ పేర్కొన్నారు. గాంధీజీ భంగిమలను శంకర్ చిత్రించిన తీరు భారతీయులకే కాదు, విదేశీ అభిమానులకు సైతం ఈ పుస్తకం నేత్రపర్వం చేయగలదనడంలో సందేహం అవసరం లేదు. ఈ పుస్తకం రేఖాచిత్రాల సంపుటం మాత్రమే కాదు, అంతకు మించినదని చిత్రకారుడు, గాంధీజీ విశేషజ్ఞుడు అయిన బిరద్ రాజారామ్ యాజ్ఞిక్ రాశారు 'మహాత్మా, ఇలస్ట్రేటెడ్' అనే ఆ కాఫీ టేబుల్ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నేడు హైదరాబాద్ నానక్‌రామ్ గూడలోని ఇవాన్‌లో సాయంత్రం నాలుగు గంటలకు జరగనుంది. ఇందులో దండి యాత్రకు సంబంధించి గాంధీజీ క్యారికేచర్‌తో సహా మొత్తం 150 స్కెచెస్ ఉన్నాయి. ఈ డ్రాయింగ్స్ అన్నీ కాఫీ టేబుల్ పుస్తకరూపంలో కళాభిమానులకు కనువిందు చేయనున్నాయి.

బ్యూటిప్



కళ్ల చుట్టూ వలయాల నివారణ కోసం...
కీరా రసంలో కాటన్ ప్యాడ్స్‌ని ముంచి కనురెప్పలపై ఉంచి అర గంట తరవాతతీసేయాలి. ఇలా చేస్తే కంటికి మంచి ఉపశమనంగా ఉంటుంది.



మృదువైన చేతుల కోసం... రెండు టీ స్పూన్ల టొమాటో రసంలో టీ స్పూన్ నిమ్మరసం, టీ స్పూన్ గ్లిజరిన్ కలపాలి. ఈ మిశ్రమంతో చేతులను 4 నిమిషాల పాటు మర్దనా చేసి గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

బులియన్ (బంగారం 10 గ్రా., వెండి కిలో) డిసెంబర్ 19న ముగింపు ధరలు

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,35,890	1,36,160	1,34,180	1,36,150	1,32,200	1,35,050
బంగారం (22 క్యారెట్లు)	1,25,670	1,23,000	1,23,000	1,26,690	1,21,620	1,23,800
వెండి	2,06,500	2,07,000	2,21,000	2,07,000	1,98,000	2,21,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా

హార్డ్‌వర్క్ మాత్రమే మాట్లాడుతుంది

- సాయిదుర్గా తేజ్

సాక్షీ మడోల్కర్, సాయిదుర్గా తేజ్, రోషన్ కనకాల, టీజీ విశ్వప్రసాద్

రోషన్ కనకాల, సాక్షీ మడోల్కర్ హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మోగ్లీ 2025'. సందీప్ రాజ్ దర్శకత్వంలో టీజీ విశ్వ ప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదలైంది. తమ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన హీరో సాయిదుర్గా తేజ్ మాట్లాడుతూ– ''చిన్నప్పట్నుంచి మోగ్లీ క్యారెక్టర్‌ను చూస్తూ పెరిగాను. ఈ రోజు ఆ టైటిల్‌తో సినిమా రావడం అనేది చాలా ఆనందాన్నిచ్చింది. ఇండస్ట్రీలో హార్డ్‌వర్క్ మాత్రమే మాట్లాడుతుంది. రోషన్ అద్భుతంగా నటించాడు. రోషన్ మరింత గొప్ప స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నాను. బండి సరోజ్‌గారు బాగా యాక్ట్ చేశారు. సందీప్‌గారు ఈ సినిమాను అద్భుతంగా తీశారు'' అని అన్నారు. ''నాకు సినిమా అంటే ప్రాణం... పిచ్చి. సుమారాజీవ్‌ల కొడుకు కదా... తనకు అంతా ఈజీగా జరిగిపోతుంది అనే మాటలు విన్నాను. నిజానికి అందరు హీరోలూ, వారి అభిమానులు నాకు చాలా సపోర్ట్ చేశారు. వాళ్ళందరికీ ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటాను. అయితే దీనికి మించి తలరాత ఉంటుంది. ఎవరి తలరాత వాళ్ల చేతుల్లోనే ఉంటుంది. దానిని నిర్వచించేది హార్డ్‌వర్క్, టాలెంట్, డిసిప్లెయిన్. ఈ మూడు మాత్రమే విజయాన్ని నిర్ణయిస్తాయి. నా హండ్రెడ్ పర్సెంట్ హార్డ్ వర్క్ నేను పెట్టాను. ప్రాణం పెట్టి పని చేశాను. 'మోగ్లీ 2025' సినిమాను గెలిపించిన అందరికీ థ్యాంక్స్'' అని అన్నారు. ''మేం చిన్న సినిమా తీశాం. కానీ ఆడియన్స్ పెద్ద సక్సెస్ ఇచ్చారు'' అని చెప్పారు టీజీ విశ్వప్రసాద్. హీరోయిన్ సాక్షి, దర్శకుడు హేమంత్ మధుకర్ మాట్లాడారు.

ఇది రెగ్యులర్ సినిమా కాదు

- వినోద్ కుమార్

సాయి సింహాద్రి, వినోద్ కుమార్, సతీష్

సాయి సింహాద్రి హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'సన్ ఆఫ్'. వినోద్‌కుమార్ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాకు బత్తుల సతీష్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో వినోద్‌కుమార్ మాట్లాడుతూ– ''సన్ ఆఫ్' రెగ్యులర్ ఫార్మాట్ సినిమా కాదు. స్క్రీన్‌ప్లే బేస్డ్ మూవీ. తండ్రీకొడుకుల మధ్య సాగే మంచి కథ. ఎక్కడో పర్లాకిమిడిలో చదివి, ఆ తర్వాత అమెరికా వెళ్లి, తిరిగి అక్కడ్నుంచి వచ్చి, సాయి సింహాద్రి ఈ సినిమాను నిర్మించడం గ్రేట్ అచీవ్‌మెంట్. నటుడిగా నాకున్న అనుభవంతో చెబుతున్నాను... ఈ చిత్రదర్శకుడు మంచి ప్రతిభాశాలి. ఎంతో కమిట్‌మెంట్‌తో ఈ సినిమా చేశాడు. ప్రస్తుతం నేను గోపీచంద్ హీరోగా చేస్తున్న సినిమాలో, 'మారెమ్మ' చిత్రాల్లో నటిస్తున్నాను. అలాగే సుహాసినితో కలిసి ఓ సినిమా చేస్తున్నాను'' అని చెప్పారు. ''ఈ కథ రియల్ లైఫ్‌లో నాకు, మా నాన్నకు కనెక్ట్ అవుతుంది. ప్రతి కొడుకు తన తండ్రికి చూపించాల్సిన సినిమా ఇది. నేను చిరంజీవి గారికి అభిమానిని. ఆయనకు ఈ సినిమా చూపించాలని ఉంది'' అన్నారు. ''ఈ సినిమాలో కొడుకు తన తండ్రిపై ఎందుకు కేసు వేశాడు? అన్న పాయింట్‌ని స్ట్రాంగ్‌గా చూపించాం. వినోద్‌కుమార్‌గారి కెరీర్‌లో 'మామగారు' సినిమాలా ఈ 'సన్ ఆఫ్' చిత్రం కూడా నిలిచిపోతుందని అనుకుంటున్నాను'' అని పేర్కొన్నారు సతీష్. ఈ కార్యక్రమంలో 'చిత్రం' శ్రీను, రిషి తదితరులు పాల్గొన్నారు.

మా తాతగారు తన కష్టాన్ని ఎప్పుడూ చెప్పలేదు

- శోభన్‌బాబు మనవడు డా. సురక్షిత్

'సోగ్గాడు' స్వర్ణోత్సవంలో శోభన్‌బాబు మనవళ్లు సౌరభ్, సురక్షిత్‌ల సమక్షంలో పి. సుశీలకు సత్కారం

''అందరికీ మా తాతగారు 'సోగ్గాడు'గా తెలుసు. కానీ నాకు అంతకన్నా ఎక్కువ. ఆయన ఎంత సక్సెస్ అయినా ఫ్యామిలీకి, ఫ్యాన్స్‌కి టైమ్ కేటాయించారు'' అని ప్రముఖ నటుడు శోభన్ బాబు మనవడు డా. సురక్షిత్ పేర్కొన్నారు. శోభన్‌బాబు హీరోగా నటించిన 'సోగ్గాడు' సినిమా యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ చిత్రనిర్మాణ సంస్థ సురేష్ ప్రొడక్షన్స్ డి. సురేష్ బాబు, అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం 'స్వర్ణోత్సవం' జరిగింది. ఈ వేదికపై

డా. సురక్షిత్ ఇంకా మాట్లాడుతూ – ''సోగ్గాడు' తీసినందుకు సురేష్‌బాబుగారికి, ఆయన ఫ్యామిలీకి అభినందనలు. యాభై ఏళ్ల తర్వాత కూడా ఈ సినిమా గురించి మాట్లాడుకుంటున్నాం. దీన్ని బట్టి 'లెజెండ్స్ మన మనసులను ఎప్పుడూ వదిలి వెళ్లరు' అని అర్థమవుతోంది. వాళ్లపట్ల మనం చూపించే ప్రేమే ఆ జ్ఞాపకాలను పదిలంగా ఉంచుతాయి. 'నేనింత కష్టపడ్డాను...అంత కష్టపడ్డాను' అని మా తాతగారు ఎప్పుడూ చెప్పలేదు. కానీ మనందరికీ తెలుసు ఎంత కష్టపడ్డారో. చెన్నైలో మండుటెండల్లో సైకిలు మీద ఇంటి నుంచి స్టూడియోలకు వెళ్లడం అలా కష్టపడ్డారు. కానీ ఆ కష్టాన్ని ఎప్పుడూ చెప్పలేదు. ఎందుకంటే ఆయనకు సినిమా అంటే చాలా ఇష్టం. అయితే ఫ్యామిలీలో ఎవర్నీ సినిమాల్లోకి వెళ్లమని ఫోర్స్ చేయలేదు. ఎవరికి నచ్చింది వారిని చెయ్యమన్నారు. అందుకే నేను మెడిసిన్ చేశాను. ఇవాళ తాతగారిని చాలా మిస్సవుతున్నాను. ఎందుకంటే నేను సాధించినవి ఆయన చూడలేదని, ఈ యాభై ఏళ్ల సంబరాలను చూడ్డానికి లేరనే వెలితి ఉంది. ఆయన లెగసీని జ్ఞాపకాల్లో ఉంచుకోవడం మాత్రమే కాదు... నా సేవల ద్వారా కాపాడుకోవాలనుకుంటున్నాను'' అని చెప్పారు.

డి. సురేష్‌బాబు మాట్లాడుతూ– ''మాకు ఎంతో ముఖ్యమైన 'సోగ్గాడు' చిత్రంలో భాగమైన శోభన్‌బాబు, రైటర్ బాల మురుగన్, విన్సెంట్‌గార్లు... ఇలా కొంతమంది ఇప్పుడు లేరు. సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ రీ స్టార్ట్ చేసిన సినిమా ఇది. 1975లో నాన్నగారు సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ పెట్టి, ఈ సినిమా తీశారు. ఆ రోజుల్లో 'సోగ్గాడు' ఇండస్ట్రీ రికార్డ్స్‌ను ఈజీగా కొట్టిందనుకుంటున్నాను. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలను ఇటీవల చూశాను. జయచిత్ర, జయసుధగార్లు బాగా నటించారు. సోగ్గాడు పాత్రని శోభన్‌బాబుగారు నిజాయితీగా చేయడంవల్లే ఆయన కెరీర్‌లో ఈ సినిమా బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ వేడుకలో సుమలత, బేబీ రాణి, రోజా రమణి, వై. విజయగార్లు... ఇలా అందర్నీ కలుసుకోవడం సంతోషంగా ఉంది. ఇందాక పి. సుశీలగారు పాడుతున్నప్పుడు హ్యాపీగా అనిపించింది. ఇప్పుడూ ఆమె పాటలు పాడుతున్నారు. కళ, పాటల విలువ మరోసారి తెలుస్తోంది'' అని చెప్పారు.

పి. సుశీల మాట్లాడుతూ– ''యాభై ఏళ్ల పండగ ఇది. సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ ఎంత పెద్ద పేరు సంపాదించిందో అందరికీ తెలుసు'' అంటూ 'సోగ్గాడే చిన్ని నాయనా, జోరు మీద ఉన్నావు తుమ్మెదా, రాజువయ్యా...' తదితర పాటలను హమ్ చేశారు.

అట్లూరి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ– ''శోభన్‌బాబుతో తొమ్మిది సినిమాలు నిర్మించా. ఆయన నటుడు, హీరో కన్నా సినీ ఇండస్ట్రీకి ఆర్థిక మంత్రి అనిపించుకున్న వ్యక్తి. ఇంత వస్తే అంత అని లెక్కలు వేసుకునేవారు. రాజకీయాల్లోకి వెళ్లి, ఆర్థికమంత్రి అయ్యింటే బాగుండేదని ఆయనతో అనేవాడిని'' అని తెలిపారు.

జయసుధ మాట్లాడుతూ– ''శోభన్‌బాబుగారితో నేను 38 సినిమాలు చేశాను. ఆయనతో నా జర్నీని ఓ పుస్తకంగా రాయవచ్చు'' అని అన్నారు.

ఈ వేడుకలో పి. సుశీల తదితరులను సత్కరించారు. రచయిత, మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ ఎమ్మెల్యే జేష్ఠ రమేశ్‌బాబు, దర్శక–నిర్మాతలు రేలంగి నరసింహారావు, కేఎస్ రామారావు, కేవీ సత్యనారాయణ, అశోక్‌కుమార్, రాజు, రామసత్యనారాయణ, నటుడు రఘుబాబు, అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి గౌరవ అధ్యక్షుడు నరసింహారావు, చైర్మన్ సుధాకర్, కన్వీనర్ సాయి కామరాజు, పూడి శ్రీనివాస్, బాలసుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాస్, వీరప్రసాద్, విజయ్ కుర్రా రాంబాబు, తెలంగాణ శోభన్‌బాబు ఫ్యాన్స్ పాల్గొన్నారు.

జడల్ ఫ్రెండ్ బిర్యానీ

ఇక్కడున్న ఫొటోలో సంపూర్ణేష్ బాబు ఎంత సీరియస్‌గా కనిపిస్తున్నారో చూశారుగా! ఇప్పటివరకు ఎక్కువగా వినోదాత్మక పాత్రలే చేసిన సంపూర్ణేష్ 'ది ప్యారడైజ్' సినిమాలో 'బిర్యానీ' అనే సీరియస్ రోల్ చేస్తున్నారు. శుక్రవారం ఈ చిత్రంలోని సంపూర్ణేష్ బాబు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ మూవీ 'ది ప్యారడైజ్'. ఈ చిత్రంలో మోహన్‌బాబు కీలక పాత్ర చేస్తుండగా రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ బాబు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇందులో జడల్ అనే పాత్రలో నాని నటిస్తున్నారు. జడల్‌కి స్నేహితుడు, నమ్మకస్తుడైన బిర్యానీ పాత్రలో సంపూర్ణేష్ బాబు కనిపిస్తారు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 26న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో విడుదల కానుంది.

డింపుల్ హయతి, రవితేజ, ఆషికా రంగనాథ్

సమస్య ఏంటో చెప్పండి

'సైకాలజిస్ట్ దగ్గరకు ఎందుకు సార్?, రెండుసార్లు చెప్పలేను... వాడికి చెప్పేటప్పుడు విను' వంటి డైలాగ్స్‌తో ప్రారంభమైంది 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమా టీజర్. రవితేజ హీరోగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా ఇది. ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమాలో రామసత్యనారాయణ పాత్రలో రవితేజ కనిపిస్తారు. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను శుక్రవారం విడుదల చేసి, ఈ సినిమాను సంక్రాంతి సందర్భంగా జనవరి 13న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ తెలిపారు. 'ఇంతకీ మీ సమస్య ఏంటో చెప్పండి.., రామ్‌ని అనుమానించడమా... మగాళ్ళు ఎలా ఉండాలి అనేదానికి రోల్ మోడల్ రామ్.., మొన్న బావ కూడా స్పెయిన్ వెళ్లి వచ్చాడు... అక్కడ ఎవరైనా కలిసి ఉండొచ్చు... ఏమైనా జరిగి ఉండొచ్చు..., ఎవడైతే తప్పు చేసి, ఆ తప్పు తన భార్యకు తెలిస్తే ఎక్కడ బాధపడుతుందోనని భయపడతాడు చూడు... వాడు అసలు సిసలైన నిఖార్సయిన భర్త..., వైఫ్ ఉందని ఎందుకు చెప్పలేదు, వదిన వాళ్ల చెల్లి అంటే నా వైఫే కదా... కాదా!' వంటి డైలాగ్స్ ఈ టీజర్‌లో ఉన్నాయి. వెన్నెల కిశోర్, సత్య, మురళీధర్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

బతుకులు మారాలంటే..!

మనికా, రవికృష్ణ

శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. శుక్రవారం ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ''చావు నుంచైనా తప్పించుకోవచ్చునేమో కానీ కులం నుంచి తప్పించుకోలేము రా, మన బతుకులు మారాలంటే మనకు కావాల్సింది ఒక్కటే... చదువు... చదువు... చదువు, ఒకటి పెళ్లి దగ్గర... లేకపోతే చావు దగ్గర.. ఈ రెండింటిలోనే కదా వీళ్ల ఆటలు సాగేవి' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ సినిమాకు సంగీతం: మార్క్ కె.రాబిన్.

సాక్షి బిజినెస్
శనివారం
20-12-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
448	151
84,929	25,966

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	23,270	▲	265
డోజోన్స్	48,207	▲	254
ఎఫ్‌టీఎస్ఈ 100	9,900	▲	62
డాక్స్	24,376	▲	177
షాంఘై	3,890	▲	14
నికాయ్	49,507	▲	506

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	89.60	90.62
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	119.10	122.04
€	యూరో	ఎస్‌బీఐ	104.20	107.03
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.05	58.45
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.61	61.74
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.77	70.46
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.91	24.42
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.41	24.67
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.80	13.62

ఆకాశమే హద్దు

విమానాశ్రయాలపై అదానీ రూ. లక్ష కోట్లు బెట్

ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం అదానీ గ్రూప్ విమానాశ్రయాల బిజినెస్‌పై భారీగా ఇన్వెస్ట్ చేయనుంది. రానున్న ఐదేళ్లలో ఇందుకు రూ. లక్ష కోట్లు వెచ్చించనున్నట్లు అదానీ ఎయిర్‌పోర్ట్స్ డైరెక్టర్, బిలియనీర్ గౌతమ్ అదానీ చిన్న కుమారుడు జీత్ అదానీ పేర్కొన్నారు. ఈ నెల 25న నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో దేశీ విమానాశ్రయ పరిశ్రమపై అత్యంత ఆశావహంగా ఉన్నట్లు తెలియజేశారు. వెరసి తదుపరి 11 ఎయిర్‌పోర్టుల బిడ్డింగ్‌లో మరింత భారీగా పాలుపంచుకోనున్నట్లు వెల్లడించారు. దేశీయంగా ఏవియేషన్ రంగం వార్షిక పద్ధతిలో 15–16 శాతం విస్తరించవచ్చునని అంచనా వేశారు. గ్రూప్ విమానాశ్రయ పోర్ట్‌ఫోలియోలో నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్(ఎన్‌ఎంఐఏఎల్) తాజాగా చేరనుంది. తద్వారా దేశీ ఏవియేషన్ రంగంలో కార్యకలాపాలు మరింత విస్తరించనుంది. ఎన్‌ఎంఐఏఎల్‌లో అదానీ గ్రూప్ వాటా 74% కాగా.. 2025 డిసెంబర్ 25న వాణిజ్య ప్రాతిపదికన కార్యకలాపాలకు తెరతీయనుంది.

రూ. 19,650 కోట్లు

అదానీ గ్రూప్ రూ. 19,650 కోట్ల తొలి దశ పెట్టుబడులతో ఎన్‌ఎంఐఏఎల్‌ను అభివృద్ధి చేసింది. వార్షికంగా 2 కోట్లమంది ప్రయాణికులను హ్యాండిల్ చేయగల సామర్థ్యంతో ఏర్పాటైంది. తదుపరి సామర్థ్యాన్ని 9 కోట్లమంది ప్రయాణికులకు అనువుగా విస్తరించనుంది. తద్వారా ప్రస్తుతం ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం ఎదుర్కొంటున్న సామర్థ్య సవాళ్లకు చెక్ పెట్టనుంది. ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్(ఎంఐఏఎల్)ను జీవీకే గ్రూప్ నుంచి అదానీ గ్రూప్ చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. ఇవికాకుండా అదానీ గ్రూప్ అహ్మదాబాద్, లక్నో, గువాహటి, తిరువనంతపురం, జైపూర్, మంగళూరులోనూ ఎయిర్‌పోర్టులను నిర్వహిస్తోంది.

శ్రీరామ్ ఫైనాన్స్‌పై మిత్సుబిషి ఫోకస్

- 20 శాతం వాటా కొనుగోలుకి రెడీ
- రూ. 39,618 కోట్ల పెట్టుబడులు
- ఫైనాన్షియల్ రంగంలో భారీ డీల్

ఇటీవల దేశీ ఫైనాన్షియల్ రంగంలో పెట్టుబడులకు విదేశీ దిగ్గజాలు ఆసక్తి చూపుతున్నాయి. ఈ ఏడాది అక్టోబర్‌లో ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్ మెజారిటీ వాటాను సొంతం చేసుకోగా, యస్ బ్యాంక్‌లో జపనీస్ దిగ్గజం ఎస్ఎంబీసీ సైతం 25 శాతం వాటా సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ బాటలో తాజాగా ఎన్‌బీఎఫ్‌సీ.. శ్రీరామ్ ఫైనాన్స్‌లో జపనీస్ దిగ్గజం ఎంయూఎఫ్‌జీ భారీగా ఇన్వెస్ట్ చేస్తోంది. వివరాలు చూద్దాం..

న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ.. శ్రీరామ్ ఫైనాన్స్‌లో జపనీస్ దిగ్గజం మిత్సుబిషీ యూఎఫ్‌జే ఫైనాన్షియల్ గ్రూప్(ఎంయూఎఫ్‌జీ) 20 శాతం వాటా కొనుగోలు చేయనుంది. ఇందుకు రెండు సంస్థలు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఇందుకు అనుగుణంగా శ్రీరామ్ ఫైనాన్స్ 47.11 కోట్ల ప్రిఫరెన్షియల్ ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ఒక్కో షేరుకీ రూ. 840.93 ధరలో వీటిని ఎంయూఎఫ్‌జీ కొనుగోలు చేయనుంది. తద్వారా శ్రీరామ్ ఫైనాన్స్‌లో 4.4 బిలియన్ డాలర్ల(రూ. 39,618 కోట్లు) ఇన్వెస్ట్ చేయనుంది. వెరసి దేశీ ఫైనాన్షియల్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా ఇది నిలవనుంది. తాజా డీల్.. దేశీ ఫైనాన్షియల్ రంగ పటిష్టత, వృద్ధి అవకాశాలపట్ల విశ్వాసానికి ప్రతీకగా శ్రీరామ్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఉమేష్ రేవంకర్ పేర్కొన్నారు. వాటాదారుల అనుమతి, నియంత్రణ సంస్థల క్లియరెన్స్‌ల తదుపరి ఎంయూఎఫ్‌జీ వాటాను సొంతం చేసుకోనున్నట్లు శ్రీరామ్ ఫైనాన్స్ వెల్లడించింది. తాజా నిధులు సంస్థ మూలధన పటిష్టతకు, దీర్ఘకాలిక వృద్ధికి సహకరిస్తాయని తెలియజేసింది. ఎంయూఎఫ్‌జీతో భాగస్వామ్యం చౌక నిధుల సమీకరణ, మెరుగైన క్రెడిట్ రేటింగ్స్‌కు వీలు కల్పించడంతోపాటు, పాలన, నిర్వహణలో ప్రపంచ ప్రమాణాల సరసన నిలుపుతుందని పేర్కొంది. శ్రీరామ్ ఫైనాన్స్ వృద్ధికి మద్దతిచ్చేందుకు కట్టుబడి ఉన్నట్లు ఎంయూఎఫ్‌జీ గ్రూప్ సీఈవో హిరొనోరీ కమెజావా పేర్కొన్నారు. తద్వారా భారత్‌లో ఆర్థిక, సామాజిక అభివృద్ధికి తమవంతు పాత్ర పోషించనున్నట్లు తెలియజేశారు.

ఇద్దరు డైరెక్టర్లు

శ్రీరామ్ ఫైనాన్స్‌లో 20 శాతం వాటా చేజిక్కించుకున్నాక బోర్డులో ఇద్దరు డైరెక్టర్లను నియమించే ప్రణాళికల్లో ఉన్నట్లు ఎంయూఎఫ్‌జీ వెల్లడించింది. భారత్‌లో యొకొహామా స్పెసీ బ్యాంక్ ముంబై బ్రాంచ్‌తో 1,894లో కార్యకలాపాలు ప్రారంభించిన సంస్థ 1.7 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయడం ద్వారా సుమారు 5,000 మందికి ఉపాధి కల్పించింది. గిఫ్ట్ సిటీలో బ్రాంచ్ ప్రారంభించిన తొలి జపనీస్ బ్యాంక్‌గా నిలుస్తోంది. 2023లో డిజిటల్ ఫైనాన్షియల్ సర్వీసులందిస్తున్న ఎన్‌బీఎఫ్‌సీ డీఎంఐ ఫైనాన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌లో ఇన్వెస్ట్ చేసింది. కాగా.. యూఏఈలో రెండో పెద్ద సంస్థ ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్ ఈ ఏడాది అక్టోబర్‌లో దేశీ ప్రయివేట్ రంగ సంస్థ ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో 60 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 26,853 కోట్లు వెచ్చించింది. అంతకుముందే మరో ప్రయివేట్ రంగ సంస్థ యస్ బ్యాంక్‌లో జపనీస్ దిగ్గజం సుమితోమొ మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్(ఎస్ఎంబీసీ) 24 శాతానికిపైగా వాటాను సొంతం చేసుకున్న విషయం విదితమే. ఇందుకు రూ. 16,330 కోట్లకు పైగా వెచ్చించింది.

నాలుగు రోజుల నష్టాలకు చెక్

- సెన్సెక్స్ 448 పాయింట్లు ప్లస్
- నిఫ్టీ లాభం 151 పాయింట్లు
- రాణించిన రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ నాలుగు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్(1.34%), హెచ్‌డీఎఫ్‌సీ (0.65%) షేర్లు రాణించడంతో పాటు అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు కలిసొచ్చాయి. సెన్సెక్స్ 448 పాయింట్లు పెరిగి 84,929 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 151 పాయింట్లు బలపడి 25,966 వద్ద నిలిచింది.

- ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ షేరు ఇష్యూ ధర(రూ.2,165)తో పోలిస్తే 20% ప్రీమియంతో రూ.2,606 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 23% పెరిగి రూ.2,662 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 19% లాభంతో రూ.2,587 వద్ద స్థిరపడింది.

రూపాయి భారీ రికవరీ

డాలర్ మారకంలో రూపాయి విలువ 53 పైసలు పెరిగి 89.67 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ ధర 59 డాలర్ల దిగువన ట్రేడవుతుండటంతో పాటు దేశీయ మార్కెట్లోకి కార్పొరేట్ డాలర్ల ప్రవాహం కలిసొచ్చింది. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 90.19 వద్ద రూపాయి ట్రేడింగ్ మొదలైంది. ఒక దశలో 95 పైసల మేరకు బలపడి 89.25 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. స్టాక్ మార్కెట్ బౌన్స్‌బ్యాక్ కూడా రూపాయి బలోపేతానికి కారణమైంది.

రిలయన్స్ కన్జూమర్ చేతికి ఉదయమ్స్

మెజారిటీ వాటా కొనుగోలు

చెన్నై: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎఫ్ఎంసీజీ విభాగం రిలయన్స్ కన్జూమర్ ప్రాడక్ట్స్ తాజాగా తమిళనాడు సంస్థ ఉదయమ్స్‌లో మెజారిటీ వాటా సొంతం చేసుకుంది. అయితే వాటా కొనుగోలు విలువ వెల్లడికాలేదు. ఒప్పందం ప్రకారం ఉదయమ్స్ ఆగ్రో ఫుడ్స్ ప్రయివేట్ లిమిటెలో గత ప్రమోటర్లు ఎస్.సుధాకర్, ఎస్.దినకర్ మైనారిటీ వాటాతో కొనసాగనున్నారు. ఉదయమ్ బ్రాండుతో మూడు దశాబ్దాలుగా తమిళనాడు మార్కెట్లో కంపెనీ పటిష్ట కార్యకలాపాలు నిర్వహిస్తోంది. పంపిణీ నెట్‌వర్క్ ద్వారా బియ్యం, మసాలా దినుసులు, ఇడ్లీ నూక, స్నాక్స్ తదితర నిత్యావసరాలు విక్రయిస్తోంది.

తాజ్ జీవీకేలో ప్రమోటర్ల వాటా అప్

25.52% విక్రయించనున్న ఐహెచ్‌సీఎల్

న్యూఢిల్లీ: ఆతిథ్య రంగ టాటా గ్రూప్ దిగ్గజం ఇండియన్ హోటల్స్ కంపెనీ(ఐహెచ్‌సీఎల్) భాగస్వామ్య సంస్థ తాజ్ జీవీకేలోగల 25.52 శాతం వాటా విక్రయించనుంది. ప్రమోటర్లు జీవీకే–భూపాల్ కుటుంబానికి ఈ వాటాను అమ్మివేసేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఐహెచ్‌సీఎల్ వెల్లడించింది. దీంతో ప్రమోటర్లుగా జీవీకే–భూపాల్ కుటుంబం తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్‌లో 74.99 శాతం వాటా పొందనుంది. కంపెనీ ఐదేళ్ల ప్రణాళిక(యాక్సెలరేట్ 2030)లో భాగంగా అసెట్‌లైట్ క్యాపిటల్ వ్యూహాలను అమలు చేయనున్నట్లు ఐహెచ్‌సీఎల్ ఎండీ, సీఈవో పునీత్ చత్వాల్ పేర్కొన్నారు. వెరసి జీవీకే–భూపాల్ కుటుంబంతో దీర్ఘకాలిక మేనేజ్‌మెంట్ కాంట్రాక్టు అమలు చేయనున్నట్లు తెలియజేశారు. కాగా.. భవిష్యత్ వృద్ధి అవకాశాలలో భాగంగా ఐహెచ్‌సీఎల్‌తో 2025 అక్టోబర్‌లో 256 గదుల తాజ్ యెలహంక (బెంగళూరు) కోసం యాజమాన్య కాంట్రాక్ట్ కుదుర్చుకున్నట్లు తాజ్ జీవీకే హోటల్స్ జేఎండీ కృష్ణ భూపాల్ తెలియజేశారు. 2026లో ప్రారంభకానున్న ఈ హోటల్‌తోపాటు.. తాజ్ జీవీకే పోర్ట్‌ఫోలియోలో హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ, తాజ్ డెక్కన్, తాజ్ క్లబ్‌హౌస్ (చెన్నై), తాజ్ చండీగఢ్, వివాంతా హైదరాబాద్(బేగంపేట) ఉన్నాయి.

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి గ్రేట్ ప్లేస్ టు వర్క్ గుర్తింపు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్వతంత్ర విద్యుదుత్పత్తి దిగ్గజాల్లో ఒకటైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా ప్రతిష్టాత్మక గుర్తింపు దక్కించుకుంది. 2025–26 సంవత్సరానికి గాను 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' సర్టిఫికేషన్ లభించింది. ఉద్యోగానికి అనువైన సంస్థగా 86 శాతం మంది ఉద్యోగులు ఎస్ఈఐఎల్‌ని ఎంచుకున్నట్లు కంపెనీ తెలిపింది. గ్రేట్ ప్లేస్ టు వర్క్ గుర్తింపును పొందడం వరుసగా ఇది రెండోసారని వివరించింది. వ్యక్తిగత జీవితం –ఉద్యోగం మధ్య సమతుల్యత, ఉద్యోగుల ఎదుగుదలకు అవకాశాల కల్పన తదితర అంశాలకు తాము అత్యంత ప్రాధాన్యమిస్తామని కంపెనీ సీఈవో జనమేజయ మహాపాత్ర తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్

నేడు టి20 వరల్డ్ కప్‌కు భారత జట్టు ప్రకటన

స్వదేశంలో జరిగే 2026 టి20 వరల్డ్ కప్‌లో పాల్గొనే భారత జట్టును నేడు ఎంపిక చేయనున్నారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ 15 మంది సభ్యుల టీమ్‌ను ప్రకటించనుంది. ఈ మెగా టోర్నీకి ముందు న్యూజిలాండ్‌తో జరిగే 5 మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో కూడా వరల్డ్ కప్‌కు ఎంపికయ్యే జట్టే ఆడుతుంది. ఫిబ్రవరి 7న మొదలయ్యే వరల్డ్ కప్‌లో భారత జట్టు డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. 2024 టి20 వరల్డ్ కప్ తర్వాతి నుంచి తాజాగా దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్ వరకు భారత జట్టు అద్భుత ప్రదర్శనను (35 మ్యాచ్‌లలో 26 విజయాలు) చూస్తే టీమ్ ఎంపికలో ఎలాంటి సంచలనాలు ఉండే అవకాశం లేదు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఏడాదికి పైగా విఫలమవుతున్నా సరే... టోర్నీకి చాలా తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో అతడి కెప్టెన్సీకి ఎలాంటి ఢోకా లేదు. ఓపెనర్లుగా అభిషేక్, గిల్‌లతో పాటు సంజు సామ్సన్ కూడా అందుబాటులో ఉన్నాడు కాబట్టి టాపార్డర్‌లో జైస్వాల్‌కు చోటు కష్టమే.

విజయంతో ముగింపు

చివరి టి20లో భారత్ గెలుపు • 30 పరుగుల తేడాతో ఓడిన దక్షిణాఫ్రికా

3-1తో సిరీస్ టీమిండియా సొంతం • 16 బంతుల్లో పాండ్యా హాఫ్ సెంచరీ

టెస్టు సిరీస్‌లో 0–2తో ఓటమి, వన్డేల్లో 2–1తో గెలుపు, ఇప్పుడు టి20ల్లో 3–1తో ఘన విజయం...సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగిన పోరులో భారత జట్టు ప్రదర్శన ఇది. చాలా కాలం తర్వాత ఒకే పర్యటనలో భాగంగా మూడు ఫార్మాట్‌లలో జరిగిన సిరీస్‌లలో టీమిండియా పైచేయి సాధించింది. టెస్టు సిరీస్ ఫలితం బాధపెట్టేదే అయినా ఓవరాల్‌గా 5–4తో మన జట్టు పైచేయి సాధించింది. సిరీస్ ఓడిపోయే ప్రమాదం లేని స్థితిలో చివరి టి20లో బరిలోకి దిగిన భారత్ భారీ స్కోరుతో ప్రత్యర్థికి చెక్ పెట్టింది. పాండ్యా అద్భుత బ్యాటింగ్, తిలక్ మెరుపులు ఇందులో కీలక పాత్ర పోషించాయి. డికాక్ జోరుతో సఫారీలు ఛేదన వైపు సాగినట్లు అనిపించినా అది కొన్ని ఓవర్లకే పరిమితమైంది. చేయాల్సిన రన్‌రేట్ పెరిగిపోయి ఒత్తిడిలో జట్టు చిత్తయింది. టి20ల్లో భారత్‌కు ఇది వరుసగా 8వ సిరీస్ విజయం కావడం విశేషం.

పాండ్యా

ఆ 16 బంతులు...

తొలి బంతికే సూపర్ సిక్స్...మెరుపు వేగంతో దూసుకొచ్చిన బంతి భుజానికి తగలడంతో కెమెరామన్ అల్లాడిపోయాడు. టీమ్ ఫిజియో వెళ్లి చికిత్స చేయాల్సి వచ్చింది. అలా మొదలైన హార్దిక్ పాండ్యా ఇన్నింగ్స్ అంతే విధ్వంసకరంగా సాగింది. తాను ఎదుర్కొన్న తర్వాతి రెండు బంతుల్లో సింగిల్, ఫోర్ కొట్టిన పాండ్యా... లిండే వేసిన 14వ ఓవర్లో వరుస బంతుల్లో 4, 6, 6, 4 బాదాడు. ఇంత పెద్ద మైదానంలో అతను కొట్టిన భారీ సిక్స్‌లు బౌండరీకి దగ్గర్లో కాకుండా ఎక్కడో గ్యాలరీల్లో పడ్డాయంటే ఆ వాడి ఎలాంటిదో అర్థమవుతుంది. తర్వాతి ఐదు బంతులు కాస్త జాగ్రత్తగా ఆడుతూ 7 పరుగులే రాబట్టినా...బాష్ ఓవర్లో మళ్లీ జోరు కనిపించింది. ఈ ఓవర్లో వరుసగా 6, 4 కొట్టిన అతను అదే ఓవర్లో డీప్ మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్స్ బాదడంతో 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తయింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అహ్మదాబాద్: దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్‌ను భారత్ 3–1తో సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగిన చివరిదైన ఐదో మ్యాచ్‌లో భారత్ 30 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హార్దిక్ పాండ్యా (25 బంతుల్లో 63; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), తిలక్ వర్మ (42 బంతుల్లో 73; 10 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు చేశారు. అనంతరం దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 201 పరుగులకే పరిమితమైంది. క్వింటన్ డికాక్ (35 బంతుల్లో 65; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించగా, వరుణ్ చక్రవర్తికి 4 వికెట్లు దక్కాయి.

రాణించిన సామ్సన్...

భారత్‌కు సంజు సామ్సన్ (22 బంతుల్లో 37; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), అభిషేక్ శర్మ (21 బంతుల్లో 34; 6 ఫోర్లు, 1 సిక్స్) శుభారంభం అందించారు. అభిషేక్ తనదైన శైలిలో దూకుడుగా మొదలు పెట్టగా, గిల్ గైర్హాజరులో దక్కిన అవకాశాన్ని సామ్సన్ సమర్థంగా వాడుకున్నాడు. యాన్సెన్ ఓవర్లో తొలి మూడు బంతులను అభిషేక్ ఫోర్లుగా మలచగా, చివరి బంతికి సామ్సన్ సిక్స్ బాదడంతో మొత్తం 19 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత బార్ట్‌మన్ ఓవర్లో సామ్సన్ మూడు ఫోర్లు కొట్టాడు. అభిషేక్ వికెట్ కోల్పోయి పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 67 పరుగులు చేసింది. తొలి బంతికే ఫోర్‌తో మొదలు పెట్టిన తిలక్ కూడా తన ధాటిని ప్రదర్శించడంతో స్కోరు దూసుకుపోయింది. సామ్సన్ వెనుదిరిగాక మరో సారి సూర్యకుమార్ (5) వైఫల్యం కొనసాగింది. ఈ దశలో జత కలిసిన తిలక్, హార్దిక్ ద్వయం దక్షిణాఫ్రికా బౌలర్లపై విరుచుకుపడింది. చూడచక్కటి ఫోర్లు కొట్టిన తిలక్ 30 బంతుల్లో అర్ధసెంచరీని అందుకున్నాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 44 బంతుల్లోనే 105 పరుగులు జోడించి స్కోరును 200 దాటించారు. చివర్లో దూబే (10 నాటౌట్) కూడా సిక్స్, ఫోర్‌తో తాను ఓ చేయి వేశాడు.

డికాక్ అర్ధ సెంచరీ...

భారీ లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికాకు డికాక్ మెరుపు ఆరంభాన్ని ఇస్తూ అద్భుత షాట్లతో చెలరేగిపోయాడు. అర్ష్‌దీప్ తొలి ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు కొట్టిన అతను...అతని తర్వాతి ఓవర్లో మరో మూడు ఫోర్లు, సిక్స్ బాదడం విశేషం. పవర్‌ప్లే సఫారీ టీమ్ కూడా సరిగ్గా 67 పరుగులే సాధించింది. హెన్‌డ్రిక్స్ (13) వెనుదిరిగాక 30 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న డికాక్‌కు మరో ఎండ్‌లో బ్రెవిస్ (17 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అండగా నిలిచాడు. పాండ్యా బౌలింగ్‌లో బ్రెవిస్ వరుసగా 4, 6, 4 కొట్టడం విశేషం. 10.1 ఓవర్లలో 120/1తో దక్షిణాఫ్రికా పటిష్టంగా కనిపించింది. అయితే ఆ తర్వాత ఒక్కసారిగా కథ మారిపోయింది. డికాక్, బ్రెవిస్ రెండు పరుగుల వ్యవధిలో వెనుదిరిగాక ఇన్నింగ్స్ కుప్పకూలింది. మిగతా బ్యాటర్లలో ఎవరూ నిలవలేకపోయారు.

2 భారత్ తరఫున టి20ల్లో పాండ్యా రెండో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ (16 బంతుల్లో) సాధించాడు. యువరాజ్ సింగ్ (12 బంతుల్లో) పేరిట టాప్ రికార్డు ఉంది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: సామ్సన్ (బి) లిండే 37; అభిషేక్ (సి) డికాక్ (బి) బాష్ 34; తిలక్ (రనౌట్) 73; సూర్యకుమార్ (సి) మిల్లర్ (బి) బాష్ 5; పాండ్యా (సి) హెన్‌డ్రిక్స్ (బి) బార్ట్‌మన్ 63; దూబే (నాటౌట్) 10; జితేశ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 231. వికెట్ల పతనం:** 1-63, 2-97, 3-115, 4-220, 5-227. **బౌలింగ్:** ఎన్‌గిడి 4-0-29-0, యాన్సెన్ 4-0-50-0, బార్ట్‌మన్ 3-0-39-1, బాష్ 3-0-44-2, ఫెరీరా 2-0-20-0, లిండే 4-0-46-1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి) అండ్ (బి) బుమ్రా 65; హెన్‌డ్రిక్స్ (సి) దూబే (బి) వరుణ్ 13; బ్రెవిస్ (సి) సుందర్ (బి) పాండ్యా 31; మిల్లర్ (సి) సామ్సన్ (బి) అర్ష్‌దీప్ 18; మార్క్‌రమ్ (ఎల్బీ) (బి) వరుణ్ 6; ఫెరీరా (బి) వరుణ్ 0; లిండే (బి) వరుణ్ 16; యాన్సెన్ (సి) సామ్సన్ (బి) బుమ్రా 14; బాష్ (నాటౌట్) 17; ఎన్‌గిడి (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1-69, 2-120, 3-122, 4-135, 5-135, 6-154, 7-163, 8-177.
బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-47-1, సుందర్ 4-0-30-0, బుమ్రా 4-0-17-2, వరుణ్ 4-0-53-4, పాండ్యా 3-0-41-1, 1-0-13-0.

ఫైనల్‌కు యువ భారత్

- సెమీస్‌లో లంకపై విజయఢంకా
- రేపు పాక్‌తో టైటిల్ పోరు

దుబాయ్: యువ భారత జట్టు ఆసియా కప్ అండర్–19 టోర్నమెంట్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన తొలి సెమీస్‌లో ఆయుశ్ మాత్రే సారథ్యంలోని భారత్ 8 వికెట్ల తేడాతో శ్రీలంకపై విజయఢంకా మోగించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. పవర్‌ప్లేలో 28 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయిన లంకను కాసేపు కెప్టెన్ విమత్ దిన్సార (32; 4 ఫోర్లు), చమిక హీనతిగల (42; 3 ఫోర్లు) ఆదుకున్నారు. ఇద్దరు తర్వాతి 6 ఓవర్ల పాటు వికెట్ పడనీయకుండా నాలుగో వికెట్‌కు 45 పరుగులు జతచేశారు. ఆఖర్లో సేత్మిక సెనెవిరత్నే (22 బంతుల్లో 30; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడటంతో లంక 130 పైచిలుకు స్కోరు చేయగలిగింది.

యువ భారత ఓపెనర్లు ఆయుశ్ మాత్రే (7), వైభవ్ సూర్యవంశీ (9)లు విఫలమయ్యారు. 25/2 స్కోరు వద్ద లంక పండగ చేసుకుంది. వైస్ కెప్టెన్ విహాన్ మల్హోత్ర (45 బంతుల్లో 61 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), హైదరాబాదీ బ్యాటర్ ఆరోన్ జార్జ్ (49 బంతుల్లో 58 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధ శతకాలతో లంకేయుల ఆశలపై నీళ్లు చల్లారు. ఇద్దరు జట్టును గెలిపించేదాకా క్రీజును అట్టిపెట్టుకోవడంతో లంక బౌలర్లు ఆపసోపాలు పడ్డారు. అబేధ్యమైన మూడో వికెట్‌కు 114 పరుగులు జోడించారు. మూడు రోజుల క్రితం జరిగిన ఐపీఎల్ ఆటగాళ్ల వేలంలో లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్ విహాన్‌ను రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్రాంచైజీ ప్రాథమిక ధర రూ. 30 లక్షలకు కొనుగోలు చేసింది. మరో సెమీఫైనల్లో పాకిస్తాన్ కూడా 8 వికెట్ల తేడాతోనే బంగ్లాదేశ్‌పై గెలుపొందింది. 11 ఏళ్ల తర్వాత యువ చిరకాల ప్రత్యర్థులు (అండర్–19లో) ఆసియా కప్ ఫైనల్లో తలపడనున్నాయి. చివరిసారిగా 2014లో జరిగిన ఆసియాకప్ ఫైనల్లో పాక్‌ను ఓడించిన యువ భారత్ టైటిల్ సాధించింది.

ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో స్వల్ప మార్పులు

సాక్షి, అమరావతి: వచ్చే ఏడాది ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు జరిగే ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో స్వల్ప మార్పులు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2026 ఏడాది సెలవులు ప్రకటించడం కంటే ముందే పరీక్షల షెడ్యూల్ ప్రకటించడంతో సెలవులకు అనుగుణంగా పరీక్షల్లో మార్పులు చేసినట్లు ఇంటర్ పరీక్షల విభాగం కంట్రోలర్ సైమన్ విక్టర్ తెలిపారు. ముఖ్యంగా మార్చి 3న జరగాల్సిన రెండో ఏడాది మేథమెటిక్స్, సివిక్స్ పరీక్షలు మార్చి 4న, మార్చి 20న ప్రకటించిన మొదటి ఏడాది పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్ సబ్జెక్టుల పరీక్షలను మార్చి 21న నిర్వహిస్తారు. మార్చి 3న హోలీ, మార్చి 20 రంజాన్ సెలవులు ఉండడంతో ఈ మార్పులు చేసినట్లు బోర్డు ప్రకటించింది. మిగిలిన పరీక్షలు గతంలో ప్రకటించిన టైమ్‌టేబుల్ ప్రకారమే జరుగుతాయని అధికారులు తెలిపారు.

22 నుంచి 24 వరకు స్పాట్ కౌన్సెలింగ్

బీఎస్సీ(హానర్స్) అగ్రికల్చర్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) విభాగాల్లో ప్రవేశాల కోసం..

సాక్షి, అమరావతి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏపీ ఎంసెట్–2025 ర్యాంకుల ద్వారా బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) ప్రవేశాలకు చివరి విడత స్పాట్ కౌన్సెలింగ్ 22 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్టు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ www.angrau.ac.in లో సంప్రదించాలన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు 31 వరకు దరఖాస్తులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం (2026–27)లో ప్రైవేట్ పాఠశాలలు ఓపెనింగ్ పర్మిషన్ కోసం ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్య డైరెక్టర్ వి.విజయ్ రామరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతులు పొందిన తర్వాత పాఠశాల ప్రారంభానికి కావాల్సిన సదుపాయాల ఏర్పాటు, గుర్తింపునకు సమయం ఇవ్వాల్సిన నేపథ్యంలో ముందుగానే https://cse.ap.gov.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అధికారులు ఆయా ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాల అవసరం ఉందా? లేదా? అనే విషయాన్ని ధ్రువీకరిస్తూ నివేదిక సమర్పించాల్సి ఉంటుందన్నారు.

విశాఖ తీరం నుంచి 3,240 కి.మీ. డేంజర్ జోన్

ఈ నెల 22 నుంచి 24 వరకూ ఆ పరిధిలో విమానాల దారిమళ్లింపు.. మరోసారి నోటమ్ జారీ

సాక్షి, విశాఖపట్నం: బంగాళాఖాతంలో విశాఖ సముద్రతీరం నుంచి హిందూమహాసముద్రం వరకూ 3,240 కిలోమీటర్ల పరిధిని క్షిపణి పరీక్ష కోసం నో ఫ్లైయింగ్ జోన్‌గా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. నోటీస్ టు ఎయిర్‌మెన్ (నోటమ్) ప్రకారం ఈ మిసైల్ టెస్టింగ్ ఈనెల 22 నుంచి 24 మధ్య జరగనుందని స్పష్టం చేసింది. తొలుత డిసెంబర్ 1 నుంచి 4 తేదీల్లో మిసైల్ టెస్టింగ్ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం అప్పట్లో 3,485 కి.మీ ప్రాంతాన్ని డేంజర్ జోన్‌గా గుర్తించారు. దాన్ని రద్దు చేస్తూ ఈ నెల 7న మరోసారి కొత్త నో ఫ్లైజోన్‌ను 1190 కిలోమీటర్లుగా ప్రకటించారు. మళ్లీ శుక్రవారం తాజాగా నోటమ్ జారీ చేశారు. ఇందుకోసం మొత్తం 3,240 కి.మీ తీర ప్రాంతం వరకూ డేంజర్ జోన్‌గా డిక్లేర్ చేశారు. విమాన కార్యకలాపాలు, సముద్ర భద్రతను ప్రభావితం చేసేందుకు యుద్ధ నౌకలు, జలాంతర్గాములను అప్రమత్తం చేసేందుకు ఈ డేంజర్ జోన్‌ను ప్రకటించారు. పైలెట్లు, విమానయాన సంస్థలు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు నోటమ్ ద్వారా అధికారిక నోటిఫికేషన్ అందజేయనున్నారు. విమాన ప్రయాణానికి ఆటంకం కలిగించే మార్పులు లేదా ప్రమాదాల గురించి పైలెట్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు, విమానయాన సిబ్బందికి ముందుగానే ఇచ్చే హెచ్చరిక ప్రకటననే 'నోటమ్' అని పిలుస్తారు. ఈ డేంజర్ జోన్ ప్రకటన ఉన్నంతవరకూ ఆ పరిధిలో పౌర, యుద్ధ విమానాలను దారిమళ్లిస్తారు. భారత కాలమానం ప్రకారం ఈనెల 22వ తేదీ ఉదయం 4.30 గంటల నుంచి 24వ తేదీ ఉదయం 8.30 గంటల మధ్య ఎప్పుడైనా ఈ మిసైల్ టెస్టింగ్ ఉండే అవకాశం ఉందని భారతరక్షణ వర్గాల సమాచారం.



మిసైల్ టెస్టింగ్ కోసం గుర్తించిన డేంజర్ జోన్ మ్యాప్

తిరుప్పరకుండ్రంపై దీపం వెలిగించాలని ఆత్మాహుతి

పూర్ణచంద్రన్ (ఫైల్)

సాక్షి, చెన్నై : తమిళనాడులోని తిరుప్పరకుండ్రం కొండపై దీపం వెలిగించాలని ఓ భక్తుడు ఆత్మాహుతికి పాల్పడ్డాడు. మదురై జిల్లా తిరుప్పరకుండ్రం కొండపై కార్తీక దీపం వ్యవహారం వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. లోక్‌సభలో సైతం తీవ్ర చర్చకు దారి తీసిన ఈ వ్యవహారం తాజాగా మదురై ధర్మాసనంలో విచారణలో ఉంది. వాదనలు ముగియడంతో తీర్పు వెలువరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మదురై నరిమేడు ప్రాంతానికి చెందిన గ్రాడ్యుయేట్ పూర్ణచంద్రన్ (40) మురుగన్ భక్తుడు. దీపం వెలిగింపు వివాదంపై అతడు మానసిక వేదనతో బాధపడుతున్నట్టు సన్నిహితులు చెబుతున్నారు. ఈ క్రమంలో తిరుప్పరకుండ్రంపై కార్తీక దీపం వెలిగించాలని నినదిస్తూ గురువారం సాయంత్రం మదురై అవుట్ పోస్టులోని పెరియార్ విగ్రహం వద్ద శరీరంపై పెట్రోలు పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడు పూర్ణచంద్రన్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కొండపై కార్తీక దీపం వెలిగించాల్సిందేనని ఆత్మాహుతికి ముందు అతడు విడుదల చేసిన వీడియో వైరల్‌గా మారింది. బీజేపీ నాయకులు, హిందూ మున్నని వర్గాలు ఆ కుటుంబాన్ని ఓదార్చాయి. నష్టపరిహారంగా రూ.కోటి ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వాల్మీకి మండలి స్కాంలో రూ.8 కోట్ల ఆస్తులు స్వాధీనం

సాక్షి, బళ్లారి : మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలి కుంభకోణం కేసులో బళ్లారి గ్రామీణ ఎమ్మెల్యే, మాజీ మంత్రి బి.నాగేంద్రకు చెందిన రూ.8 కోట్ల విలువ చేసే ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. వాల్మీకి అభివృద్ధి మండలి నిధుల దుర్వినియోగం, అక్రమ బదలాయింపుల కేసులో ఎమ్మెల్యే నాగేంద్రపై ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. అతని వాణిజ్య ఆస్తులు, మరో కట్టడం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇక మిగిలిన ఆదాయాన్ని తెలుసుకోవడానికి సాధ్యం కాలేదని చెప్పారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

పోలీసు అధికారులకు అవార్డులు

సాక్షి, అమరావతి : నేర పరిశోధనలో అధునాతన విధానాలతో త్వరితగతిన కేసుల పరిష్కారంలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులకు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా అవార్డులను ప్రదానం చేశారు. మొదటి త్రైమాసికానికి 4 కేసులు, రెండో త్రైమాసికానికి 4 కేసులు, మూడో త్రైమాసికానికి 5 కేసులను ఎంపిక చేశారు. ఆ కేసుల దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన అధికారులకు రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో డీజీపీ అవార్డులు ప్రదానం చేశారు.

విచారణ అధికారి నియామకం

సాక్షి, అమరావతి: గతంలో గుంటూరు డీఈఓగా ఉన్న గంగాభవానీతో పాటు ఏడుగురు అధికారులపై విచారణకు ప్రభుత్వ టెక్స్ట్ బుక్స్ ప్రెస్ డైరెక్టర్ డి.మధుసూదన్‌రావును విచారణ అధికారిగా నియమించారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు వారాల్లో విచారణ పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సిందిగా పేర్కొన్నారు.

జీఎస్‌డీపీ లక్ష్యాల సాధన, పనితీరు సూచికలకు సవరణలు

సాక్షి, అమరావతి: జీఎస్‌డీపీ లక్ష్యాల సాధన కీలక పనితీరు, సూచికలకు అవసరమైన సవరణలు చేసేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన మరో ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తూ సీఎస్ కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో ప్రణాళికా, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి, సంబంధిత శాఖ కార్యదర్శి, ప్రణాళికా శాఖ సంయుక్త కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ప్రాధాన్యత రంగ ఫలితాలను ప్రభావితం చేసే వాటిని పరిశీలించి, అవసరమైన చోట సవరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చలిపులి పంజా

రికార్డు స్థాయిలో రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు

సింహాచలంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

- సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల తక్కువగా నమోదు
- ఉత్తర దిశ నుంచి వీస్తున్న శీతల గాలులు..
- హిమాలయ ప్రాంతాల్లో మంచుతుపాన్లు కారణం
- భవిష్యత్తులో మరింత తీవ్రత తప్పదంటున్న నిపుణులు

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాదిన మొదలైన చలి తీవ్రత.. రాష్ట్రాన్ని గజగజా వణికిస్తోంది. పది రోజుల నుంచి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో ఇళ్ల నుంచి బయటికి వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. జనవరి రెండో వారం వరకూ ఇదే పరిస్థితి ఉండవచ్చని అంచనా. వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలంటూ వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడం.. దీనికి తోడు శీతల గాలులు వీస్తుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగింది. అధిక పీడన ప్రభావంతో ఉత్తర భారతం నుంచి బలమైన గాలులు రాష్ట్రం వైపు వీస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు తగ్గాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీలు లేదా అంతకంటే ఎక్కువగా పడిపోయినప్పుడు దానిని 'అతి శీతల గాలులు' (కోల్డ్‌వేవ్)గా ప్రకటిస్తారు. ఇప్పుడు రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పలు చోట్ల కోల్డ్ వేవ్స్ కొనసాగుతున్నాయి.

ఇన్వర్షన్ లేయర్‌తో ప్రమాదం..!

సాధారణంగా భూ ఉపరితలం నుంచి పైకి వెళ్లే కొద్దీ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతుంటాయి. కానీ.. ఉపరితలంలో వాతావరణం పూర్తిగా చల్లగా ఉండటంతో ఉష్ణోగ్రతలు పైకి వెళ్లే కొద్దీ పెరుగుతున్నాయి. దీన్నే ఇన్వర్షన్ లేయర్ అని పిలుస్తుంటారు. గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ మాదిరిగా.. కింది నుంచి వెళ్లే నీటి ఆవిరి, కాలుష్యం, దుమ్ము ధూళి కణాలన్నీ కలిసి ఇన్వర్షన్ లేయర్ కారణంగా మధ్యలోనే ఆగిపోయి పొగమంచులా ఏర్పడుతున్నాయి. మరో నాలుగు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉండొచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ తరహా వాతావరణం అత్యంత ప్రమాదకరమని వాతావరణ నిపుణులు, వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు పట్ల జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు.



పొగమంచు మరో సమస్య

పొగమంచు కూడా విపరీతంగా కురుస్తోంది. ముఖ్యంగా రూరల్ ప్రాంతాల్లో మంచు ప్రభావం ఎక్కువగా ఉంటోంది. పొగమంచు దట్టంగా కురుస్తుండటంతో వాహనదారులు, ప్రజలు బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పొగమంచు కారణంగా పగటి వేళల్లో ఉదయం 9 గంటల వరకూ లైట్లు వేసుకొని ప్రయాణం చెయ్యాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఎందుకు చలి పెరుగుతోంది.?

భూతాపం పెరగడం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతిని, చలి తీవ్రత పెరుగుతోందని వాతావరణ శాఖ పేర్కొంటోంది. ఉష్ణోగ్రతల పతనానికి ఉత్తర దిశ నుంచి వీస్తున్న చల్లని గాలులు కూడా కారణమని చెబుతున్నారు. హిమాలయ ప్రాంతాల్లో ఏర్పడిన మంచు తుపాన్లు, వాయు పీడన మార్పులు దక్షిణ భారతదేశం వైపు చల్లని గాలులను వస్తున్నాయి. అదే సమయంలో ఆకాశం స్పష్టంగా ఉండటం, మేఘావరణం లేకపోవడం వల్ల రాత్రివేళ భూమి నుంచి వేడి త్వరగా బయటకు వెళ్లిపోతోంది. దీని ఫలితంగా చలి మరింత పెరుగుతోంది.

సైబీరియా గాలులూ ఓ కారణమే..!

అధిక పీడన ప్రాంతాల నుంచి అల్పపీడన ప్రాంతాల వైపు వేగంగా, భారీగా చల్లని గాలులు కదలడాన్ని 'కోల్డ్ సర్జ్' అని పిలుస్తారు. ప్రస్తుత పరిస్థితులకు ఇది కూడా ఒక కారణంగా మారింది. ముఖ్యంగా.. సైబీరియా, మంగోలియా ప్రాంతాల నుంచి ఇటువైపు గాలులు వస్తున్నాయి. ఇవి గంటకు 25 నుంచి 60 కిమీ వేగంతో వస్తున్నాయి. ఇవి ప్రవేశించే ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే దిగువకు పడిపోతాయి. దీనివల్లే చల్లని గాలులకు పొగమంచు తోడవుతోంది. జనవరి వరకూ ఈ పరిస్థితులు కొనసాగనున్నాయి. ఈ తరహా చలి తీవ్రత అనారోగ్యాలకు కారణమవుతుంది. రాత్రి, తెల్లవారుజామున బయటకు వెళ్లేవారు గాలిని తట్టుకునే దుస్తులు ధరించాలి. వృద్ధులు, చిన్నపిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

– ప్రొ.భానుకుమార్, వాతావరణ నిపుణుడు

చంద్రబాబు నోట.. ఆరుసార్లు అదేమాట

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు వచ్చిన ప్రతిసారి చింతలపూడి ఎత్తిపోతలు పూర్తిచేస్తామని చెప్పిన సీఎం

- ఎన్నికల సమయంలో ఎన్నిసార్లు చెప్పారో లెక్కేలేదు
- అడుగు ముందుకుపడని ప్రాజెక్టు పనులు
- ఇంతకుముందు సీఎంగా ఉన్నప్పుడే అంచనావ్యయం భారీగా పెంచిన చంద్రబాబు
- జలయజ్ఞంలో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపనచేసిన అప్పటి సీఎం వైఎస్సార్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటనకు వచ్చిన ప్రతిసారీ ముఖ్యమంత్రి చంద్రబాబు అలవోకగా చెప్పేది చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పూర్తిచేస్తాం అనే మాట. గత ఏడాది ముఖ్యమంత్రి అయిన తరువాత చంద్రబాబు ఇప్పటికి ఆరుసార్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించారు. ఆరుసార్లు ఇదేమాట చెప్పారు. ఈనెల 1వ తేదిన ఉంగుటూరులో జరిగిన పింఛన్ల పంపిణీ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి 'చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రాజెక్ట్ పూర్తిచేస్తాం. చింతలపూడి, నూజివీడు లాంటి మెట్టప్రాంతాలను సస్యశామలం చేస్తాం. ప్రాజెక్ట్ పూర్తయితే ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాల్లో 4.80 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందుతుంది. ఇది మా ప్రభుత్వ ప్రాధాన్యత..' అని చెప్పారు. కానీ క్షేత్రస్థాయిలో ఆ ప్రాజెక్టు పనుల కోసం తీసుకున్న చర్యలే లేవు. గోదావరి జలాలను మెట్ట ప్రాంతాలకు తరలించాలనే సంకల్పంతో 2008 అక్టోబర్ 30న చింతలపూడి ఎత్తిపోతల పథకానికి అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 15 మెట్ట ప్రాంత మండలాలకు సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. జలయజ్ఞంలో భాగంగా రూ.1,701 కోట్లతో అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు నిర్మించి రెండులక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని పనులు చేపట్టారు. వైఎస్సార్ హఠాన్మరణంతో ప్రాజెక్ట్ అటకెక్కింది. మళ్లీ 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాజెక్ట్ వ్యయాన్ని భారీగా పెంచి అదనపు ఆయకట్టును దీని పరిధిలోకి తెచ్చేలా మార్పులు చేశారు. ప్రాజెక్టు వ్యయాన్ని రూ.4,909.80 కోట్లకు పెంచి ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 4.80 లక్షల ఎకరాలకు తాగు, సాగునీరు ఇచ్చేలా రూపొందించారు. అక్కడి నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. భూసేకరణ సమస్యలు చెప్పి ఈ ప్రాజెక్టును అటకెక్కించారు. 2024 ఎన్నికలకు ముందు ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తామని ఎన్నిసార్లు హామీలు ఇచ్చారో లెక్కేలేదు. ఏలూరు, చింతలపూడి, నూజివీడు, దెందులూరు.. ఇలా అన్ని నియోజకవర్గాల్లోను ఎన్నికల సభల్లో అధికారంలోకి వస్తే వెంటనే ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తామని చెప్పారు.

మాటల మూటలే..

2024లో సీఎం అయిన తరువాత చంద్రబాబు అగిరిపల్లి, పోలవరం, ఏలూరు, కైకలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వచ్చిన ప్రతిసారి.. 2026 జూన్‌కల్లా చింతలపూడి పూర్తిచేస్తామని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.222 కోట్లు కేటాయించినా.. ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. ముఖ్యమంత్రి ఎన్నిసార్లు చెప్పినా.. క్షేత్రస్థాయిలో ఈ ప్రాజెక్ట్ పనులకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. భూసేకరణ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపలేదు. ప్రధానంగా చింతలపూడి నియోజకవర్గంలో 14 కిలోమీటర్ల కాలువ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ విషయంలో ఇబ్బందులున్నాయి. కాలువ కోసం భూమి కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.19 లక్షల పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు వ్యతిరేకించారు. అప్పటి నుంచి ఈ సమస్య తీరలేదు.

చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేయాలి

రైతులకు ఆమోదయోగ్యమైన నష్టపరిహారం ఇచ్చి ప్రాజెక్ట్ పనులు వెంటనే ప్రారంభించాలి. ఎన్నికలకు ముందు పదేపదే హామీలిచ్చిన చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్.. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా సమస్య పరిష్కారంపై దృష్టిపెట్టకపోవడం సరికాదు.

– కంభం విజయరాజు, వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జ్

బ్రిటన్, కువైట్‌లో వైఎస్ జగన్ ముందస్తు పుట్టినరోజు

యూకేలో మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్ జగన్ జన్మదిన సందర్భంగా కువైట్‌లో రక్తదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభిమానులు

వేంపల్లె/కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ముందస్తు పుట్టినరోజును యునైటెడ్ కింగ్‌డమ్ బ్రిటన్‌లో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించినట్లు వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ గ్లోబల్ కో–ఆర్డినేటర్లు ఆలూరి సాంబశివారెడ్డి, డాక్టర్ చింతా ప్రదీప్ రెడ్డి, ఎల్.ఎన్.జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనం మెచ్చిన నాయకుడిగా, జననేతగా మాజీ సీఎం వైఎస్ ప్రఖ్యాతి పొందారన్నారు. ఆయన పుట్టినరోజును బ్రిటన్‌లో నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ యూకే కన్వీనర్లు సహాయ కన్వీనర్లు, కోర్ కమిటీ సభ్యులు, మహిళా విభాగం సభ్యులు, పెద్ద ఎత్తున యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కువైట్‌లో మెగా రక్తదానం

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందస్తు పుట్టినరోజు వేడుకలు కువైట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కువైట్ కమిటీ ఆధ్వర్యంలో కువైట్‌లోని జాబ్రియా బ్లడ్ బ్యాంకులో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ గ్లోబల్ కన్వీనర్ ఎ.సాంబశివారెడ్డి, గల్ఫ్ కన్వీనర్ బీహెచ్. ఇలియాస్, కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కువైట్‌లో ఉన్న జగనన్న అభిమానులు భారీ వర్షం పడుతున్నా లెక్క చేయకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చారని, కువైటీల ఇళ్లలో పని చేస్తున్న మహిళలు, డ్రైవర్లు అనుమతి తీసుకొని వచ్చి 82 మంది రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. రక్తదానం చేసిన వారికి జగనన్న సంతకంతో కూడిన సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కో–కన్వీనర్ గోవిందు నాగరాజు, కువైట్ కో కన్వీనర్లు కె. రమణయాదవ్, మర్రి కళ్యాణ్, షా హుసేన్, గల్ఫ్ కోర్ కమిటీ సభ్యులు పులపత్తూరు సురేష్ రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్. లక్ష్మీ ప్రసాద్ యాదవ్, షేక్ రహమతుల్లా, షేక్ అఫ్సర్ అలీ, కార్యవర్గ సభ్యులు షేక్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

గోదారమ్మకు గర్భశోకం

లోతుగా తవ్వేయడంతో పైకొచ్చిన నీరు

నదీ గర్భాన్ని కుళ్లబొడుస్తోన్న ఇసుక మాఫియా

పది అడుగుల లోతు వరకూ యంత్రాలతో తవ్వకాలు

- 'కానూరు–పెండ్యాల' ఓపెన్ రీచ్‌లో దర్జాగా దందా
- మూడు రోజులుగా నిరాటంకంగా అక్రమ బాగోతం
- అనుమతులు లేకపోయినా బరితెగింపు
- మంత్రి దుర్గేష్ నియోజకవర్గంలో సహజ సంపద దోపిడీ
- ప్రతి రోజూ 400 లారీలకు పైగా అక్రమ రవాణా
- రూ.కోట్లు దండుకుంటున్న కూటమి నేతలు
- మామూళ్ల మత్తులో కన్నెత్తి చూడని మైనింగ్, రెవెన్యూ అధికారులు

సాక్షి, రాజమహేంద్రవరం: గోదావరి నదీ తీరం ఇసుక మాఫియాకు అడ్డాగా మారింది. నిబంధనలకు నీళ్లొదిలి యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు కొనసాగిస్తోంది. తవ్వకాలకు అనుమతులు లేకపోయినా తమనెవరు ప్రశ్నిస్తారని రెచ్చిపోతోంది. గోదావరి నదీ గర్భాన్ని కుళ్లబొడుస్తోంది. పది అడుగుల లోతు వరకూ ఇష్టానుసారంగా తవ్వేస్తూ సహజ సంపదను దోపిడీ చేస్తోంది. కూటమి నేతల కనుసన్నల్లో అక్రమ దందా దర్జాగా సాగుతోంది. స్వయానా మంత్రి కందుల దుర్గేష్ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇంతటి దోపిడీకి తెర తీసినా.. అటువైపు కన్నెత్తి చూసే నాథుడే కరవయ్యాడు. మూడు రోజులుగా దందా సాగుతున్నా.. ఏ ఒక్క అధికారీ అడ్డుకునేందుకు సాహసం చేయడం లేదు. నిత్యం లారీల కొద్దీ ఇసుక ఇతర ప్రాంతాలకు తరలించి రూ.కోట్లు కొల్లగొడుతున్నా చర్యలు తీసుకునేందుకు మీనమేషాలు లెక్కిస్తుండటం వెనుక మతలబు ఏంటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

కాంట్రాక్టర్‌కు గడువు ముగిసినా..

నిడదవోలు నియోజకవర్గం 'కానూరు–పెండ్యాల' ఓపెన్ రీచ్‌లో మూడు రోజులుగా అనుమతులు లేకుండా ఇసుక యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. ర్యాంపును గతేడాది దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు గడువు ముగిసింది. ఈ ఏడాది ఇంకా అనుమతులు ఇవ్వలేదు. అయినా తమను ఆపేదెవరంటూ ఇసుక మాఫియా బరితెగిస్తోంది. కూటమి నేతల కనుసన్నల్లో ర్యాంపు నిర్వహిస్తుండడంతో అక్రమాల పర్వం కొనసాగుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు తూట్లు పొడిచి ఇసుకను తవ్వేస్తున్నారు. పగలు, రాత్రి అని తేడా లేకుండా తవ్వకాలు చేసి తరలించేస్తున్నారు. నిత్యం 400 లారీలకు పైగా ఇసుక భీమవరం, ఏలూరు, కృష్ణా జిల్లాలకు తరలిరచి సొమ్ము చేసుకుంటున్నారు.

మూడు జేసీబీలు ఉపయోగించి మరీ..

యంత్రాలతో దర్జాగా తవ్వేస్తున్నారు. అన్ని అనుమతులు ఉండి.. రీచ్ దక్కించుకుంటే ప్రభుత్వ నిబంధనల మేరకు కూలీల ద్వారా నదిలో ఉన్న మేటల నుంచి ఇసుకను తవ్వాలి. లోడింగ్‌కు సైతం కూలీలనే ఉపయోగించాలి. గోదావరిలోకి యంత్రాలు, లారీలు తీసుకెళ్లడం నిషేధం. కానీ ఇక్కడ మాత్రం అలాంటి పరిస్థితి మచ్చుకైనా కనిపించడం లేదు. ఇష్టానుసారంగా యంత్రాలతో లోడింగ్ చేసేస్తున్నారు. వందల సంఖ్యలో లారీలో గోదావరిలోకి తీసుకెళ్లి ఇసుకను లోడింగ్ చేస్తున్నారు. 'కానూరు–పెండ్యాల' రీచ్‌లో ప్రతి రోజూ మూడు జేసీబీలు ఇసుక తోడేందుకు వినియోగిస్తున్నారు. రాత్రిళ్లు అయితే మరింత రెచ్చిపోతున్నారు. కిలో మీటర్ల మేర వందల వాహనాలు క్యూ కడుతున్నాయి. యంత్రాలను నదిలోకి దించి పది అడుగుల వరకు గర్భాన్ని లోతుగా తవ్వేస్తున్నారు. ఒక్క 'కానూరు–పెండ్యాల' రీచ్ నుంచి ప్రతి రోజూ 400లకు పైగా లారీల ఇసుక అక్రమంగా తవ్వి, తరలించి సొమ్ము చేసుకుంటున్నట్టు సమాచారం.

నెలకు రూ.10 కోట్ల దోపిడీ

అసలే అక్రమ తవ్వకాలు ఆపై అధిక ధరకు విక్రయిస్తూ రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. అనుమతులు ఉంటే.. 'కానూరు–పెండ్యాల' ఇసుక ర్యాంప్‌లో 6 యూనిట్ల లారీ ఇసుక రూ.1,900 వందలకు విక్రయించాల్సి ఉంది. కానీ రూ.5,500 నుంచి రూ.6,500 వరకు వసూలు చేస్తున్నారు. అక్కడి నుంచి బయట మార్కెట్‌లోకి వెళ్లే సరికి కిరాయితో కలిపి రూ.10 వేల నుంచి రూ.15 వేలకు ఇసుక లారీ ధర చేరుతోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఓపెన్ రీచ్‌లలో ఇసుక టన్ను రూ.35 నుంచి రూ.100 లోపు మాత్రమే ఉంది. బోటు ర్యాంపుల వద్ద టన్ను ఇసుక రూ.240 ధర పలుకుతోంది. 6 యూనిట్లకు రూ.3,000 మాత్రమే తీసుకుంటున్నారు. అయితే కానూరు–పెండ్యాల రీచ్ వద్ద మాత్రం ఏకంగా రూ.6,500 దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఒక్క కానూరు–పెండ్యాల రీచ్ నుంచే ప్రతి రోజూ రాత్రి, పగలు 400కు పైగా లారీల ఇసుక అక్రమంగా తరలుతోంది. ఒక్కో లారీ ఇసుక రూ.6,500 చొప్పున రోజుకు 400 లారీలకు రూ.26 లక్షలు కూటమి నేతల జేబుల్లోకి వెళుతోంది. బిల్లులు కావాలంటే మరింత ఎక్కువ చెల్లించాల్సి వస్తోంది. మూడు రోజులుగా రూ.78 లక్షలు దండుకున్నట్లు విమర్శలున్నాయి. దీన్ని బట్టి చూస్తే ఒక్క ర్యాంప్ నుంచే నెలకు సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు దండుకుంటున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతోంది.

పరిమితులు లేకుండా..

అనుమతులు లేకుండా దర్జాగా తవ్వకాలు చేపడుతున్నా.. పరిమితులు లేకుండా లారీల ఇసుక తరలుతున్నా.. అధికారులు మాత్రం నిద్ర నటిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రహదారులపై లారీల ప్రవాహం కొనసాగుతున్నా అడ్డుకున్న దాఖలాలు లేవు. పైగా ఇసుక మాఫియాతో మైత్రి కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అనుమతులు లేకుండా ఎందుకు తవ్వుతున్నారు..?, ఎక్కడికి తరలిస్తున్నారు..? అని ప్రశ్నించిన సందర్భాలు లేవు. దీని వెనుక భారీ స్థాయిలో మామూళ్లు అందినట్లు ఆరోపణలున్నాయి. రీచ్ తెరిచే ముందే ఇసుక మాఫియా... అధికారులను మేనేజ్ చేసేసిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందులో భాగంగానే ఇంత భారీ అక్రమం జరుగుతున్నా.. పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

ఎవరాపుతారు?

అనుమతులు లేకుండా తవ్వుతున్న వైనంపై మాఫియా తమకేమీ భయం లేదన్నట్లుగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. తమకు ఓ ప్రజాప్రతినిధి, ఓ టీడీపీ నేత అండదండలు పుష్కలంగా ఉన్నాయని, తమను ఆపేవారెవరన్న ధీమాతో ఉన్నట్లు తెలిసింది.

మైనింగ్ అధికారుల లీలలు

ఇసుక మాఫియాను కాపాడేందుకు మైనింగ్ అధికారులు ఆగమేఘాలపై రంగంలోకి దిగారు. 'కానూరు–పెండ్యాల' ఇసుక ర్యాంపునకు 21.10.2024న టెండర్లు పిలిచారు. 13.03.2025 నుంచి 20.10.2025 వరకు ఇసుక తవ్వుకునేందుకు అనుమతులు ఇచ్చినట్లు మైనింగ్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. వారి ప్రకటనను పరిశీలిస్తే.. కానూరు–పెండ్యాల ర్యాంపునకు అక్టోబర్ నెలలోనే తవ్వకాలకు గడువు ముగిసింది. అయినా ప్రస్తుతం యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. కానీ మైనింగ్ అధికారులు మాత్రం పశ్చిమగోదావరి జిల్లాకు పెండ్యాల ర్యాంప్‌ను కేటాయించినట్లు తాజాగా ప్రకటనలో తెలిపారు. అయితే ఇసుక తవ్వకాలు పెండ్యాల ర్యాంపులోనే జరగాల్సి ఉన్నా.. కానూరు–పెండ్యాల ర్యాంప్‌లో తవ్వకాలు యథేచ్ఛగా చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే అక్రమాలకు ఏ స్థాయిలో సహకారం అందుతుందో అర్థమవుతోంది.

కూటమి నేతల కనుసన్నల్లో జరుగుతుండటం, అధికారులకు ఇప్పటికే ఆమ్యామ్యాలు అందడంతో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది.

కలెక్టర్ స్పందిస్తేనే..

ఇసుక అక్రమ తవ్వకాలు, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రీచ్‌లపై కలెక్టర్ స్పందిస్తే తప్ప తవ్వకాలు ఆగే పరిస్థితి లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో అనుమతులు లేకుండా తవ్వకాలు జరపాలంటే భయపడేవారని, ప్రస్తుతం నిర్భీతిగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. కొత్తగా జిల్లాకు వచ్చిన కలెక్టర్ దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

లోడింగ్‌కు రీచ్‌లోకి లారీలు, 'కానూరు–పెండ్యాల' ఓపెన్ రీచ్‌లో ఇసుకను లారీల్లో నింపుతున్న జేసీబీ

ఇంగ్లాండ్

రోమ్

వాటికన్ సిటీ

క్రిస్మస్ ట్రీ

క్రిస్మస్ వస్తే దేశ దేశాలలో, చర్చిల వద్ద, ఊర్లలో, వాడల్లో క్రిస్మస్ చెట్టు వెలుస్తుంది. రంగు రంగుల దీపాలతో వెలిగిపోతూ తల మీద పెద్ద స్టార్‌తో అది పండగ కళను తెస్తుంది. చలి దేశాలలో విపరీతంగా మంచు కురుస్తూ మూడ్ డల్‌గా ఉంటుంది ఈ సీజన్‌లో. పండగ టైమ్‌లో మూడ్ అలా కాకుండా కాస్త ఉత్సాహంగా ఉండాలని ఎన్నో ఏళ్ల క్రిందట ఇళ్ల ముందు ఫర్ ట్రీను నాటి దానికి దీపాలు వెలిగించడం అలవాటైంది. అలా మెల్ల మెల్లగా క్రిస్మస్ ట్రీ క్రిస్మస్ పండగలో భాగమైంది. ఇక్కడ కనిపిస్తున్న మూడు క్రిస్మస్ ట్రీలు రోమ్, వాటికన్ సిటీ, ఇంగ్లాండ్‌లలో వెలిసినవి. చూడండి ఎంత బాగున్నాయో.

● మహనీయులు

దేశానికి విశేష సేవలందించిన
పద్మజా నాయుడు

తెలుగు నేలపై అనేకమంది మహిళల భారత స్వాతంత్ర్యం కోసం పోరాడారు. దేశాన్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తం చేశారు. అందుకోసం ఎంతగానో కృషి చేశారు. అటువంటి వారిని మనం నిత్యం స్మరించుకోవాలి. వారిలో ఒకరు పద్మజా నాయుడు. ఆమె సరోజినీ నాయుడు, గోవిందరాజులు నాయుడు దంపతుల కుమార్తె. తల్లిదండ్రుల ఆశయాలను పుణికి పుచ్చుకొని దేశవ్యాప్తంగా తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు.

పద్మజా నాయుడు 1900 సంవత్సరం నవంబర్ 17న హైదరాబాదులో జన్మించారు. చిన్ననాడు ఎక్కువగా అనారోగ్యం బారిన పడేవారు. దీంతో ఆమె చదువుకు ఆటంకం ఏర్పడింది. మహబూబియా బాలికల ఉన్నత పాఠశాలలో నాలుగేళ్లు చదువుకున్నారు. అయితే తల్లిదండ్రులు, వారి కోసం వచ్చే అతిథులు, దేశ నాయకుల ద్వారా ఆమె విద్యను, వినయాన్ని, సంస్కారాన్ని నేర్చుకున్నారు. చిన్ననాటి నుంచే ఆమెవి ఆదర్శ భావాలు. 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వర్క్స్' శాఖను ఏర్పాటు చేసి పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. ముస్లిం స్త్రీలను సభ్యులుగా చేసుకొని ప్లేగు నివారణ కమిటీని ఏర్పాటు చేశారు. జాగిర్దారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఏర్పాటైన 'స్వదేశీ లీగ్' సంస్థకు అధ్యక్షురాలిగా పనిచేశారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో 'వన్ వరల్డ్' అనే పత్రికకు సంపాదకత్వం వహించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. తనతోపాటు ఇతర మహిళా ఖైదీలకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1950లో భారత రాజ్యాంగ సభకు ఎన్నికైన పద్మజా నాయుడు రెండేళ్లు ఆ పదవిలో కొనసాగారు. అనేక స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేశారు. 1956 నుంచి 1967 వరకూ బెంగాల్ గవర్నరుగా వ్యవహరించారు. జవహర్‌లాల్ నెహ్రూ కుటుంబానికి ఆమె సన్నిహితురాలు. ఆమె చక్కటి కవయిత్రి కూడా. 'ది ఫెదర్ ఆఫ్ డాన్' అనే కవితా సంకలనం వెలువరించారు. దేశానికి ఆమె చేసిన సేవలకు గుర్తుగా ప్రభుత్వం ఆమెకు 'పద్మవిభూషణ్' ప్రదానం చేసింది. 1975 మే 2న ఆమె తుదిశ్వాస విడిచారు.

ఏకాగ్రత

● కథ

అనగనగా ఓ అడవిలో జింకల గుంపు నివసించేది. ఆ గుంపులో సుదేవుడు అనే జింక తెలివిగలది, అనేక విద్యలు తెలిసినది. అదే గుంపులో కుంభుడనే చిన్నారి జింక ఉండేది. అది చాలా అల్లరిది. ఎప్పుడూ ఏదో గొడవ చేస్తూ తల్లిదండ్రులు మందలించినా, పెద్దలు వారించినా వినేది కాదు. ఇలాగే ఉంటే తమకు చెడ్డపేరు వస్తుందని భావించిన అతని తల్లిదండ్రులు కుంభుణ్ని సుదేవుడి దగ్గరకు విద్య నేర్చుకునేందుకు పంపించారు.

అక్కడికి వెళ్లినా కుంభుడు పద్ధతి మార్చుకోలేదు. సుదేవుడు పాఠం చెబుతుండగా తోటివారిని ఇబ్బంది పెట్టడం, చెయ్యమన్న పని చేయకపోవడం, పాఠం చెబుతుంటే పడుకోవడం వంటి చేస్తూ ఉండేది. దీంతో విసుగెత్తిన తోటివారు దాన్ని అక్కడి నుంచి పంపిస్తేనే తాము పాఠాలు వింటామని సుదేవుడితో అన్నారు. అయితే సుదేవుడు అంగీకరించలేదు. అల్లరి చేసినా సరే కుంభుడు అక్కడే ఉంటుందని, కొంతకాలం ఓపిక పట్టాలని అంది.

ఒకనాడు కుంభుడు అడవిలో తిరుగుతూ ఉండగా తెలియకుండా ఒక గోతిలో పడిపోయింది. తాను వేటగాడి వలలో చిక్కానని దానికి అర్థమైంది. దీంతో భయం నెలకొంది. ఎలా ప్రాణాలు రక్షించుకోవాలా అని ఆలోచించింది. ఆ సమయంలో సుదేవుడు చెప్పిన పాఠాలు గుర్తొచ్చాయి. అల్లరిలోనూ ఆయన మాటల్ని ఏకాగ్రతతో వినడంతో అవన్నీ గుర్తొచ్చాయి. కాసేపటికి వేటగాడు అక్కడికి వచ్చాడు. వెంటనే కుంభుడు ఊపిరి బిగపట్టి చనిపోయినట్లు నటించింది. అది చూసిన వేటగాడు జింకపిల్ల మరణించిందని భావించి వల తీసేశాడు. ఆ తర్వాత గోతిలో నుంచి కుంభుణ్ని బయటకు తీశాడు. జింకను భుజాన వేసుకొని తీసుకెళ్దామని భావిస్తూ వేటగాడు వెనక్కి తిరగ్గా రెప్పపాటులో కుంభుడు ఓపిక తెచ్చుకొని, చెంగున గెంతి పారిపోయింది. వెంటనే వేటగాడు బాణం తీసి గురిపెట్టి వదిలాడు. కుంభుడు ఒడుపుగా ఆ బాణాన్ని తప్పించుకుని వేగంగా పరిగెత్తింది.

గుంపులో కుంభుడు కనిపించకపోవడంతో అందరూ ఆందోళన చెందారు. ఎక్కడికి వెళ్లిందో తెలియక ఆందోళన చెందారు. కాసేపటికి కుంభుడు అక్కడికి చేరుకొని తనకు జరిగిన అనుభవాన్ని అందరికీ చెప్పాడు. అందరూ అతని చాకచక్యాన్ని మెచ్చుకున్నారు.

సుదేవుడు అతణ్ని అభినందించాడు. అల్లరి చేస్తూ విన్న పాఠాలే ప్రాణాలను కాపాడితే, అల్లరి చేయకుండా మరింత శ్రద్ధతో వెంటే ఇంకెంత మేలు జరుగుతుందో ఆలోచించాలని సుదేవుడు సూచించాడు. ఆ విషయాన్ని ఒప్పుకున్న కుంభుడు అందరినీ క్షమాపణలు కోరింది. ఇకపై తాను అల్లరి చేయనని, ఇకపై బుద్ధిగా ఉంటానని చెప్పింది. ఆ మాటతో అందరూ సంతోషించారు.

● పుస్తకాలు

భలే భలే బాలల జానపదాలు

చిన్నారులకు పాటలంటే చాలా ఇష్టం. అందులోనూ అలతి పదాలతో పాడుకునే జానపదాలంటే మరింత ఇష్టం. తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో పిల్లల కోసం పలు జానపద పాటలు వాడుకలో ఉన్నాయి. వాటన్నింటినీ సేకరించి పుస్తకంగా ప్రచురించారు రచయిత హరికిషన్. ఇందులో పాటలన్నీ పిల్లలకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని అందిస్తాయి. పిల్లలకు భాష మీద ప్రేమను పెంచుతాయి.

మంచి మనసున్న మంత్రగత్తె



రచయిత్రి జూలియా డోనాల్డ్‌సన్ రాసిన పిల్లల కథల పుస్తకం ఇది. మంచి మనసు కలిగిన ఓ మంత్రగత్తె, ఆమె పిల్లి ఈ కథలో ప్రధాన పాత్రలు. ఆమె తన చీపురు కర్రపై ప్రయాణించడానికి కుక్క, పక్షి, కప్పలను ఆహ్వానిస్తుంది. వారంతా కలిసి చేసే ప్రయాణమే ఈ కథలోని మూలాంశం. ఆక్సెల్ షెఫ్లర్ ఈ పుస్తకానికి చిత్రాలు గీశారు. ఈ పుస్తకం 22 భాషలలోకి అనువాదమై చిన్నారుల్ని అమితంగా అలరించింది. అనేక పురస్కారాలు గెలుచుకుంది.

● భలే భలే

క్రీస్తుపూర్వం బడి...
నేటికీ ఉంది తెలుసా?

పిల్లలూ! మీ స్కూల్ కట్టి ఎన్నేళ్లయ్యింది? పదేళ్లు, ఇరవై ఏళ్లు..మహా అయితే యాభై ఏళ్లు. అయితే వేల సంవత్సరాల క్రితమే ఉన్న బడి గురించి తెలుసా? మరింత ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, నేటికీ అది నడుస్తోంది. అందులో విద్యార్థులు చదువుకుంటున్నారు. అదే చైనా దేశంలోని చాంటూ షూషే ఉన్నత పాఠశాల.

ఈ పాఠశాలను క్రీ.పూ.143–141 సంవత్సరాల మధ్య హాన్ రాజవంశపు గవర్నర్ వెన్ వెంగ్ నిర్మించారు. చైనాలో స్థానిక ప్రభుత్వం నిర్మించిన మొట్టమొదటి ప్రభుత్వ పాఠశాల ఇదే. దీన్ని మొదట రాళ్లతో నిర్మించారు. అందుకే దీనికి 'షూషే' అంటారు. అంటే 'రాతి గది' అని అర్థం. ఈ పాఠశాలను వెన్‌వెంగ్ షూషే అని కూడా పిలుస్తారు. చరిత్రలో నిలిచిన హాన్ రాజవంశ పండితుడు సిమా జియాంగ్రు ఈ పాఠశాలలోనే చదువుకున్నారు. అనంతరం ఈ పాఠశాల అగ్నిప్రమాదంలో ధ్వంసమైంది. ఆపై క్రీ.శ.199లో పునర్నిర్మించారు. 17వ శతాబ్దంలో మింగ్ రాజవంశం పతనమైనప్పుడు జాంగ్ జియాన్‌జాంగ్ యొక్క తిరుగుబాటు దళం ఈ బడిని నాశనం చేసింది.

1661లో క్వింగ్ రాజవంశం అదే ప్రదేశంలో బడిని తిరిగి స్థాపించింది. తరువాత కాలంలో సిచువాన్ విశ్వవిద్యాలయంగా మారిన జిన్జియాంగ్ అకాడమీ 1740లో ఈ పాఠశాలలోనే స్థాపించారు.1902లో ప్రవేశపెట్టిన కొత్త విద్యావిధానంలో ఇది 'చెంగ్డు పుక్సు చెంగ్డు నార్మల్ స్కూల్'గా మారింది. ఆ తర్వాత 1904లో ఇది చెంగ్డు మిడిల్ స్కూల్‌గా మారింది. 1940లో దీన్ని చెంగ్డు షూషే మిడిల్ స్కూల్‌గా మార్చారు. 1948 మధ్యలో దేశవ్యాప్తంగా ఉన్న మాధ్యమిక పాఠశాలలకు ఒక నమూనాగా గుర్తించారు. 1952లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా స్థాపించిన తర్వాత ఈ పాఠశాల పేరును చెంగ్డు నంబర్ 4 మిడిల్ స్కూల్‌గా మార్చారు. చైనాలోని టాప్ 100 హైస్కూల్స్‌లో ఇదీ ఒకటిగా నేటికీ నిలబడింది. ఎంతోమంది చైనా ప్రముఖులు ఈ బడిలో చదువుకున్నారు.

● తోక లేని పిట్ట

ఇది జెన్-జీ పోస్టాఫీసు గురూ!

పిల్లలూ... మన టీనేజ్ అన్నయ్యలు... అక్కయ్యలు ఉత్తరాలు రాయడమే మానేశారు. వారి రాతలన్నీ ఫోన్‌లోనే ఉంటాయి. మరి వారికి 'తోక లేని పిట్ట'ను దగ్గర చేయడం ఎలా? అందుకే జెన్–జీ కోసం బెంగళూరులోని 'ఆచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లో కర్ణాటకలోని మొట్టమొదటి 'జెన్ జీ థీమ్ పోస్టాఫీసు'ను ఇండియా పోస్ట్ ఆవిష్కరించింది. యువతరాన్ని పోస్టు సేవలను దగ్గర చేసేందుకు, డిజిటల్ యుగంలో పోస్టాఫీసుల పాత్రను గుర్తించేందుకు ఇది ఉపకరిస్తుందని అధికారులు భావిస్తున్నారు. యువత తమ స్నేహితులతో సమయం గడుపుతూనే పోస్టాఫీసులను యాక్సెస్ చేయగలగడం ఈ జెన్–జీ పోస్టాఫీసు లక్ష్యం. ఇక్కడ సెల్ఫ్ బుకింగ్, డిజిటల్ పేమెంట్, తమ ఫొటోలతో స్టాంపులు చేయించుకోవడం, ఫోన్, ల్యాప్‌టాప్లకు ఛార్జింగ్ పెట్టుకోవడం, పుస్తకాల కోసం బుక్ బూత్ వంటి సౌకర్యాలు అందిస్తున్నారు. ఈ పోస్టాఫీసులో రంగురంగుల ఇంటీరియర్‌లు, వైఫై కనెక్టివిటీ, సెల్ఫీ పాయింట్, విద్యార్థులు రూపొందించిన అలంకరణ ఉన్నాయి. ఈ కార్యాలయాన్ని ప్లాన్ చేయడానికి, డిజైన్ చేయడానికి యువతకే అవకాశం ఇవ్వడం విశేషం.

బట్టల షాపు రోబో

చైనాలోని షాంఘైలో గ్లోబల్ డెవలపర్స్ సమ్మిట్ జరుగుతోంది. అక్కడ అనేక కంపెనీలు తాము తయారు చేసిన రోబోలను ప్రదర్శనకు పెట్టాయి. ఈ రోబోను చూడండి. బట్టల షాపులో పని చేసేందుకు వీలుగా తయారు చేసినట్టున్నారు. ఇకపై బట్టలు మడతపెట్టే పని మనుషులకు తప్పినట్టే.

● పక్షిలోకం

ఫ్రిగేట్ బర్డ్ – ఆకాశంలో రౌడీ పక్షి

Fregatidae అనే కుటుంబానికి చెందిన 'ఫ్రిగేట్ బర్డ్' అనే ఈ పక్షి సముద్ర పక్షులలో ఒక విభిన్నమైన జాతి. ఇవి ముఖ్యంగా భారత, పసిఫిక్ మరియు అట్లాంటిక్ మహాసముద్రాల వద్ద కనిపిస్తాయి. ఈ పక్షులు భూమిపై కంటే ఎక్కువ సమయం ఆకాశంలోనే గడుపుతాయి.

ఫ్రిగేట్‌బర్డ్‌లకు పొడవైన రెక్కలు, చీలిన తోక, వంకరగా ఉండే గట్టి ముక్కు ప్రత్యేక లక్షణాలు. వీటి విశాలమైన రెక్కల కారణంగా ఇవి గంటల తరబడి రెక్కలు ఊపకుండా గాలిలో తేలుతూ ప్రయాణించగలవు. ఇతర సముద్ర పక్షుల్లా ఇవి నీటిలోకి మునిగి చేపలు పట్టవు. నిజానికి, ఇవి నీటిపై కూర్చోవడానికే ఇష్టపడవు, ఎందుకంటే వాటి రెక్కలు తడిస్తే ఎగరడం కష్టం అవుతుంది.

ఈ పక్షులను 'ఆకాశంలో దొంగలు' లేదా 'రౌడీ పక్షులు' అని కూడా అంటారు. కారణం ఏమిటంటే, ఇవి ఇతర సముద్ర పక్షులు పట్టుకున్న ఆహారాన్ని గాల్లోనే దొంగిలిస్తాయి. ఈ ప్రక్రియను శాస్త్రీయంగా క్లెప్టోపరాసిటిజం అంటారు. ఇతర పక్షులను వెంటాడి, అవి పట్టుకున్న చేపలను వదిలేలా చేసి, వాటిని పట్టేసుకుంటాయి.

ఫ్రిగేట్‌బర్డ్‌లు సముద్ర పర్యావరణానికి చాలా ముఖ్యమైనవి. ఇవి సముద్రంలో చేపల సద్దిని సూచించే పక్షులుగా పరిగణించబడతాయి. ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో వీటి పాత్ర ఎంతో కీలకం.

సాత్విక్-చిరాగ్ జోడీ చరిత్ర

వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీలో సెమీస్ చేరిక

అజేయంగా, గ్రూప్ టాపర్‌గా... నాకౌట్‌కు ● ఈ ఘనతకెక్కిన తొలి భారత ద్వయం

కొన్నేళ్లపాటు భారత బ్యాడ్మింటన్‌లో సింగిల్స్‌లో షట్లర్లు దేశ ప్రతిష్ట పెంచారు. ‘చైనా’ గోడకు ఎదురునిలిచి సంచలన విజయాలు, ఒలింపిక్ పతకాలు, ప్రపంచ చాంపియన్‌షిప్ విజయాలు, ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకింగ్స్‌తో షట్లర్లు ఘన తకెక్కారు. అయితే డబుల్స్‌లో మాత్రం ఆ స్థాయికి చేరలేదనే బెంగ ఉండేది. కానీ ఇప్పుడది గతం! వర్తమానంలో సాత్విక్-చిరాగ్ జోడీ చెలరేగిపోతోంది. డబుల్స్ భవిష్యత్తును బంగారం చేయబోతోంది.

హాంగ్జౌ: భారత డబుల్స్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టిలు కొత్త చరిత్ర లిఖించారు. ప్రతిష్టాత్మక వరల్డ్ టూర్ ఫైనల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. తద్వారా ఈ మెగా టోర్నీలో సెమీస్ చేరిన తొలి భారత పురుషుల ద్వయంగా సాత్విక్-చిరాగ్ ఘనతకెక్కింది. ఈ టోర్నీలో ఈ జోడీ ఎదురేలేకుండా దూసుకెళుతోంది. ప్రపంచ అత్యుత్తమ, టాప్-8 జంటలే బరిలోకి దిగే ఈ మేటి టోర్నీలో గ్రూప్ ‘బి’లో ఉన్న సాత్విక్-చిరాగ్ జోడీ అజేయంగా నాకౌట్ దశకు అర్హత సంపాదించింది. చైనా గడ్డపై ప్రత్యర్థి జంటలను గడగడలాడిస్తోంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ వరుసగా గెలిచి ‘హ్యాట్రిక్’ నమోదు చేసింది. శుక్రవారం జరిగిన ఈ గ్రూపులోని ఆఖరి మూడో మ్యాచ్‌లో మూడో సీడ్ సాత్విక్-చిరాగ్ జోడీ 17-21, 21-18, 21-15తో మలేసియాకు చెందిన రెండో సీడ్ ఆరోన్ చియా-సో వుయ్ యిక్‌లపై చెమటోడ్చి నెగ్గింది. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతక విజేతలైన చియా- సో వుయ్‌లకు అసాధారణ పోరాటంతో చెక్‌పెట్టింది. ముఖాముఖీ పోటీల్లో 5-11తో వెనుకబడి వున్నప్పటికీ శుక్రవారం మాత్రం భారత జోడీ ప్రదర్శన మరో స్థాయిలో నిలిపింది. మింగుడు పడని ప్రత్యర్థి ద్వయం చేతిలో తొలి గేమ్‌ను కోల్పోయిన భారత జోడీ ఏమాత్రం నిరాశపడకుండా తదుపరి గేముల్లో పట్టుదల కనబరిచింది. పాయింట్ పాయింట్‌కు చెమటోడ్చి రెండో గేమ్‌ను వశం చేసుకొని మ్యాచ్‌లో నిలిచింది. ఇక నిర్ణాయక మూడో గేమ్‌లో అయిన చిరాగ్-సాత్విక్‌ల ఆటతీరుకు మలేసియన్ జోడీ తలొగ్గకతప్పలేదు. నేడు జరిగే సెమీఫైనల్లో భారత ద్వయం చైనాకు చెందిన లియాంగ్ వి కెంగ్-వాంగ్ చంగ్ జంటను ఢీకొట్టనుంది.

శిబిరానికి రాకుంటే జట్టులోకి రారా!

జాతీయ క్యాంప్‌లో హాజరు తప్పనిసరి చేసిన డబ్ల్యూఎఫ్ఐ

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) కొత్త సెలక్షన్ పాలసీని తీసుకొచ్చింది. సమాఖ్య ఏర్పాటు చేసే జాతీయ శిక్షణ శిబిరాలకు హాజరైన వారినే ఇక మీదట భారత జట్టుకు ఎంపిక చేస్తామని ప్రకటించింది. ఇకపై శిబిరాల్లో క్రమం తప్పకుండా పాల్గొన్న వారినే ఎంపిక కోసం పరిగణిస్తామని, శిబిరాలను బేఖాతరు చేసే రెజ్లర్లను భారత జట్టుకు ఎంపిక చేయబోమని డబ్ల్యూఎఫ్ఐ ప్రకటించింది. అహ్మదాబాద్‌లో ఇటీవల డబ్ల్యూఎఫ్ఐ జనరల్ కౌన్సిల్‌లో జరిగిన సుదీర్ఘ చర్చలో ఇదే విషయాన్ని కౌన్సిల్ సభ్యులు కూడా సూచించినట్లు డబ్ల్యూఎఫ్ఐ అధికారి ఒకరు వెల్లడించారు.

నో క్యాంప్... నో జెర్సీ!

ఎలైట్ రెజ్లర్లయినా, ఐకానిక్ ఆటగాళ్లయినా, ఒలింపిక్ పతక విజేతలు ఎవరైనా సరే జాతీయ శిక్షణ శిబిరాలకు రావాల్సిందే. శిబిరాలకు ఎంపికైన రెజ్లర్లు డబ్ల్యూఎఫ్ఐ ఏర్పాటు చేసిన జాతీయ క్యాంప్‌లో కచ్చితంగా పాల్గొనాలి. వ్యక్తిగతంగా మరో చోట శిక్షణ తీసుకుంటామంటే కుదరదు. సాకులతో శిబిరాలకు గైర్హాజరయ్యే రెజ్లర్లు ఎంతటి వారైనా సరే భారత జట్టుకు ఎంపిక చేయనే చేయరు. శిబిరాలకు ప్రాధాన్యత ఇచ్చి కోచ్ మార్గదర్శనంలో శిక్షణ పొందిన, అర్హత గల రెజ్లర్లకు మాత్రమే భారత టీమ్ జెర్సీ (బెర్తు) లభిస్తుంది.

ట్రయల్స్ ‘పోటీ’తోనే అంతర్జాతీయ ఈవెంట్లకు...

అంతర్జాతీయ ఈవెంట్లలో పోటీపడాలనుకునే రెజ్లర్లు ఇక మీదట తప్పనిసరిగా సెలక్షన్ ట్రయల్స్‌లోనూ పోటీపడాల్సి ఉంటుంది. గత పతక ఘనతలు, ర్యాంకింగ్‌ను ఏమాత్రం పరిగణించరు. కేవలం ప్రస్తుత ఫామ్, సెలక్షన్ ట్రయల్స్‌లో సత్తా చాటితేనే భారత జట్టుకు ఎంపిక చేస్తారు.

హెడ్ అజేయ శతకం

356 పరుగుల ఆధిక్యంలో ఆస్ట్రేలియా ● ఆసీస్ రెండో ఇన్నింగ్స్ 272/4
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 286 ఆలౌట్ ● ‘యాషెస్’ మూడో టెస్టు

అలెక్స్ కేరీ



ట్రవిస్ హెడ్

అడిలైడ్: ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా జట్టు మరో విజయానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. ఓపెనర్ ట్రవిస్ హెడ్ (196 బంతుల్లో 142 బ్యాటింగ్; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీతో చెలరేగడంతో ఆస్ట్రేలియా జట్టు రెండో ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి 2-0తో ఆధిక్యంలో ఉన్న ఆతిథ్య ఆస్ట్రేలియా... మూడో టెస్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 66 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసింది. మిడిలార్డర్ నుంచి ఓపెనర్‌గా ప్రమోషన్ దక్కించుకున్న హెడ్... ఈ సిరీస్‌లో రెండో సెంచరీ ఖాతాలో వేసుకోవడంతో ఆసీస్ భారీ స్కోరు చేసింది. మరో ఓపెనర్ జాక్ వెదరాల్డ్ (1), మార్నస్ లబుషేన్ (13), కామెరాన్ గ్రీన్ (7) విఫలం కాగా... తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో అలెక్స్ కేరీ (91 బంతుల్లో 52 బ్యాటింగ్; 4 ఫోర్లు) అజేయ అర్ధ శతకంతో ఆకట్టుకున్నాడు. ఉస్మాన్ ఖ్వాజా (51 బంతుల్లో 40; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. మరో వైపు నుంచి వికెట్లు పడుతున్నా... హెడ్ మాత్రం ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆడుతూ పాడుతూ పరుగులు సాధించాడు. మంచి బంతులను గౌరవిస్తూనే... చెత్త బంతులను బౌండరీలకు తరలించాడు. 72 బంతుల్లో హాఫ్‌సెంచరీ పూర్తి చేసుకున్న హెడ్.. 146 బంతుల్లో శతకం తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే తనకు అలవాటైన రీతిలో గాల్లోకి ఎగిరి సంబరాలు చేసుకునే హెడ్... ఈసారి మాత్రం అందుకు భిన్నంగా పిచ్‌ను ముద్దాడి ఆనందంలో మునిగిపోయాడు. సెంచరీకి ఒక పరుగు ముందు హెడ్ ఇచ్చిన క్యాచ్‌ను గల్లీలో హ్యారీ బ్రూక్ వదిలేశాడు. ఆ తర్వాత కొన్ని ఉత్కంఠ క్షణాలు ఎదుర్కొన్న హెడ్ ఎట్టకేలకు సెంచరీ పూర్తిచేసుకున్నాడు. టెస్టుల్లో అతడికిది 11వ శతకం. అబేధ్యమైన ఐదో వికెట్‌కు కేరీతో కలిసి హెడ్ 122 పరుగులు జోడించాడు. చేతిలో 6 వికెట్లు ఉన్న ఆస్ట్రేలియా.... తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 85 పరుగులతో కలుపుకొని ఓవరాల్‌గా 356 పరుగుల ముందంజలో ఉంది. ఈ మ్యాచ్‌లో మరో రెండు రోజుల ఆట మిగిలుండగా... శనివారం మరింత స్కోరు చేసి ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని నిలపాలని ఆసీస్ భావిస్తోంది.

స్టోక్స్-ఆర్చర్ రికార్డు భాగస్వామ్యం...

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 213/8తో శుక్రవారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ చివరకు 87.2 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ బెన్ స్టోక్స్ (198 బంతుల్లో 83; 8 ఫోర్లు) పట్టుదలగా పోరాడగా... జోఫ్రా ఆర్చర్ (105 బంతుల్లో 51; 5 ఫోర్లు, 1 సిక్స్) కీలక హాఫ్‌సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో స్టోక్స్ 159 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. టెస్టుల్లో అతడికిదే నెమ్మదైన అర్ధ శతకం. ఈ జోడీ తొమ్మిదో వికెట్‌కు రికార్డు స్థాయిలో 106 పరుగులు జోడించడంతో ఆస్ట్రేలియాకు తొలి ఇన్నింగ్స్‌లో ఎక్కువ ఆధిక్యం దక్కలేదు. ఒక్కసారి స్టోక్స్ అవుట్ అయ్యాక... ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. ఆస్ట్రేలియా బౌలర్లలో కమిన్స్, బోలాండ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు.

పంత్ కెప్టెన్సీలో కోహ్లి

విజయ్ హజారే టోర్నీలో ఆడనున్న టీమిండియా స్టార్

న్యూఢిల్లీ: దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో టీమిండియా స్టార్ విరాట్ కోహ్లి... ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో రెండు సెంచరీలతో విజృంభించిన విరాట్... న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందు ఈ టోర్నీలో పాల్గొనాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నమెంట్ ఆరంభ మ్యాచ్‌ల్లో కోహ్లి బరిలోకి దిగనున్నాడు. ఈ టోర్నీలోని తొలి రెండు మ్యాచ్‌ల కోసం శుక్రవారం ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) 20 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఈ టీమ్‌కు భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. కోహ్లి, పంత్‌తో పాటు సీనియర్ పేసర్లు ఇషాంత్ శర్మ, నవ్‌దీప్ సైనీ కూడా ఈ టోర్నీలో ఆడనున్నారు. పేస్ ఆల్‌రౌండర్ హర్షిత్ రాణా అందుబాటులో ఉన్న సమయంలో టోర్నీలో పాల్గొననున్నట్లు ప్రకటించాడు. గ్రూప్ ‘డి’లో భాగంగా ఢిల్లీ జట్టు డిసెంబర్ 24 నుంచి జనవరి 8 మధ్య ఏడు మ్యాచ్‌లు ఆడనుంది. ఆ తర్వాత జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో భారత జట్టు వన్డే సిరీస్ ఆడనుంది. దీంతో ఫామ్, ఫిట్‌నెస్ కాపాడుకునేందుకు కోహ్లికి ఈ టోర్నమెంట్ ఉపయోగపడనుంది. ఆయుష్ బదోనీ ఢిల్లీ జట్టు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా... యశ్ ధుల్, ప్రియాన్ష్ ఆర్య, నితీశ్ రాణా వంటి ప్రతిభావంతులు జట్టులో ఉన్నారు.

ఆరంభ మ్యాచ్‌లకు రోహిత్ దూరం

మరోవైపు టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో పాటు యశస్వి జైస్వాల్, అజింక్యా రహానే, శివమ్ దూబే... విజయ్ హజారే టోర్నీ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నారు. యువ ఆటగాళ్లను పరీక్షించాలనే ఉద్దేశంతో స్టార్ ఆటగాళ్లను తొలి రెండు మ్యాచ్‌లకు ఎంపిక చేయడం లేదని ముంబై చీఫ్ సెలెక్టర్ సంజయ్ పాటిల్ పేర్కొన్నాడు. ‘రోహిత్, జైస్వాల్, దూబే, రహానే కనీసం తొలి రెండు మ్యాచ్‌లకు ముంబై జట్టులో ఉండరు. సెలెక్షన్ కమిటీ యువ ఆటగాళ్లను పరీక్షించాలని భావిస్తోంది. జైస్వాల్ కడుపునొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో యువకులకు అవకాశం ఇవ్వాలని భావించాం’ అని సంజయ్ వెల్లడించారు. ఈ టోర్నీ గ్రూప్ ‘సి’లో ఉన్న ముంబై జట్టు ఈ నెల 24న తొలి మ్యాచ్‌లో సిక్కింతో తలపడనుంది.

చాంపియన్స్ సాహితి, శ్రీకాంత్

యూబీఎస్ అథ్లెటిక్స్ కిడ్స్ కప్

సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు నిర్వహించిన యూబీఎస్ అథ్లెటిక్స్ కిడ్స్ కప్ విజయవంతంగా ముగిసింది. జీఎంసీ బాలయోగి అథ్లెటిక్స్ స్టేడియంలో నిర్వహించిన ఈ టోర్నీలో... 7 నుంచి 15 ఏళ్ల విభాగాల్లో వేర్వేరుగా ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలు నిర్వహించారు. హైదరాబాద్ వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో నిర్వహించిన ప్రాథమిక రౌండ్‌లలో సత్తాచాటిన 500 మంది అథ్లెట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. బాలికల అండర్-15 విభాగంలో సత్యం ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన వర్ష ప్రథమ బహుమతి దక్కించుకోగా... సాహితి (ఎంఎస్‌ఆర్ హై స్కూల్), పర్వీన్ జేబా (అంబర్‌పేట్ గవర్నమెంట్ హై స్కూల్) వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచారు. బాలికల అండర్-14 విభాగంలో నాగార్జున గ్రామర్ హై స్కూల్‌కు చెందిన శ్రీజెనా మొదటి స్థానం దక్కించుకోగా... ప్రణవి (శ్లోక స్కూల్), భువనేశ్వరి (కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్) రెండో, మూడో బహుమతులు దక్కించుకున్నారు. బాలుర అండర్-15 విభాగంలో గంగోత్రి పబ్లిక్ స్కూల్‌కు చెందిన శ్రీకాంత్ అగ్రస్థానంలో నిలవగా... సమీర్ హుసేన్ (బ్రైట్ కాన్సెప్ట్ హైస్కూల్), రాహుల్ శెట్టి (గౌతమి టెక్నో స్కూల్) వరుసగా ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. అండర్-14 విభాగంలో పల్లవి మోడల్ స్కూల్‌కు చెందిన హర్షిత్ మొదటి స్థానం దక్కించుకోగా... మొహమ్మద్ అయాన్ ఖాన్ (పల్లవి మోడల్ స్కూల్), సూరజ్ కుమార్ (సెయింట్ థామస్ హై స్కూల్) వరుసగా రెండో, మూడో బహుమతులు దక్కించుకున్నారు. విజేతలకు రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు.

వ్రిత్తి అగర్వాల్‌కు పసిడి పతకం

సాక్షి, హైదరాబాద్: అఖిల భారత అంతర్ యూనివర్సిటీ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన వ్రిత్తి అగర్వాల్ పసిడి పతకంతో మెరిసింది. ఇప్పటికే జాతీయ స్థాయిలో పలు టోర్నీల్లో లెక్కకు మిక్కిలి పతకాలతో సత్తా చాటిన వ్రిత్తి... చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎమ్ యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో మరో స్వర్ణం ఖాతాలో వేసుకుంది. మహిళల 1500 మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగంలో శుక్రవారం వ్రిత్తి 18 నిమిషాల 1.04 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానం దక్కించుకుంది. విశ్వేశ్వర టెక్నాలజీ యూనివర్సిటీకి చెందిన షీరీన్ (18 నిమిషాల 10.97 సెకన్లు) రజత పతకం గెలుచుకోగా... అశ్విత చంద్ర (18 నిమిషాల 24.11 సెకన్లు; జైన్ యూనివర్సిటీ బెంగళూరు) కాంస్య పతకం సాధించింది.

కాన్వే డబుల్ సెంచరీ

- న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 575/8 డిక్లేర్డ్
- రాణించిన రచిన్ రవీంద్ర
- వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ 110/0
- మూడో టెస్టు

మౌంట్ మాంగనీ (న్యూజిలాండ్): న్యూజిలాండ్, వెస్టిండీస్ జట్ల మధ్య జరుగుతున్న మూడో టెస్టులో పరుగుల వరద పారుతోంది. ఓపెనర్ డెవాన్ కాన్వే (367 బంతుల్లో 227; 31 ఫోర్లు) డబుల్ సెంచరీతో చెలరేగడంతో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 334/1తో శుక్రవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ చివరకు 155 ఓవర్లలో 575/8 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. కాన్వే ద్విశతకంతో చెలరేగగా... రచిన్ రవీంద్ర (106 బంతుల్లో 72 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. కాన్వేకు టెస్టుల్లో ఇది రెండో డబుల్ సెంచరీ. 2021లో లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌పై టెస్టు అరంగేంట్రంలోనే ద్విశతకం సాధించిన కాన్వే... మళ్లీ నాలుగేళ్ల తర్వాత రెండో డబుల్ తన పేరిట లిఖించుకున్నాడు. ఎనిమిదిన్నర గంటలకు పైగా క్రీజులో నిలిచిన కాన్వేకు... టెస్టుల్లో ఇదే అత్యధిక స్కోరు. అయితే మిడిలార్డర్ ఆశించినంత వేగంగా ఆడలేకపోయింది. కేన్ విలియమ్సన్ (31; 5 ఫోర్లు), గ్లెన్ ఫిలిప్స్ (29; 4 ఫోర్లు), ఎజాజ్ పటేల్ (30 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) తలా కొన్ని పరుగులు చేశారు. వెస్టిండీస్ బౌలర్లలో జైడెన్ సీల్స్, అండర్సన్ ఫిలిప్స్, జస్టిన్ గ్రేవ్స్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్... శుక్రవారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 23 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 110 పరుగులు చేసింది. ఓపెనర్లు జాన్ క్యాంప్‌బెల్ (60 బంతుల్లో 45 బ్యాటింగ్; 7 ఫోర్లు), బ్రాండన్ కింగ్ (78 బంతుల్లో 55 బ్యాటింగ్; 9 ఫోర్లు) రాణించారు. కివీస్ బ్యాటర్లు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసిన పిచ్‌పై విండీస్ ప్లేయర్లు మరింత అలవోకగా పరుగులు రాబట్టారు. వన్డే తరహాలో ఓవర్‌కు 4.78 రన్‌రేట్‌తో కరీబియన్‌లు స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. చేతిలో 10 వికెట్లు ఉన్న వెస్టిండీస్... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 465 పరుగులు వెనుకబడి ఉంది. మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో న్యూజిలాండ్ ఇప్పటికే 1-0తో ఆధిక్యంలో ఉంది.

డిసెంబర్ 18వ తేదీ రాత్రి.. దుబాయ్ నగరం గాఢ నిద్రలోకి జారుకుంటోంది. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న ఆకాశం ఒక్కసారిగా రంగు మారిపోయింది. కారుమబ్బులు కమ్ముకున్నాయి.. ఉరుముల శబ్దం హడలెత్తిస్తోంది. సరిగ్గా అదే సమయంలో, ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన కట్టడం బుర్జ్ ఖలీఫా శిఖరాగ్రాన ఏదో జరగబోతోందని ఎవరూ ఊహించలేదు.

బుర్జ్ ఖలీఫాపై ప్రకృతి సంతకం

వణికిపోయిన దుబాయ్

ఒక్క సెకను.. కేవలం ఒక్కటంటే ఒక్క సెకను.. ఆకాశం చీల్చుకుంటూ ఒక భయంకరమైన మెరుపు తీగ నేరుగా వచ్చి 829.8 మీటర్ల ఎత్తున్న బుర్జ్ ఖలీఫా శిఖరాన్ని ముద్దాడింది. ఆకాశంలోని విద్యుత్ శక్తి అంతా ఆ కట్టడం పైకి ప్రవహించినట్లు అనిపించింది. కళ్లు బైర్లు కమ్మేలా, ఆ భవనం వెలిగిపోయింది. ఈ అరుదైన దృశ్యాన్ని దుబాయ్ యువరాజు షేక్ హమ్దాన్ తన కెమెరాలో బంధించడంతో.. అది కాస్తా ఇప్పుడు ప్రపంచాన్ని షేక్ చేస్తోంది.

అసలేం జరిగిందంటే..

యూఏఈని ప్రస్తుతం 'అల్ బషాయెర్' అనే ప్రమాదకరమైన అల్పపీడనం చుట్టుముట్టింది. డిసెంబర్ 18 నుండి దుబాయ్‌లో భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. వాతావరణ కేంద్రం ముందే హెచ్చరించినట్లు, ఆకాశం నుంచి నిప్పు కణికలు పిడుగుల రూపంలో విరుచుకుపడుతున్నాయి.

అద్భుతాన్ని బంధించిన యువరాజు

సాహసాలకు, ఫొటోగ్రఫీకి మారుపేరైన దుబాయ్ యువరాజు, యూఏఈ ఉప ప్రధాని షేక్ హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ఈ అరుదైన దృశ్యాన్ని వీడియో తీశారు. ఆయన తన ఇన్‌స్ట్రాగామ్ ఖాతాలో 'దుబాయ్' అనే క్యాప్షన్‌తో పాటు మెరుపు గుర్తును జోడించి పోస్ట్ చేసిన ఈ వీడియో చూసి నెటిజన్లు నోరెళ్లబెడుతున్నారు. నిప్పుకణిక వంటి మెరుపు 829.8 మీటర్ల ఎత్తున్న బుర్జ్ ఖలీఫా కొనను తాకిన తీరు రోమాంచితంగా ఉంది.

నోరెళ్లబెట్టిన నెటిజన్లు

పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే ఈ వీడియో లక్షలాది వ్యూస్ సొంతం చేసుకుంది. బుర్జ్ ఖలీఫా రాజసం, ప్రకృతి ప్రకోపం కలగలిసిన ఈ దృశ్యాన్ని నెటిజన్లు 'పవర్ ఫుల్'అంటూ అభివర్ణిస్తున్నారు. ప్రపంచం గర్వించే కట్టడంపై ప్రకృతి చేసిన ఈ సంతకం.. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యింది.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఉత్తరాదిన చలి వణికిస్తోంది. దీంతో, యూపీలోని కాన్పూర్ జూలో లూనా అనే ఆడ పులికి వెచ్చదనం కల్పించేందుకు అధికారులు ఎన్‌క్లోజర్ వద్ద హీటర్‌ను ఏర్పాటు చేశారు

నౌకాశ్రయాలు, ఓడల భద్రతకు బ్యూరో ఆఫ్ పోర్ట్ సెక్యూరిటీ

త్వరలో ఏర్పాటు చేయనున్న కేంద్ర ప్రభుత్వం • చట్టబద్ధమైన సంస్థగా పనిచేయనున్న బీవోపీఎస్

న్యూఢిల్లీ: దేశంలోని నౌకాశ్రయాల్లో మౌలికవనరుల భద్రత పెంపునకు కేంద్రం నడుం బిగించింది. బ్యూరో ఆఫ్ పోర్ట్ సెక్యూరిటీ పేరిట చట్టబద్ధమైన ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. భద్రతాపరమైన అంశాల విశ్లేషణ, సమాచార సేకరణ, పోర్టులు, నౌకలకు సంబంధించిన భద్రతాపరమైన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం వంటి విధులను ఇది నిర్వర్తిస్తుందని అధికారులు శుక్రవారం వెల్లడించారు. బ్యూరో ఆఫ్ పోర్ట్ సెక్యూరిటీ(బీవోపీఎస్) నిర్మాణం తదితర విషయాలపై చర్చించేందుకు గురువారం హోం మంత్రి అమిత్ షా ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో నౌకాశ్రయాలు, ఓడలు, జలరవాణా శాఖ మంత్రి శర్బందా సోనోవాల్, పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు పాల్గొన్నారు. పటిష్టమైన నౌకాశ్రయ భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. భద్రతా చర్యలను క్రమబద్ధంగా, ప్రమాద-ఆధారిత పద్ధతిలో అమలు చేయాలని అమిత్ షా ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లలో లోపాలు,, వాణిజ్య సామర్థ్యం, భౌగోళిక ప్రాంతం, సంబంధిత ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. సముద్రప్రాంత భద్రతా వ్యవస్థ ద్వారా నేర్చుకున్న పాఠాలను విమానయాన భద్రతా రంగంలో కూడా అమలు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ(బీసీఏఎస్) తరహాలో రూపొందించనున్న బీవోపీఎస్ విభాగం మర్చంట్ షిప్పింగ్ యాక్ట్–2025 ప్రకారం చట్టబద్ధమైన సంస్థగా పనిచేస్తుంది. ఇది ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ పరిధిలో ఉంటుంది. బీవోపీఎస్‌కు ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరిస్తారు. నౌకలు, ఓడరేవుల్లో భద్రతా నియంత్రణ, పర్యవేక్షణ బాధ్యతలను ఈయన చూసుకుంటారు. ముందుగా ఒక ఏడాదిపాటు షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ బీవోపీఎస్ డీజీగా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు. బీవోపీఎస్ ఓడ రేవుల భద్రతా సంబంధిత సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషించడం, సేకరించడం, పంచుకోవడం వంటి పనులను చేపడుతుంది. ముఖ్యంగా సైబర్ భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది. ఓడరేవుల్లోని ఐటీ మౌలిక వనరులను డిజిటల్ ముప్పు నుంచి రక్షిస్తుంది. దీనికోసం ఇందులోనే ఒక ప్రత్యేక విభాగం ఉంటుందని కేంద్రం ఆ ప్రకటనలో తెలిపింది. అదే సమయంలో, నౌకాశ్రయాల భద్రతకు గుర్తింపుపొందిన భద్రతా సంస్థ (ఆర్ఎస్‌వో)గా కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాన్ని (సీఐఎస్ఎఫ్)ను ఇటీవల కేంద్రం నియమించడం తెల్సిందే. ఓడరేవుల భద్రతలో పాలుపంచుకునే ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల సామర్థ్యాన్ని పెంపొందించడానికి కేంద్ర సాయుధ పోలీసు బలగాలు శిక్షణ ఇస్తాయి. కేవలం లైసెన్స్ పొందిన ఏజెన్సీలు మాత్రమే ఈ రంగంలో పనిచేసేలా తగిన నియంత్రణ చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం పేర్కొంది.

ఎక్స్‌లో అత్యధికంగా రీపోస్ట్ అయిన 8 పోస్టులు ప్రధాని మోదీవే

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గడిచిన 30 రోజుల్లో సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా చేసిన 8 వ్యాఖ్యలు/ ఫొటోలు అత్యధికంగా రీపోస్ట్ చేసిన టాప్ 10 పోస్టుల్లో నిలిచాయి. ఇటీవల ఢిల్లీ విమానాశ్రయం నుంచి రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కలిసి కారులో ప్రయాణిస్తున్నట్లుగా ఉన్న ఫొటో కూడా ఇందులో ఉంది. మొత్తం ఎనిమిది పోస్టులకు కలిపి 'ఎక్స్'లో 1,60,700 రీపోస్టులు, 14.76 లక్షల లైకులు వచ్చాయి. ఈ సామాజిక మాధ్యమ వేదికపై అత్యధికంగా లైకులు, రీపోస్టులు వచ్చిన దేశంలోని ఏకైక రాజకీయ నేతగా మోదీ ఘనత సాధించారని అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 4వ తేదీన మాస్కో నుంచి వచ్చిన అధ్యక్షుడు పుతిన్‌తో ఢిల్లీ విమానాశ్రయంలో మోదీ ఘన స్వాగతం తెలిపిన అనంతరం ఇద్దరూ కలిసి కారులో ప్రయాణిస్తున్నట్లుగా ఉన్న ఫొటోను ఎక్స్‌లో 34 వేల రీపోస్టులు, 2.14 లక్షల లైకులు వచ్చాయి. మొత్తం 8 పోస్టుల్లో టాప్‌లో ఈ ఫొటోనే ఉంది. అదేవిధంగా, పుతిన్ రష్యా భాషలో ఉన్న భగవద్గీతను మోదీ బహూకరిస్తున్న ఫొటోకు 29 వేల రీపోస్టులు, 2.31లక్షల లైకులు వచ్చాయి. నవంబర్ 29వ తేదీన పెళ్లి చేసుకున్న ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్, జోడీ హేడెన్ జంటకు ప్రధాని మోదీ వివాహ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాని మోదీ పంపిన శుభాకాంక్షల సందేశం 14,900 రీపోస్టులు, 2.11 లక్షల లైకులు పడ్డాయి. నవంబర్ 25న అయోధ్యలో ధర్మధ్వజారోహణ ఉత్సవంలో ప్రధాని మోదీ పాల్గొన్నప్పటి పోస్టు 26,300 రీపోస్టులు, 1.40 లక్షల లైకులు వచ్చాయని అధికారులు వివరించారు.

'నో పీయూసీ- నో ఫ్యూయెల్'

ఢిల్లీలో 2,800 వాహనాలకు ఇంధన నిరాకరణ

న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణలో భాగంగా చేపట్టిన 'నో పీయూసీ.. నో ఫ్యూయెల్'అమలు గురువారం ప్రారంభమైంది. మొదటి రోజునే 2,800 వాహనాలకు చమురు నిరాకరించినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. ఢిల్లీ రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో 210 ఎన్‌ఫోర్స్ మెంట్ బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసులతో కలిసి ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. డ్రైవ్‌లో భాగంగా గురువారం ఉదయం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటలవరకు పీయూసీ (పొల్యూషన్ అండ్ కంట్రోల్) నిబంధనలు ఉల్లంఘించిన వారికి 3,746 చలాన్లు జారీ చేసినట్లు తెలిపారు. గురువారం నుంచి 'నో పీయూసీ.. నో ఫ్యూయల్'అమలు చేస్తున్నట్లు ఢిల్లీ పర్యావరణ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా ప్రకటించిన తరువాత నో పీయూసీ సర్టిఫికెట్లకు డిమాండ్ బాగా పెరిగింది. డిసెంబర్ 17న 31వేలకు పైగా సర్టిఫికెట్లు జారీ చేశారు.

22న అత్యవసర కేసులు విచారిస్తాం

- సెలవైనా ఒకట్రెండు ధర్మాసనాలు పనిచేస్తాయి
- సీజేఐ సూర్యకాంత్ వెల్లడి

న్యూఢిల్లీ: ఈ నెల 22వ తేదీన సెలవు దినం అయినప్పటికీ అత్యవసర కేసులను వినేందుకు సిద్ధంగా ఉన్నానని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా సుప్రీంకోర్టు ఈ నెల 22 నుంచి జనవరి 2వ తేదీ వరకు సెలవులు. అత్యవసర కేసుల వివరాలను ప్రాధాన్యత క్రమంలో అందజేయాల్సిందిగా రిజిస్ట్రీని ఆదేశించినట్లు జస్టిస్ సూర్యకాంత్ శుక్రవారం చెప్పారు. ఇతర న్యాయమూర్తులను ఇబ్బంది పెట్టడం తమకు ఇష్టం లేదన్నారు. రాత్రివేళ విచారణ చేపట్టాల్సిన కేసులను అధ్యయనం చేస్తామన్నారు. కేసుల సంఖ్యను బట్టి, ఒకటి లేదా రెండు ధర్మాసనాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆయన ప్రకారం.. సెలవుల ప్రారంభం రోజున సోమవారం సీజేఐ సారథ్యంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీల ధర్మాసనం అత్యవసర కేసులను చేపట్టనుంది. అదేవిధంగా, అత్యవసర కేసులను విచారించాలంటూ వచ్చే జూనియర్ లాయర్లు ఆ కేసులను 22న వారే వాదించాల్సి ఉంటుందని కూడా సీజేఐ షరతు విధించారు.

ఉక్రెయిన్‌లో అనుకున్న లక్ష్యాలను సాధిస్తాం

- యుద్ధక్షేత్రంలో మా బలగాలు దూసుకెళ్తున్నాయి
- ఏడాది చివరికల్లా వ్యూహాత్మకంగా మరిన్ని విజయాలు
- వార్షిక మీడియా భేటీలో రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడి

మాస్కో: ఉక్రెయిన్‌లో ఆశించిన సైనిక లక్ష్యాలను సాధిస్తామన్న నమ్మకం తనకు ఉందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం రష్యా బలగాలు యుద్ధ క్షేత్రంలో ముందుకు సాగుతున్నాయని ఆయన ప్రకటించారు. ఇప్పటికే వ్యూహాత్మకంగా పైచేయి సాధించాయని, ఈ ఏడాది చివరి నాటికి మరిన్ని ప్రాంతాలను కైవసం చేసుకుంటాయని ధీమా వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌పైకి దండెత్తి దాదాపు నాలుగేళ్లవుతున్న సందర్భంగా ఆయనీ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన వార్షిక మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన దేశ వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్‌కు సైతం నేరుగా లైవ్‌లో సమాధానాలిచ్చారు. ఒకవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ యుద్ధానికి ముగింపు పలికేలా తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్న వేళ పుతిన్ ఏం మాట్లాడుతారా అని పరిశీలకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 2022 ఆరంభంలో పెద్ద ఎత్తున దండెత్తి వచ్చిన రష్యా బలగాలను చాలా చిన్నదైన ఉక్రెయిన్ ఆర్మీ సమర్థంగా తిప్పికొట్టగలిగినప్పటికీ, రాన్రానూ అత్యంత భారీ రష్యా ఆర్మీ, అధునాతన ఆయుధ సంపత్తి ముందు తలొంచక తప్పలేదు. రష్యా బలగాలు యుద్ధ క్షేత్రంలో మెరుపు వేగంతో చొచ్చుకుపోలేకున్నా, క్రమంగా పైచేయి సాధిస్తూ ముందుకు సాగుతున్నాయి. దీనిపై పుతిన్ మాట్లాడుతూ..'మా బలగాలు యుద్ధక్షేత్రమంతటా ముందుకు వెళ్తున్నాయి. ఒక్కోచోట వేగంగా, మరోచోట నెమ్మదిగా వెళ్తున్నాయి. మొత్తమ్మీద శత్రువు వెనక్కి మరలుతున్నాడు'అని పేర్కొన్నారు. ఈ సంక్షోభానికి మూల కారణాలను పరిష్కరించేందుకు శాంతియుతమైన ఒప్పందం కోసం తాము సిద్ధంగా ఉన్నామన్నారు. స్తంభింపజేసిన రష్యా ఆస్తుల్ని విక్రయించి, ఆ సొమ్మును ఉక్రెయిన్‌కు సాయంగా ఇవ్వాలంటూ పశ్చిమదేశాలు చేస్తున్న ప్రయత్నాలను పుతిన్ తప్పుబట్టారు. దీనిని పశ్చిమ దేశాలు సాగిస్తున్న దోపిడీగా అభివర్ణించారు. యూరోజోన్‌పై వ్యాపార, పారిశ్రామికవేత్తలపై విశ్వాసాన్ని దెబ్బతీస్తుందన్నారు.

భారత్‌తో మరింత సన్నిహిత రక్షణ సంబంధాలు

వార్షిక రక్షణ విధానంపై అధ్యక్షుడు ట్రంప్ సంతకం

వాషింగ్టన్: టారిఫ్‌లు, వీసాలపై ఆంక్షలంటూ ఒకవైపు భారత్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరోవైపు చైనాతో ఎదురవుతున్న సవాళ్లకు చెక్ పెట్టేందుకు భారత్‌తో రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. ఇందుకు ఉద్దేశించిన నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్–2026పై తాజాగా ఆయన సంతకం చేశారు. స్వేచ్ఛాయుత ఆసియా–పసిఫిక్ ప్రాంత సాధనకు భారత్‌ను కలుపుకుని పోవాల్సిన అవసరాన్ని ఆయన గుర్తించారు. ప్రస్తుతం ఇండో–అమెరికా వ్యూహాత్మక భద్రతా చర్చల్లో విదేశాంగ మంత్రి పాల్గొనడంతోపాటు భారత్‌తో సన్నిహిత సంబంధాలను కొనసాగించాలని అందులో పేర్కొన్నారు. న్యూక్లియర్ లయబిలిటీ నిబంధనల అమలుపై ఎప్పటికప్పుడు ఆ దేశంతో కలిసి సమీక్షలు చేపడుతూ ఉండాలని నిర్దేశించారు. ఈ రంగంలో ద్వైపాక్షిక సహకారానికి గల అవకాశాలపై మూడు నెలల్లోగా నివేదికను అందించాలని విదేశాంగ మంత్రిని ఆదేశించారు. ఆ తర్వాత ఏటా ఇలాంటి నివేదికలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీంతోపాటు, రక్షణ మంత్రి ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనాతో ఎదురవుతున్న పోటీలో పైచేయి సాధించేందుకు అమెరికా రక్షణ మిత్రులు, భాగస్వామ్యదేశాలతో సన్నిహిత సంబంధాలను సుదృఢం చేసుకునేందుకు కృషి కొనసాగించాలని ఆ చట్టంలో పేర్కొన్నారు. క్వాడ్ సహా స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్ ప్రాంతం అనే ఉమ్మడి లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు భారత్‌తో ద్వైపాక్షిక, బహుళ పక్ష చర్చలు వేగవంతం చేయడం, ఉమ్మడి సైనిక విన్యాసాలు చేపట్టడం, రక్షణ రంగ వాణిజ్యాన్ని పెంచుకోవడం, మానవతా సాయం- విపత్తు నిర్వహణలో సహకరించుకోవడం వంటివి ఇందులో ఉన్నాయి. భారత్ సహా ఏ దేశాన్ని అయినా భాగస్వామ్య దేశంగా ప్రకటించేందుకు విదేశాంగ మంత్రికి ఈ చట్టం ద్వారా అవకాశమేర్పడింది.

ప్రధానిపై వివాదాస్పద పోస్టు..

యువకుడి పిటిషన్ కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: ప్రధాని మోదీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన బెంగళూరు యువకుడు పెట్టుకున్న అర్జీపై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. చేసిన పనిపై అతనిలో ఎలాంటి పశ్చాత్తాపం గానీ, తప్పు చేసిన భావన గానీ లేదని వ్యాఖ్యానించింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ గురుదత్ షెట్టి(24)వేసిన పిటిషన్‌పై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీల విచారణ చేపట్టింది. 'పిటిషనర్ భావ ప్రకటన హక్కు, వాక్ స్వాతంత్య్రం హక్కులను అతడు తీవ్రంగా దుర్వినియోగపర్చాడు. ఈ దశలో అతడికి ఎలాంటి ఉపశమనం ఇవ్వలేము'అని తెలిపింది. అయితే, అతడు సంబంధిత హైకోర్టుకు వెళ్లి, చట్ట పరిధిలో తగు పరిష్కారం కోరేందుకు అవకాశమిస్తున్నట్లు వివరించింది. పిటిషనర్ బేషరతుగా క్షమాపణ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాడని, గుజరాత్ పోలీసుల అరెస్ట్ నుంచి వారం పాటు రక్షణ ఇవ్వాలంటూ అతడి లాయర్ చేసిన వినతిని ధర్మాసనం తోసిపుచ్చింది.

ప్రజాస్వామ్యం అంటే జవాబుదారీతనం

రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ జర్మనీలో శుక్రవారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాజధాని బెర్లిన్‌లోని హెర్టీ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యావేత్తలు, మేధావులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రజాస్వామ్యమంటే కేవలం ప్రభుత్వ వ్యవస్థ మాత్రమే కాదు, జవాబుదారీ తనం కూడా అని అన్నారు. ప్రజలతో నిత్యం మమేకమై ఉండటం ప్రజాస్వామ్యంలో మాత్రమే సాధ్యమని చెప్పారు. సమ్మిళిత ప్రాముఖ్యత, విద్యావకాశాలు అందరికీ సమానంగా అందాల్సిన ఆవశ్యకతను రాహుల్ నొక్కి చెప్పారు. సమాజంలో పేరుకుపోయిన అసమానతలను రూపుమాపేందుకు బలమైన అంతర్జాతీయ సహకారం అవసరం ఎంతో ఉందని తెలిపారు. అనంతరం ఆయన జర్మనీ వైస్ చాన్సెలర్ లార్స్ క్లింగ్‌బిల్, మాజీ చాన్సెలర్ ఒలాఫ్ షోల్జ్‌తోనూ భేటీ అయ్యారని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ తెలిపింది. భారత సంతతి ప్రజలతోనూ రాహుల్ సమావేశమయ్యారని, దేశానికి నిజమైన రాయబారులంతా వారి కృషిని ప్రశంసించారని వెల్లడించింది.

సీఐఎస్ఎఫ్ జవాను రెండో పెళ్లి..

అతడి తొలగింపు సరైందే: సుప్రీం

న్యూఢిల్లీ: మొదటి వివాహం చట్టబద్ధంగా అమల్లో ఉండగానే రెండో పెళ్లి చేసుకున్నందుకు గాను, కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్ఎఫ్)జవానును క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఉద్యోగం నుంచి తొలగించడం సరైందేనని సుప్రీంకోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీల ధర్మాసనం...చట్టాన్ని అతిక్రమించినప్పుడు ఎదురయ్యే ఇబ్బందులు లేదా కష్టాలను సాకుగా చూపి, చట్టం నిర్దేశించిన శిక్ష నుంచి తప్పించుకోలేమని వ్యాఖ్యానించింది. సంబంధిత జవాను శిక్ష తగ్గింపును పరిశీలించాలంటూ ఈ కేసులో గౌహతి హైకోర్టు సీఐఎస్ఎఫ్ అధికారులకు ఇచ్చిన ఆదేశాలను పక్కనబెట్టింది.

తైవాన్‌లో జనంపై కత్తి, గ్రనేడ్‌తో దాడి

ముగ్గురి మృతి, తొమ్మిది మందికి గాయాలు

తైపీ: తైవాన్ రాజధాని తైపీలో శుక్రవారం సాయంత్రం ఘోరం జరిగింది. ఓ వ్యక్తి జనంపై కత్తి, పొగ గ్రనేడ్‌తో దాడికి దిగాడు. ఈ ఘటనలో కనీసం ముగ్గురు మరణించారు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. తర్వాత నిందితుడు ఓ భవనం ఆరో అంతస్తు నుంచి కిందికి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడిని 27 ఏళ్ల చాంగ్ వెన్‌గా గుర్తించారు.

సంప్రదాయ వైద్యానికి సముచిత స్థానం దక్కాలి

డబ్ల్యూహెచ్‌వో కార్యక్రమంలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: సంప్రదాయ వైద్యానికి సరైన గుర్తింపు ఇప్పటికీ లభించలేదని ప్రధానమంత్రి మోదీ శుక్రవారం అన్నారు. ఈ వైద్య విధానం తన పరిధిని మరింతగా విస్తరించుకోవాలంటే, శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రజల నమ్మకాన్ని గెలవాల్సి ఉందని చెప్పారు. సంప్రదాయ వైద్యంపై శుక్రవారం ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ప్రధాని ప్రసంగించారు. డిజిటల్ సాంకేతికతను వాడుకుంటూ పరిశోధనలను మరింతగా విస్తరించుకుంటూ సంప్రదాయ వైద్యం తన పరిధిని పెంచుకోవాలని సూచించారు. లైఫ్‌స్టయిల్ విధానాలకు మాత్రమే సంప్రదాయ వైద్య పరిమితమనే నమ్మకం ఒకప్పుడు ఉండేది. ఈ ఆలోచనాధోరణిలో వేగంగా మార్పువచ్చింది. క్లిష్టమైన సందర్భాల్లో సైతం సంప్రదాయ వైద్య విధానాలు నేడు ప్రభావవంతంగా ఉంటున్నాయి. ఇదే దృక్పథం భారత్‌లోనూ ఉండాలని మోదీ చెప్పారు. 'ఒకప్పుడు ప్రపంచంలోని అత్యధిక ప్రాంతంలో సంప్రదాయ వైద్యానికే పెద్దపీట వేసేవారు. అయినప్పటికీ, దీనికి దక్కాల్సిన స్థానం ఇప్పటికీ దక్కలేదు. సైన్స్ ద్వారా నమ్మకాన్ని పెంచుకోవాలి. మరింతగా ప్రజాబాహుళ్యంలోకి వెళ్లాలి'అని అన్నారు. భారతీయ సంప్రదాయ వైద్య విధానాల్లో కీలకంగా ఉన్న అశ్వగంధకు కోవిడ్ మహమ్మారి సమయంలో అంతర్జాతీయంగా డిమాండ్ వచ్చిందన్నారు. భారత వైద్య నిపుణులు అమూల్యమైన పరిశోధనలు, సాధించిన ప్రమాణాల ఫలితంగా అశ్వగంధకు సముచిత స్థానం దక్కిందని వివరించారు. ఇలాంటి మూలికలకు ప్రపంచ ఆరోగ్య రంగంలోభాగంగా మారేలా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రకటించారు. సంప్రదాయ వైద్యానికి అంగీకార యోగ్యతను కల్పించడం దేశాల బాధ్యతని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మై ఆయుష్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ పోర్టల్(ఎంఏఐఎస్‌పీ)ని ప్రారంభించారు. ఆయుష్ ఉత్పత్తులు, సేవల నాణ్యతను నిర్ధారించే ఆయుష్ మార్క్‌ను ఆవిష్కరించారు. అశ్వగంధపై తపాలా స్టాంపును విడుదల చేశారు. డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రెయెసుస్, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, ప్రతాప్‌రావ్ జాదవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈసారి బడ్జెట్ ఆదివారమే!

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సామాన్యుడి నుంచి కార్పొరేట్ దిగ్గజాల వరకు అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే 'కేంద్ర బడ్జెట్' ఈసారి ఒక సంచలనానికి వేదిక కాబోతోంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026–27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ఆదివారం ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. సెలవు రోజు పార్లమెంటు సభలు జరగడం అరుదైన విషయమైనా, ఈసారి అది కార్యరూపం దాల్చే సూచనలు కనిపిస్తున్నాయి.

సస్పెన్స్ రేపుతున్న ఫిబ్రవరి 1

2017 నుండి బడ్జెట్‌ను ఫిబ్రవరి మొదటి తేదీనే ప్రవేశపెట్టడం ఒక ఆచారంగా మారింది. అయితే, 2026 ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం కావడంతో ఇప్పుడు అందరి దృష్టి కేంద్రంపై పడింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజును దీనిపై ప్రశ్నించగా.. 'సరైన సమయంలో క్యాబినెట్ కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుంది'.. అంటూ సస్పెన్స్‌ను కొనసాగించారు.

కొత్తేమీ కాదు కానీ..

బ్రిటిష్ కాలం నాటి 'వారాంతపు సెలవు' విధానం మన బడ్జెట్ తేదీని మార్చలేదు. గతంలో కూడా కోవిడ్ సమయంలో, పార్లమెంటు 60వ వార్షికోత్సవం (మే 13, 2012) సందర్భంగా ఆదివారాల్లో సభలు నిర్వహించిన చరిత్ర ఉంది. ఒకప్పుడు బడ్జెట్ అంటే ఫిబ్రవరి చివరి రోజు జరిగేది.

కోస్టు గార్డు చేతికి.. అమూల్య!

న్యూఢిల్లీ: భారత తీర రక్షక దళం నిఘా నేత్రం మరింత పదునెక్కనుంది. సాగర జలాల్లో శరవేగంగా దూసుకెళ్తూ పహారా కాసే అత్యాధునిక నిఘా నౌక అమూల్య శుక్రవారం లాంఛనంగా కోస్ట్ గార్డ్ అమ్ములపొదిలో చేరింది. తర్వాతి తరానికి చెందిన మామూలు శ్రేణి నౌకలో ఇది మూడోది. అంతేగాక తొలి రెండింటికన్నా అత్యంత వేగవంతమైనది. నిఘాతో పాటు సోదా, రెస్క్యూ, స్మగ్లింగ్ నిరోధక ఆపరేషన్స్ తదితరాల్లో కూడా ఇది వెలలేని సేవలు అందిస్తుందని కోస్ట్ గార్డ్ ఒక ప్రకటనలో తెలిపింది. నౌకా పాటవ విస్తరణకు కోస్ట్ గార్డ్ చేపట్టిన చర్యల్లో అమూల్య శ్రేణి ఫ్లీట్ ను మైలురాయిగా రక్షణ నిపుణులు పేర్కొంటారు.

ఎన్నెన్నో విశేషాలు...!

- ఈ నౌక పూర్తిపేరు ఐసీజీఎస్ అమూల్య
- పొడవు 51 మీటర్లు. దీన్ని గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ నిర్మించింది.
- దీనిలో వాడిన 60 శాతం పై చిలుకు విడి భాగాలు దేశీయంగా తయారైనవే.
- ఇంటిగ్రేటెడ్ బ్రిగేడ్ సిస్టమ్, ఆటోమేటెడ్ పవర్ మేనేజ్మెంట్ సిస్టమ్ వంటి పలు

అత్యాధునిక పహారా నౌక

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలు దీని సొంతం.

- అంతేగాక పూర్తి దేశీయంగా అభివృద్ధి చేసిన కంట్రోలబుల్ పిచ్ ప్రొపెల్లర్స్, అత్యంత కచ్చితత్వంతో పని చేసే గేర్ బాక్సులు అమూల్యకే సొంతమైన విశేషాలు. వీటి సాయంతో ఎంతటి క్లిష్టమైన కోణంలో అయినా చివరి నిమిషంలో కూడా అవసరమైన వైపుకు తిరగగల సామర్థ్యం ఈ నౌకకు ఉంటుంది.
- గంటకు 27 నాట్ల వేగంతో ఏకంగా 1,500 నాటికల్ మైళ్ళ వరకు నిర్నిరోధంగా దూసుకెళ్లగలదు.

అమెరికాలో ఘోర విమాన ప్రమాదం

నాస్కార్ రేసింగ్ దిగ్గజం బిఫ్, కుటుంబం సహా ఏడుగురు మృతి

స్టేట్స్‌విల్లే: అమెరికాలోని నార్త్ కరోలినాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. నాస్కార్ డ్రైవర్ గ్రెగ్ బిఫిల్, అతని కుటుంబం సహా విమానంలో ఉన్న ఏడుగురు మరణించారు. గురువారం ఉదయం స్టేట్స్‌విల్లే ప్రాంతీయ విమానాశ్రయం నుంచి నార్త్‌కరోలినాకు బయలుదేరిన సెస్నా సీ550 జెట్‌లో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సమస్య ఏర్పడింది. విమానశ్రయానికి తిరిగి వచ్చి ల్యాండ్ అయ్యే ప్రయత్నంలో రన్‌వేపై కూలిపోయింది. విమానం నేలను తాకగానే భారీ మంటలు చెలరేగాయి. క్షణాల్లో విమానం దగ్ధమైపోయింది. ఈ ప్రమాదంలో గ్రెగ్ బిఫిల్, ఆయన భార్య క్రిస్టినా, కుమారుడు రైడర్, కుమార్తె ఎమ్మా, మరో ముగ్గురు మరణించారు. ఈ జెట్ బిఫిల్ ఆధ్వర్యంలో నడుపుతున్న కంపెనీ పేరు మీదే రిజిస్టర్ అయి ఉంది. అయితే బిఫిల్ హెలికాప్టర్లతోపాటు సింగిల్, మల్టీ ఇంజన్ విమానాలు కూడా నడపగలరని, ప్రమాదం జరిగిన సమయంలో విమానాన్ని ఎవరు నడుపుతున్నారనే విషయం స్పష్టంగా తెలియరాలేదు. ప్రమాద సమయంలో ప్రాంతంలో ప్రతికూల వాతావరణం ఉంది. 55 ఏళ్ల బిఫిల్ నాస్కార్ ఛాంపియన్. 50కి పైగా రేసుల్లో గెలుపొందారు. ఆయన మృతి పట్ల నాస్కార్ కమ్యూనిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

ఉక్రెయిన్‌కు 90 బిలియన్ యూరోల సాయం

బ్రస్సెల్స్: ఉక్రెయిన్‌కు సైనిక, ఆర్థిక అవసరాల కోసం వడ్డీలేని రుణాన్ని అందించడానికి యురోపియన్ యూనియన్ (ఈయూ) నాయకులు అంగీకరించారు. 2026–27 సంవత్సరానికి ఉక్రెయిన్‌కు 90 బిలియన్ యూరోల సాయం చేసేందుకు ఈయూ కట్టుబడి ఉందని కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా తెలిపారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్ట్‌లో వెల్లడించారు. ఈ ఒప్పందానికి రావడానికి ఈయూ నాయకులు తీవ్రంగా కృషి చేశారని పేర్కొన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ.. ఈయూ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. దేశం ముందున్న బడ్జెట్ లోటును ఇది పూడుస్తుందని, తమ దేశ రక్షణను బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు.

వర్తకం కోసం వచ్చి పెత్తనం సాగించిన వలసవాదులు

ఆధునిక భారతదేశ చరిత్ర

వాస్కోడిగామా చూపిన మార్గంలో అనేక మంది పోర్చుగీసు వర్తకులు భారతదేశానికి వచ్చారు. 1503లో ఫ్రాన్సిస్-డి-అల్మీడా భారతదేశంలోని పోర్చుగీస్ స్థావరాలకు మొదటి గవర్నర్‌గా నియామకమయ్యాడు. ఇతడు నీలి నీటి విధానం (Blue Water Policy)ను విస్తరింపజేశాడు. ఆల్ఫెన్సో-డి-ఆల్బ్యూకర్క్ 1509 నుంచి 1515 వరకు భారత్‌లో రెండో పోర్చుగీసు గవర్నరుగా పని చేశాడు. ఇతడు పోర్చుగీస్ సామ్రాజ్యానికి పునాదులు వేశాడు. గోవాను, పర్షియా సింధుశాఖలోని హార్మోజ్‌ను 1510లో ఆక్రమించాడు.

ఆంగ్లేయుల రాక..

భారతదేశంలో మొదటిసారి అడుగుపెట్టిన ఆంగ్లేయుడు ఫాదర్ థామస్ స్టీవెన్స్. ఇతడు 1579లో గోవా చేరాడు. 1600లో ఎలిజబెత్ రాణి (లండన్) అనుమతితో భారతదేశంలో వాణిజ్యం చేయడానికి 'ఈస్టిండియా కంపెనీ'ని స్థాపించాడు. 1611లో కెప్టెన్ జేమ్స్ హాకిన్స్ భారతదేశం వచ్చి మొదటి జేమ్స్ ఉత్తరంతో మొగలు పాదుషా జహంగీర్‌ను కలుసుకున్నాడు. జహంగీర్ అనుమతితో ఇతడు 1612లో సూరత్‌లో మొదటి కర్మాగారం స్థాపించాడు. తర్వాత అహ్మదాబాద్, ఆగ్రా, హుబ్లీ, కాశింబజార్, ఢాకాలో కర్మాగారాలు ఏర్పాటు చేశాడు. ఆంగ్లేయులు భారతదేశంలో ప్రధానంగా దుస్తులు, నల్లమందు వ్యాపారం చేసేవారు. పోర్చుగీసువారితో బ్రిటిషర్లకు ఆధిపత్య పోరు మొదలైంది. 1614లో ఈస్టిండియా కంపెనీవారు పోర్చుగీసువారిని 'సూర్' సమీపంలో ఓడించారు. 1618లో మొదటి జేమ్స్ రాయబారిగా సర్ థామస్ (1615-19) జహంగీర్ ఆస్థానానికి వచ్చి రెండు 'ఫర్మానా'లు పొందాడు. వీటిలో మొదటిది భారతదేశంలో వాణిజ్యం చేసుకోవడానికి అనుమతించడం. రెండోది స్వదేశీ వాణిజ్యంపై సుంకాలు తగ్గించడం.

దక్షిణ భారతదేశంలో మొదటి కర్మాగారాన్ని మచిలీపట్నంలో స్థాపించారు. 1641లో సెయింట్-జార్జికోట (మద్రాసు) ను నిర్మించారు. 1654లో ఇంగ్లిష్ కంపెనీ వాణిజ్య ఆధిపత్యాన్ని పోర్చుగీస్ గుర్తించింది. 1661లో పోర్చుగీస్ వారు బ్రిటిష్ రాజైన రెండో చార్లెస్‌కు బొంబాయిని కట్నంగా ఇచ్చారు. 1698లో ఈస్టిండియా కంపెనీ సత్నాటి, కాలికట, గోవిందపూర్ ప్రెసిడెన్సీల్లో జమీందారీ హక్కులు పొందింది.

ఆ తర్వాత ఈ మూడు ప్రెసిడెన్సీలను కలిపి 'కలకత్తా' నగరాన్ని ఏర్పాటు చేశారు. 1690లో జాబ్ చార్నాక్ కలకత్తాకు శంకుస్థాపన చేశాడు. 1696లో ఇక్కడ జార్జి విలియం కోట నిర్మాణం మొదలైంది. 1746 నుంచి 1763 వరకు బ్రిటిషర్లు, ఫ్రెంచివారి మధ్య ఆధిపత్యం కోసం మూడు కర్ణాటక యుద్ధాలు జరిగాయి. ఇందులో మూడో కర్ణాటక యుద్ధం (1758-63) ముఖ్యమైంది. 1760లో వాండివాష్ యుద్ధంలో ఇంగ్లిషువారు, ఫ్రెంచివారిని ఓడించి పూర్తి ఆధిపత్యం సాధించారు. 1756లో బెంగాల్ నవాబైన సిరాజుద్దౌలా కలకత్తా పోర్టును ఆక్రమించి చీకటి గది ఉదంతానికి కారకుడయ్యాడు. 1757లో ప్లాసీ యుద్ధంలో సిరాజుద్దౌలాను ఓడించి ఇంగ్లిషువారు కలకత్తాను తిరిగి ఆక్రమించుకున్నారు. 1759లో ఇంగ్లిష్ కంపెనీవారు డచ్‌వారిని బెదరా యుద్ధంలో ఓడించారు. 1764 బక్సార్ యుద్ధం విజయంతో ఉత్తర భారతంలో బ్రిటిషర్ల ఆధిపత్యానికి తిరుగులేకుండా పోయింది. ఈ విజయం కారణంగా 1767లో బెంగాల్‌లో ద్వంద్వ ప్రభుత్వం ఏర్పాటైంది.

1664లో ఫ్రెంచ్ ఈస్టిండియా కంపెనీని 14వ లూయీ మంత్రి కోల్బర్ట్ స్థాపించాడు. 1667లో ఫ్రాంకోయిస్ కరన్ 'సూరత్' ఫ్యాక్టరీని స్థాపించాడు. ఫ్రాన్సిస్కో మార్టిన్ 1673లో ముస్లిం గవర్నర్ నుంచి అనుమతి పొంది పాండిచ్చేరికి పునాదులు వేశాడు. ఇతడు 1764లో గవర్నర్‌గా నియమితుడయ్యాడు. ఫ్రెంచ్‌వారు 1674లో షాయిస్థాఖాన్ నుంచి అనుమతి పొంది బాలాసోర్, కాశిం బజార్, చంద్రనాగూర్ వద్ద ఫ్యాక్టరీలు నిర్మించుకున్నారు. 1674లో డూప్లే పాండిచ్చేరి గవర్నర్‌గా నియమితుడయ్యాడు. ఇతడు రెండు ఆస్ట్రియా వారసత్వ యుద్ధాలు చేశాడు.

డచ్ కంపెనీ

డచ్చివారు యూరప్‌లోని హాలెండ్ (నెదర్లాండ్స్) దేశానికి చెందినవారు. వీరు 1602లో డచ్ ఈస్టిండియా కంపెనీ స్థాపించారు. వీరు తూర్పు ఇండియా సుగంధ దీవులపై దృష్టి కేంద్రీకరించారు. 1604లో గోల్కొండ నవాబు అనుమతితో మచిలీపట్నంలో మొదటి డచ్చి వర్తక స్థావరం ఏర్పాటు చేశారు. 1610లో పులికాట్ వద్ద స్థావరాన్ని నిర్మించుకున్నారు.

వారన్ హేస్టింగ్స్ (1772-85)

వారన్ హేస్టింగ్స్ 1772లో బెంగాల్ గవర్నర్‌గా నియమితులయ్యాడు. ఇతడు 1773 నుంచి 1785 వరకు గవర్నర్ జనరల్‌గా పనిచేశాడు. 1773లో ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దు చేశాడు. 1773లో రెగ్యులేటింగ్ చట్టం చేశారు. దీంతో కంపెనీకి తూర్పుదేశ వర్తకంపై గుత్తాధిపత్యం లభించింది. వారన్ హేస్టింగ్స్ రాజధానిని ముర్షిదాబాద్ నుంచి కలకత్తాకు మార్చాడు. సివిల్ న్యాయస్థానానికి కలెక్టరును, క్రిమినల్ న్యాయస్థానానికి భారతీయుడిని న్యాయాధిపతిగా నియమించాడు. న్యాయ సంస్కరణలలో భాగంగా ముఖ్యంగా జిల్లాల్లో 'దివానీ', 'ఫౌజ్‌దారీ' అదాలత్‌లను ప్రవేశపెట్టాడు. ప్రెసిడెన్సీ (కలకత్తా)లలో సాదర్, దివానీ సాదర్, నిజామత్ అదాలత్‌లను ఏర్పాటు చేసి హిందూ, ముస్లిం చట్టాలు అమలు చేశాడు. 1784లో బ్రిటిషర్లు పిట్స్ ఇండియా చట్టం చేశారు.

కారన్ వాలిస్ (1786-93)

ఇతడు సివిల్ సర్వీసులను ప్రవేశపెట్టాడు. ప్రభుత్వ యంత్రాంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టాడు. వివిధ స్థాయిల్లో కోర్టులను ఏర్పాటు చేశాడు. న్యాయశాఖ నుంచి పరిపాలన శాఖను వేరుపరిచాడు. 1793లో శాశ్వత శిస్తు విధానం ప్రవేశపెట్టాడు. న్యాయ విచారణ పద్ధతిని రాయించాడు. న్యాయ పద్ధతిపై కారన్ వాలీస్ కోడ్‌ను పొందుపరిచాడు. మూడో మైసూర్ యుద్ధంలో టిప్పుసుల్తాన్‌ను ఓడించి రాజ్యంలో సగభాగాన్ని తీసుకున్నాడు.

సర్ జాన్‌షోర్ (1793-98)

శాశ్వత శిస్తు విధానంలో ఇతడి పాత్ర ప్రధానమైంది. జాన్‌షోర్ కాలంలో బ్రిటిష్ పార్లమెంట్ 1793లో చార్టర్ చట్టం చేసింది.

లార్డ్ వెల్లస్లీ (1798-1805)

ఇతడు ఉద్యోగుల శిక్షణ కోసం 1800లో పోర్ట్ విలియం కళాశాల స్థాపించాడు. సంస్థానాధీశులను సామంతులుగా చేసుకున్నాడు. నాలుగో మైసూర్ యుద్ధంలో టిప్పుసుల్తాన్‌ను ఓడించాడు. 1798లో సైన్య సహకార పద్ధతిని ప్రవేశపెట్టాడు. దీనికి మొదటగా హైదరాబాద్ నిజాం అంగీకరించి ఒప్పందం చేసుకున్నాడు. వెల్లస్లీ రెండో మరాఠా యుద్ధం చేశాడు. ఇతడి కాలంలో మద్రాస్ ప్రెసిడెన్సీ ఏర్పడింది.

- 1805 నుంచి 1807 వరకు జార్జ్‌బార్లో గవర్నర్ జనరల్‌గా పని చేశాడు. ఇతడి కాలంలో వెల్లూరు తిరుగుబాటు జరిగింది.

మొదటి లార్డ్ మింటో (1807-1813)

ఇతడి కాలంలో 1813లో చార్టర్ చట్టం చేశారు. రంజిత్ సింగ్‌తో అమృతసర్ ఒప్పందం చేసుకున్నాడు.

లార్డ్ హేస్టింగ్స్ (1813-1823)

ఇతడు నేపాల్ యుద్ధం, మూడో మరాఠా యుద్ధం చేశాడు. పీష్వా పదవి రద్దు చేశాడు. బొంబాయి ప్రెసిడెన్సీ ఏర్పాటు చేశాడు. పిండారులు అనే దారి దోపిడీదారులను అదుపులోకి తెచ్చాడు. బొంబాయి, మద్రాసులో రైత్వారీ పద్ధతి అమలుపరిచాడు. దీనికి సర్ థామస్ మన్రో, ఎల్ఫిన్‌స్టోన్ సహకరించారు. 1817లో కలకత్తాలో ఆంగ్ల మాధ్యమంలో బోధించే హిందూ కళాశాలను స్థాపించాడు. 1813 చట్టంతో ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీకి చైనాతో పూర్తి స్వేచ్ఛా వాణిజ్యం చేసుకునే వెసులుబాటు కలిగింది. హేస్టింగ్స్ 1799లో పత్రికలపై ఆంక్షలు రద్దు చేశాడు.

లార్డ్ అమ్రెస్ట్ (1823-1828)

ఇతడి కాలంలో మొదటి బర్మా యుద్ధం జరిగింది. భరత్‌పూర్‌ను ఆక్రమించాడు.

విలియం బెంటింక్ (1828-1835)

ఇతడు గవర్నర్ జనరళ్లలో గుర్తింపు పొందినవాడు. విలియం బెంటింక్ 'థగ్గులు' అనే దారి దోపిడీ దొంగలను అణచివేశాడు. మైసూర్ రాజును పదవి నుంచి తొలగించాడు. కాచర్, జైంషియా, కూర్గ్‌ను ఆక్రమించాడు. 1828లో బెంగాల్ రాష్ట్రానికే కాకుండా భారతదేశమంతటికీ గవర్నర్ జనరల్‌గా నియమితుడయ్యాడు. 1829లో సతీసహగమనాన్ని నిషేధించాడు. పురిటిలో ఆడ పిల్లలను చంపడం లాంటి దురాచారాలను అదుపు చేశాడు. భారతీయులు ఉన్నత ఉద్యోగాలకు అర్హులని ప్రకటించాడు. బెంటింక్ కలకత్తాలో వైద్య కళాశాలను స్థాపించాడు. 1835లో మెకాలే అధ్యక్షతన న్యాయ సంఘాన్ని నియమించాడు. దీనికి సంబంధించి ఇంగ్లిష్ భాషలో విద్యా బోధన ప్రవేశపెట్టాడు. 1833లో చార్టర్ చట్టంతో స్వేచ్ఛా వాణిజ్యాన్ని ఎత్తేశారు.

- 1835 నుంచి 1836 వరకు సర్ చార్లెస్ మెట్‌కాఫ్ గవర్నర్ జనరల్‌గా పని చేశాడు.
- 1836-42 మధ్య లార్డ్ ఆక్లాండ్ గవర్నర్ జనరల్‌గా ఉన్నాడు. ఇతడు అఫ్గానిస్తాన్‌లో బ్రిటిషర్ల పరాజయం ఫలితంగా పదవి కోల్పోయాడు.

లార్డ్ ఎలెన్‌బరో (1842-44)

ఇతడు సింధ్‌ను బ్రిటిష్ ఇండియాలో విలీనం చేశాడు. ఇతడి కాలంలో మొదటి అఫ్గాన్ యుద్ధం ముగిసింది. ఇతడు గ్వాలియర్ యుద్ధం చేశాడు.

లార్డ్ ఎలెన్‌బరో (1842-44)

ఇతడు సింధ్‌ను బ్రిటిష్ ఇండియాలో విలీనం చేశాడు. ఇతడి కాలంలో మొదటి అఫ్గాన్ యుద్ధం ముగిసింది. ఇతడు గ్వాలియర్ యుద్ధం చేశాడు.

మొదటి లార్డ్ హార్డింజ్ (1844-48)

ఇతడి కాలంలో మొదటి సిక్కు యుద్ధం జరిగింది. ఆంగ్ల మాధ్యమంలో చదివిన భారతీయులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాడు. ఇతడు నరమేధాన్ని అణచివేశాడు.

లార్డ్ డల్హౌసి (1848-56)

ఇతడు రెండో సిక్కు యుద్ధం తర్వాత పంజాబ్‌ను ఆక్రమించాడు. రెండో బర్మా యుద్ధం తర్వాత బర్మా దిగువ ప్రాంతాన్ని ఆక్రమించాడు. రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి సతారా, సంబల్‌పూర్, ఝాన్సీ, నాగ్‌పూర్‌ను ఆక్రమించాడు. అయోధ్యను ఆక్రమించాడు. ఇతడి హయాంలో వితంతు పునర్వివాహ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఇతడి కాలంలో సంతాలులు తిరుగుబాటు చేశారు. ప్రతి రాష్ట్రంలో పబ్లిక్ వర్క్స్ శాఖను ప్రవేశపెట్టారు. 1854లో చార్లెస్ ఉడ్స్ అధ్యక్షుడిగా విద్యకు సంబంధించిన అంశాలపై కమిటీ ఏర్పాటు చేశాడు. ఈ కమిటీ సూచనలతో విద్యాలయం నుంచి విశ్వవిద్యాలయాల వరకు కీలక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. 1853లో రైళ్లు, తంతితపాలా, రోడ్డు రవాణా సౌకర్యాలు ప్రవేశపెట్టాడు. బొంబాయి నుంచి థానే వరకు మొదటి రైల్వే లైన్ వేశారు. కలకత్తా నుంచి పెషావర్ వరకు మొదటి తంతి నిర్మించాడు. 1854లో మొదటిసారిగా తపాలా బిళ్లలను ప్రవేశపెట్టాడు. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేశాడు. 1853లో చార్టర్ చట్టంతో పోటీ పరీక్షలను ప్రవేశపెట్టారు. ఈ చట్టం వ్యాపార సంస్థలకు.. వ్యాపారంలో తప్ప మిగతా విషయాలతో సంబంధం లేకుండా చేసింది. 1854లో బొంబాయిలో మొదటి నూలు మిల్లు, కలకత్తాలో జనపనార మిల్లును స్థాపించారు.

లార్డ్ కానింగ్ (1856-62)

1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ పార్లమెంట్ 1858లో ఒక చట్టం చేసింది. దీని ప్రకారం బ్రిటిష్ ఇండియాలో 'వైస్రాయ్' పదవిని ఏర్పాటు చేశారు. లార్డ్ కానింగ్ 1858 చట్టం ప్రకారం తొలి రాజప్రతినిధిగా నియమితులయ్యాడు. 1861లో ఇండియా కౌన్సిళ్ల చట్టం ప్రవేశపెట్టారు. 1859లో రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని రద్దు చేశారు. 1858లో భారత శిక్షాస్మృతి, 1861లో హైకోర్టు చట్టాన్ని ప్రవేశపెట్టారు. 1865లో లారెన్స్ మూడు హైకోర్టులను స్థాపించాడు. 1857లో కానింగ్ కలకత్తా, బొంబాయి, మద్రాసులో విశ్వవిద్యాలయాలు స్థాపించాడు. ఇతడి కాలంలో 1859లో శ్వేత సైనికుల విప్లవం, 1860లో నీలి మందు రైతుల తిరుగుబాటు, 1863లో పాబ్నా రైతుల తిరుగుబాటు చెలరేగాయి.

మానవ శరీరంలో అతి కఠిన భాగం?

అస్థిపంజర వ్యవస్థ

అస్థిపంజరం.. ఎముకలతో నిర్మితమైన చట్రం. దీనిలో కొన్ని మృదులాస్థి నిర్మాణాలు కూడా ఉంటాయి. దేహభాగాలకు నిర్దిష్టమైన ఆకృతి, దృఢత్వాన్ని, మెదడు, గుండె, ఊపిరితిత్తులకు రక్షణనిస్తూ శరీర కదలికల్లో అస్థిపంజర వ్యవస్థ ప్రధాన పాత్ర పోషిస్తుంది. మానవుడి దేహంలోని మొత్తం ఎముకలన్నింటినీ కలిపి అస్థిపంజరం అంటారు. అస్థిపంజరం అధ్యయనాన్ని ఆస్టియాలజీ అంటారు. ఎముకల్లో ఉండే ప్రొటీన్ ఆస్టిన్. మానవుడి అస్థిపంజరంలో 206 ఎముకలు ఉంటాయి.

ఎముకలను ఏర్పర్చే కణాలు ఆస్టియోసైట్స్. ఎముకల్లో ఉండే మూలకాలు కాల్షియం, ఫాస్ఫరస్. ఎముకల్లో కాల్షియం ఫాస్ఫేట్ ఎక్కువగా, కాల్షియం కార్బొనేట్ తక్కువగా ఉంటుంది. కాల్షియం ఎముకకు దృఢత్వాన్నిస్తుంది. మానవ శరీరంలో అత్యధికంగా ఉండే మూలకం కాల్షియం.

పాలు, గుడ్లు, ఆకుకూరల్లో కాల్షియం అధికంగా లభిస్తుంది. విటమిన్-డి కూడా చర్మం, ఎముకల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ఎముకల మధ్య భాగంలో అస్థిమజ్జ ఉంటుంది. ఎరుపు రంగు అస్థిమజ్జ ఎర్ర రక్తకణాల (ఆర్‌బీసీ)ను ఉత్పత్తి చేస్తుంది.

పక్షుల ఎముకల్లో అస్థిమజ్జ ఉండదు. వీటిలో గాలి ఉంటుంది. వీటిని వాతులాస్థులు (న్యూమాటిక్ బోన్స్) అంటారు. పక్షుల్లో ఆర్‌బీసీలను ఉత్పత్తి చేసే అవయవం బర్సా.

అస్థిపంజరం - రకాలు

1) బాహ్యాస్థిపంజరం
2) అంతరాస్థిపంజరం.

బాహ్యాస్థిపంజరం

బాహ్యాస్థిపంజరం జీవి దేహం బయట ఉంటుంది.

వివిధ జీవుల్లోని బాహ్యాస్థిపంజరం..

1) చేపలు - పొలుసులు
2) పక్షులు - ఈకలు
3) కోడిగుడ్లు - పెంకు
4) నత్తలు, ఆల్చిప్పలు, ప్రవాళాలు (కోరల్స్)- కర్పరం
5) కీటకాలు - స్లీరైట్స్
6) సకశేరుకాలు - రోమాలు, నఖాలు, కొమ్ములు, గిట్టలు మొదలైనవి. వీటిలో ఉండే ప్రొటీన్ ఆల్ఫాకెరాటిన్.

నోట్: క్యారెట్‌లోని విటమిన్-ఏను బీటా కెరోటిన్ అంటారు.

గోర్లను కత్తిరించినప్పుడు నొప్పి, బాధ అనిపించకపోవడానికి కారణం అవి మృతకణ జాలంతో తయారైన కొమ్ము వంటి పదార్థంతో ఏర్పడటం.

అంతరాస్థిపంజరం

అంతరాస్థిపంజరం దేహం లోపల ఉంటుంది. అస్థిపంజరంలోని ఎముకలు రెండు రకాలు. ఎ) మృదులాస్థి బి) అస్థి

మృదులాస్థి

మెత్తగా ఉండే ఎముకలను మృదులాస్థి ఎముకలు అంటారు. పిండదశలో ఎముకలన్నీ మృదులాస్థి నిర్మితాలు. శిశువు ఎదిగిన తర్వాత ఈ మృదులాస్థులు అస్థులుగా రూపొందుతాయి. మృదులాస్థిలో ఉండే ప్రొటీన్ 'కాండ్రిన్'. మృదులాస్థి అధ్యయనాన్ని కాండ్రాలజీ అంటారు.

మృదులాస్థి ఉండే భాగాలు..

1) ముక్కుకొన (నాసికాగ్రం)
2) వెలుపలి చెవి
3) వాయునాళంలోని 'సి' ఆకారపు ఉంగరాలు
4) కొండనాలుక
5) అంగిలి (ఇది నాసికాకుహారం, ఆస్యకుహారాన్ని వేరు చేస్తుంది)
6) సొరచేప అస్థిపంజరం

షార్క్ చేప కాలేయ నూనెలో విటమిన్ - ఎ, డిలు లభిస్తాయి.

అస్థి (బోన్)

అస్థి అంటే దృఢంగా ఉండే ఎముక.
చిన్నపిల్లల్లో 300 పైగా ఎముకలు ఉంటాయి.

	శరీర భాగం	ఎముకల సంఖ్య
1.	తల హయాయిడ్	29 (పుర్రె-22 ఎముక-1, రెండు చెవులు-6)
2.	వెన్నుపూసలు	26 (చిన్నపిల్లల్లో- 33)
3.	పక్కటెముకలు/రిబ్స్	24
4.	రెండు చేతులు	60
5.	రెండు కాళ్లు	60
	మొత్తం ఎముకల సంఖ్య (పెద్ద వారిలో) 206	

గమనిక: ఉరి వేసుకున్న వారిలో హయాయిడ్ ఎముక విరుగుతుంది.

శైశవ దశలో 33 వెన్నుపూసలుంటాయి. తర్వాత వాటిలో చివరి 9 వెన్నుపూసలు (ఐదు కలిసి ఒక త్రికంగా, 4 కలిసి అనుమత్రికంగా) 2 వెన్నుపూసలుగా ఏర్పడతాయి.

కాబట్టి పెద్ద వారిలో ఉండే మొత్తం వెన్నుపూసల సంఖ్య 26. తలలోని ఎముకల గూడును పుర్రె అంటారు. పుర్రెలో మెదడు ఉండే పెట్టెవంటి నిర్మాణం కపాలం (క్రీనియం). కపాలం అధ్యయనాన్ని క్రీనియాలజీ అంటారు.

- కపాలంలోని ఎముకలు- 8
- ముఖంలోని ఎముకలు -14
- పుర్రెలో కదిలే ఎముక - 1
- కింది దవడ కదులుతుంది
- పుర్రెలో కదలని ఎముకలు- 21
- అతిపెద్ద ఎముక - ఫీమర్ (తొడ ఎముక)
- అతిచిన్న ఎముక - స్టెపిస్ (కర్ణాంతరాస్థి)
- పుర్రెలో అతిదృఢమైన ఎముక - కింది దవడ (మాండిబ్యూల్)
- అతి మెత్తని ఎముక - మృదులాస్థి

చేతి ఎముకలు:
ప్రతి చేయిలో 30 ఎముకలుంటాయి.
చేయిలో మూడు భాగాలు ఉంటాయి.
1) పై చేయి (భుజాస్థి ఎముక - హ్యూమరస్ 1)
2) ముంజేయి (రత్ని, అరత్ని ఎముకలు -2)
3) హస్తం
ఎ) మణిబంధాస్థులు -8
బి) కరభాస్థులు - 5
సి) చేతివేళ్లు - 14

గమనిక: రాస్తున్నప్పుడు పెన్నుకు ఆధారాన్నిచ్చే చేతి వేళ్ల ఎముకలను ఫాలింజెస్ అంటారు.

కాలు ఎముకలు: ప్రతికాలులో 30 ఎముకలుంటాయి. కాలులో మూడు భాగాలున్నాయి.
1) తొడ: ఫీమర్ - 1
2) మోకాలు: టిబియా, ఫిబులా (అంతర్‌జంగిక, బహిర్జంగిక- 2)
3) పాదం
ఎ) చీలమండలం (టార్సల్స్)-7
బి) ప్రపాదాస్థులు-మెటాటార్సల్స్-5
సి) కాలివేళ్లు - ఫాలింజస్-14
డి) మోకాలి చిప్ప - పటెల్లా - 1

ఉరోమేఖల (పెక్టోరల్ గిర్డిల్): ఇది చేతులను అంటిపెట్టుకుని ఉంటుంది. ఉరోమేఖల / భుజ వలయంలో రెండు ఎముకలుంటాయి. అవి..
ఎ) జత్రుక (కాలర్ బోన్)
బి) అంస ఫలకం (స్కాపులా)
(ఇది త్రిభుజాకారంలో ఉంటుంది)

ఉరఃపంజరం: ఉరోస్థి ముందువైపు (రొమ్ము ఎముక), పక్కటెముకల ఇరువైపులా, వెన్నెముక వెనుకవైపు ఉండి గుండె, ఊపిరితిత్తులను రక్షిస్తుంది.

శ్రోణిమేఖల (పెల్విస్ గిర్డిల్): ఇది కాలి ఎముకలను అంటుకుని ఉదరం కింది భాగంలో ఉంటుంది. కూర్చోవడానికి ఉపయోగపడుతుంది.

కీళ్లు (జాయింట్స్)

రెండు ఎముకలు కలిసే ప్రాంతాన్ని కీలు అంటారు. రెండు ఎముకలను బంధించే కొల్లాజెన్ పోగులను లిగ్మెంట్ (స్నాయువు) అంటారు. ఎముకను కండరంతో బంధించే కొల్లాజెన్ పోగును టిండాన్ (స్నాయుబంధనం) అంటారు. కీళ్ల మధ్యలో సైనోవియల్ కుహరం ఉంటుంది. దీనిలో సైనోవియల్ ద్రవం ఉంటుంది. సైనోవియల్ ద్రవం కీళ్ల కదలికలో కందెనలా ఉపయోగపడుతుంది. ఎముకలు, దేహం కదలడానికి కీళ్లు తోడ్పడతాయి. కీళ్ల అధ్యయనాన్ని ఆర్థాలజీ అంటారు. శరీరంలోమొత్తం 230 కీళ్లుంటాయి. కీళ్ల, ఎముకల వైద్య నిపుణుడ్ని ఆర్థోపెడిక్ డాక్టర్ అంటారు.

కీళ్లు - రకాలు

కీళ్లు రెండు రకాలు.

1) కదలని (స్థిరమైన) కీళ్లు

పుర్రెలో పైదవడ, కపాలానికి మధ్య ఉండే వి కదలని కీళ్లు

2) కదిలే కీళ్లు

పుర్రెలో కింది దవడ కదిలే కీలు.
ఇవి నాలుగు రకాలు. అవి..

బొంగరపు కీలు: ఇది మెడలో పుర్రె, వెన్నెముక కలిసే ప్రాంతంలో ఉంటుంది. మెడలో 7 ఎముకలు ఉంటాయి. బొంగరపు కీలు చేసే కోణం 180 డిగ్రీలు.

నోట్: భరతనాట్యం చేసే వారిలో ఈ కీలు ఎక్కువగా ఉపయోగపడుతుంది.

బంతిగిన్నె కీలు: ఇది భుజం-దండచేయి, తొడ-కటివలయం ప్రాంతంలో ఉంటుంది. ఈ కీలు చేసే కోణం 360 డిగ్రీలు

నోట్: చేతులు, కాళ్లను ఈ కీలు వృత్తాకారంగా (గుండ్రంగా) తిప్పుతుంది.

మడతబందు కీలు: ఇది మోచేయి, మోకాలు, కాలు, చేతి వేళ్లకు మధ్య ఉంటుంది. ఈ కీలు చేసే కోణం - 90 డిగ్రీలు

నోట్: ఈ కీలు మోచేయి, మోకాలును ఒకే వైపు వంచుతుంది. తలుపులు, కిటికీలకు బంధించే నిర్మాణాలు మడతబందులు.

జారుడు కీలు: ఇది వెన్నెముకలోని వెన్నుపూసల మధ్య పక్కటెముకలు, మణికట్టులో ఉంటుంది.

నోట్: తాళం వేసేటప్పుడు, తీసేటప్పుడు, ఉచ్ఛ్వాస, నిచ్ఛ్వాస సమయంలో అవసరమయ్యే కీలు జారుడు కీలు. నేలమీది ఉన్న వస్తువును వంగి తీసుకునేటప్పుడు (వెన్నుపూసలు) ఉపయోగపడేది జారుడు కీలు.

ఎముకలను నిర్వాత స్వేదనం చేసి ఎముకల బొగ్గును తయారుచేస్తారు. ఎముకల బొగ్గును చక్కెర పరిశ్రమలో విరంజనకారి (డీ కలరింగ్ ఏజెంట్)గా ఉపయోగిస్తారు.

ఎముకలు, కీళ్ల వ్యాధులు- వ్యాధి లక్షణాలు

- ఆర్థరైటిస్: కీళ్లవాపు, దీని నివారణకు తేనెటీగల విషాన్ని ఔషధంగా వాడుతారు.
- సర్వైకల్ స్పాండలైటిస్: మెడనొప్పి
- స్పాండలైటిస్: వెన్నునొప్పి
- ఆస్టియోఆర్థరైటిస్ : కీళ్లనొప్పి
- రుమటాయిడ్ ఆర్థరైటిస్: సైనోవియల్ ద్రవం లోపంతో వచ్చే కీళ్ల నొప్పి.
- ఆస్టియోపోరోసిస్: ఎముకలు పెలుసుగా మారడం.
- గౌట్ వ్యాధి: కీళ్లవాపు
- రికెట్స్ వ్యాధి: విటమిన్ డి లోపం వల్ల చిన్న పిల్లల్లో ఎముకలు వంగిపోవడం
- ఆస్టియోమలేషియా: విటమిన్ డి లోపంతో పెద్దవారిలో ఎముకలు పెలుసుగా మారడం
- ఫ్లోరోసిస్: ఫ్లోరిన్ నీటితో దంతాలు పసుపు రంగులోకి, ఎముకలు వికృత రూపంలోకి మారడం
- సైనోవిటిస్: చికెన్ గున్యా వ్యాధి వల్ల కీళ్లవాపు. ఇది వైరస్ వల్ల కలిగే వ్యాధి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. మానవుడి శరీరంలో (పెద్దవారిలో) ఎముకల సంఖ్య?
1) 330 2) 260
3) 206 4) 220

2. మానవ శరీరంలోని అతి కఠిన భాగం?
1) దంతాలు 2) గోర్లు
3) ఎముకలు 4) ఎనామిల్

3. జంతువులలోని అస్థిమజ్జ నిర్వహించే క్రియ?
1) మూత్రపిండాలకు సహాయం
2) రక్తకణోత్పత్తి
3) కాలేయానికి సహాయం
4) రక్తపీడన నియంత్రణ

4. గోర్లను కత్తిరించినప్పుడు ఎందుకు నొప్పి కలగదు?
1) మృతకణజాలంతో తయారైన కొమ్మువంటి పదార్థం ఉండటం
2) శరీరంలో అనవసర భాగం
3) బహిష్కృత భాగంగా రూపాంతరం చెందడం
4) కాల్షియం ఫాస్ఫేట్‌తో తయారు కావడం

5. మనం చేతితో రాస్తున్నప్పుడు పెన్నుకు ఆధారాన్నిచ్చే చేతి వేళ్లలోని ఎముకలు?
1) కార్పెల్స్
2) మెటాకార్పెల్స్
3) టార్సల్స్ 4) ఫాలింజెస్

6. ఎముకల అధ్యయన శాస్త్రం?
1) ఓటాలజీ 2) ఆస్టియాలజీ
3) ఆర్నిథాలజీ 4) అంకాలజీ

7. అప్పుడే పుట్టిన శిశువులో ఉండే ఎముకల సంఖ్య?
1) 300 2) 320
3) 330 4) 340

8. కింది వాటిలో మానవుడి వెన్నెముకకు సంబంధించిన వ్యాధి?
1) హైపోథార్మియా
2) కాటరాక్ట్
3) హెర్నియా
4) సర్వైకల్ స్పాండలైటిస్

9. మానవ శరీరంలో అతిపెద్ద ఎముక?
1) ఫిబులా 2) టిబియా
3) స్టెపిస్ 4) ఫీమర్

10. నీటిలో ఏ పదార్థం ఎక్కువ ఉండటంతో ఎముకల్లో వంకర్లు వస్తాయి?
1) ఫ్లోరిన్ 2) క్లోరైడ్
3) లెడ్ 4) ఏదీకాదు

11. చెవులలోని మొత్తం ఎముకల సంఖ్య?
1) 2 2) 4
3) 6 4) 8

12. మానవుడి పుర్రెలోని మొత్తం ఎముకల సంఖ్య?
1) 24 2) 22
3) 20 4) 21

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 1;
5) 4; 6) 2; 7) 1; 8) 4;
9) 4; 10) 1; 11) 3; 12) 2.

చౌమొహల్లా ప్యాలెస్ నిర్మాణాన్ని పూర్తి చేసిందెవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

మాన్యుమెంట్స్ ఆఫ్ అసఫ్ జాహీ పీరియడ్

అసఫ్ జాహీలు 17వ శతాబ్దంలో మధ్యాసియా ప్రాంతం నుంచి భారతదేశానికి వచ్చి మొగల్ సామ్రాజ్యంలో ఉన్నత పదవులు అలంకరించారు. కుతుబ్‌షాహీల పతనం తర్వాత 1687–1724 వరకు హైదరాబాద్ నగరం మొగలుల ఆధీనంలో ఉంది. మొగల్ గవర్నర్ ఔరంగబాద్ నుంచి పరిపాలన చేపట్టాడు. చార్మినార్ వద్ద కుతుబ్‌షాహీలు నిర్మించిన అనేక కట్టడాలను మొగల్ సైన్యం నాశనం చేసింది. మరాఠాల దాడుల నుంచి హైదరాబాద్‌ను రక్షించేందుకు మొగలులు 1724లో నగరం చుట్టూ గోడల నిర్మాణాన్ని ప్రారంభించారు. మొగల్ గవర్నరైన మీర్ ఖమ్రుద్దీన్ నిజాం ఉల్ ముల్క్ 1724లో హైదరాబాద్‌లో 'అసఫ్‌జా' వంశాన్ని స్థాపించాడు. అసఫ్‌జాల నిర్మాణాలు హైదరాబాద్ నగర రక్షణ గోడలతోనే ప్రారంభమయ్యాయి. మీర్ ఖమ్రుద్దీన్ నిజాం–ఉల్–ముల్క్ ఔరంగాబాద్ నుంచి హైదరాబాద్ రాజ్యాన్ని పరిపాలించాడు. 1740 నాటికి హైదరాబాద్ చుట్టూ రక్షణ గోడల నిర్మాణం పూర్తైంది. 1908లో మూసీ నదికి వచ్చిన వరదల వల్ల మొదటిసారిగా రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం కొన్ని ద్వారాలు మాత్రమే ఉండగా, అవి కూడా అవసాన దశలో ఉన్నాయి.

డాబిర్‌పుర ద్వారం

హైదరాబాద్ చుట్టూ 17 ద్వారాలను నిర్మించారు. అందులో ముఖ్యమైన డాబిర్‌పుర ద్వారాన్ని 1724–40 మధ్య కాలంలో నిర్మించారు. హైదరాబాద్ రాజ్యంలోని పండితుల్లో ఒకరైన అబుస్ సమద్ డాబిర్–ఉల్–ముల్క్ పేరును ఈ ద్వారానికి పెట్టారు. 1750 నాటికి హైదరాబాద్ నగరం 2.25 లక్షల జనాభాతో దేశంలోనే ఎక్కువ జనాభా ఉన్న నగరంగా ఆవిర్భవించింది. 1763 తర్వాత అసఫ్ జాహీల కట్టడాల నిర్మాణం ఊపందుకుంది. అసఫ్ జాహీల కాలంలో నిర్మించిన కట్టడాల్లో పాయెగా సమాధులు, సైదానిమా సమాధి, చౌమొహల్లా ప్యాలెస్, పురానా హవేలి, బేగం బజార్, రేమండ్ సమాధి, గన్‌ఫౌండ్రి, బ్రిటిష్ రాజ ప్రతినిధి కోట, హైకోర్టు భవనం, ఆర్ట్స్ కాలేజీ భవనం, దివాన్ దేవిడీ, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి భవనం ముఖ్యమైనవి. 1748లో మీర్ ఖమ్రుద్దీన్ అసఫ్‌జా లాడ్ బజార్‌లో షాహీ జీలుఖానా ద్వారాన్ని నిర్మించాడు. ఈ నిర్మాణంలో రాజస్థానీ శైలిని వాడి పందిళ్లు, కిటికీలను నిర్మించారు. మలి మొగలుల శైలిలో తోరణాలు, ముఖద్వారాన్ని నిర్మించారు. 1724–40 మధ్య కాలంలో నిర్మించిన హైదరాబాద్ నగర కోటల్లో భాగంగా అలియాబాద్ సరాయిని మొదటి అసఫ్‌జా నిర్మించాడు. పాత నగర రక్షణ కోట భాగాలను ఇప్పటికీ అలియాబాద్ పరిసర ప్రాంతాల్లో చూడవచ్చు.

రెండో అసఫ్‌జా కాలంలోని నిర్మాణాలు

1795లో మన్సీ రేమండ్ సహాయంతో ఫిరంగుల తయారీ పరిశ్రమను గన్‌ఫౌండ్రి పేరుతో అబిడ్స్ వద్ద నిజాం అలీఖాన్ నిర్మించాడు. గన్‌ఫౌండ్రి నిర్మాణంలో ఇటుకలు, మోర్టార్‌ను వాడారు.

మన్సీ రేమండ్ సమాధి

రెండో నిజాం రాజు నిజాం అలీఖాన్ సైన్యంలో ముఖ్యమైన ఫ్రెంచ్ అధికారి మన్సీ రేమండ్. ప్రజలు ఇతణ్ని ముసారాముడని పిలిచేవారు. ఇతడి పేరు మీద ముసారాంబాగ్ నిర్మాణం జరిగింది. 1798లో మన్సీ రేమండ్ మరణించాడు. ఇతడి సమాధిని యురోపియన్ శైలిలో 28 పిల్లర్లతో ముసారాంబాగ్ వద్ద నిర్మించారు. ఈ నిర్మాణంలో ఊదారంగు గ్రానైట్ రాయిని వాడారు.

పాయెగా (పాయిగా) సమాధులు

వీటి నిర్మాణాన్ని 1786లో ప్రారంభించారు. పాయిగా సమాధులను షమ్స్–ఉల్–ఉమ్రా సమాధులని కూడా అంటారు. హైదరాబాద్ రాజ్యంలో అత్యంత శక్తివంతమైన వ్యక్తులు పాయెగాలు. నిజాం అలీఖాన్ కాలంలో 1760 నుంచి 1803 వరకు షమ్స్–ఉల్–ఉమ్రా సర్వసైన్యాధ్యక్షుడిగా పనిచేశాడు. పాయెగా సమాధుల నిర్మాణంలో మొగల్, మూరిష్ శైలులను వాడారు. ఈ సమాధుల నిర్మాణంలో సున్నం, మోర్టార్‌ను ఉపయోగించారు. ఈ సమాధుల్లో రేఖాగణిత చిత్రాలు, పూలమొక్కల డిజైన్లు, పందిరి నిర్మాణాలు చూడవచ్చు.

పురానా హవేలి

రెండో నిజాం కాలంలో పురానా హవేలి నిర్మాణం ప్రారంభమైంది. పురానా హవేలి ప్రాంతాన్ని రుకును–ఉద్–దౌలా నుంచి నిజాం అలీ తీసుకొని తన కుమారుడైన సికిందర్ జా కోసం హవేలి (అంతఃపురం)ని నిర్మించాడు. ఈ హవేలిలోని ప్రధాన భవనాన్ని 18వ శతాబ్దం నాటి యురోపియన్ శైలిలో నిర్మించారు. పురానా హవేలి U ఆకారంలో ఉంటుంది. ప్రధాన భవనానికి రెండు వైపులా దీర్ఘచతురస్రాకారంలో ఒకదానికొకటి సమాంతరంగా ఈ భవనాలను నిర్మించారు. ఈ హవేలిలో ప్రపంచంలోనే అతిపెద్ద దుస్తుల అల్మారాను ఏర్పాటు చేశారు. సికిందర్ జా కొన్ని రోజులు ఇక్కడ నివసించి తర్వాత కిల్వత్ మహల్‌కు మారాడు. సికందర్ జా ఈ హవేలిని వదిలి పెట్టడం వల్ల పురానా హవేలి అని పేరొచ్చింది. మీర్ ఉస్మాన్ అలీఖాన్ పురానా హవేలిలో మ్యూజియంను ఏర్పాటు చేశాడు. పురానా హవేలిలోని అద్దాల భవనం చీనిఖానా (చైనా నుంచి తెచ్చిన అద్దాలతో నిర్మించిన భవనం) చెప్పుకోదగింది.

సికిందర్ జా (1803-1829) కాలంలోని నిర్మాణాలు

నిజాం రాజు సైన్య సహకార సంధిపై సంతకం చేసిన తర్వాత బ్రిటిషర్లు హైదరాబాద్‌లో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్నారు. బ్రిటిష్ రాజప్రతినిధి అధికార నివాసాన్ని సుల్తాన్ బజార్‌లో నిర్మించారు. 1803లో జాన్ శామ్యూల్స్ రస్సెల్ రెసిడెన్సీ భవన డిజైన్ (ప్రణాళిక)ను రూపొందించాడు. 1803–04లో రెసిడెన్సీ భవన నిర్మాణం పూర్తైంది. ఆ సమయంలో హైదరాబాద్‌లో బ్రిటిష్ రాజప్రతినిధిగా జేమ్స్ అకిలీస్ కిర్క్‌పాట్రిక్ ఉన్నాడు. ఈ నిర్మాణంలో యురోపియన్ శైలి కన్పిస్తుంది. ఈ భవనంలోని ప్రధాన కేంద్ర బ్లాక్‌ను జార్జియన్ శైలిలో నిర్మించారు. ఈ శైలిని అమెరికా అధ్యక్ష భవనమైన శ్వేతభవనంలో చూడవచ్చు. బ్రిటిష్ రాజప్రతినిధి నివసించే కోట ప్రాంతం వల్ల దానికి కోఠి అనే పేరొచ్చింది. ప్రస్తుతం ఈ భవనంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉమెన్స్ కాలేజీని నిర్వహిస్తున్నారు. 1803–29 మధ్య కాలంలో సికిందర్ జా వద్ద మిలటరీ అధికారిగా పనిచేసిన జామ్ సింగ్ కార్వాన్‌లో రాజస్థానీ శైలిలో ఒక దేవాలయాన్ని నిర్మించాడు.

నాసిరుద్దౌలా (1829-57) కాలంలో నిర్మాణాలు

1839లో చాదర్‌ఘాట్ వద్ద మూసీనదిపై వంతెన నిర్మించారు. 1840–50 మధ్య కాలంలో సికింద్రాబాద్‌లో సెయింట్ మేరీ క్యాథడల్‌ను డేనియల్ మర్ఫి నిర్మించాడు. 1845లో హైదరాబాద్ రాజ్య పేష్కర్ రాజా చందులాల్ ఆల్వాల్ ప్రాంతంలో ఒక దేవాలయాన్ని నిర్మించాడు.

భగవాన్ దాస్ గార్డెన్

భగవాన్ దాస్ గుజరాత్‌కు చెందిన వైశ్యుడు. ఇతడు కార్వాన్ వద్ద భగవాన్ దాస్ గార్డెన్ పెవిలియన్ నిర్మించాడు. రెండు అంతస్తుల ఈ భవనంలో ఆర్కేడ్ వరండాలు, బాల్కనీలను టిప్పు ప్యాలెస్ తరహాలో నిర్మించారు. ఈ గార్డెన్‌లో మొగల్, గుజరాతీ శైలిలో మేలు రకం టేకుతో చెక్క స్తంభాలు, పందిళ్లు, కిటీకీలను నిర్మించారు.

అఫ్జల్-ఉద్-దౌలా కాలంలో నిర్మాణాలు (1857-69)

1857–61 మధ్య నయాపూల్ వద్ద మూసీనదిపై వంతెన నిర్మించారు.

చౌమొహల్లా ప్యాలెస్

పర్షియా భాషలో చౌ అంటే నాలుగు అని అర్థం. అరబిక్ భాషలో మొహల్లా అంటే మహల్. చౌమొహల్లా అంటే నాలుగు మహల్‌లు ఉన్న ప్రాంతమని అర్థం. 1750లో సలాబత్‌జంగ్ చౌమొహల్లా ప్యాలెస్‌కు పునాది వేశాడు. 1869లో అఫ్జల్‌ద్దౌలా బహదూర్ చౌమొహల్లా నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని షా మహల్ తరహాలో చౌమొహల్లా ప్యాలెస్‌ను నిర్మించారు. ఈ ప్యాలెస్‌లో రెండు ప్రాంగణాలు ఉన్నాయి. ఉత్తర, దక్షిణ ప్రాంగణాల్లో సొగసైన రాజభవనాలు, గొప్ప రాజదర్బారు హాలు, ఫౌంటెన్లు, తోటలు ఉన్నాయి. ఉత్తర ప్రాంగణంలో బారా ఇమామ్ ఉంది. ఇందులో తూర్పువైపు పొడవైన కారిడార్, దాని పక్కనే విశాలమైన గదులు ఉన్నాయి. గతంలో పరిపాలన కోసం ఈ గదులను ఉపయోగించారు. దక్షిణ ప్రాంగణంలో నాలుగు మహల్‌లు ఉన్నాయి. అవి అఫ్జల్ మహల్, మహతబ్ మహల్, తన్నిత్ మహల్, అఫ్తాబ్ మహల్. వీటిలో అఫ్తాబ్ మహల్ అందమైంది. ఈ మహల్ ఉన్న గడియారాన్ని కిల్వత్ గడియారం అంటారు. చౌమొహల్లాలోని దర్బారు హాల్లో అతి ముఖ్యమైన అధికారులను నిజాం రాజులు కలుసుకునేవారు. ఈ దర్బారులో పురాతన రాత ప్రతులు, పుస్తకాలను ఉంచారు. ఆరో నిజాం గౌరవార్థం రోషన్ మహల్‌ను ఉత్తర ప్రాంగణంలో నిర్మించారు. కిల్వత్ మహల్‌లోని అతిగొప్ప నిర్మాణం గ్రాండ్ దర్బారు హాలు. ఇందులో మొగల్ శైలిలో గుమ్మటాలు (డోమ్‌లు), తోరణాలు నిర్మించారు. గోడలను పర్షియన్ శైలిలో అలంకరించారు. గ్రాండ్ దర్బారులో నిజాం రాజు సింహాసనం తక్త్–ఇ–నిషాన్‌ను ఉంచారు. దర్బారు హాలు ఫ్లోర్ అంతటినీ స్వచ్ఛమైన పాలరాయితో నిర్మించారు. 19 బెల్జియన్ క్రిస్టల్ షాండ్లియర్‌లను గ్రాండ్ దర్బారులో ఏర్పాటు చేశారు. నిజాం రాజులు తమ రాజకీయ, మత సమావేశాలు, పండుగలను గ్రాండ్ దర్బారులో నిర్వహించేవారు. 1906లో వేల్స్ రాకుమారుడు భారత్ వచ్చినప్పుడు అతడి గౌరవార్థం గ్రాండ్ దర్బారులో విందు ఏర్పాటు చేశారు.

మీర్ మహబూబ్ అలీఖాన్ (1869-1911) కాలంలో నిర్మాణాలు

1874లో తొలి రైల్వేలైన్‌ను హైదరాబాద్ నుంచి వాడి వరకు బ్రాడ్‌గేజ్ నిర్మించారు. 1886లో బ్రిటిషర్లు చార్మినార్‌ను రక్షించాల్సిన కట్టడాల జాబితాలో చేర్చారు.

హజ్రత్ సైదానిమా సాహెబా సమాధి

మీర్ మహబూబ్ అలీఖాన్ ప్రభుత్వంలో ఉన్నతాధికారి అబ్దుల్ హక్ దిలేర్ జంగ్ తన తల్లి సైదానిమా సాహెబా మరణానంతరం హుస్సేన్ సాగర్ వద్ద ఆమె సమాధి నిర్మించారు. ఈ సమాధిని రెండు అంతస్తులుగా నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని తోరణాలు, అలంకరణలు మొగల్ శైలిలో ఉన్నాయి. మొదటి అంతస్తు, గుమ్మటాన్ని కుతుబ్ షాహీల వాస్తుకళ లేదా శైలిలో నిర్మించారు.

ఛాత్తాబజార్‌లో సాలార్‌జంగ్–1 పేరు మీద దివాన్ దేవిడిని నిర్మించారు. ఇందులో మొగల్ శైలిలో రెండు ముఖద్వారాలు, అర్ధచంద్రాకార తోరణాలను నిర్మించారు.

అసెంబ్లీ భవనం

మీర్ మహబూబ్ అలీఖాన్ 40వ జన్మదినాన్ని పురస్కరించుకొని 1905లో టౌన్‌హాల్ నిర్మాణాన్ని ప్రారంభించి 1923లో పూర్తి చేశారు. దీన్ని పర్షియన్, రాజస్థానీ శైలిలో నిర్మించారు. తర్వాతి కాలంలో నిజాం ప్రభుత్వం ఈ హాలును శాసనసభగా మార్చింది.

మీర్ ఉస్మాన్ అలీఖాన్ (1911-1948) కాలంలో నిర్మాణాలు

1866లో రాజ కుటుంబీకులు, భూస్వాముల కోసం అఫ్జల్‌గంజ్‌లో 30 పడకల ఆసుపత్రిని నిర్మించారు. 1908లో మూసీనదికి వచ్చిన వరదల వల్ల ఈ ఆసుపత్రి ధ్వంసమైంది. మీర్ ఉస్మాన్ అలీఖాన్ రూ. 20 లక్షల వ్యయంతో నూతన ఆసుపత్రి భవనాన్ని అఫ్జల్‌గంజ్‌లో నిర్మించాడు. ఆయన పేరుమీద ఈ ఆస్పత్రికి ఉస్మానియా జనరల్ ఆసుపత్రిగా నామకరణం చేశారు. ఉస్మానియా ఆసుపత్రిని ఇండో–సార్సనిక్ శైలిలో నిర్మించారు. ఈ భవన నిర్మాణానికి విన్సెంట్ జెరోమ్ ఎస్చ్ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశాడు. ఇతడు నగర ఉన్నత పాఠశాల, హైదరాబాద్ రైల్వేస్టేషన్, హైకోర్టు భవనాలను కూడా రూపొందించాడు.

కింగ్ కోఠి ప్యాలెస్

1911లో కమల్ ఖాన్ తన సొంత అవసరాల కోసం సుల్తాన్‌బజార్ ప్రాంతంలో నూతన ప్యాలెస్‌ను నిర్మించాడు. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌కు ఈ ప్యాలెస్ నచ్చింది. దాంతో కమాల్ ఖాన్ వద్ద నుంచి ప్యాలెస్‌ను పొందాడు. ఉస్మాన్ అలీఖాన్ ఒక ఫర్మానా ద్వారా ఆ ప్రాంతానికి కింగ్ కోఠి అని నామకరణం చేశాడు. ఈ ప్యాలెస్‌లో మూడు ప్రధాన భవనాలు ఉన్నాయి. పశ్చిమ భాగంలో ఉన్న భవనాన్ని నజరిబాగ్ అని పిలుస్తారు. ప్రస్తుతం ప్యాలెస్ తూర్పు భాగంలో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు.

బషీర్‌బాగ్ ప్యాలెస్

పాయెగా వంశానికి చెందిన ఆస్మాన్ జా బషీర్–ఉద్–దౌలా ఫతేమైదాన్ వద్ద బషీర్‌బాగ్ ప్యాలెస్‌ను నిర్మించాడు.

సిటీ కాలేజీ

1895లో మీర్ మహబూబ్ అలీఖాన్, మదరసా దార్–ఉల్–ఉలూమ్ అనే మొదటి సిటీ స్కూల్‌ను ప్రారంభించాడు. తర్వాతి కాలంలో మీర్ ఉస్మాన్ అలీఖాన్ దాన్ని విస్తరించాడు. ప్రస్తుతం ఉన్న సిటీ కాలేజీ భవనానికి ఈ స్కూల్‌ను 1921లో మార్చారు. మీర్ ఉస్మాన్ అలీఖాన్ 16 ఎకరాల స్థలంలో ఇండో–సార్సనిక్ శైలిలో సిటీ కాలేజీని రెండు అంతస్తులుగా నిర్మించాడు.

మొజంజాహీ మార్కెట్

1935లో మీర్ ఉస్మాన్ అలీఖాన్ తన రెండో కుమారుడైన మొజంజా పేరు మీద మొజంజాహీ మార్కెట్‌ను నిర్మించాడు. దీన్ని పూర్తిగా రాళ్లతో నిర్మించారు. దీనికి ఒక మూలన మినార్‌ను నిర్మించి, అందులో ఒక గడియారాన్ని పొందుపర్చారు.

What is the code name for 'WINDOWS 95'?

BANK EXAMS

Computer Awareness

Computer Network

A computer network consists of two or more autonomous computers that are connected together in order to share resources(files, printers, modem etc), share application, allow electronic communication etc.

A computer network includes the network operating system in the client and server machines, the cables, which connect different computers and all supporting hardware in between such as bridges, routers & switches. In wireless system, antennas and towers are also part of the network.

Types of Computer Network: Computer network are generally classified according to their structure and the area.

Local Area Network (LAN)

In LAN, computers are connected locally within a room, building or in a small area. LAN can range from simple (two computers) to complex (hundred of computers and peripherals). LANs connect workstations and personal computers. User can share data as well as devices like printers, fax etc and can use LAN to communicate with each other, by sending e-mail or chatting.

Examples of LAN Technology: Ethernet, Token Ring, and Fiber Distributed Data Interconnect (FDDI).

Characteristics of LAN are:

- Configured to small area i.e. it connects several devices over a distance of 5 to 10 KM.
- High Speed
- Low error rates
- Data and hardware sharing between users.
- Operates at speed ranging from 10 Mbps to 100 Mbps. Now a day's 1000 Mbps are available.

Network Topology

Topology is physical arrangement of computer system in a network. Or refers to the shape of networks. Some of the most common network topologies are

Bus topology

In bus topology, all devices are connected to a central cable, called the bus or backbone. The bus topology connects workstations using a single cable. Each workstation is connected to the next workstation in a point to point fashion. All workstation connect to the same cable. An extension to the bus topology is tree topology.

Advantage of Bus topology: Installation is easy and cheap. Connections are simple and easy to use. Data can be transmitted from the both sides.

Disadvantage of Bus topology: A single fault in the cable stops all transmission. Fault identification is difficult.

Ring topology

In ring topology, all devices are connected to one another in the shape of a closed loop; so that each device is connected directly to each other i.e. the ring topology connects workstations in a closed loop. Data is transmitted around the ring in one direction only. Each station passing on the data to the next station till it reaches its destination. The common implementation of this topology is token ring.

Advantage of Ring topology: Easy to install and modify the network and fault isolation is simplified.

Disadvantage of Ring Topology: Adding or removing computer disrupts the entire network. A break in the ring can stop the transmission in the entire network. Finding fault is difficult.

Star Topology

Star topology uses a central hub through which, all components are connected. A central hub is the host computer and at the end of each connection is a terminal. Communication on the connecting links between the stations and the central station of star topology can be bi-directional and are point to point.

Advantage of Star Topology: Expansion or modification is easy. Single computer failure does not affect the network.

Disadvantage of Star Topology: Failure in the central hub brings the entire network to halt.

Tree topology

Tree topology is LAN topology in which only one route exists between any two nodes on the network. It is similar to the star topology but the nodes are connected to the secondary hub, which in turn is connected to the central hub.

Advantage of Tree Topology: Installation and configuration of tree network is easy. Less expensive when compared to mesh topology.

Disadvantage of tree Topology: Failure in central hub brings the entire network to a halt. More cabling is required when compared to bus topology.

Mesh topology

Devices are connected with many redundant interconnections between network nodes. In a well connected topology, every node has a connection to every other node in the network. Mesh topology are used in critical connection of host computers [typically telephone exchange]. Alternate path allow each computer to balance the load to other computer systems in the network by using more than one connection path available.

Advantage of Mesh topology: Failure in one of the computers does not affect the entire network. Privacy between computers is maintained as messages travel along dedicated path.

Disadvantage of Mesh Topology: Amount of caballing required is high. A large number of I/O ports are required.

MODEL BITS

1. The property that, when classes are arranged in a hierarchy, each class assumes the attributes and methods of its ancestors is ____.
   1) Generalization
   2) Inheritance
   3) Encapsulation
   4) Information hiding
   5) None of these
2. An E-R diagram is a graphic method of presenting ____.
   1) Primary keys and their relationships
   2) Primary keys and their relationships to instances
   3) Entity classes and their relationships
   4) Entity classes and their relationships to primary keys
   5) None of these
3. ____ is a primary key of one file that also appears in another file.
   1) Physical key 2) Primary key
   3) Foreign key 4) Logical key
   5) None of these
4. SMTP, FTP and DNS are applications of the ____ layer.
   1) Data link 2) Network
   3) Transport 4) Application
   5) None of these
5. Which of the following is the smallest and fastest computer imitating human brain working?
   1) Supercomputer
   2) Quantum Computer
   3) Param-10,000 4) IBM chips
   5) None of these
6. Which of the following statement is wrong?
   1) Windows XP is an operating system
   2) Linux is owned and sold by Microsoft
   3) Photoshop is a graphical design tool by Adobe
   4) Linux is free and open source software
   5) None of these
7. What is the full form of SDRM?
   1) Shift Dynamic random access memory
   2) Synchronous Dynamics random access memory
   3) System Dynamic random access memory
   4) Serial Dynamic random access memory
   5) Synchronous Dynamic random access memory
8. First microprocessor was used in which of the following?
   1) Computer 2) Calculator
   3) Telephones 4) Printers
   5) None of these
9. Which of the following transforms input data into output data?
   1) Peripherals 2) RAM 3) ROM
   4) CPU 5) None of these
10. BSNL, Reliance, Shaw cable, AOL, Tata Indicom all can be kept in which one of the following groups?
    1) ISDN 2) IRC 3) ISP
    4) ICONS 5) None of these
11. In windows XP, which shortcut is used you lock the computer?
    1) Ctrl + L 2) Windows Key + k
    3) Ctrl + K 4) Scroll Lock key
    5) Windows Key + L
12. What is a 'tuple'?
    1) Another name for a table in an RDBMS.
    2) Another name for the key linking different tables in a database.
    3) Initial seed value of field.
    4) A row or record in a database table.
    5) An attribute attached to a record
13. A spooler is a (n):
    1) Location in memory that maintains the contents of a document until it prints out
    2) Print job
    3) Program that coordinates the print jobs that are waiting to print
    4) Message sent from the printer to the operating system when a print job is completed
    5) None of these
14. A scientific institution performing intensive mathematical operations for a complex model that required extremely powerful computing capabilities will most likely use a (n):
    1) Supercomputer 2) PC
    3) Mainframe 4) ISP
    5) None of these
15. The process ____ involves automated study of consumer buying patterns in order to support marketing, inventory replenishment and pricing decisions.
    1) Transaction processing
    2) Data mining 3) Simulation
    4) Information processing
    5) None of these
16. Press the ___ button to have the window fill the entire screen.
    1) Close
    2) Maximize
    3) Minimize
    4) All of the above
    5) None of these
17. What is the code name for 'WINDOWS 95'?
    1) Snowball 2) Chicago
    3) Win ball 4) Sparta
    5) None of these
18. The first part of a complete URL is the needed to access the web resource.
    1) Address 2) Name
    3) Location 4) Protocol
    5) None of these

KEY

1) 2	2) 3	3) 3	4) 4	5) 2
6) 2	7) 5	8) 2	9) 4	10) 3
11) 5	12) 4	13) 3	14) 1	15) 2
16) 2	17) 2	18) 3		